www.andhrajyothy.com

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHI

గురువారం | 4-1-2024 | పేజీలు: 14 | వెల (Price): Rs. 6.50 | సంపుటి (Volume): 21 సంచిక (Issue): 277 | శ్రీ శోభకృత్ నామ సంవత్సరం, దక్షిణాయనం, హేమంతరుతువు, మార్గశిరమాసం, బహుళపక్షం; తిథి: అష్టమి రా. 10.06 తదుపరి నవమి; నక్షత్రం: హస్త సా. 5.34 తదుపరి చిత్త; వర్జ్యం: రా2.19-4.04; దుర్ముహూర్తం: ఉ.10.30-11.14, మ.2.54-3.38; అమృతఘడియలు: ఉ.10.52-12.39; రాహుకాలం: మ.1.30-3.00; సూర్యోదయం: 6.51; సూర్యాస్తమయం: 5.50 | వరంగల్

Warangal | Hyderabad | Mahaboobnagar | Vijayawada | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru

ఇరాన్‌లో జంట పేలుళ్లు.. 103 మంది మృతి

సులేమానీ వర్ధంతి సందర్భంగా భారీ ర్యాలీ

కారు, బ్యాగు బాంబులు పేల్చిన దుండగులు

శ్మశానవాటిక వద్ద చెల్లాచెదురైన మృతదేహాలు.. 211 మందికి గాయాలు

మృతుల సంఖ్య మరింత పెరిగే చాన్స్

ఉగ్రదాడిగా ప్రకటించిన ఇరాన్ సర్కారు

2





ఖరీఫ్ నుంచి

పంటల బీమా!

కాంగ్రెస్ మేనిఫెస్టోలో ఇచ్చిన హామీకి జూన్‌లో శ్రీకారం

ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజనలో చేరతారా?.. రాష్ట్ర ప్రభుత్వమే కొత్త పథకం అమలు చేస్తుందా?

సీఎం రేవంత్‌రెడ్డి సమీక్ష తర్వాత కీలక నిర్ణయం.. ఐదెకరాల వరకు ఉచిత ప్రీమియంకు డిమాండ్

పంట బీమా లేని ఏకైక రాష్ట్రం తెలంగాణ.. గుజరాత్, బెంగాల్, బిహార్, ఝార్ఖండ్‌లో సొంత పథకాలు



హైదరాబాద్, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): 'వివిధ కారణాలతో పంటలు నష్టపోతే రైతులకు తక్షణం నష్టపరిహారం అందేలా పటిష్ఠమైన పంటల బీమా పథకం తీసుకొస్తాం. ప్రకృతి వైపరీత్యాల సమయంలో రైతులకు ఇన్‌పుట్ సబ్సిడీ అందేలా చర్యలు తీసుకుంటాం'.. అసెంబ్లీ ఎన్నికలకు ముందు తెలంగాణ కాంగ్రెస్ కమిటీ రూపొందించిన అభయహస్తం మేనిఫెస్టోలో ఇచ్చిన హామీ ఇది. దీనిని నెరవేర్చేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం సమాయత్తమవుతోంది. ఐదేళ్లుగా రాష్ట్రంలో అటకెక్కిన పంటల బీమా పథకాన్ని వచ్చే వానాకాలం సీజన్ (ఖరీఫ్) అంటే జూన్ నుంచి అమల్లోకి తెచ్చేందుకు కసరత్తు చేస్తోంది. అయితే ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజన (పీఎం-ఎఫ్‌బీవై)ను అమల్లోకి తీసుకొస్తారా? లేక కొత్త పంటల బీమా పథకానికి రూపకల్పన చేస్తారా? అనే అంశంపై ఇంకా స్పష్టత రాలేదు. దీనిపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వ్యవసాయ శాఖపై ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించిన తర్వాత స్పష్టత రానుంది. రాష్ట్రంలో గడిచిన ఐదేళ్లుగా పంటల బీమా పథకం అమలులో లేదు. పీఎం-ఎఫ్‌బీవైతో ఏ మాత్రం ఉపయోగం లేదని గత కేసీఆర్ ప్రభుత్వం 2020లో బయటకు వచ్చింది. దీంతో ప్రకృతి విపత్తులు, అతివృష్టి, అనావృష్టితో పంటలు దెబ్బతిన్నప్పుడు రైతులు పరిహారానికి నోచుకోక తీవ్రంగా నష్టపోయారు. ఈ సమస్యను అధిగమించడానికి పంటల బీమా పథకాన్ని తప్పనిసరిగా అమలు చేయాలనే ఆలోచనకు రాష్ట్ర ప్రభుత్వం వచ్చింది. గ్రామం యూనిట్‌గా అమలు చేస్తారా? మండలాన్ని యూనిట్‌గా తీసుకుంటారా? పంటల వారీగా అమలు చేస్తారా? అనే అంశాలపై కూడా సీఎం సమీక్ష తర్వాత స్పష్టత

మిగతా 14వ పేజీలో...

టార్గెట్ 17.. కనీసం 12

రాష్ట్రంలో లోక్‌సభ సీట్లన్నీ గెలవడమే లక్ష్యంగా పనిచేద్దాం



ఇందిరాభవన్‌లో జరిగిన టీపీసీసీ రాష్ట్ర కార్యవర్గ సమావేశంలో పాల్గొన్న కాంగ్రెస్ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి దీపాదాస్ మున్షీ, సీఎం రేవంత్, భట్టి తదితరులు

8 నుంచి 12 వ తేదీ దాకా నేతలతో సమీక్షలు

పార్టీ కోసం కష్టపడ్డవారికి సముచిత స్థానం

చెరుకుతోటలో అడవి పందుల్లా బీఆర్ఎస్ దోపిడీ

ఎన్నికల్లో బోర్లాపడి బొక్కలిరిగినా వారికి బుద్ధి రాలే

కాళేశ్వరం అవినీతిపై జ్యుడీషియల్ విచారణ తథ్యం

దానిపై సీబీఐ విచారణ చేయించాలని కిషన్ రెడ్డి అడగడం దొంగను గజదొంగకు పట్టించాలనడమే!

టీపీసీసీ విస్తృత భేటీలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి

సార్వత్రిక ఎన్నికల్లో రాష్ట్రం నుంచి సోనియా గాంధీ పోటీ చేయాలని కోరుతూ సమావేశంలో తీర్మానం

గ్రామాల్లో ఇందిరమ్మ కమిటీల ఏర్పాటుకు నిర్ణయం

నేడు ఢిల్లీకి సీఎం రేవంత్‌రెడ్డి

లోక్‌సభ ఎన్నికలు, నామినేటెడ్ పోస్టులపై చర్చ

హైదరాబాద్, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): వచ్చే లోక్‌సభ ఎన్నికల్లో రాష్ట్రంలోని 17 సీట్లలోనూ గెలుపే లక్ష్యంగా పని చేద్దామని.. 12కు తగ్గకుండా సీట్లలో పార్టీని గెలిపించుకుందామని కాంగ్రెస్ నేతలు, కార్యకర్తలకు సీఎం రేవంత్‌రెడ్డి పిలుపునిచ్చారు. ఎన్నికల సన్నద్ధత కోసం ఉమ్మడి జిల్లాలవారీగా నేతలతో 8, 9 తేదీల్లో సమీక్ష.. 10, 11, 12 తేదీల్లో అన్ని లోక్‌సభ నియోజకవర్గాల ఇన్‌చార్జ్‌లతో సన్నాహక సమావేశాలు నిర్వహిస్తానని ఆయన వెల్లడించారు. ఈ నెల 20 తర్వాత క్షేత్రస్థాయి పర్యటనల్లోనూ పాల్గొంటానని తెలిపారు. లోక్‌సభ ఎన్నికలే ప్రధాన అజెండాగా బుధవారం ఇందిరాభవన్‌లో టీపీసీసీ విస్తృత సమావేశం జరిగింది. టీపీసీసీ చీఫ్, సీఎం రేవంత్‌రెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ భేటీలో.. పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇంచార్జి దీపాదాస్‌మున్షీ, డిప్యూటీ సీఎం భట్టివిక్రమార్క, మంత్రులు, టీపీసీసీ రాజకీయ వ్యవహారాలు, ప్రదేశ్ ఎన్నికల కమిటీల సభ్యులు, కార్యవర్గం, డీసీసీ అధ్యక్షులు, అధికార ప్రతినిధులు, అనుబంధ సంఘాల చైర్మన్లు తదితరులు పాల్గొన్నారు. త్వరలో జరగనున్న సార్వత్రిక ఎన్నికల్లో తెలంగాణ నుంచి పోటీ చేయాల్సిందిగా సోనియాగాంధీని కోరుతూ సమావేశం ఏకగ్రీవంగా తీర్మానాన్ని

మిగతా 13వ పేజీలో...

రాష్ట్రంలో అదానీ డేటా సెంటర్,

ఏరోస్పేస్ పార్క్!

కొత్త పెట్టుబడులు పెట్టడానికి సిద్ధంగా ఉన్నట్టు వెల్లడి

సీఎం రేవంత్‌రెడ్డితో అదానీ గ్రూప్ ప్రతినిధుల చర్చలు

శంషాబాద్‌లో ఎనర్జీ పార్క్, పరిశోధన కేంద్రం పెడతాం

ముఖ్యమంత్రితో అమరరాజా చైర్మన్ గల్లా జయదేవ్

13

కొత్త పరిశ్రమల స్థాపనకు అత్యధిక ప్రాధాన్యమిస్తాం

ప్రభుత్వపరంగా పూర్తి సహకారం అందిస్తాం: సీఎం



అదానీపై ఇక ఏ దర్యాప్తు అవసరం లేదు

11

దర్యాప్తును సిట్ లేదా సీబీఐకి బదిలీ చేసేందుకు 'సుప్రీం' నిరాకరణ

దర్యాప్తు పూర్తికి సెబీకి 3 నెలల గడువు

సత్యమే గెలిచింది: అదానీ

క్రోనీ క్యాపిటలిజంపై పోరు కొనసాగిస్తాం

ఈ తీర్పుతో కోర్టు విశ్వసనీయతను పెంచుకోలేకపోయింది: కాంగ్రెస్



నాకు అందేలోపే మీడియాలో వస్తోంది!

నా ప్రతిష్ఠను దెబ్బతీయడం కోసమేనా?

మద్యం కేసులో ఈడీ మూడోసారి సమన్లు జారీ చేయడంపై ఢిల్లీ సీఎం కేజ్రీవాల్ ప్రశ్న

తీరిక లేదు.. విచారణకు రాలేను

ప్రశ్నలు పంపండి.. సమాధానాలిస్తా

ఈడీకి లేఖ రాసిన ఆప్ అధినేత

2

ఇందిరమ్మ ఇంటికి పీఎంఏవై నిధులు!?

ప్రధానమంత్రి ఆవాస్ యోజన నిధులను వాడుకోవాలని రాష్ట్ర సర్కారు యోచన

త్వరలో కేంద్రానికి చెప్పేందుకు ప్రణాళిక

ప్రజాపాలన దరఖాస్తుల స్వీకరణ తర్వాత పథకం అమలుకు చర్యలు

13

పీఎంఏవై పథకాన్ని తీసుకోని గత సర్కార్

స్మితా సభర్వాల్‌పై వేటు



రాష్ట్రంలో భారీగా ఐఏఎస్‌ల బదిలీలు

ఒకేసారి 26 మందికి స్థానచలనం

రాహుల్ బొజ్జాకు ఇరిగేషన్ శాఖ

ఐదు జిల్లాల కలెక్టర్లకు స్థానభ్రంశం

సీఎంవో సంయుక్త కార్యదర్శిగా సంగీత

'ప్రజావాణి' నోడల్ అధికారి హరిచందన బదిలీ

8మంది ఐఏఎస్‌లకు అదనపు బాధ్యతలు

ఫైనాన్స్ కమిషన్ సభ్య కార్యదర్శిగా అప్రాధాన్య పోస్టుకు బదిలీ చేసిన సర్కారు

హైదరాబాద్, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో మరోసారి ఐఏఎస్ అధికారుల బదిలీలు జరిగాయి. ఒకేసారి 26 మంది అధికారులను ప్రభుత్వం బదిలీ చేసింది. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటయ్యాక వివాదాలు చుట్టుముట్టిన సీనియర్ ఐఏఎస్ అధికారిణి స్మితా సభర్వాల్‌పై వేటు వేసింది. ఆమెను ఎలాంటి ప్రాధాన్యం లేని రాష్ట్ర ఫైనాన్స్ కమిషన్ సభ్య కార్యదర్శిపోస్టులో నియమించింది. మరో ఐఏఎస్ అధికారి రాహుల్ బొజ్జాకు కీలకమైన సాగునీటి పారుదల శాఖ కార్యదర్శిగా బాధ్యతలు అప్పగించింది. ఈ మేరకు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి బుధవారం బదిలీ ఉత్తర్వులు (జీవో నంబర్ 3) జారీ చేశారు. సీఎంవో కార్యదర్శిగా, ఎస్సీ అభివృద్ధి శాఖ కార్యదర్శిగా ఉన్న రాహుల్ బొజ్జాను ఇటీవలే బదిలీ చేసి, సాధారణ పరిపాలనా శాఖ(జీఏడీ) కార్యదర్శిగా నియమించిన సంగతి తెలిసిందే. కానీ, ఆ పోస్టులో చేరడానికి ఆయన కొంత నిరాసక్తత కనబరిచారు. తాజాగా ప్రభుత్వం ఆయనను

మిగతా 12వ పేజీలో...

23 మంది ఐపీఎస్‌ల బదిలీలు

21 మంది నాన్-క్యాడర్ ఎస్పీలూ

టెక్నికల్ సర్వీసెస్‌కు వీవీ శ్రీనివాస్

డీఐజీ కో-ఆర్డినేషన్‌గా భూపాల్

ఐఏఎస్, ఐపీఎస్‌లపై కేంద్రం నిర్ణయమే ఫైనల్

క్యాడర్ కేటాయింపుల అధికారం క్యాట్‌కు లేదు.. ప్రత్యూష్‌సిన్హా మార్గదర్శకాలను పాటించాల్సిందే

13 మంది అధికారుల కేటాయింపుపై హైకోర్టు తీర్పు

12

పదేళ్ల వివాదానికి ముగింపు

అన్నకు ఆహ్వానం!

జగన్ నివాసానికి వెళ్లిన షర్మిల.. కుమారుడి పెళ్లి కార్డు అందజేత

ప్యాలెస్‌లో ఉంది పావుగంటే.. తర్వాత కేసరపల్లిలో భర్తతో సమాలోచన

అనంతరం ఇద్దరూ ఢిల్లీకి.. నేడు ఖర్గే, రాహుల్ సమక్షంలో కాంగ్రెస్‌లోకి



సీఎం అవగానే.. జగన్ మమ్మల్ని దూరం పెట్టారు

విధిలేని పరిస్థితుల్లోనే ఏపీ రాజకీయాల్లోకి

ఆ పరిస్థితులు కల్పించింది జగనే

కాంగ్రెస్‌లో షర్మిలకు ఏ బాధ్యతలిచ్చినా ఓకే!

అది రాహుల్ ఇష్టం.. భర్త అనిల్ వెల్లడి

కడప ఎయిర్‌పోర్టులో టీడీపీ నేత బీటెక్ రవితో మాటామంతీ

నేడు కేసీఆర్‌ను పరామర్శించనున్న జగన్ రెడ్డి

3

వైసీపీకి భారీ షాక్

టీడీపీలో చేరిన ఎమ్మెల్సీ సి.రామచంద్రయ్య

విజయసాయి బావమరిది ద్వారకానాథ్‌రెడ్డి..

మాజీ మంత్రి దాడి వీరభద్రరావు కూడా

చంద్రబాబు సమక్షంలో పెద్ద సంఖ్యలో చేరికలు

ఏపీలో టీడీపీ గెలుపునకు కృషి చేస్తామని వెల్లడి

టీఎస్‌పీఎస్సీ ప్రక్షాళన!

సమూల మార్పులకు సర్కారు సిద్ధం

ఇప్పటికే కేరళ వెళ్లొచ్చిన కమిషన్ కార్యదర్శి

అక్కడ ఉద్యోగ నియామకాలపై పరిశీలన

ఉద్యోగి రిటైరయ్యే సమయానికి కొత్త వారు పోస్టులో చేరేలా భర్తీ ప్రక్రియ!

5న ఢిల్లీకి ఐఏఎస్‌లు వాణీప్రసాద్, నదీం

యూపీఎస్సీ విధానాలపై అధ్యయనం

అనంతరం రాష్ట్ర ప్రభుత్వానికి నివేదిక

దాని ఆధారంగా రాష్ట్ర పబ్లిక్ సర్వీస్ కమిషన్‌లో మార్పులు

హైదరాబాద్, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాష్ట్ర పబ్లిక్ సర్వీస్ కమిషన్ (టీఎస్‌పీఎస్సీ)ను సమూలంగా ప్రక్షాళన చేయడానికి రాష్ట్ర ప్రభుత్వం సన్నద్ధమైంది. గత ప్రభుత్వ హయాంలో గ్రూపు-1, ఇతర పరీక్ష పేపర్ లీకేజీలతో అప్రతిష్ఠపాలైన టీఎస్‌పీఎస్సీని పూర్తిస్థాయిలో ప్రక్షాళన చేసేందుకు రేవంత్ సర్కారు సిద్ధమైంది. ఇందులో భాగంగా ఇప్పటికే టీఎస్‌పీఎస్సీ కార్యదర్శి అనితా రామచంద్రన్ కేరళ రాష్ట్రానికి వెళ్లి, అక్కడి విధానాన్ని పరిశీలించి వచ్చారు. ఈ నెల 5న మరో ఇద్దరు ఐఏఎస్ అధికారులు ఢిల్లీ వెళ్లి యూపీఎస్సీ విధానాన్ని పరిశీలించనున్నారు. అనంతరం అధికారులు సమర్పించే నివేదిక ఆధారంగా టీఎస్‌పీఎస్సీలో అవసరమైన మార్పులు చేయాలని ప్రభుత్వం భావిస్తోంది. ఎప్పటికప్పుడు ప్రభుత్వ ఉద్యోగ ఖాళీలను భర్తీ చేయడానికి వీలుగా నియామకాల

మిగతా 2వ పేజీలో...



కాంగ్రెస్.. 420 హామీలు

27 పేజీలతో బుక్‌లెట్ విడుదల చేసిన బీఆర్ఎస్

కాంగ్రెస్ అడ్డగోలుగా హామీలు ఇచ్చిందని ధ్వజం.. మోసం చేస్తామంటే ఊరుకోబోమని స్పష్టీకరణ

హైదరాబాద్, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): ఎన్నికల వేళ కాంగ్రెస్ పార్టీ అడ్డగోలు హామీలు ఇచ్చిందని బీఆర్ఎస్ ధ్వజమెత్తింది. కేవలం ఎన్నికల్లో గెలవడమే లక్ష్యంగా ఆచరణ సాధ్యం కాని అనేక హామీలు గుప్పించిందని ఆరోపించింది. ఈ మేరకు 27 పేజీలతో కూడిన బుక్‌లెట్‌ను బుధవారం విడుదల చేసింది. హామీల అమలులో జరుగుతున్న ఆలస్యాన్ని కాంగ్రెస్‌కు గుర్తు చేసేందుకే ఈ బుక్‌లెట్‌ను విడుదల చేసినట్లు వెల్లడించింది. ఎన్నికలకు ముందు వందలాది హామీలు గుప్పించిన కాంగ్రెస్ పార్టీ- అధికారంలోకి వచ్చాక ఆరు హామీల జపం చేస్తోందని దుయ్యబట్టింది. కాంగ్రెస్ ఇచ్చింది ఆరు హామీలు కాదని, 420 అని పేర్కొంటూ మేనిఫెస్టోతోపాటు వివిధ డిక్లరేషన్ల సందర్భంగా కాంగ్రెస్ ఇచ్చిన హామీలను ఒక చోట చేర్చి బుక్‌లెట్‌ను ముద్రించినట్లు తెలిపింది. అధికారంలోకి వచ్చిన తర్వాత రకరకాల సాకులతో కొన్ని హామీలపై కాంగ్రెస్ వెనక్కి వెళ్లే ప్రయత్నం చేస్తోందని ఆరోపించింది. ఏవేవో కొర్రీలు పెట్టి లబ్ధిదారులను తగ్గించే ప్రక్రియను

మిగతా 12వ పేజీలో...

ఓటమికి 170 కారణాలు!

ఆత్మపరిశీలన చేసుకొని ముందుకెళతాం

లోక్‌సభ ఎన్నికలకు అభ్యర్థులపై 22 తర్వాత నిర్ణయం

కాంగ్రెస్, బీజేపీ మధ్య అవగాహన కుదిరింది

12

ప్రజల దృష్టి మళ్లించేందుకే మాపై విమర్శలు

కేసీఆర్ సీఎం కాకపోవడాన్ని జనం జీర్ణించుకోవట్లే

బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ వెల్లడి

సైన్స్ కాంగ్రెస్‌కు బ్రేక్.. వందేళ్లలో ఇదే తొలిసారి

న్యూఢిల్లీ, జనవరి 3: కేంద్ర ప్రభుత్వం, ఇండియన్ సైన్స్ కాంగ్రెస్ అసోసియేషన్ మధ్య వివాదం ముదిరిపాకాన పడింది. కేంద్రం నిధులు ఇవ్వడానికి ససేమిరా అనడంతో ఈ ఏడాది ఇండియన్ సైన్స్ కాంగ్రెస్ (ఐఎస్‌సీ) నిర్వహణకు బ్రేక్ పడింది. వందేళ్ల చరిత్రలో ఐఎస్‌సీ వాయిదా పడడం ఇదే మొదటిసారి. మున్ముందు ఎప్పుడు జరుగుతుందో కూడా స్పష్టత లేదు. ఏటా జనవరి 3వ తేదీ నుంచి 5 రోజుల పాటు ఐఎస్‌సీ నిర్వహించడం, ప్రధాని ప్రారంభించడం సంప్రదాయంగా వస్తోంది. అసోసియేషన్‌లో ఆర్థిక అవకతవకలు జరుగుతున్నాయని కొన్నాళ్ల కిందట కేంద్ర సైన్స్, టెక్నాలజీ విభాగం ఆరోపించడంతో వివాదం మొదలైంది. ఈ ఆరోపణలను ఐఎస్‌సీ అసోసియేషన్ ఖండించింది. కేంద్రం నిర్ణయాన్ని కోర్టులో సవాల్ చేసింది. తీర్పు రావాల్సి ఉంది.

సమన్లు నాకు అందేలోపే..మీడియాకు: కేజ్రీవాల్

న్యూఢిల్లీ, జనవరి 3: ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) తనకు వరుసగా సమన్లు జారీ చేస్తుండటంపై ఆమ్‌ఆద్మీపార్టీ జాతీయ కన్వీనర్, ఢిల్లీ సీఎం కేజ్రీవాల్ ఆగ్రహం వ్యక్తం చేశారు. సమన్లు తన చేతికి అందక ముందే ఆ విషయం మీడియాలో వస్తోందని.. 'ఈ సమన్ల జారీ వ్యవహారం చట్టబద్ధమైన దర్యాప్తు కోసమా? నా ప్రతిష్ఠను మసకబార్చటం కోసమా?' అని నిలదీశారు. ఢిల్లీ మద్యం కేసులో ఈడీ కేజ్రీవాల్‌కు బుధవారం మరోసారి(మూడోసారి) సమన్లు జారీ చేసింది. ఈ నేపథ్యంలో ఈడీకి కేజ్రీవాల్ ఓ లేఖ రాశారు. రాజ్యసభ ఎన్నికలు, రిపబ్లిక్ డే ఉత్సవాల నేపథ్యంలో తాను బిజీగా ఉన్నానని, కాబట్టి, విచారణకు రాలేనని తెలిపారు. అయితే, తనకు ప్రశ్నలు పంపిస్తే వాటికి సమాధానాలు ఇవ్వటానికి సిద్ధంగా ఉన్నట్లు పేర్కొన్నారు. ఢిల్లీ మద్యం కేసులో ఈడీ తొలిసారి నవంబరు 2న తొలిసారి సమన్లు జారీ చేసింది.

మొయిత్రా బహిష్కరణపై వివరణ ఇవ్వండి: సుప్రీం

న్యూఢిల్లీ, జనవరి 3: లోక్‌సభ నుంచి తనను బహిష్కరించడాన్ని సవాలు చేస్తూ టీఎంసీ నేత మహువా మొయిత్రా దాఖలు చేసిన పిటిషన్‌పై సుప్రీంకోర్టు బుధవారం విచారణ చేపట్టింది. ఈ వ్యవహారంపై మూడు వారాల్లోగా వివరణ ఇవ్వాలని లోక్‌సభ సెక్రటరీ జనరల్‌కు నోటీసులు జారీ చేసింది. సభా కార్యక్రమాలకు హాజరయ్యేందుకు అనుమతించాలని ఆమె చేసిన మధ్యంతర అభ్యర్థనపై ఉత్తర్వులు ఇవ్వడానికి జస్టిస్ సంజీవ్ ఖన్నా, జస్టిస్ దీపంకర్ దత్తాతో కూడిన ధర్మాసనం నిరాకరించింది. తదుపరి విచారణను మార్చి 11తో మొదలయ్యే వారానికి వాయిదా వేసింది. ఇదిలా ఉండగా, బెంగాల్ పోలీసు ఉన్నతాధికారుల సాయంతో తనపై మహువా గూఢచర్యానికి పాల్పడ్డారని ఆమె మాజీ ప్రియుడు, సుప్రీంకోర్టు న్యాయవాది జై అనంత్ దేహద్రాయ్ ఆరోపించారు. దీనిపై ఫిర్యాదు చేస్తూ కేంద్ర హోంశాఖకు, సీబీఐ డైరెక్టర్ ప్రవీణ్ సూద్‌కు ఆయన లేఖ రాశారు. ఆమె నిరంతరం తన ఫోన్‌ను ట్రాక్ చేస్తున్నారని తెలిపారు.

అరుదైన పరిస్థితుల్లోనే అధికారులు కోర్టుకు..

న్యూఢిల్లీ, జనవరి 3 : అధికారులను అరుదైన పరిస్థితుల్లోనే కోర్టుకు పిలిపించాలని సుప్రీంకోర్టు తెలిపింది. సమన్లు ఇవ్వక తప్పని పరిస్థితి వస్తే వీడియో కాన్ఫరెన్స్ ద్వారా విచారించాలంటూ మార్గదర్శకాలను విడుదల చేసింది. ఉద్యోగుల యూనిఫామ్‌పై విచారణ సందర్భంగా కోర్టులు వ్యాఖ్యలు చేయడానికి వీల్లేదని స్పష్టం చేసింది. ఏకపక్షంగా ప్రభుత్వ అధికారులను కోర్టుకు పిలిచే వైఖరిని విడనాడాలని కూడా పేర్కొంది. అలహాబాద్ హైకోర్టు ఇచ్చిన తీర్పును సవాల్ చేస్తూ యూపీ ప్రభుత్వం దాఖలు చేసిన పిటిషన్‌పై విచారణ సందర్భంగా చీఫ్ జస్టిస్ డీవై చంద్రచూడ్ నేతృత్వంలోని ముగ్గురు సభ్యుల ధర్మాసనం ఈ మేరకు ఆదేశాలు జారీచేసింది. ఏకపక్షంగా వారికి నోటీసులిచ్చి కోర్టులకు పిలిపిస్తే వారి విధులను ఆటంకపరిచినట్లు అవుతుందని పేర్కొంది.

'ముందు తవ్వకాలు..తర్వాత అనుమతుల'పై స్టే

న్యూఢిల్లీ, జనవరి 3: 'ముందు తవ్వుకో.. అనుమతులు తర్వాత తీసుకో' అనే చందంగా మైనింగ్ ప్రాజెక్టులకు ఎక్స్-పోస్ట్ ఫ్యాక్టో పర్యావరణ అనుమతుల క్లియరెన్స్ ఇచ్చే అవకాశం కల్పిస్తూ కేంద్రం గతంలో ఇచ్చిన ఉత్తర్వులపై సుప్రీం కోర్టు స్టే విధించింది. పర్యావరణ ప్రభావ అంచనా నోటిఫికేషన్ 2006 ప్రకారం.. మైనింగ్ ప్రాజెక్టులకు ముందస్తుగా పర్యావరణ అనుమతులు తీసుకోవడం తప్పనిసరి. అలా కాకుండా, ముందు పనులు మొదలుపెట్టి ఆ తర్వాత తీరిగ్గా పర్యావరణ అనుమతులు తీసుకునే (ఎక్స్-పోస్ట్ ఫ్యాక్టో ఎన్విరాన్‌మెంటల్ క్లియరెన్స్) అవకాశం కల్పిస్తూ కేంద్ర పర్యావరణ శాఖ 2021 జూలైలో, 2022 జనవరిలో ఉత్తర్వులు ఇచ్చింది. దీనిపై వనశక్తి అనే స్వచ్ఛంద సంస్థ సుప్రీంకోర్టును ఆశ్రయించింది. బుధవారం ఈ కేసు సుప్రీంకోర్టులో విచారణకు వచ్చింది. వనశక్తి తరఫున న్యాయవాది గోపాల్ శంకర్ నారాయణన్ వాదించారు. కేంద్రం ఇచ్చిన వెసులుబాటు పర్యావరణ సంరక్షణ చట్టానికే విఘాతం కలిగించేలా ఉందన్నారు. దీంతో.. ఎక్స్-పోస్ట్ ఫ్యాక్టో ఎన్విరాన్‌మెంటల్ క్లియరెన్స్‌కు అవకాశం కల్పిస్తూ 2022 జనవరి 20న కేంద్రం ఇచ్చిన ఆఫీసు మెమొరాండంపై తదుపరి విచారణ జరిగేంత వరకూ స్టే విధిస్తున్నట్లు ధర్మాసనం వెల్లడించింది. 4వారాల్లోగా సమాధానం ఇవ్వాల్సిందిగా ఆదేశిస్తూ అన్ని పార్టీలకూ నోటీసులు జారీ చేసింది.

సీఎంగా సోరెన్ కొనసాగుతారు: ఎమ్మెల్యేలు

రాంచీ, జనవరి 3: ఝార్ఖండ్ సీఎం హేమంత్ సోరెన్ రాజీనామా చేయరని, ఆయనే సీఎంగా కొనసాగుతారని రాష్ట్రంలోని సంకీర్ణ ప్రభుత్వ ఎమ్మెల్యేలు పేర్కొన్నారు. సీఎంగా ఆయన ఐదేళ్ల పదవీకాలం పూర్తి చేసుకుంటారంటూ మద్దతుగా నిలిచారు. భూకుంభకోణం కేసుకు సంబంధించి హేమంత్ సోరెన్‌కు ఈడీ ఏడుసార్లు సమన్లు జారీ చేసింది. అయినా ఆయన విచారణకు హాజరుకాలేదు. ఈ నేపథ్యంలో ఆయనను అరెస్ట్ చేయవచ్చన్న వార్తలు వచ్చాయి. ఈడీ సమన్ల నేపథ్యంలో సోరెన్ రాజీనామా చేసి ఆయన భార్య కల్పనా సోరెన్‌కు పగ్గాలు అప్పగించాలనుకుంటున్నారన్న ఊహాగానాలు వెలువడ్డాయి. ఈ పరిణామాల దరిమిలా బుధవారం సీఎం రాంచీలోని తన అధికారిక నివాసంలో రాష్ట్రంలోని అధికార కూటమిలోని పార్టీల ఎమ్మెల్యేలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్రంలో నెలకొన్న ప్రస్తుత రాజకీయ పరిణామాలపై చర్చించారు.

మధ్యవర్తిత్వానికి ఈజిప్టు గుడ్‌బై!

సలేహ్ అరౌరీ హత్యే కారణం

ఇజ్రాయెల్ హిట్ లిస్టులో మరికొందరు



వెస్ట్ బ్యాంక్‌లోని ఓ శరణార్థి శిబిరంలో పాలస్తీనీయులను అరెస్టు చేస్తున్న ఇజ్రాయెల్ సైన్యం

ఇజ్రాయెల్-హమాస్ యుద్ధ విరమణకు ఇంత కాలం ఖతార్‌తోపాటు ప్రయత్నించిన ఈజిప్ట్.. మధ్యవర్తిత్వం నుంచి తప్పుకొంటోంది. ఈ మేరకు ఇజ్రాయెల్ ప్రభుత్వానికి లేఖ రాసినట్లు ఖతార్ ధ్రువీకరించింది. ఇజ్రాయెల్ బ్రాడ్‌కాస్టింగ్ కార్పొరేషన్(ఐబీసీ) కూడా దీనిపై ప్రత్యేక కథనాలను ప్రసారం చేసింది. ఓ వైపు శాంతి కోసం తాము ప్రయత్నాలు చేస్తుంటే.. ఇజ్రాయెల్ డిఫెన్స్ ఫోర్సెస్(ఐడీఎఫ్) లెబనాన్‌లో ఉన్న హమాస్ నేత సలేహ్ అల్-అరౌరీని తుదముట్టించడమే ఈజిప్టు నిర్ణయానికి కారణమని ఆ కథనాలు స్పష్టం చేశాయి. దీంతో.. ఈజిప్టు వర్గాలతో కైరోలో ఇజ్రాయెల్ అధికారులు సోమవారం నుంచి జరుపుతున్న సమావేశాలు బుధవారం రద్దయ్యాయి. అయితే.. మధ్యవర్తిత్వం నుంచి తప్పుకోవడంపై ఈజిప్టు విదేశాంగ మంత్రిత్వ శాఖ నుంచి ఎలాంటి అధికారిక ప్రకటన వెలువడలేదు. నవంబరులో హమాస్-ఇజ్రాయెల్ మధ్య వారం రోజుల పాటు కాల్పుల విరమణ, బందీలు-ఖైదీల మార్పిడిలో ఈజిప్టు కీలక పాత్ర పోషించిన విషయం తెలిసిందే.

ఇజ్రాయెల్ హిట్‌లిస్టులో ఉన్నది వీరే..!

హమాస్ కీలక నేతలు ఇజ్రాయెల్ హిట్‌లిస్టులో ఉన్నట్లు తెలుస్తోంది. ముఖ్యంగా అక్టోబరు 7న హమాస్ ఇజ్రాయెల్‌పై దాడి చేశాక.. ఆ దృశ్యాలను లైవ్‌లో చూస్తూ.. 'థాంక్స్ గీవింగ్' ప్రార్థనలు చేసిన ముఖ్య నాయకులను ఇజ్రాయెల్ టార్గెట్‌గా చేసుకుంది. హమాస్ పొలిటికల్ బ్యూరో సభ్యులు జకారియా అబూ ముమ్మార్, జావేద్ అబూ, హమాస్ వైమానిక విభాగం చీఫ్ మురాద్ అబూ-మురాద్, ఎలైట్ ఫోర్స్ కమాండర్ అలీ అల్ ఖాదీ తదితరులను ఐడీఎఫ్ ఇప్పటికే తుదముట్టించింది. మరో ఐదుగురు కీలక నేతలను టార్గెట్‌గా చేసుకున్నట్లు తెలుస్తోంది.

ఖలీద్ మెషాల్

దశాబ్దాలుగా ఇజ్రాయెల్‌కు పంటికింద రాయిలా ఉన్న వ్యక్తుల్లో ఖలీద్ మెషాల్ ఒకరు. 1997లోనే ఇజ్రాయెల్ ఏజెంట్లు జోర్డాన్‌లో ఇతణ్ని చంపేందుకు ప్రయత్నించారు.ఇతని చెవిలో విషాన్ని పిచికారీ చేయడంతో కోమాలోకి వెళ్లిపోయాడు. అప్పటి అమెరికా అధ్యక్షుడు బిల్ క్లింటన్ చొరవతో ఆ విషానికి విరుగుడు ఇచ్చారు.

మూసా అబూ మర్జౌక్

మూసా అబూ మర్జౌక్ 1990-94 మధ్యకాలంలో అల్-ఖాసిం బ్రిగేడ్ హింసాకాండలో కీలకంగా వ్యవహరించారు. అప్పటి నుంచి ఈయన ప్రవాస జీవితంలో ఉన్నారు. 1997 మే వరకు అమెరికాలో తలదాచుకోగా.. అగ్రరాజ్యం అతణ్ని డీపోర్ట్ చేయడంతో జోర్డాన్‌లో ఉంటున్నారు. ప్రస్తుతం ఈయన హమాస్ పొలిటికల్ బ్యూరోలో సీనియర్ సభ్యుడిగా ఉన్నారు.

మహమ్మద్ అల్-డైఫ్

మహమ్మద్ అల్-డైఫ్ హమాస్ అల్-ఖాసం/అల్-మస్రీ బ్రిగేడ్‌లకు కమాండర్-ఇన్-చీఫ్. అక్టోబరు 7 నాటి దాడి వ్యూహాన్ని తూచ తప్పకుండా అమలు చేసింది ఈయనే. 1965లో ఖాన్‌యూనిస్‌లోని శరణార్థి శిబిరంలో జన్మించిన డైఫ్.. 2002లో హమాస్ సాయుధ విభాగానికి కమాండర్‌గా నియమితుడయ్యారు. 2015లో అమెరికా ఇతణ్ని అంతర్జాతీయ ఉగ్రవాదిగా ప్రకటించింది.

ఇస్మాయిల్ హనియే

హనియే 2017 నుంచి హమాస్ పొలిటికల్ బ్యూరో అధిపతిగా ఉన్నారు. గతంలో గాజాస్ట్రిప్‌ను హమాస్ స్వాధీనం చేసుకోవడంలో కీలక వ్యక్తి ఇతనే. చాలా కాలం ఖతార్, తుర్కియేలో ప్రవాస జీవితాన్ని గడిపారు. అక్టోబరు 7 దాడిలో ఇతను కీలక వ్యక్తి. మంగళవారం ఈయన హమాస్ వెనక్కి తగ్గుతున్నట్లు ప్రకటించారు.

యాహ్యా సిన్వార్

యాహ్యా సిన్వార్ 2017 నుంచి గాజాలో హమాస్ పొలిటికల్ బ్యూరో చీఫ్‌గా పనిచేస్తున్నారు. అక్టోబరు 7 నాటి హమాస్ దాడికి వ్యూహకర్త ఇతనే. గతంలో ఈయనను ఇజ్రాయెల్ అరెస్టు చేయగా.. హమాస్ కిడ్నాప్ చేసిన ఐడీఎఫ్ సైనికుడు గిలాద్ షాలిత్‌తో మార్పిడి ఒప్పందం మేరకు 2011లో విడుదలయ్యారు. ఇజ్రాయెల్‌లో 23 ఏళ్ల జైల్లో ఉన్నారు.

- సెంట్రల్ డెస్క్

ఇరాన్‌లో జంట పేలుళ్లు..

103 మంది దుర్మరణం

- సులేమానీ వర్ధంతి సందర్భంగా భారీ ర్యాలీ
- కారు, బ్యాగు బాంబులను పేల్చిన దుండగులు



టెహ్రాన్, జనవరి 3: ఇరాన్ దివంగత మేజర్ జనరల్ ఖాసీం సులేమానీ వర్ధంతి సందర్భంగా నిర్వహించిన ర్యాలీ నెత్తురోడింది. బుధవారం మధ్యాహ్నం దక్షిణ కెర్మాన్ ప్రావిన్స్‌లోని సాహెబ్ అల్-జమా మసీదు సమీపంలో.. సులేమానీ సమాధి వద్ద ప్రార్థనలు జరుగుతుండగా.. రెండు శక్తిమంతమైన ఐఈడీ పేలుళ్లు సంభవించాయి. ఈ ఘటనలో 103 మంది చనిపోయారని, 211 మంది పైగా గాయపడ్డారని ఇరాన్ అధికారిక మీడియా(ఐఆర్ఎన్ఏ) వెల్లడించింది. 2020లో ఇరాక్‌లోని బగ్దాద్ విమానాశ్రయం వెలుపల అమెరికా జరిపిన వైమానిక దాడుల్లో సులేమానీ మృతిచెందిన విషయం తెలిసిందే..! ఆయన వర్ధంతి సందర్భంగా బుధవారం ఇరానీయులు పెద్ద సంఖ్యలో ర్యాలీగా సమాధి వద్దకు చేరుకున్నారు. సరిగ్గా ప్రార్థనలు జరుగుతున్న సమయంలో సమాధికి అత్యంత సమీపంలో శక్తిమంతమైన పేలుడు సంభవించింది. "మధ్యాహ్నం 3 గంటల సమయంలో మొదటి పేలుడు సంభవించింది. సులేమానీ సమాధికి 700 మీటర్ల దూరంలో.. బ్యాగులో పెట్టిన బాంబులను దుండగులు రిమోట్ ద్వారా పేల్చారు. క్షతగాత్రులను ఆస్పత్రులకు తరలిస్తుండగా.. 20 నిమిషాల తర్వాత.. శ్మశానవాటిక అండర్‌పాస్‌కు సమీపంలో పార్క్ చేసిన కారు బాంబు పేలింది" అని ఇరాన్ అంతర్గత వ్యవహారాల మంత్రి అహ్మద్ వాహిది తెలిపారు. ఇరాన్ ప్రభుత్వం ఈ ఘటనను ఉగ్రదాడిగా ప్రకటించింది.

ఇజ్రాయెల్‌పై నెపం వేస్తున్న ఐఆర్‌జీసీ

ఈ దాడి వెనక ఇజ్రాయెల్ ఉన్నట్లు ఇరాన్ రివల్యూషనరీ గార్డ్ కార్ప్స్(ఐఆర్‌జీసీ) ఆరోపిస్తోంది. వారం క్రితమే ఆ సంస్థ అధికార ప్రతినిధి రంజాన్ షరీఫ్ ఇజ్రాయెల్‌పై ఆరోపణలను గుప్పించారు. అక్టోబరు 7న ఇజ్రాయెల్‌పై హమాస్ దాడి కూడా సులేమానీ హత్యకు ప్రతీకారమని పేర్కొన్నారు. సులేమానీ సమాధిని పేల్చేందుకు కుట్రలు జరుగుతున్నట్లు తమకు సమాచారం అందిందని వివరించారు.

లోకం తీరు



రాజకీయ విరాళాల్లో

మేఘా టాప్

2022-23లో పార్టీలకు రూ.87 కోట్ల మేర విరాళంగా ఇచ్చిన మేఘా ఇంజనీరింగ్ సంస్థ

న్యూఢిల్లీ, జనవరి 3: రాజకీయ పార్టీలకు 2022-23 ఆర్థిక సంవత్సరంలో అత్యధికంగా విరాళాలు ఇచ్చిన కార్పొరేట్ సంస్థల్లో మేఘా ఇంజనీరింగ్ అండ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ అగ్రస్థానంలో నిలిచింది. విరాళాలు ఇచ్చే వ్యక్తులు/సంస్థలకు.. రాజకీయ పార్టీలకు నడుమ అనుసంధానకర్తగా వ్యవహరించే ఎలక్టోరల్ ట్రస్టుల ద్వారా మేఘా సంస్థ రూ.87 కోట్లు పార్టీలకు విరాళాల రూపంలో ఇచ్చింది. ఈ విషయంలో మేఘా తర్వాతి స్థానాల్లో సీరమ్ ఇన్‌స్టిట్యూట్ (రూ.50.25 కోట్లు), ఆర్సెలర్ మిత్తల్ నిప్పోన్ స్టీల్ ఇండియా (రూ.50 కోట్లు) ఉన్నాయి. 'అసోసియేషన్ ఫర్ డెమొక్రాటిక్ రిఫార్మ్స్ (ఏడీఆర్)' తన తాజా నివేదికలో ఈ వివరాలను వెల్లడించింది. ఆ నివేదిక ప్రకారం..

- దేశంలో మొత్తం 18 రిజిస్టర్డ్ ఎలక్టోరల్ ట్రస్టులు ఉండగా.. వాటిలో 13 ట్రస్టుల వివరాలే ఎన్నికల కమిషన్ వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉన్నాయి. వాటిలో ఎనిమిదింటికి అసలు ఏ విరాళాలూ అందలేదు. మిగతా ఐదింటికీ కలిపి 39 కార్పొరేట్, వ్యాపార సంస్థలు రూ.363.71 కోట్లు ఇచ్చాయి.
- తనకు అందిన రూ.360.46 కోట్లలో రూ.256.25 కోట్లను ప్రుడెంట్ ట్రస్టు బీజేపీకి ఇచ్చేయడం గమనార్హం. అలాగే.. ఆ సంస్థ ఆప్, బీఆర్ఎస్, వైసీపీలకు కూడా విరాళాలు ఇచ్చింది.
- 2022-23 ఆర్థిక సంవత్సరంలో అన్ని ఎలక్టోరల్ ట్రస్టుల నుంచి అత్యధికంగా (రూ.259 కోట్లు) విరాళాలు అందుకున్న పార్టీ బీజేపీ. బీజేపీ తర్వాత బీఆర్ఎస్ అత్యధికంగా రూ.90 కోట్లు అందుకుంది. వైసీపీ, ఆప్, కాంగ్రెస్ పార్టీలు మూడూ కలిపి ఎలక్టోరల్ ట్రస్టుల నుంచి 2022-23లో అందుకున్న విరాళాలు.. రూ.17.40 కోట్లు.

జేఈఈ మెయిన్‌కు 'బ్రేక్స్'లోనూ

తనిఖీలు, బయోమెట్రిక్

న్యూఢిల్లీ, జనవరి 3: ఇంజనీరింగ్ జాతీయ ప్రవేశ పరీక్ష.. జేఈఈ మెయిన్ నిర్వహణలో మరిన్ని జాగ్రత్తలు తీసుకోనున్నట్లు నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్‌టీఏ) అధికారులు తెలిపారు. పరీక్ష ప్రారంభంలో విద్యార్థులను ఆసాంతం తనిఖీ (ఫ్రిస్కింగ్) చేయడం, బయోమెట్రిక్ తీసుకోవడం ఇప్పటి వరకూ అమలులో ఉన్న ప్రక్రియ. జనవరి 21 నుంచి ఫిబ్రవరి 1వ తేదీ వరకూ జరిగే మెయిన్స్‌కు కాలకృత్యాల కోసం బయటకు వెళ్లి తిరిగి వచ్చేటపుడు కూడా ఆసాంతం తనిఖీ చేయడం, బయోమెట్రిక్ తీసుకోవడం తప్పనిసరి చేస్తున్నట్లు ఎన్‌టీఏ పేర్కొంది. 'తప్పుడు మార్గాలను, నకిలీ హాజరును పూర్తిగా నిరోధించడానికి ఈ చర్య ఉపయోగపడుతుంది. ఇప్పటికే మేం అత్యంత కఠినమైన పద్ధతులను అమలు చేస్తున్నాం. అయితే ఒక్క పొరపాటుకు కూడా ఆస్కారం ఇవ్వకూడదన్నది మా ఉద్దేశం' అని ఎన్‌టీఏ డైరెక్టర్ సుబోధ్ కుమార్ సింగ్ తెలిపారు. కాగా జేఈఈ మెయిన్ మొత్తం 13 భాషల్లో.. ఇంగ్లీషు, హిందీ, అస్సామీ, బెంగాలీ, గుజరాతీ, కన్నడ, మరాఠీ, ఒడియా, పంజాబీ, తమిళ్, తెలుగు, ఉర్దూలో నిర్వహిస్తున్నారు. ఫలితాలు ఫిబ్రవరి 12న వెల్లడిస్తారు. ఈ సారి పరీక్షకు 12.3 లక్షలు మంది దరఖాస్తు చేసుకున్నారు.

టార్గెట్ 50



మోదీ 'మిషన్ సౌత్'!

40-50 ఎంపీ సీట్లపై గురి.. 2019లో 29 స్థానాల్లోనే గెలుపు

న్యూఢిల్లీ, జనవరి 3: వచ్చే లోక్‌సభ ఎన్నికల్లో దక్షిణ భారతంలో 40-50 స్థానాలు సాధించాలని బీజేపీ లక్ష్యంగా పెట్టుకుంది. 'మిషన్ సౌత్'లో భాగంగానే ప్రధాని మోదీ ఇటీవల తమిళనాడు, కేరళల్లో విస్తృతంగా పర్యటిస్తున్నారు. తమిళనాట మంగళవారం తిరుచిరాపల్లి విమానాశ్రయాన్ని ప్రారంభించిన ఆయన.. బుధవారం కేరళలోని త్రిసూర్‌లో, కేంద్ర పాలిత ప్రాంతం లక్షదీవుల్లో భారీ రోడ్‌షోలు నిర్వహించారు. ప్రధానంగా త్రిసూర్ రోడ్‌షోకు 2 లక్షల మంది బీజేపీ మహిళా కార్యకర్తలు హాజరవడం విశేషం. ఈ దఫా 350 లోక్‌సభ స్థానాలు గెలవాలని బీజేపీ గట్టి పట్టుదలతో ఉంది. ఇది సాధించాలంటే దక్షిణాదిన కూడా ఎక్కువ సీట్లు గెలవాల్సి ఉంటుంది. దక్షిణ భారతంలో 129 లోక్‌సభ స్థానాలు ఉండగా గత ఎన్నికల్లో బీజేపీ 29 చోట్ల మాత్రమే విజయం సాధించింది. ఇందులోనూ 25 సీట్లు కర్ణాటకలో వచ్చాయి. తెలంగాణలో 4 స్థానాలు గెలిచింది. ఆంధ్రప్రదేశ్, తమిళనాడు, కేరళల్లో ఖాతా తెరవలేదు. కర్ణాటకలో నిరుటి అసెంబ్లీ ఎన్నికల్లో అధికారం కోల్పోయింది. తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల్లో బలం పెంచుకున్నా.. కనీసం రెండో స్థానమైనా సాధించలేదు. ఈ రెండు రాష్ట్రాల్లో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్‌కు ఈ దఫా లోక్‌సభ సీట్లు పెరిగే అవకాశం ఉందని అంటున్నారు. ఈ నష్టాన్ని ఆంధ్ర, తమిళనాడు, కేరళల్లో పూడ్చుకోవాలని బీజేపీ జాతీయ నాయకత్వం భావిస్తోంది. ఈ దిశగానే ప్రధాని జనవరి, ఫిబ్రవరి నెలల్లో ఐదు దక్షిణ రాష్ట్రాల్లో విస్తృతంగా ప్రచారం చేస్తారని.. వివిధ అభివృద్ధి కార్యక్రమాలను ప్రారంభిస్తారని బీజేపీ వర్గాలు తెలిపాయి. తమిళనాడులో మంగళవారం తిరుచిరాపల్లి విమానాశ్రయం సహా రూ.20 వేల కోట్ల విలువైన అభివృద్ధి ప్రాజెక్టులను ప్రారంభించారు. కాగా, తమిళనాడులో గత ఎన్నికల్లో బీజేపీతో కలిసి పోటీచేసిన అన్నాడీఎంకే ఇప్పుడు తెగతెంపులు చేసుకుంది. కేరళలో వామపక్షాలు,కాంగ్రెస్‌పై బీజేపీ దూకుడుగా పోరాడుతోంది. వయనాడ్‌లో రాహుల్‌గాంధీపై గట్టి అభ్యర్థిని నిలపాలని యోచిస్తోంది.

బండి సంజయ్‌ను తప్పించి..!

తెలంగాణలో అసెంబ్లీ ఎన్నికల ముంగిట రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్‌ను తొలగించడం వల్లే ఓటమిపాలయ్యామని బీజేపీ జాతీయ నాయకత్వం కూడా అంగీకరిస్తోంది. అయితే బీఆర్ఎస్ పరాజయంతో లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్, బీజేపీ మధ్య ముఖాముఖి పోరు నెలకొందని ఓ బీజేపీ నేత చెప్పారు.

లక్షద్వీప్ చిన్నదే.. కానీ మనసు పెద్దది

లక్షద్వీప్ ద్వీపసమూహం చాలా చిన్నదే.. కానీ దాని మనసు పెద్దదని ప్రధాని మోదీ అన్నారు. లక్షద్వీప్‌లో రూ.1,150 కోట్ల విలువైన వివిధ ప్రాజెక్టులను ప్రారంభించడానికి, శంకుస్థాపనలు చేయడానికి బుధవారం ఆయన కవరత్తికి వచ్చారు. ఈ సందర్భంగా స్థానిక ప్రజలను మోదీ మలయాళంలో తన కుటుంబసభ్యులు (కుదుంబంగంగల్) అని సంబోధించారు. 'లక్షద్వీప్ భౌగోళిక ప్రాంతం చిన్నదే అయినప్పటికీ ఇక్కడి ప్రజల హృదయాలు సముద్రమంత లోతుగా ఉన్నాయి. ఇక్కడ నాకు లభిస్తున్న ప్రేమ, ఆశీర్వాదాలకు ముగ్ధుడనయ్యాను' అని మోదీ వ్యాఖ్యానించారు.

టీఎస్‌పీఎస్సీ ప్రక్షాళన!

(మొదటి పేజీ తరువాయి)

క్యాలెండర్‌ను అమలు చేస్తామని ఎన్నికల సందర్భంగా కాంగ్రెస్ పార్టీ హామీ ఇచ్చిన విషయం తెలిసిందే. అలాగే ఫిబ్రవరి నుంచి ఉద్యోగాల భర్తీ ప్రక్రియను మొదలు పెట్టనున్నట్లు కూడా ప్రకటించింది. మరోవైపు గత ప్రభుత్వంలో చేపట్టిన నియామకాల విషయంలో అనేక వివాదాలు చోటుచేసుకున్నాయి. టీఎస్‌పీఎస్సీ నిర్వహించిన పరీక్షల ప్రశ్నపత్రాలు లీకవడంతో గ్రూపు-1 సహా పలు పరీక్షలను రద్దు చేయాల్సి వచ్చింది. కొన్ని పరీక్షలను వాయిదా వేయాల్సి వచ్చింది. ఈ అంశంపై నిరుద్యోగుల్లో తీవ్ర ఆందోళన నెలకొంది. ఈ నేపథ్యంలో రాష్ట్రంలో బీఆర్ఎస్ ఓటమిపాలై, కాంగ్రెస్ అధికారంలోకి రావడంతో టీఎస్‌పీఎస్సీ చైర్మన్, ఇతర సభ్యులు తమ పదవులకు రాజీనామా చేశారు. వారి రాజీనామాలు గవర్నర్ వద్ద పెండింగ్‌లో ఉన్నాయి.

ఇతర రాష్ట్రాల్లో అధ్యయనం చేసి..

టీఎస్‌పీఎస్సీకి కొత్త చైర్మన్‌ను నియమించడంతో పాటు ఉద్యోగాల భర్తీ విధానంలో కూడా మార్పులు చేయాలని ప్రభుత్వం భావిస్తోంది. ఈ క్రమంలోనే టీఎస్‌పీఎస్సీ కార్యదర్శి అనితా రామచంద్రన్ కేరళ వెళ్లారు. అక్కడ అమలు చేస్తున్న విధానాన్ని పరిశీలించి వచ్చారు. మిగిలిన రాష్ట్రాలతో పోలిస్తే.. కేరళలో ఉద్యోగాల భర్తీ ప్రక్రియ కొంత భిన్నంగా ఉంటుంది. రాష్ట్రంలో ఏ ఉద్యోగి ఎప్పుడు రిటైర్ అవుతారనే విషయాన్ని ముందుగానే గుర్తించి, ఆ ఉద్యోగి రిటైరయ్యే నాటికి కొత్తవారు వచ్చి చేరేలా నియామకాల ప్రక్రియను అమలు చేస్తున్నారు. ఇలా ఎప్పటికప్పుడు ఖాళీలను భర్తీ చేస్తుండడంతో పోస్టుల సంఖ్య కూడా పరిమితంగా ఉంటుంది. పోటీ పడే అభ్యర్థులకూ స్పష్టత ఉంటుంది. నిరుద్యోగుల సంఖ్య కూడా తక్కువగా ఉంటుంది. దీంతో అధికారులపై ఒత్తిడి ఉండదు. పరీక్షల నిర్వహణలో పొరపాట్లు జరగడానికి అవకాశం తక్కువగా ఉంటుంది. ఈ విధానంలో భాగంగా ఖాళీ అయ్యే పోస్టులకు కనీసం ఆరు నెలల ముందుగానే నియామకాలను చేపట్టాల్సి ఉంటుందని టీఎస్‌పీఎస్సీ కార్యదర్శి తన పర్యటనలో గుర్తించినట్లు తెలిసింది. ఇక అఖిల భారత సర్వీసులకు చెందిన పోస్టుల భర్తీ ప్రక్రియను 'యూనియన్ పబ్లిక్ సర్వీసు కమిషన్ (యూపీఎస్సీ)' నిర్వహిస్తున్న విషయం తెలిసిందే. ఏటా షెడ్యూల్ ప్రకారమే యూపీఎస్సీ ఈ నియామకాలను పూర్తి చేస్తోంది. దేశవ్యాప్తంగా జరిగే ఈ నియామకాల్లో ఎలాంటి పొరపాట్లు, తప్పులు లేకుండా యూపీఎస్సీ పటిష్ఠ చర్యలు చేపడుతోంది. ఈ నేపథ్యంలో యూపీఎస్సీ విధానాలను కూడా పరిశీలించాలని రాష్ట్ర ప్రభుత్వం భావిస్తోంది. అందుకోసం ఈ నెల 5న ఐఏఎస్ అధికారులు వాణీప్రసాద్, అహ్మద్ నదీమ్‌లు ఢిల్లీ వెళ్లి, యూపీఎస్సీ విధానాలపై అధ్యయనం చేయనున్నారు. ఈ పర్యటన పూర్తయిన తర్వాత అధికారులు ప్రభుత్వానికి నివేదికను సమర్పించనున్నారు. రాష్ట్రంలో టీఎస్‌పీఎస్సీ ఎలా ఉండాలి? పరీక్షలను ఎలా నిర్వహించాలి? ఉద్యోగాల భర్తీ క్యాలెండర్‌ను ఎలా అమలు చేయాలి? వంటి అంశాలపై అధికారులు తమ నివేదికలో స్పష్టత ఇచ్చే అవకాశం ఉంది.

ఐఏఎస్, ఐపీఎస్‌లపై కేంద్రం నిర్ణయమే ఫైనల్

క్యాడర్ కేటాయింపులు కేంద్రం పరిధిలోనిదే.. ఆ అధికారం క్యాట్‌కు లేదు.. 'సోమేశ్ కుమార్' తీర్పుతో ఇప్పటికే స్పష్టమైంది

- ప్రత్యూష్‌సిన్హా మార్గదర్శకాలను పాటించాల్సిందే
- 13 మంది అధికారుల కేటాయింపుపై హైకోర్టు తీర్పు
- పదేళ్లుగా నలుగుతున్న వివాదానికి ముగింపు

హైదరాబాద్, జనవరి3 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి ఏపీ విభజన సందర్భంగా పదేళ్ల క్రితం మొదలైన ఐఏఎస్, ఐపీఎస్‌ల క్యాడర్ వివాదానికి హైకోర్టు ముగింపు పలికింది. అఖిల భారత సర్వీసు అధికారులను రాష్ట్రాలకు కేటాయించే విషయంలో తుది నిర్ణయం కేంద్రానిదేనని.. ఆ అధికారం సెంట్రల్ అడ్మినిస్ట్రేటివ్ ట్రిబ్యునల్ (క్యాట్)కు లేదని స్పష్టం చేసింది. అధికారుల కేటాయింపు కోసం కేంద్రం జారీ చేసిన ప్రత్యూష్ సిన్హా కమిటీ మార్గదర్శకాలను గతంలో ఇదే హైకోర్టు డివిజన్ బెంచ్ సమర్థించిందని, కాబట్టి ఆ మార్గదర్శకాలను కచ్చితంగా పాటిస్తూ నిర్ణయం తీసుకోవాలని స్పష్టం చేసింది. క్యాడర్ వివాదంలో ఉన్న అధికారులు పదేళ్లుగా తెలంగాణలో పనిచేస్తున్న అంశాన్ని, రిటైర్‌మెంట్‌కు దగ్గర్లో ఉన్న అంశాన్ని పరిగణనలోకి తీసుకోవాలని కేంద్రానికి సూచించింది. అలాగే తమ కేసుల్లో ఉన్న ప్రత్యేక సమస్యలపై అధికారులు తాజాగా దరఖాస్తులు చేసుకోవాలని, ఈ మేరకు వారి వాదనను పరిశీలించిన తర్వాతే నిర్ణయం తీసుకోవాలని కేంద్రానికి స్పష్టం చేసింది. ఆయా కేసుల్లో క్యాట్ అభిప్రాయాలను కూడా పరిగణనలోకి తీసుకోవాలని పేర్కొంది. ఈ మేరకు పది మంది ఐఏఎస్‌లు, ముగ్గురు ఐపీఎస్‌లకు సంబంధించిన పిటిషన్లపై విచారణను ముగించింది.

నేపథ్యం ఇదీ..

ఉమ్మడి ఏపీ విభజన సందర్భంగా ఏపీ, తెలంగాణ మధ్య ఐఏఎస్, ఐపీఎస్ అధికారుల విభజనకు కేంద్రం ప్రత్యూష్ సిన్హా కమిటీని ఏర్పాటు చేసింది. ఈ కమిటీ కేటాయింపులు, మార్గదర్శకాలను సవాల్ చేస్తూ 16మంది అధికారులు క్యాట్‌ను ఆశ్రయించి తమకు అనుకూలంగా ఉత్తర్వులు తెచ్చుకున్నారు. ఈమేరకు అసలు కేటాయింపులకు విరుద్ధంగా ఇటు తెలంగాణలో అటు ఏపీలో కొనసాగుతున్నారు. వీరి లో ఐపీఎస్‌లు ఏపీ రంగనాథ్, సంతోష్ మెహ్రా తమ పిటిషన్లను ఉపసంహరించుకోగా మిగిలిన 14మందికి వ్యతిరేకంగా కేంద్రం (డీవోపీటీ) హైకోర్టులో పిటిషన్లు దాఖలు చేసింది. క్యాట్ ఉత్తర్వులను కొట్టేసి ఒరిజినల్ కేటాయింపుల ప్రకారం ఎక్కడి అధికారులను అక్కడికి పంపాలని హైకోర్టును కోరింది.

అప్పటి తెలంగాణ సీఎస్ సోమేశ్‌కుమార్‌కు సంబంధించిన పిటిషన్‌ను లీడ్ కేసుగా తీసుకున్న అప్పటి చీఫ్ జస్టిస్ ఉజ్జల్ భుయాన్ నేతృత్వంలోని డివిజన్ బెంచ్.. సోమేశ్‌కుమార్ ఏపీకి వెళ్లాల్సిందేనని తీర్పు ఇచ్చింది. క్యాడర్ కేటాయింపుల్లో కేంద్రానిదే తుది నిర్ణయమంటూ క్యాట్ ఉత్తర్వులను కొట్టేసింది. మిగిలిన 13 మంది అధికారుల కేసులపై గత కొద్దినెలలుగా జస్టిస్ అభినంద్ కుమార్ షావిలి, జస్టిస్ నామవరపు రాజేశ్వర్‌రావు నేతృత్వంలోని ధర్మాసనం విచారణ జరుపుతోంది. కాగా బుధవారం అధికారుల తరఫున సీనియర్ న్యాయవాదులు జీ.విద్యాసాగర్, ఆదినారాయణరావు, వీ మల్లిక్, సుధీర్, లక్ష్మీనర్సింహ, గోడ శివ, అశ్వినీకుమార్, ప్రభునాథ్ తదితరులు వాదనలు వినిపించారు. పిటిషనర్లకు సంబంధించిన కేసుల్లోని వేర్వేరు అంశాలు 'సోమేశ్‌కుమార్' తీర్పులో కవర్ కాలేదన్నారు. కేంద్రం తరఫున అదనపు సొలిసిటర్ జనరల్ నరసింహ శర్మ వాదనలు వినిపిస్తూ.. 'సోమేశ్‌కుమార్' వ్యవహారంలో హైకోర్టు వెలువరించిన తీర్పే ప్రస్తుతానికీ శిరోధార్యం అని పేర్కొన్నారు. ప్రత్యూష్ సిన్హా కమిటీ కేటాయింపులప్రకారం ఎక్కడి అధికారులు అక్కడికి వెళ్లిపోవాల్సిందేనన్నారు. ఇరుపక్షాల వాదనలు విన్న ధర్మాసనం.. కేంద్రం మార్గదర్శకాలను కచ్చితంగా పాటించాలని ఆదేశాలు జారీచేసింది. 'సోమేశ్ కుమార్' తీర్పునకు వ్యతిరేకంగా తాము వ్యవహరించలేమని స్పష్టం చేసింది.

అధికారి పేరు	అసలు కేటాయింపు	క్యాట్ కేటాయింపు
1. హరికిరణ్ ఐఏఎస్	తెలంగాణ	ఏపీ
2. జీ అనంతరాము ఐఏఎస్	ఏపీ	తెలంగాణ
3. ఎం ప్రశాంతి ఐఏఎస్ (ప్రమోటీ)	ఏపీ	తెలంగాణ
4. వాకాటి కరుణ ఐఏఎస్ (ప్రమోటీ)	ఏపీ	తెలంగాణ
5. ఏ వాణీప్రసాద్ ఐఏఎస్ (ప్రమోటీ)	ఏపీ	తెలంగాణ
6. రొనాల్డ్ రోస్ ఐఏఎస్	ఏపీ	తెలంగాణ
7. గుమ్మళ్ల శ్రీజన ఐఏఎస్	తెలంగాణ	ఏపీ
8. ఎస్ఎస్ రావత్ ఐఏఎస్	ఏపీ	తెలంగాణ
9. ఆమ్రపాలి కాట ఐఏఎస్	ఏపీ	తెలంగాణ
10. శివశంకర్ లోతేటి ఐఏఎస్	తెలంగాణ	ఏపీ
11. అంజనీకుమార్ ఐపీఎస్	ఏపీ	తెలంగాణ
12. అభిలాష బిస్త్ ఐపీఎస్	ఏపీ	తెలంగాణ
13. అభిషేక్ మహంతి ఐపీఎస్	ఏపీ	తెలంగాణ

మారిన రాష్ట్ర ప్రభుత్వ స్వరం

క్యాడర్ వివాదానికి సంబంధించి గత బీఆర్ఎస్ ప్రభుత్వం క్యాట్‌లో, హైకోర్టులో భిన్న వైఖరులను తీసుకుంది. తెలంగాణ ఏర్పడిన కొత్తలో క్యాట్ వద్ద వాదనలు వినిపిస్తూ ఈ అంశం కేంద్రం పరిధిలోనిదని పేర్కొంది. తర్వాత హైకోర్టులో విచారణ సమయంలో సోమేశ్‌కుమార్, అంజనీకుమార్ సహా ఇతర అధికారులు తెలంగాణలో పదేళ్లుగా పనిచేస్తున్నారని.. వారి సేవలు ప్రభుత్వానికి అవసరమని తెలిపింది. ఒకానొక దశలో హైకోర్టు ధర్మాసనం ఎదుటే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల న్యాయవాదులు వాగ్వాదానికి దిగారు. కాంగ్రెస్ అధికారం చేపట్టిన తర్వాత ప్రభుత్వ వైఖరి మారింది. ఇది కేంద్రం పరిధిలోని అంశమని స్పష్టం చేసింది. 'సోమేశ్‌కుమార్' తీర్పుపై గతంలో రాష్ట్రప్రభుత్వం దాఖలు చేసిన రివ్యూ పిటిషన్‌ను వెనక్కి తీసుకుంటామని తెలిపింది.



కడప విమానాశ్రయంలో బ్రదర్ అనిల్‌తో మాజీ ఎమ్మెల్సీ బీటెక్ రవి

సీఎం అయినప్పటి నుంచి జగన్ మమ్మల్ని దూరం పెట్టారు

- విధి లేని స్థితిలోనే ఏపీ రాజకీయాల్లోకి..
- ఆ పరిస్థితులు కల్పించింది జగనే
- కాంగ్రెస్‌లో షర్మిలకు ఏ బాధ్యతలిచ్చినా ఓకే
- భర్త బ్రదర్ అనిల్ వెల్లడి
- కడప ఎయిర్‌పోర్టులో బీటెక్ రవితో ముచ్చట

కడప, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): 'జగన్ సీఎంగా బాధ్యతలు చేపట్టిన రోజు నుంచే షర్మిలను, నన్ను దూరం పెడుతూ వచ్చారు. ఏపీ రాజకీయాల్లోకి అడుగు పెట్టాలని షర్మిలకు ఆసక్తే లేదు. ఆయనే విధిలేని పరిస్థితులు కల్పించడంతో రావలసి వచ్చింది' అని వైఎస్ షర్మిల భర్త, సీఎం జగన్ బావ బ్రదర్ అనిల్ వ్యాఖ్యానించారు. బుధవారం కడప విమానాశ్రయంలో విజయవాడ వెళ్లేందుకు ఆయన ఎదురుచూస్తుండగా.. టీడీపీ నేతలు, మాజీ ఎమ్మెల్యేలు బీటెక్ రవి, దేవగుడి నారాయణరెడ్డి (మాజీ మంత్రి ఆదినారాయణరెడ్డి సోదరుడు) కూడా విజయవాడ వెళ్లేందుకు వచ్చారు. వీరంతా లాంజ్‌లో అనుకోకుండా కలిశారు. రవి, నారాయణరెడ్డి.. అనిల్‌కు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు. షర్మిల కాంగ్రెస్‌లో చేరుతున్న సందర్భంగా ఆల్‌ది బెస్ట్ చెప్పారు. ఈ సందర్భంగా వారి మధ్య ఆసక్తికర చర్చ జరిగినట్లు తెలిసింది. విశ్వసనీయ సమాచారం ప్రకారం.. మీ డిబేట్లు చూస్తుంటానని.. ముక్కుసూటిగా మాట్లాడతారని బీటెక్ రవితో అనిల్ అన్నారు. షర్మిలతో కలిసి ఢిల్లీ వెళ్లి కాంగ్రెస్‌లో చేరతామని చెప్పారు. ఆమెకు పీసీసీ అధ్యక్ష పదవి ఇస్తున్నారా అని అనిల్ అడుగగా.. 'అది రాహుల్‌గాంధీ ఇష్టం. పీసీసీ ఇస్తారా.. సీడబ్ల్యూసీలో సభ్యత్వం ఇస్తారా అనేది మా మధ్య చర్చకు రాలేదు. కాంగ్రెస్ ఏ బాధ్యతలు ఇచ్చినా ఓకే' అని అనిల్ బదులిచ్చారు. రాష్ట్ర రాజకీయాలతో పాటు కడప రాజకీయాలపైనా వీరు చర్చించారు. షర్మిలకు పీసీసీ ఇస్తే కడప జిల్లాలో వైసీపీపై ప్రభావం, కాంగ్రెస్‌లో చేరికల గురించి చర్చ జరిగినట్లు తెలిసింది. వైఎస్ రాజశేఖరరెడ్డి సీఎంగా ఎక్కడ ఉన్నా.. జిల్లా రాజకీయాలను దివంగత వివేకానందరెడ్డే చూసేవారని, ఆయన్ను అంత దారుణంగా హత్యచేయడం బాధాకరమని అనిల్ వ్యాఖ్యానించినట్లు సమాచారం. ఆ హత్య కేసులో తమను ఇరికించే ప్రయత్నం చేశారని, ఇబ్బందులకు గురిచేశారని బీటెక్ రవి, నారాయణరెడ్డి తెలిపారు. అనిల్‌తో చర్చపై బీటెక్ రవి 'ఆంధ్రజ్యోతి'తో మాట్లాడారు. బ్రదర్ అనిల్ తమ ఊరి అల్లుడు కావడంతో నూతన సంవత్సర శుభాకాంక్షలు చెప్పానని.. కాంగ్రెస్‌లో చేరుతుండడంతో ఆల్‌ది బెస్ట్ చెప్పానని వెల్లడించారు.

పరకాల ప్రభాకర్‌రావుకు మాతృవియోగం

- మహాప్రస్థానంలో ముగిసిన అంత్యక్రియలు



కాళికాంబ (ఫైల్)

నార్సింగ్/ రాయదుర్గం జనవరి 3 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ రాజకీయ, ఆర్థిక విశ్లేషకులు పరకాల ప్రభాకర్‌కు మాతృ వియోగం కలిగింది. ఆయన తల్లి మాజీ ఎమ్మెల్యే పరకాల కాళికాంబ (93) గండిపేట మండలం మంచిరేవుల గ్రామంలోని పరకాల ప్రభాకర్ ఇంట్లో బుధవారం తెల్లవారు జామున కన్నుమూశారు. గతంలో కాళికాంబ నరసాపూర్ నుంచి ఎమ్మెల్యేగా గెలుపొందారు. కాళికాంబ దంపతులకు నలుగురు సంతానం. ఇద్దరు కుమారులు, ఇద్దరు కుమార్తెలు. కాగా పెద్ద కుమారుడు పరకాల ప్రభాకర్ భార్య నిర్మలా సీతారామన్ ప్రస్తుతం కేంద్ర ఆర్థిక మంత్రిగా ఉన్నారు. కాళికాంబ అంత్యక్రియలు ఫిలింనగర్‌లోని మహాప్రస్థానంలో జరిగాయి.

నేడు కేసీఆర్‌ను పరామర్శించనున్న జగన్

అమరావతి, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ మాజీ ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్ రావును ఏపీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి గురువారం పరామర్శించనున్నారు. ఇటీవల కేసీఆర్‌కు తుంటికి ఆపరేషన్ జరిగింది. ఆసుపత్రి నుంచి ఆయన డిశ్చార్జ్ అయ్యారు. ఈ తరుణంలో ఏపీలోని తాడేపల్లి నివాసం నుంచి గురువారం ఉదయం పది గంటలకు బయలుదేరి హైదరాబాద్‌కు జగన్ చేరుకుంటారు. బంజారాహిల్స్ రోడ్ నంబరు 14లోని నివాసంలో కేసీఆర్‌ను కలుస్తారు. అనంతరం తాడేపల్లికి జగన్ తిరుగు ప్రయాణమవుతారు.

సింగిల్ జడ్జి వద్దే తేల్చుకోండి

- 'వ్యూహం' నిర్మాతకు స్పష్టం చేసిన తెలంగాణ హైకోర్టు

హైదరాబాద్, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): వ్యూహం సినిమాకు సెన్సార్ బోర్డు ఇచ్చిన సర్టిఫికెట్‌ను సస్పెండ్ చేస్తూ ఈ నెల 11 వరకు సినిమా విడుదలను నిలిపేయాలన్న సింగిల్ జడ్జి మధ్యంతర ఉత్తర్వులపై నిర్మాత దాసరి కిరణ్ కుమార్, రామధూత క్రియేషన్స్.. తెలంగాణ హైకోర్టు డివిజన్ బెంచ్‌లో అప్పీల్ చేశారు. ఈ అప్పీల్‌పై చీఫ్ జస్టిస్ అలోక్ అరాధే, జస్టిస్ అనిల్‌కుమార్‌తో కూడిన ధర్మాసనం బుధవారం విచారణ చేపట్టింది. సింగిల్ జడ్జి ఇచ్చింది మధ్యంతర ఉత్తర్వులే అయినందున వాటిపై విచారణ చేపట్టలేమని ధర్మాసనం పేర్కొంది. సంబంధిత రికార్డును సింగిల్ జడ్జికే సమర్పించాలని సెన్సార్ బోర్డుకు ఆదేశించింది. ఈ నెల 11కు బదులు ఈనెల 8నే మెరిట్స్ ఆధారంగా విచారణ చేపట్టి నిర్ణయం తీసుకోవాలని సింగిల్ జడ్జికి విజ్ఞప్తి చేసింది. హైకోర్టు ప్రొసీడింగ్స్ ప్రభావం సివిల్ కోర్టుపై ఉండబోవని స్పష్టం చేసింది.

సీఐడీ కార్యాలయానికి కొలికిపూడి

- సినీ దర్శకుడు రాంగోపాల్‌వర్మపై వివాదాస్పద వ్యాఖ్యలపై కేసు

గుంటూరు, జనవరి 3: సినీ దర్శకుడు రాంగోపాల్ వర్మపై వివాదాస్పద వ్యాఖ్యలు చేశారంటూ నమోదైన కేసులో అమరావతి జేఏసీ నేత కొలికిపూడి శ్రీనివాసరావు గుంటూరులోని సీఐడీ కార్యాలయంలో బుధవారం విచారణకు హాజరయ్యారు. ఉదయం 10 గంటలకు జిల్లా కోర్టు నుంచి టీడీపీ, జనసేన, విద్యార్థి జేఏసీ ఆధ్వర్యంలో ఆయన ర్యాలీగా సీఐడీ ప్రాంతీయ కార్యాలయానికి చేరుకున్నారు. పోలీసులు కొలికిపూడి శ్రీనివాసరావు, హైకోర్టు న్యాయవాది వలివేటి లక్ష్మీనారాయణ, తెలుగు యువత జిల్లా అధ్యక్షుడు రావిపాటి సాయికృష్ణలను మాత్రమే కార్యాలయంలోకి అనుమతించారు. ఉదయం 10 నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు విచారణ సాగింది. కొలికిపూడి చేసిన వ్యాఖ్యల కంటే ఆయన వ్యక్తిగత, రాజకీయ అంశాలపైనే ఎక్కువగా సీఐడీ ప్రశ్నలు సంధించినట్లు తెలిసింది. తిరిగి ఈ నెల 8న మరోసారి విచారణకు హాజరు కావాలని సీఐడీ అధికారులు చెప్పినట్లు కొలికిపూడి తెలిపారు.

వైసీపీకి భారీ షాక్

- టీడీపీలో చేరిన అధికార పార్టీ ఎమ్మెల్సీ సి. రామచంద్రయ్య
- సాయిరెడ్డి బావమరిది ద్వారకానాథ్‌రెడ్డి
- మాజీ మంత్రి దాడి వీరభద్రరావు కూడా
- బాబు సమక్షంలో పెద్ద సంఖ్యలో చేరికలు



సీ రామచంద్రయ్యకు టీడీపీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న చంద్రబాబు

అమరావతి, జనవరి 3(ఆంధ్రజ్యోతి): అసెంబ్లీ ఎన్నికల ముంగిట అధికార పార్టీ వైసీపీకి రాజకీయంగా భారీ ఎదురుదెబ్బ తగిలింది. ఆ పార్టీకి చెందిన పలువురు సీనియర్ రాజకీయ నాయకులు టీడీపీ అధినేత చంద్రబాబు సమక్షంలో ఆ పార్టీ కండువా కప్పుకొన్నారు. వీరిలో ఎమ్మెల్సీ, మాజీ మంత్రి సి. రామచంద్రయ్య వైసీపీ ప్రధాన కార్యదర్శి, ఎంపీ విజయసాయిరెడ్డి సొంత బావమరిది, మాజీ ఎమ్మెల్యే ద్వారకానాథ్‌రెడ్డి, మాజీ మంత్రి దాడి వీరభద్రరావు, ఆయన ఇద్దరు కుమారులు, బాపట్ల నియోజకవర్గంలోని జడ్పీటీసీ సభ్యుడు పిట్ల వేణుగోపాలరెడ్డి తదితరులు ఉన్నారు. టీడీపీ గెలుపు కోసం కృషి చేస్తామని నాయకులు స్పష్టం చేశారు. టీడీపీలో చేరిన వారిలో రామచంద్రయ్య ద్వారకానాథ్‌రెడ్డి ఇద్దరూ సీఎం జగన్ సొంత జిల్లా కడపకు చెందిన వారు కావడం విశేషం. హిందూ మహాసభ రాష్ట్ర అధ్యక్షుడు వెలగపూడి గోపాలకృష్ణతో కలిసి బుధవారం ఉదయం రామచంద్రయ్య ఉండవల్లిలోని చంద్రబాబు నివాసానికి వచ్చారు. సుమారు గంటసేపు చంద్రబాబు చర్చలు జరిపారు. తర్వాత మంగళగిరిలోని టీడీపీ కేంద్ర కార్యాలయానికి వచ్చి చంద్రబాబు సమక్షంలో పార్టీలో చేరిపోయారు. ఈ సందర్భంగా రామచం ద్రయ్య మాట్లాడుతూ.. జగన్ రెడ్డి హయాంలో రాష్ట్రం అప్పులు రూ.12లక్షల కోట్లకు చేరాయని, ఇవి తీరా లంటే ప్రజల చర్మం వలిస్తే తప్ప సాధ్యం కాదని వ్యాఖ్యానించారు. ఈ రాష్ట్రాన్ని బాగు చేయగలిగిన శక్తి ఒక్క చంద్రబాబుకే ఉంది. ఈసారి ప్రజలు పొరపాటు చేస్తే అంధకారం తప్ప ఏమీ మిగలదు. రాష్ట్రం ఇంకా చెడిపోవడం చూడలేకే తిరిగి టీడీపీలోకి వచ్చాను' అని అన్నారు.

రాయచోటిలో కుదుపు

కడప జిల్లా రాయచోటి నియోజకవర్గానికి చెందిన సాయిరెడ్డి బావమరిది గడికోట ద్వారకానాథ్‌రెడ్డి కూడా టీడీపీ కండువా కప్పుకొన్నారు. గతంలో టీడీపీ తరఫున లక్కిరెడ్డిపల్లి నుంచి ఎమ్మెల్యేగా విజయం దక్కించుకున్నారు. గడికోట తండ్రి రామమునిరెడ్డి కూడా ఎమ్మెల్యేగా చేశారు. ద్వారకానాథ్‌రెడ్డి వైసీపీ ఎంపీ విజయసాయిరెడ్డికి స్వయానా బావమరిది. సినీ హీరో దివంగత తారకరత్న సతీమణి అలేఖ్యా రెడ్డికి ద్వారకానాథ్‌రెడ్డి మేనమామ. వైఎస్ రాజశేఖరరెడ్డి హయాంలో కాంగ్రెస్‌లో చేరిన ద్వారకానాథ్‌రెడ్డి ఆ తర్వాత వైసీపీలో చేరి జగన్‌కు మద్దతుగా నిలిచారు. అయితే, జగన్ అధికారంలోకి వచ్చిన తర్వాత తనకు నిరాదరణ ఎదురైందన్న మనస్థాపానికి గురై.. కొంతకాలంగా తీవ్ర అసంతృప్తితో ఉన్నారు. ఈ నేపథ్యంలోనే ఆయన టీడీపీలో చేరినట్టు తెలిసింది. కాగా, ఈ పరిణామం.. రాయచోటిలో వైసీపీకి భారీ నష్టం చేకూర్చే అవకాశం ఉందని పరిశీలకులు అంచనా వేస్తున్నారు.

అనకాపల్లి వైసీపీకి నష్టం

విశాఖపట్నం జిల్లా అనకాపల్లికి చెందిన మాజీ మంత్రి దాడి వీరభద్రరావు తన ఇద్దరు కుమారులు రత్నాకర్, జైవీర్‌లతో కలిసి టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు. ఒకప్పుడు టీడీపీ సీనియర్ నేత అయిన దాడి.. తర్వాత వైసీపీలోకి వెళ్లారు. జగన్ వ్యవహార శైలితో విభేదించి దూరంగా ఉంటున్నారు. ఈక్రమంలో ఆయన కుమారులతో కలిసి టీడీపీ కండువా కప్పుకొన్నారు. దీంతో అనకాపల్లిలో వైసీపీకి నష్టం చేకూరనుంది.

జగన్ గెలుపు కల్లే!

- సాయిరెడ్డి టీడీపీలోకి వచ్చినా ఆశ్చర్యంలేదు: ద్వారకానాథ్‌రెడ్డి

వైసీపీ కోసం 4 ఎన్నికల్లో పనిచేసిన తాను ఆ పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత అనేక అవమానాలు ఎదుర్కొన్నానని, తనను కనీసం సీఎం పేషీలోకి కూడా అడుగు పెట్టనీయలేదని తాజాగా టీడీపీలోకి చేరిన గడికోట ద్వారకానాథ్‌రెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. బుధవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. రాయచోటి వైసీపీ ఎమ్మెల్యే శ్రీకాంత్ రెడ్డి చేసిన అవమానాలకు జగన్ నిరాదరణ తోడైందన్నారు. "మూడు విషయాల్లో జగన్ ప్రజాదరణ కోల్పోయారు. అవినీతి భయంకరంగా పెరిగిపోయింది. ప్రశ్నిస్తే అణిచివేతను ఆయుధంగా ప్రయోగిస్తున్నారు. కేసులు పెట్టి వేధిస్తున్నారు. ఎన్నికల్లో వాడుకుని.. తర్వా త విసిరేయడం జగన్‌కు అలవాటు. సజ్జల రామకృష్ణారెడ్డి, మిథున్ రెడ్డి, వైవీ సుబ్బారెడ్డి, విజయసాయిరెడ్డి ఆయనకు డబ్బులు వసూలు చేసి పెట్టే ఏజెంట్లు. ఈసారి జగన్ గెలవడం కల్ల. రాబోయే కాలంలో విజయసాయి రెడ్డి కూడా టీడీపీలోకి వచ్చినా ఆశ్చర్యంలేదు. ఈసారి చంద్రబాబు సీఎం అవుతారు" అని అన్నారు.

అన్నకు ఆహ్వానం!

- జగన్ నివాసానికి వెళ్లిన షర్మిల.. కుమారుడి పెళ్లి కార్డు అందజేత
- ప్యాలెస్‌లో ఉన్నది పావుగంటే
- నేడు ఖర్గే, రాహుల్ సమక్షంలో కాంగ్రెస్‌లో చేరిక
- పీసీసీ పగ్గాలు ఖాయం!



అమరావతి, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): మాజీ ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి కుమార్తె షర్మిల.. బుధవారం తాడేపల్లిలో తన అన్న, సీఎం జగన్మోహన్‌రెడ్డి నివాసానికి వెళ్లారు. తన కుమారుడు రాజారెడ్డి వివాహ ఆహ్వానపత్రికను అందజేశారు. మంగళవారం ఇడుపులపాయలోని తన తండ్రి సమాధి వద్ద కుమారుడి పెళ్లి పత్రికను మొదటిగా పెట్టి ఆశీర్వాదం తీసుకున్న ఆమె.. బుధవారం కుటుంబ సభ్యులతో ప్రత్యేక విమానంలో గన్నవరం విమానాశ్రయానికి వచ్చారు. అక్కడ ఆమెకు మంగళగిరి ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి స్వాగతం పలికారు. గన్నవరం నుంచి తాడేపల్లి చేరుకున్న షర్మిల సాయంత్రం 5.38 గంటలకు జగన్ నివాసంలో అడుగుపెట్టారు. అన్నావదినలకు కుమారుడి పెళ్లి పత్రిక అందజేసి.. పెళ్లికి రావాలని ఆహ్వానించారు. సాయంత్రం 6.03 గంటలకు బయటకు వచ్చారు. కేవలం 15 నిమిషాలు మాత్రమే జగన్ నివాసంలో ఉన్నారు. అక్కడి నుంచి నేరుగా గన్నవరం సమీపంలోని కేసరపల్లిలోని విల్లాలో బ్రదర్ అనిల్‌తో ఆమె సమాలోచనలు సాగించారు. పిల్లలు, ఇతర కుటుంబసభ్యులను ప్రత్యేక విమానంలో హైదరాబాద్‌కు పంపిన షర్మిల.. భర్తతో కలిసి ఢిల్లీ బయల్దేరారు. గురువారం ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, కాంగ్రెస్ అగ్ర నేతలు రాహుల్ గాంధీ, ప్రియాంకా గాంధీ సమక్షంలో కాంగ్రెస్‌లో చేరతారు. కాగా, కాంగ్రెస్‌లో చేరుతున్న షర్మిలకు ఆంధ్ర పీసీసీ పగ్గాలు అప్పగించేందుకే రాహుల్ మొగ్గు చూపుతున్నారు. ఇటీవల ఢిల్లీలో రాష్ట్ర నేతలతో జరిగిన సమావేశంలో.. ఆయన, ఖర్గే ప్రత్యేకంగా షర్మిల ప్రస్తావన తీసుకొచ్చారు. రాష్ట్రానికి చెందిన ఇద్దరు మాజీ ఎంపీలు తప్ప ఆమె రాకను అందరూ స్వాగతించారు. ఆమె పగ్గాలు చేపడితే రాష్ట్రంలో కాంగ్రెస్ బలోపేతమవుతుందని చెప్పారు. ఈ సమయంలో పీసీసీ అధ్యక్షుడు గిడుగు రుద్రరాజు తన అభిప్రాయాన్ని వెల్లడిస్తుండగా.. రాహుల్ జోక్యం చేసుకుని.. రాష్ట్ర కాంగ్రెస్‌లో షర్మిలకు ప్రాధాన్యం ఉంటుందని స్పష్టం చేశారు.

కాంగ్రెస్ నుంచే వచ్చాం..: ఆళ్ల

మంగళగిరి, జనవరి 3: మళ్లీ తాను వైసీపీలోకి వెళ్లే ప్రసక్తే లేదని, షర్మిలతోపాటు కాంగ్రెస్‌లో చేరబోతున్నానని గుంటూరు జిల్లా మంగళగిరి ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి స్పష్టం చేశారు. ఒకప్పుడు తామంతా కాంగ్రెస్ నుంచే వచ్చామని, ఇప్పుడు మళ్లీ అదే పార్టీలో చేరుతున్నామని తెలిపారు. ఆయన బుధవారమిక్కడ విలేకరులతో మాట్లాడారు. షర్మిల ఢిల్లీలో కాంగ్రెస్‌లో చేరుతున్న నేపథ్యంలో.. తాను కూడా త్వరలోనే చేరతానని ప్రకటించారు. ఏపీ నుంచి చేరబోయే మొదటి ఎమ్మెల్యేను తానేనన్నారు. సార్వత్రిక ఎన్నికల్లో పోటీ చేయాలా వద్దా అనేది అధిష్ఠానం నిర్ణయిస్తుందని తెలిపారు. రాజధాని అమరావతికి సంబంధించి బలవంతపు భూసేకరణను మాత్రమే తాను వ్యతిరేకించానని చెప్పారు.

జమ్మికుంట మునిసిపల్ రగడ!

- చైర్మన్‌పై అవిశ్వాసానికి నోటీసు
- బీఆర్ఎస్, కాంగ్రెస్ దాడులు.. లాఠీచార్జి
- చైర్మన్ సహా పలువురికి గాయాలు

కొత్తూర్, జనవరి 3(ఆంధ్రజ్యోతి): కరీంనగర్ జిల్లాలో జమ్మికుంట మునిసిపాలిటీ రాజకీయం రిసార్ట్‌కు చేరి.. బీఆర్ఎస్, కాంగ్రెస్ నాయకుల మధ్య ఘర్షణకు దారితీసింది. అసెంబ్లీ ఎన్నికలకు ముందు కౌన్సిలర్ పొనగంటి మల్లయ్య బీఆర్ఎస్‌కు రాజీనామా చేసి కాంగ్రెస్‌లో చేరారు. తనతో బీఆర్ఎస్, కాంగ్రెస్‌కు చెందిన 18 మంది కౌన్సిలర్లు ఉన్నారని, తాము బీఆర్ఎస్ మునిసిపల్ చైర్మన్ తక్కెలపల్లి రాజేశ్వర్‌రావుపై అవిశ్వాసం పెడుతున్నామంటూ జిల్లా అధికారులకు దరఖాస్తు చేశారు. ఆయన 15 మంది కౌన్సిలర్లను రంగారెడ్డి జిల్లాలోని ఓ రిసార్ట్‌కు తరలించారు. ఇది తెలుసుకున్న రాజేశ్వర్‌రావు, వైస్ చైర్మన్ స్వప్న భర్త కోటి, వారి అనుచరులు బుధవారం తెల్లవారుజామున రిసార్టు వద్దకు వచ్చారు. గేట్లు తెరవకపోవడంతో టీ తాగేందుకు ఇన్నోవర్సకు వెళ్లారు. వీరి రాక గురించి తెలిసి స్థానిక కాంగ్రెస్ నాయకులు వచ్చి వాగ్వాదానికి దిగారు. గొడవ పెద్దదై పరస్పరం కొట్టుకున్నారు. దీంతో రాజేశ్వర్‌రావు, ఆయన అనుచరులకు గాయాలయ్యాయి. పోలీసులు ఇరువర్గాలను చెదరగొట్టారు. ఆ తర్వాత జమ్మికుంట, రంగారెడ్డి జిల్లా షాద్‌నగర్‌కు చెందిన బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీల నాయకులు ఆ రిసార్ట్‌కు చేరుకుని పోటాపోటీగా ఆందోళనకు దిగారు. పరస్పరం దాడి చేసుకున్నారు. కాంగ్రెస్ నాయకుడు సాదిక్‌కు గాయాలయ్యాయి. పోలీసులు లాఠీచార్జి చేసి వారిని చెదరగొట్టారు. రిసార్టులో కౌన్సిలర్ల క్యాంపు కొనసాగుతోంది.



ట్రక్కు డ్రైవర్ల సమ్మె విరమించినా.. పలు ప్రాంతాల్లో పెట్రోల్ బంకుల ముందు నో స్టాక్ బోర్డులు పెట్టారు. దీంతో అక్కడక్కడా తెరిచిన బంకుల వద్ద బుధవారం రాత్రి వరకు రద్దీ కొనసాగింది. కూకట్‌పల్లిలోని ఓ బంకు వద్ద దృశ్యమిది. - హైదరాబాద్ సిటీ, ఆంధ్రజ్యోతి

ఏపీ అధికార పార్టీలో-చీలికలు!

- సీట్ల నిరాకరణపై నేతల భగ్గు
- సజ్జలతో ఎంపీ మాధవ్ భేటీ
- మల్లాది విష్ణు కినుక.. అనుచరుల ఆగ్రహం
- కాంగ్రెస్ వైపు వైసీపీ నేతల చూపు

(అమరావతి - ఆంధ్రజ్యోతి)



ఇన్నాళ్లు.. జగన్ చెప్పిందే వేదం! ఆయన మాటే శాసనం! ఇప్పుడు సీన్ మారుతోంది. నాలుగున్నరేళ్లకు పైగా కిక్కురుమనకుండా తలలూపిన వాళ్లు టికెట్ దక్కదని తెలియగానే కస్సుమంటున్నారు. ఇప్పటికే మంగళగిరి ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణా రెడ్డి, పెనమలూరు ఎమ్మెల్యే పార్థసారథి, పూతలపట్టు శాసనసభ్యుడు ఎంఎస్ బాబు జగన్ వైఖరిపై బహిరంగంగా విమర్శలు గుప్పించారు. తాజాగా ఈ జాబితాలో హిందూపురం ఎంపీ గోరంట్ల మాధవ్ కూడా చేరినట్లు సమాచారం. 'బళ్లారి' నుంచి దిగుమతి చేసుకున్న జె.శాంతను హిందూపురం ఎంపీ అభ్యర్థిగా ప్రకటించిన సంగతి తెలిసిందే. దీనిపై గోరంట్ల మాధవ్ ఆగ్రహం వ్యక్తం చేసినట్లు తెలిసింది. ఆయన బుధవారం తాడేపల్లిలో సజ్జల రామకృష్ణారెడ్డితో భేటీ అయ్యారు. విశ్వసనీయ సమాచారం ప్రకారం... తనకు సీటు ఎందుకు నిరాకరించారో చెప్పాలని మాధవ్ ప్రశ్నించినట్లు తెలిసింది. విజయవాడ సెంట్రల్ ఎమ్మెల్యే మల్లాది విష్ణు సైతం జగన్‌పై తీవ్ర అసంతృప్తితో ఉన్నట్లు సమాచారం. విష్ణుకు టికెట్ నిరాకరించి... విజయవాడ వెస్ట్ ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాస్‌ను 'సెంట్రల్'కు పంపిన సంగతి తెలిసిందే. జగన్ తమకు అన్యాయం చేశారని భావిస్తున్న వైసీపీ సిట్టింగ్‌లకు కాంగ్రెస్ ఒక ప్రత్యామ్నాయంగా కనిపిస్తోంది. పలువురు టీడీపీలో చేరేందుకు ఆసక్తి ప్రదర్శిస్తున్నా... అక్కడ టికెట్లు సర్దుబాటు చేయలేని పరిస్థితి నెలకొంది. కొందరు జనసేన వైపు చూస్తున్నారు. కాని అవకాశాలపై సందేహాలు ఉండటంతో అత్యధికులు కాంగ్రెస్ కండువా కప్పుకొనేందుకే సిద్ధమవుతున్నారు. ఎన్నికల్లో పోటీకి దూరమైతే రాజకీయంగా కనుమరుగు అవుతామనే ఆందోళన వారిలో కనిపిస్తోంది. రెండు విడతలుగా ప్రకటించిన ఇన్‌చార్జిల జాబితాలో 13 మంది సిట్టింగ్‌లకు స్థానం దక్కలేదు. తొలి విడతలో సంతనూతలపాడు ఎమ్మెల్యే టీజేఆర్ సుధాకర బాబు, గుంటూరు వెస్ట్ మద్దాలి గిరిధర్, మంగళగిరి ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి ఉన్నారు. రెండో విడతలో హిందూపురం ఎంపీ గోరంట్ల మాధవ్, అనకాపల్లి ఎమ్మెల్యే గుడివాడ అమర్నాథ్, పాయకరావుపేట ఎమ్మెల్యే గొల్ల బాబూరావు, పి.గన్నవరం ఎమ్మెల్యే కొండేటి చిట్టిబాబు, పిఠాపురం ఎమ్మెల్యే పెండెం దొరబాబు, జగ్గంపేట ఎమ్మెల్యే జ్యోతుల చంటిబాబు, పత్తిపాడు ఎమ్మెల్యే పర్వత పూర్ణచంద్రరావు, ఎమ్మిగనూరు ఎమ్మెల్యే చెన్నకేశవరెడ్డి, అరకు ఎమ్మెల్యే శెట్టి పాల్గుణ, విజయవాడ సెంట్రల్ ఎమ్మెల్యే మల్లాది విష్ణు, కదిరి శాసనసభ్యుడు సిద్ధారెడ్డి ఉన్నారు. జగ్గంపేట ఎమ్మెల్యే చంటిబాబు ఇప్పటికే కాకినాడలో జనసేన అధ్యక్షుడు పవన్ కల్యాణ్‌తో చర్చలు జరిపారు. వైఎస్ షర్మిల కాంగ్రెస్‌లో చేరుతున్నందున మంగళగిరి ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి కూడా ఆమెతో కలసి నడుస్తానని ప్రకటించేశారు. టీజేఆర్ సుధాకరబాబు తన రాజకీయ జీవితాన్ని కాంగ్రెస్‌తోనే ప్రారంభించారు. విజయవాడ సెంట్రల్ ఎమ్మెల్యే మల్లాది విష్ణు కాంగ్రెస్‌లో చేరనున్నట్లు సంకేతాలు వెలువడుతున్నాయి.

షర్మిల ప్రభావమే కీలకం...

వైసీపీలో టికెట్లు రాకపోవడంతో... కాంగ్రెస్ కండువా కప్పుకొనేందుకు సిద్ధమవుతున్న నేతలు 'తగిన' కారణాలు వెతుక్కుంటున్నారు. అందులో ముఖ్యమైనది... కాంగ్రెస్ తమ 'మాతృ సంస్థ' కావడమే! 'అప్పటి పరిస్థితుల రీత్యా... రాజశేఖర రెడ్డి అభిమానులుగా ఆయన కుమారుడికి అండగా నిలిచాం. ఇన్నాళ్లు మాకు అవమానాలు ఎదురైనా భరించాం. ఈ అన్యాయాన్ని మాత్రం సహించలేం. తిరిగి కాంగ్రెస్‌లోకి వెళ్తున్నాం' అని చెప్పుకునే అవకాశముంది. మరోవైపు... వైఎస్ కుమార్తె అయిన షర్మిలకే ఏపీ పగ్గాలు అప్పగించే అవకాశాలుండటం వారికి కలిసి వస్తున్న మరో అంశం.

ఆంధ్రజ్యోతి
▲ తమసోమా జ్యోతిర్గమయ

'ఉపాధి'ని హరిస్తున్న ఆధార్

ఆధార్ అనుసంధానం జరగనిదే ఇకపై పేదలకు మహాత్మాగాంధీ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో పనులు పుట్టవు, వేతనాలు అందవు. లోపభూయిష్టమైన ఈ ప్రక్రియతో పేదల జీవితాలను దెబ్బతీయవద్దని సంబంధిత రంగంలో పనిచేస్తున్న కార్యకర్తలు, నిపుణులు హెచ్చరికలు చేస్తున్నా, ప్రభుత్వం తాను ఎంతోకాలంగా అనుకుంటున్న విధానాన్ని జనవరి 1 నుంచి అమలులోకి తెచ్చింది. గ్రామీణ ఉపాధి హామీ పథకం మీద ఆదినుంచీ గుర్రుగా ఉన్న మోదీ ప్రభుత్వం ఇప్పుడు పేదలమీద సాంకేతికతను ఆయుధంగా వాడుతూ కోట్లాదిమందిని దూరం చేయడానికి సిద్ధపడిందని విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

ఉపాధి హామీ పథకంలో పనుల కల్పన, వేతనాల చెల్లింపులకు జాబ్‌కార్డు, బ్యాంకు ఖాతాలతో ఆధార్ అనుసంధానం తప్పనిసరి చేసిన ఈ విధానం కూలీలకు శరాఘాతం. సాంకేతిక సమస్యలకు తోడు చాలా కారణాలతో ఇది ఎంత లోపభూయిష్టంగా అమలు జరుగుతున్నదో ఇప్పటికే కేంద్రానికి ఈ రంగంలో పనిచేస్తున్న ప్రభుత్వేతర సంస్థలు పలుమార్లు తెలియచేశాయి. గత సంవత్సరం ఫిబ్రవరి నుంచీ ఈ విషయంలో పట్టుదలగా ఉంటూ, మొదట్లో ఆగస్టు నెలాఖరు, ఆ తరువాత డిసెంబరు 31 గడువులు ఇచ్చిన కేంద్రప్రభుత్వం కొత్త సంవత్సరం తొలిరోజునుంచి దీనిని అమల్లోకి తేవడంతో, అనుసంధానం జరగని కూలీలు ఇప్పుడు నిరాశగా వెనుదిరుగుతున్నారు.

జాబ్‌కార్డు ఆధారంగా కూలి పనిచేసుకొని, బ్యాంకు ఖాతాలో కూలీపడితే మురిసిపోయే స్థితిపోయి, మధ్యలో ఆధార్‌తో లంకె ఏర్పడింది. ఈ మూడింటిలోని వివరాలు ఏకరీతిలో ఉండాల్సిరావడం వారి పాలిట శాపమైంది. ఉపాధిహామీ లబ్ధిదారు పేరు, వారి బ్యాంక్ ఎకౌంట్ వివరాల జోడీతో ఖాతా ఆధారంగా నగదుబదిలీ జరిగిపోయే సులువైన పద్ధతిపోయి, ఈ ఆధార్ బేస్డ్ పేమెంట్ సిస్టమ్ (ఏబీపీఎస్) వచ్చింది. దీనిద్వారా పథకంలో అక్రమాలను నిరోధించవచ్చునని, వేతనాలు సత్వరమే అందించవచ్చునని, పని కల్పన నుంచి వేతనం అందేవరకూ కూలీలకు అన్యాయం జరగకుండా చూడవచ్చునన్నది ప్రభుత్వం వాదన. బ్యాంకు ఖాతాలను ఆధార్‌తో అనుసంధానించడం నుంచి, సామాజిక భద్రతకు ఉద్దేశించిన పథకాలన్నింటినీ ఈ ఏబీపీఎస్ విధానంలోకి తేవడం మోదీ ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది. అన్ని ప్రభుత్వశాఖలు ఈ విధానాన్నే పాటించాలని గత ఏడాది ఆదేశాలు ఇవ్వడంతో ఆయా ప్రభుత్వశాఖలు తాము అమలుచేస్తున్న పథకాలకు దీనిని తప్పనిసరి చేశాయి. గ్రామీణమంత్రిత్వశాఖ ఆదిలో దీని అమలుకు నిర్ణయించినప్పుడు మొత్తం ఉపాధి హామీ కార్మికుల్లో 40శాతం మాత్రమే అర్హులు. లబ్ధిదారు ఆధార్ సంఖ్య వారి జాబ్‌కార్డుతో, బ్యాంకుఖాతాతో సంధానం కావడంతోపాటు, నేషనల్ పేమెంట్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా డేటాబేస్‌తో మ్యాప్ కావాలి. అలాగే, సదరు బ్యాంకు గుర్తింపు సంఖ్య కూడా మ్యాప్ కావాలి. హక్కుదారుడికి ఎక్కువ ఖాతాలుంటే అది మరో చిక్కు. ఇక, ఆధార్, జాబ్‌కార్డ్, బ్యాంకుఖాతాల్లో లబ్ధిదారు పేరు, ఇంటిపేరు, వివరాల్లో ఏ మాత్రం తేడాలున్నా, స్పెల్లింగ్ పొరపాట్లున్నా వాటిని సరిచేయించుకోవడం కార్మికులకు బ్రహ్మప్రళయం అవుతున్నది. దీనితో స్థానిక అధికారులు కార్మికుల పేర్లు తొలగించడం మొదలుపెట్టారు. దేశవ్యాప్తంగా ఏడాదిన్నరకాలంలో ఆరుకోట్లమంది ఉపాధికి దూరమైనారని అంచనా. ఆగస్టు మాసాంతానికి గడువు పెంచినప్పటికి కూడా 40శాతం మంది ఏబీపీఎస్‌కు అనర్హులుగా ఉండిపోయారు. గ్రామీణ మంత్రిత్వశాఖ అధికారికంగా చెప్పిన ప్రకారమే మొన్న డిసెంబరు 27నాటికి జాబ్‌కార్డులున్నవారిలో 34.8శాతం ఈ పేమెంట్ విధానానికి దూరంగా మిగిలిపోయారు.

ఏబీపీఎస్‌లో నగదుబదిలీకి తక్కువ సమయం పడుతుందన్న ప్రభుత్వం వాదన సరైనది కాదని, ఎకౌంట్ పేమెంట్ కంటే ఆధార్ ఆధారిత వ్యవస్థలో ఎక్కువ జాప్యం జరుగుతూ, తిరస్కరణలు సైతం అధికంగా ఉన్నాయని ప్రభుత్వేతర సంస్థల వాదన. వేతనాల్లో జాప్యానికి ప్రధాన కారణం ప్రభుత్వం తగినన్ని నిధులు అందుబాటులో ఉంచకపోవడమేనని వాటి ఆరోపణ. సాంకేతిక సమస్యలు ఎదుర్కొంటున్న పంచాయితీలకు మాత్రం ఈ విధానంనుంచి తాత్కాలికంగా మినహాయింపు ఇస్తామని ప్రభుత్వం ఇప్పుడు దిగివచ్చింది కానీ, ఆధార్‌సీడింగ్, బ్యాంక్ మ్యాపింగ్ ప్రక్రియలను పూర్తిగా ప్రక్షాళించకుండా ఏబీపీఎస్‌ను అమలులోకి తేవడం పెద్ద పొరపాటు. సోషల్ ఆడిటింగ్ ద్వారా, సంబంధిత రంగాల్లో పనిచేస్తున్న సంస్థల సహకారంతో లబ్ధిదారుకు న్యాయం చేకూర్చేవరకూ దీని అమలును నిలిపివేయడం ముఖ్యం. గ్రామీణస్థాయిలో వలసలను నిరోధించేందుకు, అభివృద్ధి జరిగేందుకు, ఉపాధికల్పించేందుకు పదిహేడు సంవత్సరాలుగా ఉపకరిస్తున్న ఈ బృహత్తర పథకం అస్తవ్యస్తమైన ఓ సాంకేతిక వ్యవస్థకు బలికాకూడదు.

ట్రాఫిక్ జరిమానాలపై రాయితీల రాజీ సరికాదు

ట్రాఫిక్ ఉల్లంఘనలకు జరిమానాలను మినహాయించాలన్న తెలంగాణ ప్రభుత్వ నిర్ణయం పైకి పౌరుల పట్ల దయతో తీసుకున్నదిగా కనిపించవచ్చు. కానీ ఇది చట్టం, ప్రజా భద్రతల ప్రాథమిక మూలాలను బలహీనపరుస్తుంది. దేశంలోని అనేక ఇతర ప్రాంతాలలో వలె తెలంగాణ రాష్ట్రంలోనూ విధించే ట్రాఫిక్ జరిమానాలను కేవలం శిక్షగా మాత్రమే చూడకూడదు. రహదారి క్రమశిక్షణను, రహదారి వినియోగదారులందరి భద్రతను నిర్ధారించడానికి అవసరమైన సాధనాలుగా కూడా చూడాలి. ట్రాఫిక్ నిబంధనలకు కట్టుబడి ఉండే ఈ జరిమానాలు ఆ నిబంధనల ప్రాముఖ్యతను గుర్తు చేస్తూ, ఆ నిబంధనల ఉల్లంఘనకు ప్రతిబంధకాలుగా పనిచేస్తాయి. బహుశా ప్రజాకర్షక చర్యగానో, లేక పౌరులకు ఆర్థిక ఉపశమనం కలిగించేందుకో ఈ జరిమానాలను మాఫీ చేయాలని తెలంగాణ ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకొని ఉంటుంది. కానీ ఈ నిర్ణయం రహదారి భద్రతను నిర్వహించడంలో ప్రభుత్వ అంకితభావంపైనా, చట్టపరమైన జవాబుదారీతనం పట్ల ప్రభుత్వ నిబద్ధతపైనా సందేహాన్ని కలిగించేదిగా ఉంది.

ముఖ్యంగా— ఈ నిర్ణయం వల్ల అత్యంత తక్షణ దుష్ఫలితం రహదారి భద్రత విషయంలోనే నెలకొంటుంది. ట్రాఫిక్ ఉల్లంఘనలకు వ్యతిరేకంగా విధించే జరిమానాలు రహదారి భద్రతను పెంచుతాయి. ఈ జరిమానాని తీసివేయడం/ పాక్షికంగా తగ్గించటం వలన వాహనాలు నడిపేవారు ట్రాఫిక్ నిబంధనలను ఉల్లంఘించే ధైర్యం చేయవచ్చు. ఇది నిర్లక్ష్య డ్రైవింగ్‌కు దారి తీస్తుంది. తెలంగాణ రోడ్లు ఇప్పటికే అధిక ట్రాఫిక్ సమస్యతో బాధపడుతున్నాయి. ఇప్పుడు నిర్లక్ష్య డ్రైవింగ్ కూడా దానికి తోడైతే ప్రమాదాల శాతం గణనీయంగా పెరుగుతుంది. రహదారి మరణాలు పెరుగుతాయి.

జరిమానాలను మాఫీ చేయడం ప్రమాదకరమైన చట్టపరమైన పూర్వస్థితిని సెట్ చేస్తుంది. ఇది ట్రాఫిక్ చట్టాలను పాటించడం అత్యవసరం కాదన్న భావం కలిగిస్తుంది, తద్వారా చట్టాన్ని అమలు చేసే ఏజెన్సీల అధికారం పట్ల గౌరవాన్ని తగ్గిస్తుంది. ఇది ఇక్కడకే పరిమితం గాక, ఇతర నిబంధనలకూ విస్తరించి, చట్టాల అమలును ప్రభావితం చేసే అవకాశం ఉంది.

అలాగే ట్రాఫిక్ జరిమానాలు రాష్ట్రానికి గణనీయమైన ఆదాయ వనరుగా ఉంటూవచ్చాయి. రహదారి నిర్వహణ, ట్రాఫిక్ వ్యవస్థల నిర్వహణ వంటి క్లిష్టమైన ప్రజా సేవలకు ట్రాఫిక్ జరిమానాలు నిధులను సమకూరుస్తున్నాయి. ఈ ఆదాయ ప్రవాహాన్ని తొలగించడం లేదా వదులుకోవడం వల్ల రాష్ట్ర బడ్జెట్‌పై భారం పడుతుంది. ఈ కీలక రంగాలలో వనరులు తగ్గుతాయి. వనరులలో ఈ తగ్గింపు రహదారి నాణ్యతను, భద్రతను ప్రభావితం చేయడమే కాకుండా ఈ ప్రాంతం తాలూకు మొత్తం ఆర్థిక ఆరోగ్యంపై కూడా ప్రభావం చూపుతుంది.

అలాగే ట్రాఫిక్ జరిమానాలు మాఫీ చేయబడతాయని తెలిసి వాహనదారులు ట్రాఫిక్ నిబంధనలను ఉల్లంఘించడానికి ఉత్సాహం చూపవచ్చు. జరిమానాల ప్రభావం లేకుండా డ్రైవర్లు అతివేగం, ట్రాఫిక్ సిగ్నళ్లను విస్మరించడం, ఇతర రకాల ప్రమాదకర డ్రైవింగ్ ధోరణులకు పాల్పడే అవకాశం ఉంటుంది. ఫలితంగా రహదారిపై క్రమశిక్షణ క్షీణిస్తుంది. అంతేకాకుండా, ఇది నైతిక పాలన పట్ల, చట్టాల సమాన అమలు పట్ల ప్రభుత్వ నిబద్ధత గురించి తీవ్రమైన ప్రశ్నలను లేవనెత్తుతుంది. అటువంటి



అవగాహన ప్రభుత్వంపై ప్రజల విశ్వాసాన్ని తగ్గిస్తుంది. దీర్ఘకాలంలో జరిమానాలను మాఫీ చేయడం సమాజంలోని చట్టపరమైన, నైతికమైన ప్రమాణాలపై తీవ్ర ప్రభావాన్ని చూపుతుంది. ఇది ఒక రకమైన విష సంస్కృతిని సృష్టించే ప్రమాదం ఉంది.

ప్రభుత్వం, న్యాయ వ్యవస్థలపై ప్రజల విశ్వాసం బాగా పనిచేసే ప్రజాస్వామ్యానికి అవసరం. ట్రాఫిక్ జరిమానాలపై తెలంగాణ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం ప్రజల భద్రత కంటే, చట్టపరమైన సమగ్రత కంటే ప్రజాకర్షక చర్యలకే ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తుందనటానికి సంకేతంలా ఉంది. పౌరుల దీర్ఘకాలిక ప్రయోజనం కోసం, భద్రత కోసం ఈ నిర్ణయాన్ని పునఃపరిశీలించడం చాలా అవసరం.

– జయ వింధ్యాల, హైకోర్ట్ అడ్వకేట్
ఎన్. శివ శంకర్, ప్రతినిధులు,
రాష్ట్ర పౌర హక్కుల ప్రజా సంఘం

ఉనికి చాటింపు కాదు, వాస్తవాల గ్రహింపు కావాలి



కిషన్ రెడ్డి, ఉత్తమ్ చేస్తున్న విమర్శల్లో ఆసక్తికరమైన అంశమొకటి ఉన్నది. లోక్‌సభ ఎన్నికల్లో తెలంగాణ ఓటర్లు బీఆర్ఎస్‌కు ఎందుకు ఓటు వేస్తారు? వేయాలి? అసెంబ్లీ ఎన్నికలలో పోలఅయిన ఓట్ల ప్రకారం, బీఆర్ఎస్‌కు 3, 4 స్థానాలు రావాలి. అంతకంటే ఎక్కువ సాధించడానికి ఆ పార్టీ ప్రయత్నించవచ్చును కానీ, అసలైన పరీక్ష ఆ మూడు నాలిగింటినైనా దక్కించుకోవడం! బీఆర్ఎస్ రాష్ట్రంలో అధికారంలో లేదు, కేంద్రంలోనూ లేదు! రాష్ట్ర ప్రయోజనాలను కేంద్రంలో కాపాడే బాధ్యత అయితే కాంగ్రెస్‌ది లేదా ఢిల్లీలో అధికారంలో ఉన్న బీజేపీది? మధ్యలో ఈ బీఆర్ఎస్ వల్ల ఒరిగేదేమిటి? ఏ నినాదంతో బీఆర్ఎస్ పార్లమెంటు ఎన్నికలలో పోటీపడుతుంది? జాతీయస్థాయిలో ఉన్న ప్రధాన రాజకీయాంశం రామమందిరమో, మతతత్వవ్యతిరేకతో అనుకుంటే బీఆర్ఎస్ ఏ పక్షంలో ఉంటుంది?



■ కె. శ్రీనివాస్

సందర్భం

నక్సలైట్లు పేలుళ్లో కాల్పులో చేస్తే, అది వారు ఉనికి చాటుకునే చర్య అని పోలీసులు వెంటనే అనేవారు. ఆ చర్య వెనుక సంచలనమే తప్ప నిజమైన బలమేమీ లేదని ఆ వ్యాఖ్య ఉద్దేశ్యం. ఉనికిని చాటింపు వేసుకోవలసిరావడం పాలక, ప్రతిపక్ష రాజకీయాలలోకి కూడా ప్రవేశించి చాలా రోజులయింది. సంస్థలనో, ఉద్యమాలనో నిర్మించలేక చతికిలపడినప్పుడో, ఎన్నికలలో ప్రజల తిరస్కారానికి గురయినప్పుడో ఉనికికే ముప్పు వచ్చే ప్రమాదం రాజకీయపార్టీలకు ఎదురవుతుంది. భస్మం నుంచి లేచి ఎగిరే ఫీనిక్స్ పక్షి ఉదాహరణ చెబుతారు కానీ, నేలమట్టమయిన అస్తిత్వాలన్నిటికి అంతటి శక్తి ఉండదు. బలమైన నాయకత్వం, పట్టుదల, అనువైన పరిస్థితులు, నిరీక్షించగలిగిన నిబ్బరం అన్నీ కలసినప్పుడు, ఎన్ని పాములు మింగినా, ఎగబాకే నిచ్చెనలు కూడా అందివస్తాయి. పతనానికీ పునర్నిర్మాణ ప్రయత్నానికి మధ్య కాలంలో, బతికిచెడిన స్థితిని నిభాయించుకోగల స్థితప్రజ్ఞత అందరికీ సమకూరదు.

భారత రాష్ట్ర సమితికి ఇది గడ్డుకాలం. నిన్నమొన్నటిదాకా, మూడోసారి విజయం ఖాయమని ఆశించిన పార్టీ, ఇప్పుడు ఉనికి సమస్యను ఎదుర్కొంటున్నది. ఇంత మౌనానికీ ధ్యానానికీ ప్రయత్నించకుండా, వెనువెంటనే ప్రభుత్వం మీద తీవ్రమైన విమర్శలకు, ప్రతిస్పందనలకు పాల్పడుతూ ఉనికిని చాటుకోవాలని చూస్తున్నది. అధికారప్రతిపక్షాలకు వచ్చిన ఓట్లలో పెద్దతేడా లేదు. రెండు శాతం కంటే తక్కువే. గెలుచుకున్న అసెంబ్లీ స్థానాలా, 39! ఎంతో గౌరవప్రదమైన ప్రతిపక్ష సంఖ్య! అధికారపక్షం బెదిరిపోయే సంఖ్య కూడా! అయినా, ఆ పార్టీకి ఉనికి సమస్య ఎందుకు వస్తోంది? రానున్న అయిదేళ్ల కాలం ఎడారిలాగా భయపెడుతున్నదా? లేక భవిష్యత్తే శూన్యంగా అనిపిస్తున్నదా?

మొత్తంగా ఉండడం, పూర్తిగా లేకపోవడం లాంటి ఉనికి సమస్య కాదిది. నిలబడడం, నిలబడలేకపోవడం వంటి సమస్య. ఓ అయిదేళ్లకు ప్రభుత్వ వ్యతిరేకత ఉధృతమైనప్పుడు ప్రజల గజమాలకు తన కంఠమొక్కటే ఏకైక ఎంపికవుతుందా అన్న సందేహం. ఓటర్లు కాక, బలీయమైన ఇతరేతర శక్తులేవో కూడా తన మనుగడను శాసిస్తాయేమోనని భయం! ప్రాంతీయ పార్టీలన్నిటికి నూకలు పుట్టకుండా చేయాలని భారతీయ జనతాపార్టీ పంతం పట్టకపోయి ఉంటే ఈ అస్తినాస్తి విచికిత్సకు ఆస్కారం ఉండేది కాదు. తెలంగాణలో ఇప్పుడు రంగంలో ఉన్నది తామూ కాంగ్రెస్ మాత్రమేనని, బీఆర్ఎస్‌కు ఓటు వేస్తే అది మురుగుకాల్వలో వేసినట్టేనన్న బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు కిషన్ రెడ్డి మాటలు ఏదో యథాలాపంగా అన్నవి కాదు. అంతే కాదు, బీఆర్ఎస్‌కు అసలు ప్రాసంగికతే లేదని, లోక్‌సభ ఎన్నికల్లో పోరాడడానికి ఆ పార్టీ దగ్గర విషయమే లేదని కూడా ఆయన అన్నారు. లోక్‌సభ ఎన్నికల తరువాత బీఆర్ఎస్ ఉనికే ఉండదని కాంగ్రెస్ నాయకులు, రాష్ట్ర మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి తాజాగా వ్యాఖ్యానించారు.

వాస్తవంలో కాంగ్రెస్ బొటాబొటి మెజారిటీ మీద, దాని మనుగడకు ఉండే ప్రమాదం మీద ఎక్కువ చర్చ జరగాలి. కానీ, ప్రభుత్వం కుదురుకున్నదన్న అభిప్రాయం ఏర్పడిపోయింది. కాంగ్రెస్ బలం క్రమంగా పెరుగుతూ పోతుందని, బీఆర్ఎస్‌ది క్షీణించిపోతుందని స్పష్టంగా తెలిసిపోతోంది! ముప్పు ఉన్నది బీఆర్ఎస్ మనుగడకే అని సూచనలు కనిపిస్తున్నాయి. హామీలు అమలుచేయకపోతే ఖబడ్దార్ అంటూ ఆ పార్టీ నేతలు చేస్తున్న ప్రకటనలు కేవలం ఉనికిని చాటుకునే గర్జనలు మాత్రమే. సాధారణ ఎన్నికలలో తమ ప్రాసంగికతను వెదుక్కునే బలహీనమైన ప్రయత్నాలు మాత్రమే! కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ఇబ్బందిలో పెట్టే ఉద్దేశ్యమేదీ బీజేపీకి లేదు. ఇప్పట్లో ఉండదు కూడా. రాష్ట్రంలో కాంగ్రెస్ బీజేపీ మిలాఖత్ అయ్యాయని ఆరోపణలు వచ్చినా రావచ్చు. కాంగ్రెస్ బీఆరఎస్ అవగాహనతో వ్యవహరిస్తున్నాయని బీజేపీ ఎట్లాగూ అంటూనే ఉంది. లాలూచీ ఉన్నా లేకపోయినా, రంగంలో తనూ కాంగ్రెస్ మాత్రమే మిగలడం బీజేపీ ప్రాధాన్యం. ముగ్గురి నడుమ తాను లాభపడాలని కాంగ్రెస్ ఆలోచన. అధికారపక్షంతోనే కాక, సాటి ప్రతిపక్షంతో కూడా ఎట్లా పోరాడాలని బీఆరఎస్ సంకటం!

కిషన్ రెడ్డి, ఉత్తమ్ చేస్తున్న విమర్శల్లో ఆసక్తికరమైన అంశమొకటి ఉన్నది. లోక్‌సభ ఎన్నికల్లో తెలంగాణ ఓటర్లు బీఆరఎస్‌కు ఎందుకు ఓటు వేస్తారు? వేయాలి? అసెంబ్లీ ఎన్నికలలో పోలఅయిన ఓట్ల ప్రకారం, బీఆరఎస్‌కు 3, 4 స్థానాలు రావాలి. అంతకంటే ఎక్కువ సాధించడానికి ఆ పార్టీ ప్రయత్నించవచ్చును కానీ, అసలైన పరీక్ష ఆ మూడు నాలిగింటినైనా దక్కించుకోవడం! బీఆరఎస్ రాష్ట్రంలో అధికారంలో లేదు, కేంద్రంలోనూ లేదు! రాష్ట్ర ప్రయోజనాలను కేంద్రంలో కాపాడే బాధ్యత అయితే కాంగ్రెస్‌ది లేదా ఢిల్లీలో అధికారంలో ఉన్న బీజేపీది? మధ్యలో ఈ బీఆరఎస్ వల్ల ఒరిగేదేమిటి? ఏ నినాదంతో బీఆరఎస్ పార్లమెంటు ఎన్నికలలో పోటీపడుతుంది? జాతీయస్థాయిలో ఉన్న ప్రధాన రాజకీయాంశం రామమందిరమో, మతతత్వవ్యతిరేకతో అనుకుంటే బీఆరఎస్ ఏ పక్షంలో ఉంటుంది? సెక్యులరిజం విషయంలో కాంగ్రెస్‌తో పోటీపడలేదు, మతవాదంలో బీజేపీతో పోటీపడలేదు. గత నెలరోజులుగా బీఆరఎస్ శిబిరం నుంచి వస్తున్న ప్రకటనలు కొన్ని హిందూత్వ వాదానికి సానుకూలతను ప్రకటించడం మాత్రం ఆసక్తి కలిగిస్తోంది. బీజేపీతో ఏదో అవగాహనకోసం బీఆరఎస్ ప్రయత్నిస్తోందని, అందుకు బీజేపీ విముఖత చూపిందని అనధికార వార్తలు చెలామణిలో ఉన్నాయి. నిజానికి ఆ వైపు వెళ్లడంలో ఉపయోగమేమీ ఉండదని బీఆరఎస్ గ్రహించే ఉంటుంది. బీఆరఎస్ బలహీనపడడమే బీజేపీ దీర్ఘకాలిక అజెండాకు అనుగుణమైనది. ఈ జటిలమైన వాతావరణంలో బీఆరఎస్ తన వ్యూహాన్ని ఎట్లా రూపొందించుకుంటుందన్నది ఆసక్తికలిగించే అంశం.

హైదరాబాద్, దాని చుట్టుపక్కల ప్రాంతాల్లో ఓటర్ల నుంచి జనాదేశాన్ని విజయవంతంగా సాధించిన బీఆరఎస్, లోక్‌సభ ఎన్నికలలోనూ దాన్ని పొందగలదా? ఏ ఓటర్లు బీఆరఎస్ చేసిన 'పట్టణాభివృద్ధి'ని, నిర్వహించిన శాంతిభద్రతలను, నిర్మించిన ఆధునికమైన సాంకేతిక పౌరవ్యవస్థలను మెచ్చి ఓట్లు వేశారో, ఆ ఓటర్లు జాతీయస్థాయిలో అవే కారణాల వల్ల, వాటికి తోడు ఉద్వేగపూరిత కారణాల వల్ల లోక్‌సభ ఎన్నికలలో బీజేపీకి వేసే అవకాశం ఉన్నది. ఒకవేళ అట్లా జరిగితే, బీఆరఎస్ ఉనికి సమస్య ఉధృతమవుతుంది. అడ్రస్ గల్లంతు కాకపోయినా, ప్రమాదంలో పడుతుంది. మరి ఏమి చేయాలి?

అడ్డదారులు ఏవీ లేవు. అధికార కాలం మధ్యలోనే 'రీకాల్' చేసే వెసులుబాటు లేదు. కాబట్టి, ఐదేళ్ల ప్రతిపక్షవాసానికి మానసికంగా సిద్ధపడాలి. 'కౌంట్ డౌన్'లు లెక్కించడం మానేయాలి. ఆత్రుత పడి, అత్యుత్సాహం చూపి ఉనికిని ప్రదర్శించడం కాకుండా, మొదటి గడి నుంచి మళ్లీ ప్రయాణం మొదలుపెట్టాలి. ఎక్కడ కోల్పోయారో అక్కడే వెదుక్కోవాలి. నిర్మాణాత్మకంగా వ్యవహరిస్తూ, ప్రజలలో అభిమానాన్ని తిరిగి పునఃస్థాపితం చేసుకోవాలి. ప్రజలు పెద్ద తప్పు చేశారనీ, తాము మాత్రం చిన్నచిన్న తప్పులు చేశామని, యూట్యూబ్ చానెళ్ల వల్ల మాత్రమే ఓడామని వ్యాఖ్యానించడం విరమించి, ఓటమిని దాని కారణాలతో సహా అంగీకరించాలి.

బీఆరఎస్ గుర్తించవలసిన అతి ముఖ్యమైన విషయం, తన ఉనికి కేవలం తనకు మాత్రమే సంబంధించినది కాదు. తెలంగాణ సమాజం కోసం కూడా బీఆరఎస్ ఉనికి కొనసాగాలి. ఏ రాజకీయపక్షాన్నీ తుడిచిపెట్టడం ప్రజాస్వామికం కాదు. తెలంగాణ ప్రాంతీయ ఆకాంక్షల సాధనలో భాగంగా రంగం మీదికి వచ్చిన పార్టీ నాటి టీఆరఎస్. తన నేరాలను వైఫల్యాలను సమీక్షించుకుంటే ఆ పార్టీకి కొత్త జీవితం సమకూరుతుంది. తన పేరు నుంచి కత్తిరించుకున్న

> లాలూచీ ఉన్నా లేకపోయినా, రంగంలో తనూ కాంగ్రెస్ మాత్రమే మిగలడం బీజేపీ ప్రాధాన్యం. ముగ్గురి నడుమ తాను లాభపడాలని కాంగ్రెస్ ఆలోచన. అధికారపక్షంతోనే కాక, సాటి ప్రతిపక్షంతో కూడా ఎట్లా పోరాడాలని బీఆరఎస్ సంకటం!

తెలంగాణను తిరిగి తొడుగుకొని, కేవల భ్రమాత్మక ఊహలతో కల్పించుకున్న జాతీయ ఉనికిని కడిగేసుకుని, ప్రజలు తిరస్కరించిన అహంకార పూరిత దుష్పరిపాలనను సమీక్షించుకుని బీఆరఎస్ నిలబడాలి. నేటి అధికారపక్షాన్ని ప్రశ్నించడానికి మాత్రమే కాదు, రేపటి ప్రత్యామ్నాయం కావడానికి కూడా ఆ పార్టీ కొనసాగాలి.

తెలంగాణ రాజకీయాలలో ప్రజాప్రతినిధుల వ్యక్తిగత నైతికత అట్టడుగుకి జారిపోవడం బీఆరఎస్ హయాంలోనే మొదలైంది. ఆ పతనపు ప్రభావం రేపు బీఆరఎస్ మీద పడవచ్చు. ముపె[illegible]మ్మండుగురులో కొందరు జారిపోవచ్చు, కొనుగోలు కావచ్చు. మారుమనసు పొందవచ్చు. సాధారణ ఎన్నికలలో ప్రతికూల ఫలితాలకు తోడు, ఈ నిష్క్రమణలు కూడా పార్టీని తీవ్రంగా బాధించవచ్చు. ఈ సంక్షోభాన్ని ఎదుర్కొనడానికి బీఆరఎస్‌కు పరిపక్వత అవసరం.

ప్రధాన పక్షాలుగా రెండూ ప్రాంతీయపార్టీలుండే స్థితి తెలంగాణకు ఆరోగ్యకరం. పక్కా రాజకీయపార్టీగా మారిన ఉద్యమపార్టీ నుంచే ఒక పాయ మరో పార్టీగా మారి ఉంటే బాగుండేది. ఒకటి రెండుసార్లు అటువంటి అవకాశం వచ్చినా, సారథ్యం వహించవలసినవారు చొరవచూపలేకపోయారు. రెండు ప్రాంతీయపార్టీలు లేని పక్షంలో, ఒక జాతీయపార్టీ, ఒక ప్రాంతీయపార్టీ ఉండడం, ఆ జాతీయ పార్టీ కూడా తెలంగాణ సామరస్య జీవనశైలిని పెంపొందించే సెక్యులర్ పార్టీ అయి ఉండడం శ్రేయస్కరం. ఉత్తరభారతదేశపు ఉద్రిక్తతలను, ఉన్మాదాన్ని దిగుమతి చేసే రాజకీయాలు తెలంగాణ భవిష్యత్తుకు క్షేమం కావు. అందుకోసం కూడా బీఆరఎస్ తనను తాను కాపాడుకోవాలి.

మీ హామీలతో పాటు, మా ప్రతిపాదనలు!

ఎన్నికల సందర్భంగా ఇచ్చిన హామీలను కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం కచ్చితంగా అమలు పరుస్తుందని ఆశిస్తూ, మనసుపెట్టితే చేయగలిగే మరికొన్ని పనులను కుల నిర్మూలన వేదిక తరఫున ప్రభుత్వానికి ప్రతిపాదిస్తున్నాను.

1. రాష్ట్రంలో ఎస్సీ, ఎస్టీ, బీసీలపై జరిగిన, జరుగుతున్న అట్రాసిటీ సంఘటనలు—చర్యలపై శ్వేతపత్రం విడుదల చేయాలి. ఎస్సీ ఎస్టీలకు ఉన్నట్లుగానే బీసీలకు ప్రత్యేక అట్రాసిటీ యాక్ట్‌ను ఏర్పాటు చేయాలి. 2. అభివృద్ధి పనుల పేరిట ప్రభుత్వం లాక్కున్న ఎస్సీ, ఎస్టీల భూములను బాధితులకు అప్పగించాలి. గత ప్రభుత్వం రియల్ ఎస్టేట్ ద్వారా అమ్మిన భూములపై, రూపొందించిన విధివిధానాలపై శ్వేతపత్రం విడుదల చేయాలి. 3. ఎస్సీ, ఎస్టీ నిధులను ఏయే రంగాలకు దారి మళ్లించారు, ఏ శాఖలకు కేటాయించారు, ఎంత ఖర్చు చేశారో శ్వేతపత్రం విడుదల చేయాలి. 5. చేతివృత్తుల ఆధునీకరణ కోసం తీసుకున్న చర్యలు ఏమిటి, ఇప్పటివరకు గొర్లకుర్మలకు, ముదిరాజులకు, చేనేతకు కేటాయించిన బడ్జెట్, చేసిన ఖర్చు ఎంత అన్న వివరాలతో శ్వేతపత్రం విడుదలచేయాలి. 6. అన్ని చేతివృత్తులకు రా మెటీరియల్‌ను, మార్కెట్‌ను అందించాలి. చేతివృత్తులుగా ప్రాచుర్యంలోకి తేవాలి తప్పా కుల వృత్తులుగా తేరాదు. కుల అనే పదాన్ని నిషేధించాలి.

7. రాష్ట్రంలోని భూస్వాముల వద్ద ఉన్న మిగులు భూములు ఎన్ని, ప్రభుత్వం వద్ద ఉన్న భూమి ఎంత, ఆక్రమణకు గురైనది ఎంత అన్న వివరాలతో శ్వేతపత్రం ప్రకటించాలి. భూమిలేని పేద బీసీలకు భూ పంపిణీ చేయాలి. 8. గత ప్రభుత్వం 2014లో జరిపిన సమగ్ర కుటుంబ సర్వే రిపోర్టును బహిర్గతం చేయాలి. 9. కులతత్వానికి కారణం అవుతున్న వివిధ కుల గురుకులాల పేర్లను తొలగించి ఇంటిగ్రేటెడ్ గురుకులాలుగా అవతరింపజేయాలి. విద్యాసంస్థలలో కులం అనే కాలాన్ని తొలగించాలి. హాస్టళ్లలో, గురుకులాలలో ఎంపీ, ఎంఎల్ఏ, మంత్రులందరూ తనిఖీలు చేసి బసచేయాలి. పాఠశాల నుండి యూనివర్సిటీ స్థాయివరకూ అన్ని విద్యాసంస్థల్లో గెస్ట్ ఫ్యాకల్టీగా ఉన్న వారిని, కాంట్రాక్టు ఉద్యోగస్తులను రెగ్యులరైజ్ చేయాలి. ప్రైవేట్ ఇంజనీరింగ్ కాలేజీలలో ఫీజుల దోపిడీని అరికట్టాలి. అటానమస్ విధానం రద్దు చేయాలి. ప్రైవేటు యూనివర్సిటీల ఏర్పాటును ఆపాలి. ఇంటర్మీడియట్ కోర్సులో నాన్ టీచింగ్ పోస్టులను టీచింగ్ పోస్టులుగా మార్చడం రద్దుచేయాలి. ఒకే బిల్డింగ్‌లో పదుల కొలది నర్సింగ్ కాలేజీలు నడుపుతున్న వాటి గుర్తింపులను రద్దుచేయాలి. జాతీయస్థాయి విద్యాసంస్థలైన సెంట్రల్ యూనివర్సిటీ, ఐఐటి, ఎన్ఐటి, ట్రిబుల్ ఐటీ, ఐఐఎం లాంటి విద్యాసంస్థలకు అడ్మిషన్ల కోసం తెలంగాణ నుంచి ఈ సంవత్సరం ఒకలక్షా ముపె[illegible]ల అప్లికేషన్‌లు వెళ్ళాయి. ప్రతి సంవత్సరం ఇదే విధంగా ఉంటుంది. కనుక రాష్ట్రానికి అదనంగా జాతీయస్థాయి విద్యాసంస్థలు మంజూరు చేయాలి, ఉన్నవాటిలో సీట్లను పెంచాలి. ఇందులో రాష్ట్రానికి సంబంధించిన వాటాను 50శాతం కచ్చితంగా అమలు చేయాలి.

10. కార్పొరేట్ దవాఖానలకు రిలీజ్ అయిన సీఎంఆర్ఎఫ్, ఆరోగ్యశ్రీ నిధులపై ప్రత్యేక విచారణ జరిపించాలి, అక్రమాలకు పాల్పడిన దవాఖానాలను మూసివేయాలి. 11. విష రసాయనాలతో పర్యావరణాన్ని ధ్వంసం చేస్తున్న పరిశ్రమలను, ఫార్మా కంపెనీలను మూసివేయాలి. 12. ఆర్ఎన్ఐ గుర్తింపు ఉన్న ప్రతి పత్రికకు ఎన్‌పానెల్మెంట్ చేయాలి, అక్రిడేషన్ కార్డులు, హెల్త్ కార్డులను ఇవ్వాలి. 13. విచ్చలవిడిగా పారుతున్న మద్యాన్ని నియంత్రించాలి.

– పాపని నాగరాజు
అధ్యక్షులు, కుల నిర్మూలన వేదిక

ఉద్యమ స్త్రీలను మరిచారు

డిసెంబర్ 29న ఆంధ్రజ్యోతిలో 'పౌరహక్కుల సంఘం ప్రకటనలో అర్ధసత్యాలు' శీర్షికన ప్రచురితమైన మేఘనాథ రెడ్డి గారి వ్యాసంలో చివరి వాక్యం చాలా అభ్యంతరకరం. ఉద్యమాలలో ఉన్న స్త్రీలను తేలికగా మరచిపోయే ధోరణికి నిదర్శనం. గుంటూరులో జరిగిన ఆ సభకు హైదరాబాద్ నవోదయ సాంస్కృతిక సంఘం (తరిమెల నాగిరెడ్డి గ్రూపు) నుంచి పదిమంది వరకు యువతులు వచ్చారు. వారంతా మా ఇంట్లోనే బస చేశారు. నాటక ప్రదర్శన ఇచ్చారు. సభలలో మేమంతా చురుగ్గానే పాల్గొన్నాం. వారిలో నాతో సహా కొందరు సజీవంగానే ఉన్నారు. పురుషులూ చాలామంది సజీవంగానే ఉన్నారు. ఇక, డిసెంబర్ 23న పౌరహక్కుల సంఘం ఏర్పడలేదన్నది నిజం.

— ఓల్గా

వ్యాసాలు, ఉత్తరాలు పంపవలసిన చిరునామా
ఎడిటోపేజీ, ఆంధ్రజ్యోతి, ప్లాట్–76,
అశ్విని లే ఔట్, హుడా హైట్స్,
రోడ్ నంబరు–70, జూబ్లీహిల్స్,
హైదరాబాద్–500033.
మెయిల్:
editpage@andhrajyothy.com

వెతల మైదానాల్లో ఆటలెలా ఆడతారు?

ఏడున్నర దశాబ్దాల స్వతంత్ర భారతదేశంలో అన్ని రంగాల్లో లానే క్రీడా రంగంలోనూ కలలను పండించుకోవడానికి నవతరం ఆరాటపడుతూనే ఉన్నది. కేంద్ర ప్రభుత్వాలు యువతరం ఆకాంక్షలకు న్యాయమైన చోటు ఇవ్వడంలో ప్రతి ఏటా నిరాశనే వడ్డిస్తున్నాయి. నినాదాల్లో యువతే వెన్నముక అంటుంటారు కానీ వారికి దారి చూపడంలో మాత్రం దయ చూపడం లేదు. ఉపాధి రంగంతో పాటు కీలకమైన క్రీడా రంగంపైనా శాస్త్రీయ దృక్పథం కొరవడటం వల్ల దేశ మైదానాల్లో సమస్యల వనాలు వర్ధిల్లుతున్నాయి.

ఆరోగ్యమే కాదు జాతికి ఉత్సాహాన్నీ, మేధస్సుకు శక్తికి నూతన సామర్థ్యాన్ని కల్పించి, కొత్త ఆవిష్కరణలకు ఊతమిచ్చే కాంతి పుంజం క్రీడా రంగం కదా. ఇంతటి ప్రాధాన్య రంగాన్ని దేశ పాలకులు ఎటువైపు అడుగులు వేయించారో బుద్ధి జీవులందరికీ తెలిసిందే. ఇటీవల జాతీయ రెజ్లింగ్ అసోసియేషన్ అధ్యక్ష ఎన్నికల రగడ ఆటల్లోని అనేక అంశాలను మళ్ళీ చర్చకు పెట్టింది. కొద్ది నెలల కిందట జంతర్ మంతర్ వేదికగా జరిగిన మల్లయోధుల పోరాటాన్ని కేంద్ర సర్కార్ మనసు పెట్టి అర్థం చేసుకొని ఉండి ఉంటే, మళ్ళీ కుస్తీ వీరులు కన్నీరు పెట్టే పరిస్థితి ఏర్పడేది కాదు. రాజకీయాల్లో క్రీడా స్ఫూర్తి ఉండాలే కానీ క్రీడల్లో రాజకీయాలు ఉంటే ఎన్ని కలలు ఉరితీయబడతాయో ప్రగతి ప్రేమికులు అవగాహన చేసుకోవాలి. పాత అధ్యక్షుడు బీజేపీ ఎంపీ బ్రిజ్ భూషణ్ శరణ్ సింగ్ బాధితులు ఎటువైపు చూపుడు వేలు ఎక్కుపెట్టారో కేంద్రం కన్నులు సారించి వుంటే సంజయ్ సింగ్‌ను ఎన్నికల్లో నిలబెట్టే సాహసం బ్రిజ్ భూషణ్ చేయగలిగేవాడే కాదు. ఖేలో ఇండియా నినాదాన్ని యువతను ఆకట్టుకునే కనికట్టు ఆటగా మాత్రమే మోదీ ప్రభుత్వం కొనసాగిస్తున్నంత కాలం ఆటల రంగంలో అద్భుతాలను కాదు కదా కనీస అభివృద్ధినీ ఆశించలేం.

మైదానాల్లో యువతరం కలలు పండే దిశగా సర్కార్ కార్యాచరణ ఉండాలి. కానీ పార్టీకి వోట్ల స్కోర్‌ను రాబట్టేందుకు క్రీడలనూ ఎన్నికల ఆటలో పావుగా చూసే పాలకులు ఉండటం వల్లనే పరిస్థితి దిగజారుతున్నది. ఒలింపిక్స్‌లో పతకాలను కొల్లగొడుతున్న దేశాల పురోగతిలో క్రీడలు ఎంతటి కీలకమైన పాత్ర పోషిస్తున్నాయో జాతికి నాయకత్వం వహిస్తున్నవారు గమనంలోకి తీసుకోకపోవడం విడ్డూరం. క్రీడలు ప్రజల ఆరోగ్యాన్నే కాదు ఆలోచన తీరును ఆరోగ్యకరంగా మార్చివేసే ఔషధాలు. పనితో పాటే పాట పుట్టినట్లే, మానవ పరిణామక్రమంలో సామాజిక అవసరంగా క్రీడలు పుట్టాయి. వాటి చారిత్రక నేపథ్యం, అవసరాన్ని విశాల దృష్టి కోణంతో చూసే ప్రభుత్వాలు ఉంటే సమాజాభివృద్ధి దిశగా ఎన్నో కీలక మార్పులు జరుగుతాయి.

ఒలంపిక్ అసోసియేషన్, క్రీడా ఫెడరేషన్లలో సమర్థత, పారదర్శకత, ప్రభుత్వాల బడ్జెట్ కేటాయింపులల్లో సానుకూలత, కార్యాచరణలో స్పష్టత ఉంటే ఇండియా కూడా ఒలంపిక్స్‌లో పతకాల పంటను



> బీజేపీ ఎంపీ బ్రిజ్ భూషణ్ శరణ్ సింగ్ బాధితులు ఎటువైపు చూపుడు వేలు ఎక్కుపెట్టారో కేంద్రం దృష్టి సారించి వుంటే, తన మనిషి సంజయ్ సింగ్‌ను ఎన్నికల్లో నిలబెట్టే సాహసం బ్రిజ్ భూషణ్ చేయగలిగేవాడే కాదు. ఖేలో ఇండియా నినాదాన్ని యువతను ఆకట్టుకునే కనికట్టుగా మోదీ ప్రభుత్వం కొనసాగిస్తున్నంత కాలం ఆటల రంగంలో కనీస అభివృద్ధిని ఆశించలేం.

అందుకోవడం కష్టసాధ్యమేం కాదు. మైదానాల్లో ముండ్లను ఏరివేయగలిగితే మన జాతి ఆణిముత్యాల పరుగును ఆపే శక్తి ఏ దేశానికి లేనేలేదు. ఆనాటి పారిశ్రామిక దిగ్గజం దొరాబ్జీ టాటా, డాక్టర్ ఎ.జి.నో హెన్రీతో కలిసి 1927లోనే ఇండియన్ ఒలంపిక్ అసోసియేషన్‌ను ఎన్నో కలలతో ఏర్పాటు చేశాడు. ఏ లాభాపేక్ష లేకుండా, జాతి గెలుపే ఆశయంగా, గ్రామ పునాదుల్లోంచి ప్రపంచ చాంపియన్‌లు పుట్టాలనే ముందు చూపుతో భారత ఒలంపిక్ అసోసియేషన్‌ను వారిరువురు నెలకొల్పారు. తర్వాత ఎన్నో మార్పులు, నిబంధనలు ఏర్పాటు చేసుకున్నా, అంతర్జాతీయ ఒలంపిక్ అసోసియేషన్ స్ఫూర్తిని, మార్గాన్ని గీటురాయిగా మలుచుకోవడంలో మాత్రం మన దేశ క్రీడా అసోసియేషన్‌లు వెనకబడే ఉన్నాయి. గడిచిన ఏడున్నర దశాబ్దాలుగా దేశాన్ని ఏలినవారి వైఫల్యం, మైదానాల్లో జాతీయ జెండాను కాకుండా పార్టీ జెండాలను రెపరెపలాడించుకోవాలనే సంకుచితత్వం క్రీడా రంగంలో అవలక్షణాలకు పునాదులేసింది. అంతర్జాతీయ ఒలంపిక్ అసోసియేషన్‌లో ప్రతి నాలుగేండ్లకు ఒకసారి ఎన్నికల్లో క్రీడా ఫెడరేషన్‌ల అధ్యక్షులను, ఫెడరేషన్‌లు అన్నీ కలిసి అంతర్జాతీయ ఒలంపిక్ అసోసియేషన్ కార్యవర్గాన్ని ఎన్నుకుంటాయి. అలా ఎన్నిక కాబడిన ఎవరైనా రెండుసార్లు మాత్రమే ఎన్నికల్లో పోటీకి, ఎనిమిదేండ్లే పదవుల్లో కొనసాగేలా పారదర్శక విధానాలు పాటిస్తున్నారు. కానీ మన జాతీయ క్రీడా ఫెడరేషన్‌లు మాత్రం అలాంటి నిబంధనలను అనుసరించడానికి ఇష్టపడక, కొన్ని ఫెడరేషన్లలో ఏండ్లకేండ్లు పాత మొహాలే తిష్టవేసి కూర్చున్నాయి. క్రీడా ఫెడరేషన్‌ల ఎన్నిక, జాతీయ ఒలంపిక్ అసోసియేషన్ ఎన్నికల ప్రచారం, పోలింగ్ కూడా ఈనాటి సాధారణ ఎలక్షన్లనే తలపిస్తాయి. ధన, మద్య ప్రవాహం, బెదిరింపులు, బుజ్జగింపులు, పాలక పార్టీల అండదండలతో ఎన్నికల క్రీడలో క్రీడా సంఘాలు నెగ్గుతూ, అంతర్జాతీయ ఆటల్లో మాత్రం దేశాన్ని ఓడిస్తున్నాయి. సరైన చర్యలు తీసుకుని క్రీడా రంగానికి వెలుగుల బాటను వెయ్యాల్సిన కేంద్ర ప్రభుత్వాలు మాత్రం గ్యాలరీలో ప్రేక్షకుల్లా మిగిలిపోయాయి.

వాస్తవానికి మనది వస్తాదుల దేశం. 1950 నాటికే మన హైదరాబాద్‌లోనే 150కి పైగా దంగల్స్ (తాలీమ్ ఖానా) ఉండేవని చరిత్ర చెబుతున్నది. రెజ్లింగ్‌లోనే కాదు ప్రతి క్రీడలో అద్భుత విజయాలను దేశానికి అందించిన క్రీడాకారుల నిలయం మన దేశం. ఇప్పటి నిఖత్ జరీన్ నుంచి సైనా నెహ్వాల్, పీవీ సింధూ, గోపీచంద్, ముఖేష్, నారంగ్, సానియా మీర్జా ఇంకా ఎందరో క్రీడాకారులు అంతర్జాతీయ విజేతలుగా నిలిచారు. 1952 హెల్సెన్‌కిలో, 1956 మెల్‌బోర్న్‌లో జరిగిన ఒలంపిక్స్‌లోనే ఇండియన్ ఫుట్‌బాల్ జట్టు సెమీఫైనల్స్ ఆడింది. క్రీడలపై కేంద్ర సర్కార్లు మనసుపెట్టి ఉంటే మన యువత ఒలంపిక్స్‌లో వరుస పతకాలను దేశానికి అందించి ఉండేవారు. ప్రభుత్వాల జాతీయ యువజన విధానం, క్రీడా విధానంలో పాత లక్ష్యాలే తప్ప చిత్తశుద్ధితో కూడిన కార్యాచరణకు చోటు లేకుండా పోయింది. ఆర్భాటంగా ప్రచారం చేసుకుంటున్న 'ఖేలో ఇండియా'కు కూడా 28 రాష్ట్రాలు, 8 కేంద్ర పాలిత ప్రాంతాలకు గానూ కేవలం వెయ్యి కోట్లు కేటాయించి అందులో 600 కోట్లు బీజేపీ పాలిత రాష్ట్రాల్లో ఖర్చు చేయడం ఏం క్రీడా నమూనానో నరేంద్ర మోదీకే తెలియాలి. గతంలో కాంగ్రెస్ పాలనలో క్రీడల్లోనూ కుంభకోణాలే, ప్రస్తుత కాషాయ పార్టీ ప్రభుత్వంలో ప్రచారం తప్ప ఆటకు ఆదరణ లేదు. అందుకే క్రీడా రంగం కుప్పకూలుతున్నది. అనేక అవలక్షణాల మైదానంలో 'ఇండియా ఖేలో' అంటే ఎలా సాధ్యం? ఇవన్నీ చూడలేకే మల్లయోధులు బజరంగ్ పునియా, వీరేందర్ సింగ్‌లు పద్మశ్రీలను వెనక్కి ఇచ్చేస్తున్నారు. వినేష్ పోగట్ అర్జున, ఖేల్‌రత్నలను కేంద్ర సర్కారుకే తిరిగి ఇచ్చేసింది. అవస్థల ఆటలో కొనసాగలేక సాక్షి మాలిక్ ఏకంగా రిటైర్మెంట్ ప్రకటించేసింది. మైదానాలు ఖాళీ అయితే ఆసుపత్రులు కిక్కిరిసిపోతాయనే విషాదాన్ని ప్రభుత్వాలు అర్థం చేసుకోవాలి. ఆటలు సమాధి అయితే స్మశానాలు విస్తరిస్తాయనే నిజాన్ని కూడా పరిగణించాలి. కుస్తీ వీరుల కన్నీరు కూడా సర్కారులో కదలిక తేలేకపోతే ఎన్నో ఇంచుల చాతిలో ఇసుమంత తడి కూడా లేనట్లే కదా? పౌర సమాజం కూడా క్రీడా జ్యోతి వెలుగు కోసం నోరు విప్పాలి. మన భావి తరాలకు ఆరోగ్యకర సమాజం అందివ్వాలా, లేక అస్తవ్యస్త అవస్థల బతుకులను వాగ్దానం చెయ్యాలా అనేది సమాజం సామూహికంగా నిర్ణయించుకోవాలి.

● డాక్టర్ ఆంజనేయ గౌడ్



దరఖాస్తులు స్వీకరిస్తున్న కలెక్టర్ సిక్తా పట్నాయక్

గడువులోగా దరఖాస్తు చేసుకోవాలి

- 'ప్రజాపాలన'లో కలెక్టర్ సిక్తా పట్నాయక్

హనుమకొండ రూరల్, జనవరి 3 : అర్హులైన లబ్ధిదారులకు సంక్షేమ పథకాలను అందించేందుకు ప్రజాపాలన కార్యక్రమాన్ని ప్రభుత్వం నిర్వహిస్తోందని, ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ సిక్తా పట్నాయక్ అన్నారు. హనుమకొండ నక్కలగుట్టలోని వాటర్ ట్యాంక్ వద్ద నిర్వహిస్తున్న ప్రజాపాలన కార్యక్రమంలో బుధవారం కలెక్టర్ ప్రజల నుంచి దరఖాస్తులు స్వీకరించారు.

ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వం అందించనున్న పథకాలకు ఈ నెల 6వ తేదీ వరకు దరఖాస్తులు స్వీకరించడం జరుగుతుందని తెలిపారు. దరఖాస్తు పత్రాల్లో సరైన వివరాలు నింపి, ఆధార్, రేషన్‌కార్డు జిరాక్స్‌లను జత చేసి అందజేయాలన్నారు. దరఖాస్తుల కొరత లేదని, అవసరమైతే దరఖాస్తులను సిద్ధం చేయడం జరుగుతుందని తెలిపారు. ఒక కుటుంబానికి ఒకే దరఖాస్తు ఫారం ఇవ్వడం జరిగిందని, దానిలోనే అభయహస్తం గ్యారంటీలకు సంబంధించిన పథకాల కోసం దరఖాస్తు చేవసుకోవచ్చని తెలిపారు. గడువులోగా ప్రజలు దరఖాస్తు చేసుకోవాలని కలెక్టర్ సూచించారు. ఈ కార్యక్రమంలో కాజీపేట మునిసిపల్ డిప్యూటీ కమిషనర్ రవీందర్, డీఈ సంతోష్‌బాబు, అధికారులు, డివిజన్ ప్రజలు పాల్గొన్నారు.

చిగురిస్తున్న ఆశలు



హనుమకొండ, జనవరి 3 (ఆంధ్రజ్యోతి) : ఇటీవల ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి విద్యాశాఖ సమీక్షలో భాగంగా ఉపాధ్యాయ ఖాళీల భర్తీకి త్వరలో మెగా డీఎస్సీని నిర్వహించనున్నట్టు ప్రకటించడంతో ఉమ్మడి జిల్లాలో ఉపాధ్యాయ శిక్షణను పూర్తి చేసిన అభ్యర్థుల్లో ఆశలు చిగురిస్తున్నాయి. ఇందులో భాగంగా సుమారు 9,800 ఉపాధ్యాయ పోస్టులతో ప్రభుత్వం ఈ మెగా డీఎస్సీ నిర్వహించే ఆలోచనలో ఉన్నట్టు తెలుస్తోంది. గత ఆగస్టులో రాష్ట్ర వ్యాప్తంగా ఖాళీగా ఉన్న 5089 స్కూల్ అసిస్టెంట్, సెకండరీ గ్రేడ్ టీచర్స్, భాషా పండితులు పోస్టులను భర్తీకి నోటిఫికేషన్ కూడా విడుదల చేసింది. ఈ పోస్టులకు ఉమ్మడి జిల్లాలో 36 వేలకు పైగా అభ్యర్థులు దరఖాస్తులు చేసుకున్నారు. కానీ నియామకాలు మాత్రం జరగలేదు. దీంతో తీవ్ర నిరాశకు లోనైన నిరుద్యోగులు తాజాగా రేవంత్ రెడ్డి ప్రకటనతో సంతోషం వ్యక్తం చేస్తున్నారు. కొత్త ప్రభుత్వం ఎప్పుడు డీఎస్సీ నోటిఫికేషన్ జారీ చేసినా పరీక్షలకు హాజరయ్యేందుకు మరో సారి సిద్ధమవుతున్నారు.

మరోసారి సన్నద్ధం

గత కొన్ని సంవత్సరాలుగా టీఆర్‌టీ, డీఎస్సీ నిర్వహించకపోవడంతో వేలాది ఉపాధ్యాయ పోస్టులు ఖాళీ గా ఉన్నాయి. 2017లో టీఆర్‌టీని చివరి సారిగా నిర్వహించారు. కొత్తగా అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్ర భుత్వం మెగా డీఎస్సీ నిర్వహణకు అడుగులు వేస్తుండడంతో ఉమ్మడి జిల్లాలో డీఎడ్, బీఎడ్ శిక్షణ పూర్తి చేసిన అభ్యర్థులు కొలువులే లక్ష్యంగా మరో సారి పుస్తకాలతో కుస్తీ పట్టేందుకు సన్నద్ధం అవుతున్నారు. వేలా ది మంది నిరుద్యోగులు గ్రామాలను వదిలిపెట్టి పరీక్షల సన్నద్ధతకు నగరానికి వస్తున్నారు.

షెడ్యూల్‌తో సరి

గత ప్రభుత్వ హయాంలో సెప్టెంబరు 9న ఆయా జిల్లాల ఎంపిక కమిటీలు (డీఎస్‌సీ) ఆధ్వర్యంలో ఉపాధ్యాయ నియామక పరీక్ష (టీఆర్‌టీ) పేరిట నోటిఫికేషన్ విడుదల చేసింది. దరఖాస్తుల స్వీకరణ ప్రక్రియ అక్టోబరులో ముగియగా నవంబరు 20 నుంచి 30 వరకు ఆన్‌లైన్ విధానంలో పరీక్షల నిర్వహణకు రాత పరీక్షలకు షెడ్యూల్ విడుదల చేసింది. కానీ ఎన్నికల దృష్ట్యా ఆ పరీక్షలు వాయిదా పడ్డాయి. ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీ ఓడిపోయింది. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిం ది. సీఎంగా బాధ్యతలు చేపట్టిన రేవంత్ రెడ్డి ఆ వెంటనే విద్యాశాఖపై సమీక్ష నిర్వహించారు. బడులులేని గ్రామాలు ఉండరాదనీ, మూతపడిన బడులను తిరిగి తెరిపించాలని, ఆదేశించారు.

వీటితో పాటు నిలిచిపోయిన టీచర్ల పదోన్నతులను చేపట్టాలని సూచించారు. ఉపాధ్యాయ పోస్టుల భర్తీకి మెగా డీఎస్సీని నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. ఉపాధ్యాయ పోస్టుల ఖాళీలపై పూర్తి వివరాలు పంపాల్సిందిగా జిల్లా విద్యాశాఖ అధికారులకు తాజాగా ఆదేశాలు జారీ అయ్యాయి. ఉపాధ్యాయ పదోన్నతులపై కూడా ప్రభుత్వం దృష్టి సారించడంతో పాటు, మూతపడిన బడులను తిరిగి తెరిచేలా చర్యలు ప్రారంభించడంతో ఉపాధ్యాయ పోస్టులు మరిన్ని పెరిగే అవకాశాలు ఉన్నాయి. గత ప్రభుత్వం ఇచ్చిన డీఎస్సీ నోటిఫికేషన్ రద్దు చేస్తే పలు సమస్యలు ఉత్పన్నమయ్యే అవకాశాలు ఉన్నాయనీ విద్యాశాఖ భావిస్తోంది. దీంతో ఇప్పటికే ఉమ్మడి జిల్లాలో భర్తీ చేయాలని నిర్ణయించిన 532 పోస్టులతో కలిపి అనుబంధ నోటిఫికేషన్‌ను జారీ చేసే అవకాశం ఉన్నట్టు తెలుస్తోంది.

- త్వరలో మెగా డీఎస్సీ
- ఉమ్మడి జిల్లాలో 532 ఉపాధ్యాయ ఖాళీలు
- పోస్టులు మరిన్ని పెరిగే అవకాశం
- పరీక్షలకు మళ్లీ సన్నద్ధం అవుతున్న అభ్యర్థులు
- ముందు టెట్, ఆ తర్వాత డీఎస్సీ

ముందు టెట్

ఉపాధ్యాయ అర్హత పరీక్ష (టెట్) అర్హత సాధిస్తేనే డీఎడ్, బీఎడ్ పూర్తి చేసిన అభ్యర్థులు డీఎస్సీ రాయవచ్చు. మెగా డీఎస్సీ దిశగా ప్రభుత్వం అడుగులు వేస్తుండడంతో వేలాది మంది నిరుద్యోగులకు మేలు జరిగేలా తొలుత టెట్‌ను, ఆ తర్వాత డీఎస్సీని నిర్వహించాలనే ఆలోచనలో ప్రభుత్వం ఉన్నట్టు విద్యాశాఖ వర్గాల ద్వారా తెలుస్తోంది. వచ్చే విద్యా సంవత్సరం నాటికి నియామక ప్రక్రియ ముగిసేలా కసరత్తు మొదలైంది. ఇప్పటికే పలు దఫాలుగా గత ప్రభుత్వం ఉపాధ్యాయ పోస్టులపై చేసిన ప్రకటనలతో చాలా మంది అభ్యర్థులు నెలల తరబడి సన్నద్ధమవుతున్నారు. గత సెప్టెంబరులో నిర్వహించిన టెట్ పరీక్షకు ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 36,923 మంది అభ్యర్థులు దరఖాస్తులు చేసుకున్నారు. వీరిలో 40 శాతం మంది అర్హత సాధించారు. వీరికి తోడు ఇది వరకే టెట్ అర్హత సాధించి ఉద్యోగాలకు ఎంపిక కానీ వారు మరో 6వేలకుపైగా ఉన్నారు. దీనితో ఉపాధ్యాయ పోస్టుల కోసం సిద్ధమవుతున్న అభ్యర్థులు ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా సుమారు 25 వేల మంది వరకు ఉన్నట్టు అంచనా.

ఖాళీ పోస్టులు 532

ఉమ్మడి జిల్లాలో స్కూల్ అసిస్టెంట్లు, భాషాపండితులు, వ్యాయామ ఉపాధ్యాయులు, సెకండరీ గ్రేడ్ ఉపాధ్యాయులు కలిపి మొత్తం 532 పోస్టులు ఉన్నాయి. హనుమకొండలో మొత్తం 54 పోస్టులు ఖాళీగా ఉన్నాయి. వీటిలో స్కూల్ అసిస్టెంట్ 21, భాషాపండితులు 5, వ్యాయామ ఉపాధ్యాయులు 7, సెకండరీ ఉపాధ్యాయులు 21 ఉన్నాయి. జయశంకర్ భూపాలపల్లిలో మొత్తం 74 పోస్టులు ఖాళీగా ఉండగా వీటిలో స్కూల్ అసిస్టెంట్ 12, భాషా పండితులు 17, వ్యాయా మ ఉపాధ్యాయులు 7, సెకండరీ గ్రేడ్ ఉపాధ్యాయులు 38 ఖాళీగా ఉన్నాయి. జనగామ జిల్లాలో మొత్తం 76 ఖాళీలు ఉండగా వీటిలో స్కూల్ అసిస్టెంట్లు 23, భాషా పండితులు 17, వ్యాయామ ఉపాధ్యాయులు 7, సెకండరీ గ్రేడ్ ఉపాధ్యాయుల ఖాళీలు 29 ఉన్నాయి. కాగా, ములుగు జిల్లాలో మొత్తం 65 ఖాళీల్లో స్కూల్ అసిస్టెంట్లు 16, భాషా పండితులు 15 ఉన్నాయి. వ్యాయామ ఉపాధ్యాయుల పోస్టుల ఖాళీలు ఏమీ లేవు. సెకండరీ గ్రేడ్ ఉపాధ్యాయ పోస్టులు మాత్రం 33 ఉన్నాయి. మహబూబాబాద్ జిల్లాలో మొత్తం 125 ఉపాధ్యాయ ఖాళీలు ఉండగా వీటిలో స్కూల్ అసిస్టెంట్లు 35, భాషా పండితులు 19, వ్యాయామ ఉపాధ్యాయులు 2, సెకండరీ గ్రేడ్ ఉపాధ్యాయులు 65 ఉన్నాయి. వరంగల్ జిల్లాలో మొత్తం 138 పోస్టులు ఖాళీగా ఉన్నాయి. వీటిలో స్కూల్ అసిస్టెంట్లు 56, భాషా పండితులు 21, వ్యాయామ ఉపాధ్యాయులు 6, సెకండరీ గ్రేడ్ ఉపాధ్యాయుల ఖాళీలు 55 ఉన్నాయి. రాష్ట్ర వ్యాప్తంగా 5089 పోస్టులు ఖాళీగా ఉన్నట్టు గత సంవత్సరం ఆగస్టులో రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించింది. వీటిలో స్కూల్ అసిస్టెంట్ పోస్టులు 1739, భాషా పండితులు 611, వ్యాయామ ఉపాధ్యాయులు 164, సెకండరీ గ్రేడ్ ఉపాధ్యాయులు 2575 ఉన్నాయి.



మీడియాతో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి

'గృహలక్ష్మి'ని రద్దు చేస్తే ఊరుకునేది లేదు

- పరకాల మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి

ఆత్మకూరు, జనవరి 3: నిర్మాణ దశలో ఉన్న గృహలక్ష్మి ఇళ్లను రద్దు చేయకుండా ఏ పేరు పెట్టుకున్నా అభ్యంతరం లేదని, రద్దు చేస్తే మాత్రం ఊరుకునేది లేదని పరకాల మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి అన్నారు. వరంగల్ జిల్లా ఆత్మకూరు మండల కేంద్రంలో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ధర్మారెడ్డి మాట్లాడారు. గత ప్రభుత్వ హయాంలో రాష్ట్రంలో ఎక్కడాలేని విధంగా పరకాల నియోజకవర్గంలో అత్యధికంగా గృహలక్ష్మి ఇళ్లకు నిరుపేదలను ఎంపిక చేశామన్నారు. నిర్మాణ దశలో ఉన్న ఇళ్లను నూతనంగా ఎన్నికైన ప్రభుత్వం రద్దు చేయడం ఎంతవరకు సమంజసమని ఆయన ప్రశ్నించారు. పరకాలలో అత్యధికంగా ఇళ్ల నిర్మాణంలో ఉన్నాయని కొత్త ప్రభుత్వం గృహలక్ష్మి పథకాన్ని రద్దు చేస్తే ప్రజలు తిరగబడతారని, వాటికి బిల్లులు ఇవ్వకుంటే ప్రజలతో కలసి పోరాడతామని ధర్మారెడ్డి తెలిపారు. ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్ రెడ్డి లబ్ధిదారులను గుర్తించి బిల్లులు చెల్లించాలని, లేకుంటే సహించేది లేదన్నారు. ఈ కార్యక్రమంలో మండల ప్రధాన కార్యదర్శి బొల్లోజు కుమారస్వామి, దళిత బంధు కో ఆర్డినేటర్ నత్తి సుధాకర్, సుంకరి శివ, బీఆర్ఎస్ నాయకులు పెరుమాళ్ల భిక్షపతి, పాపని రవీందర్, తిరుమలగిరి సర్పంచ్ మనోహర్, అనిల్ తదితరులు పాల్గొన్నారు.

మహిళ దారుణ హత్య

- తల్లి ప్రాణాలను బలిగొన్న కొడుకు వివాహేతర సంబంధం
- భూపాలపల్లి జిల్లాలో ఘటన



పద్మ మృతదేహం (ఇన్‌సెట్‌లో ఫైల్)

మహదేవపూర్ రూరల్, జనవరి 3 : ఓ మహిళ దారుణ హత్యకు గురైన సంఘటన భూపాలపల్లి జిల్లా మహదేవపూర్ మండలం అంబట్‌పల్లిలో బుధవారం ఉదయం చోటుచేసుకుంది. ఎస్సై రాజ్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం..

అంబట్‌పల్లికి చెందిన నల్లా పద్మ, భూమయ్య దంపతుల కుమారుడు అవినాష్ అదే గ్రామానికి చెందిన మహిళతో వివాహేతర సంబంధం పెట్టుకున్నాడు. కొంతకాలంగా ఈ వ్యవహారం నడుస్తుండగా ఆ మహిళ భర్త పుట్టా నర్సింహస్వామికి విషయం తెలిసింది. దీంతో కోపోద్రిక్తుడైన అతడు అవినాష్‌ను మట్టుబెట్టాలని ప్లాన్ చేశాడు. బుధవారం ఉదయం గ్రామంలోని అమరేశ్వరాలయం వద్ద అవినాష్ ఉన్నాడని తెలుసుకొని గొడ్డలితో అక్కడికి చేరుకున్నాడు. అవినాష్‌పై దాడి చేసేందుకు యత్నించగా అయ్యప్ప భక్తులు అడ్డుకున్నారు. నర్సింహస్వామి బారి నుంచి తప్పించుకున్న అవినాష్ అక్కడి నుంచి పరారయ్యాడు. ఈ క్రమంలో కోపం చల్లారని నర్సింహస్వామి అదే గొడ్డలితో అతడి ఇంటికి వెళ్లాడు. అవినాష్ ఇంటికి వచ్చి ఉంటాడని భావించి బయట నుంచి కేక వేశాడు. ఆ సమయంలో అతడు ఇంట్లో లేడు. అతడి తల్లి నల్లా పద్మ (40) బయటకు వచ్చి చూడగా నర్సింహస్వామి గొడ్డలితో ఉన్నాడు. ఎందుకిలా వచ్చావని అతడిని పద్మ అడగగా, అవినాష్‌ను హత్య చేయడానికి వచ్చానని నర్సింహస్వామి సమాధానం చెప్పాడు. 'ఎందుకు చంపాలనుకుంటున్నావు.. నా కొడుకు ఏం చేశాడు?' అని పద్మ అడుగుతుండగానే నర్సింహస్వామి ఆమెపై గొడ్డలితో దాడి చేసి అక్కడి నుంచి పరారయ్యాడు. దీంతో ఆమె కుప్పకూలి అక్కడే ప్రాణాలు వదిలింది. మృతురాలి భర్త భూమయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్టు ఎస్సై తెలిపారు.

నిందితుడు నర్సింహస్వామి పరారీలో ఉన్నాడని చెప్పారు. పద్మ, భూమయ్య దంపతులు అంబట్‌పల్లిలోనే మిర్చి బండి నిర్వహిస్తూ జీవనం సాగిస్తున్నారు. వీరికి అవినాష్‌తోపాటు కూతురు ఉంది. అవినాష్ అవివాహితుడు కాగా ప్రైవేటు డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. నిందితుడు నర్సింహస్వామి అదే గ్రామంలో టెంట్‌హౌస్ నిర్వహిస్తున్నాడు.

భార్య అస్థికలు గోదావరిలో కలిపి..

- మనస్తాపంతో భర్త ఆత్మహత్య
- స్టేషన్‌ఘన్‌పూర్ మండలం ఛాగల్‌లో ఘటన



వెంకటయ్య (ఫైల్)

స్టేషన్‌ఘన్‌పూర్, జనవరి 3: నెల రోజుల క్రితం అనారోగ్యంతో మృతి చెందిన భార్య అస్థికలను గోదావరిలో కలిపి వచ్చిన భర్త మరుసటిరోజు బలవన్మరణానికి పాల్పడ్డాడు. గ్రామస్థులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. స్టేషన్‌ఘన్‌పూర్ మండలం ఛాగల్ గ్రామానికి చెందిన లొంక వెంకటయ్య (57) భార్య అండాలు నెలరోజుల క్రితం మృతి చెందింది. మంగళవారం ఉదయం కుటుంబ సభ్యులు భద్రాచలం వెళ్లి ఆమె అస్థికలను గోదావరి నదిలో కలిపి రాత్రి ఇంటికి చేరుకున్నారు. అప్పటి నుంచి భార్యను గుర్తు చేసుకుంటూ మనస్తాపం చెందిన వెంకటయ్య.. బుధవారం సాయంత్రం ఇంట్లో నుంచి బయటకు వెళ్లి గ్రామ శివారులోని పురుగుల మందు తాగి పడిపోయాడు. స్థానికుల ద్వారా సమాచారం అందుకున్న కుటుంబసభ్యులు వెంటనే ఆయనను వరంగల్ ఎంజీఎంకు తరలించగా అప్పటికే మృతి చెందాడని వైద్యులు నిర్ధారించారు. ఆయనకు ఇద్దరు కుమార్తెలు, కుమారుడు ఉన్నారు. సీఐ సట్ల రాజు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

బీఆర్ఎస్‌కు కార్పొరేటర్ల గుడ్‌బై

- కాంగ్రెస్‌లో చేరిన ఆరుగురు
- మాజీ కార్పొరేటర్లు సైతం హస్తం గూటికి..
- కండువా కప్పి ఆహ్వానించిన దీపాదాస్ మున్షీ
- నాయిని నేతృత్వంలో ముఖ్యమంత్రితో భేటీ
- త్వరలో తూర్పు, వర్ధన్నపేట కార్పొరేటర్లు సైతం..



సీఎం రేవంత్ రెడ్డిని కలిసిన బల్దియా కార్పొరేటర్లు

జీడబ్ల్యూఎంసీ(హనుమకొండ సిటీ), జనవరి 3 : బీఆర్ఎస్ కార్పొరేటర్లు, మాజీ కార్పొరేటర్లు, నాయకులు ఆ పార్టీకి గుడ్ బై చెబుతున్నారు. ఒక్కొక్కరుగా గులాబీ వనం నుంచి హస్తం గూటిలోకి చేరుతున్నారు. ఎన్నికలకు ముందు బీఆర్ఎస్ కార్పొరేటర్ గుండేటి నరేంద్రకుమార్ బీఆర్ఎస్‌ను వీడారు. ఎన్నికల్లో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చింది. ఈ క్రమంలో బీఆర్ఎస్ కార్పొరేటర్లు అధికార పక్షం వైపు మళ్లారు. వరంగల్ పశ్చిమ నియోజకవర్గానికి చెందిన ఆరుగురు కార్పొరేటర్లు కాంగ్రెస్ తీర్థం పుచ్చుకున్నారు. వీరితో పాటు మాజీ కార్పొరేటర్లు, నాయకులు బుధవారం హైదరాబాద్‌లోని గాంధీభవన్‌లో వరంగల్ పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి ఆధ్వర్యంలో రాష్ట్ర వ్యవహారాల ఇన్‌ఛార్జి దీపాదాస్ మున్షీ ఆహ్వానంతో కాంగ్రెస్‌లో చేరారు.

ఈ పరిణామాలు కాంగ్రెస్‌లో జోష్‌ను కలిగిస్తుండగా జంప్ జిలానీలతో గులాబీ గూటిలో నిస్తేజం అలుముకుంది. గులాబీ కార్పొరేటర్లను నిలువరించేందుకు బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్‌తో పాటు మాజీ ఎమ్మెల్యేలు దాస్యం వినయ్‌భాస్కర్, నన్నపునేని నరేందర్, అరూరి రమేశ్‌లతో పాటు మేయర్ గుండు సుధారాణి ప్రయత్నించినా బీఆర్ఎస్ కార్పొరేటర్లు స్పందించనట్లు తెలిసింది.

ఫలించిన నాయిని వ్యూహం...

వరంగల్ పశ్చిమకు చెందిన బీఆర్ఎస్ కార్పొరేటర్లు, మాజీ కార్పొరేటర్లు ఇతర నాయకులు కాంగ్రెస్‌లోకి రావడంలో వరంగల్ పశ్చి మ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి వ్యూహం ఫలించింది. చేరిన వారిలో కొందరు ఎన్నికలకు ముందే రాజేందర్‌రెడ్డితో టచ్‌లో ఉన్నా రు. వ్యూహాత్మకంగానే ఈ పరిణామం వాయి దా పడుతూ వచ్చింది. ఎన్నికలు ముగిశాయి చేరికలకు లైన్ క్లియర్ అయ్యింది. ఈ విషయానికి సంబంధించి బీఆర్ఎస్ కార్పొరేటర్లు, రాజేందర్‌రెడ్డిల మధ్య మంతనాలు వారం రోజులుగా జరిగాయి. బుధవారం పార్టీ సమావేశానికి రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి దీపాదాస్ మున్షీ హాజరు కానుండడంతో చేరికకు రాజేందర్‌రెడ్డి ముహూర్తం ఫిక్స్ చేశారు. అంతా చకచకా జరిగిపోయింది. దీపాదాస్ మున్షీ కండువాలు కప్పడం ఆ తదుపరి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డితో భేటీ కావడంతో గులాబీలు కాంగ్రెస్ వేదికపైకి వచ్చారు.

కాంగ్రెస్‌లో చేరిన ఆరుగురు 'గులాబీ' కార్పొరేటర్లు

వరంగల్ పశ్చిమకు చెందిన ఆరుగురు కార్పొరేటర్లు మామిండ్ల రాజు (31వ డివిజన్), మానస రాంప్రసాద్ (49వ డివిజన్), వేముల శ్రీనివాస్ (7వ డివిజన్), చీకటి శారద ఆనంద్ (9వ డివిజన్), నెక్కొండ కవిత కిషన్ (50వ డివిజన్), సర్తాజ్ బేగం (48వ డివిజన్) కాంగ్రెస్‌లో చేరారు. వీరితో పాటు మాజీ కార్పొరేటర్లు తాడిశెట్టి విద్యాసాగర్, వీరగంటి రవీందర్, వేల్పుల మోహన్‌రావు, నెక్కొండ కిషన్, అబూబాకర్, బీఆర్ఎస్ నాయకులు చీకటి ఆనంద్, నలుబోల సతీశ్ కాంగ్రెస్ గూటికి చేరారు.

కండువా కప్పిన దీపాదాస్ మున్షీ

కాంగ్రెస్‌లో చేరిన కార్పొరేటర్లు, మాజీ కార్పొరేటర్లు ఇతర బీఆర్ఎస్ నేతలకు కాంగ్రెస్ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి దీపాదాస్ మున్షీ కండువా కప్పి ఆహ్వానించారు. బుధవారం హైదరాబాద్‌లో జరిగిన పార్టీ కార్యనిర్వాహక సమావేశం అనంతరం చేరికల కార్యక్రమం జరిగింది. వరంగల్ పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి ఆధ్వర్యంలో చేరిన బీఆర్ఎస్ కార్పొరేటర్లు, మాజీ కార్పొరేటర్లు, నేతలను దీపాదాస్ మున్షీ కండువాలతో ఆహ్వానించి శుభాకాంక్షలు

మిగతా 8వ పేజీలో..

గ్రేటర్‌పై గురి

- బీఆర్ఎస్ కార్పొరేటర్లకు వల వేస్తున్న కాంగ్రెస్
- బీజేపీ కార్పొరేటర్లకు సైతం టచ్‌లో
- మే నాటికి అవిశ్వాస తీర్మానానికి రంగం సిద్ధం
- ముందుగానే బీఆర్ఎస్‌ను ఒంటరిని చేయాలనే వ్యూహాలు

7



మహబూబాబాద్ జిల్లా కలెక్టర్‌గా అద్వైత్‌కుమార్ సింగ్



మహబూబాబాద్, జనవరి 3 (ఆంధ్రజ్యోతి) : మహబూబాబాద్ జిల్లా నూతన కలెక్టర్‌గా 2013 బ్యాచ్‌కు చెందిన అద్వైత్‌కుమార్‌సింగ్ బదిలీపై వస్తున్నారు. రాష్ట్ర వ్యాప్తంగా 26 మంది కలెక్టర్లను బదిలీ చేస్తూ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. అందులో భాగంగా మహబూబాబాద్‌లో కలెక్టర్‌గా పని చేస్తున్న శశాంక రంగారెడ్డి జిల్లా కలెక్టర్‌గా బదిలీపై వెళ్తున్నారు. ఆయన స్థానంలో కేంద్ర సర్వీసులో డిప్యూటేషన్‌లో పని చేస్తున్న అద్వైత్‌కుమార్‌సింగ్ మానుకోట కలెక్టర్‌గా వస్తున్నారు. కాగా, బదిలీపై వెళ్తున్న కలెక్టర్ శశాంక 2021 సెప్టెంబరు 1న రాగా, దాదాపు 28 నెలల పాటు ఇక్కడ విధులు నిర్వర్తించారు.

నాణ్యతా ప్రమాణాలు పాటించాలి

- 'కుడా' వైస్ చైర్మన్ షేక్ రిజ్వాన్ బాషా



కమ్యూనిటీ హాల్ పరిశీలనలో కుడా వైస్ చైర్మన్ షేక్ రిజ్వాన్ బాషా

జీడబ్ల్యూఎంసీ(హనుమకొండ సిటీ), జనవరి 3 : నిర్మాణ పనుల్లో నాణ్యతా ప్రమాణాలు తప్పనిసరిగా పాటించాలని 'కుడా' అధికారులకు వైస్ చైర్మన్ షేక్ రిజ్వాన్ బాషా స్పష్టం చేశారు. బుధవారం కడిపికొండలో కుడా ఆధ్వర్యంలో నిర్మిస్తున్న కమ్యూనిటీ హాల్‌ను ఆయన క్షేత్రస్థాయిలో పరిశీలించారు. అధికారులకు నిర్మాణ పనుల సూచనలు చేశారు.



నిందితులను అరెస్టు చూపిస్తున్న డీసీపీ రవీందర్, ఏసీపీ సతీష్‌బాబు, సీఐ, ఎస్సైలు

మంత్రాల అనుమానంతోనే చంపారు...

- వీడిన సోమలక్ష్మి హత్యకేసు మిస్టరీ
- నలుగురి అరెస్టు, పరారీలో ఒకరు


ఐనవోలు, జనవరి 3: హనుమకొండ జిల్లా ఐనవోలు మండలంలోని ఒంటిమామిడిపల్లి గ్రామానికి చెందిన వృద్ధురాలు గోనె సోమలక్ష్మి ఇటీవల హత్యకు గురైంది. ఈ హత్యకేసుకు సంబంధించి నలుగురు నిందితులను పోలీసులు బుధవారం అరెస్టు చేశారు. ఈస్ట్ జోన్ డీసీపీ రవీందర్ తెలిపిన వివరాల ప్రకారం గ్రామానికి చెందిన సోమలక్ష్మి ఇటీవల హత్యకు గురికాగా.. మొదట ఆమె చిన్న కుమారుడు సాయిలుపై అనుమానంతో అదుపులోకి తీసుకుని విచారించారు. కానీ అతడు హత్య జరిగిన సమయంలో ఓ మిల్లులో హమాలీ పనికి వెళ్లినట్లు నిర్ధారించి మరో కోణంలో విచారణ చేయగా అసలు నిందితులు దొరికారు.

సోమలక్ష్మి ఇంటి పక్కనే ఉండే గోనె మధు అనే యువకుడు గత డిసెంబరు 17న పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. తన కుమారుడు ఆత్మహత్య చేసుకోవడానికి సోమలక్ష్మి మంత్రాలే కారమణమని భావించిన మధు తండ్రి రాజు అలియాస్ పెద్దరాజు సోమలక్ష్మిపై కక్ష పెంచుకున్నాడు. వృద్ధురాలిని చంపాలని నిర్ణయించుకున్నాడు.

ఇందుకు తన చిన్న కుమారుడు అనిల్, సంగెం మండలం మొండ్రాయికి చెందిన బంధువు పెండ్లి యుగందర్, ఐనవోలుకు చెందిన తన అల్లుడు అనుముల రంజిత్, అదే గ్రామానికి చెందిన ముస్కు రాజశేఖర్‌ల సహకారం కోరాడు. సోమలక్ష్మి పాలకుర్తి మండలం దర్దేపల్లిలో ఉన్న తన కూతురు ఇంటికి వెళ్లి డిసెంబర్ 26 రాత్రి గ్రామానికి చేరుకుంది. ఆమె రాకను పెద్దరాజు గమనించాడు. తెల్లారితే కొడుకు దశదిన కర్మ ఉన్నందున ఆ పనుల్లో ఉంటూనే, రాత్రి నలుగురి సహకారంతో ఇంటి ఆవరణలో నిద్రిసున్న సోమలక్ష్మి తలపై కర్రలతో గట్టిగా కొట్టడంతో తలపగిలి అక్కడిఅక్కడే మృతిచెందింది.

ఆ తర్వాత మృతురాలి మంచాన్ని కొత్తగా నిర్మిస్తున్న ఇంటి గోడల మధ్య పెట్టి దుప్పటి కప్పి, కుమారుడి దశదిన కర్మ పనుల్లో నిమగ్నమయ్యారు. ఇది కక్షతోనే జరిగిన హత్యగా భావించిన పోలీసులు.. ఐనవోలు బ్రాందీషాపుతోపాటు రహదారుల్లో ఉన్న సీసీ ఫుటేజీలను పరిశీలించగా ఆ రాత్రి నిందితులు అనిల్, రాజశేఖర్‌లు కలిసి మద్యం సేవించి వెళ్లినట్లు గుర్తించారు. వారిని విచారించగా హత్య తాలూకు వివరాలు వెల్లడించారు. మంత్రాల అనుమానంతోనే సోమలక్ష్మిని చంపినట్లు వారు ఒప్పుకోవడంతో నలుగురిని అరెస్టు చేసి కోర్టులో హాజరుపరిచారు. రంజిత్ పరారీలో ఉన్నాట్లు డీసీపీ తెలిపారు. కేసు దర్యాప్తులో ప్రతిభ చూపిన మామునూరు ఏసీపీ సతీష్‌బాబు, పర్వతగిరి సీఐ అనుముల శ్రీనివాస్, ఐనవోలు ఎస్సై నవీన్‌కుమార్‌తో పాటు సిబ్బందిని అభినందించారు.

ఇద్దరికి కరోనా



హనుమకొండ అర్బన్, జనవరి 3 : ఎంజీ ఎం ఆస్పత్రిలో బుధవారం 40 మంది రోగులు ఓపీ వి భాగానికి రాగా, 26 మందికి ఆర్‌టీపీసీ ఆర్ పరీక్షలు నిర్వహించామని, వీటిలో రెండు పాజిటీవ్‌గా నమోదు అయ్యాయని ఎంజీఎం ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ వి.చంద్ర శేఖర్ ఒక ప్రకటనలో తెలిపారు. కాగా, ఎజీఎం కొవిడ్ వార్డులో ప్రస్తుతం ఆరుగురు రోగులు చికిత్స పొందుతున్నారని పేర్కొన్నారు.

వీరభద్రుడిపై చిన్న చూపేల..?

- దాతల సహకారంతోనే అభివృద్ధి
- నిధులు కేటాయించని ప్రభుత్వం
- నేడు వీరభద్రస్వామి జాతర అభివృద్ధి సమీక్ష సమావేశం
- హాజరు కానున్న మంత్రి పొన్నం ప్రభాకర్


జాతర ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఆర్డీవో రమేష్



భీమదేవరపల్లి, జనవరి 3: కొత్తకొండ వీర భద్రస్వామి జాతర అభివృద్ధిపై ప్రభుత్వాలు చిన్న చూపు చూస్తున్నాయని విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. స్వామివారి ఆలన పాలన, అభివృద్ధి ప్రభుత్వం చూడాల్సి ఉండగా, కేవలం భక్తుల సహకారంతోనే అభివృద్ధి పనులు కొనసాగుతున్నాయి. లక్షలాది మంది భక్తులు నిత్యం స్వామివారని దర్శించుకోవడానికి వస్తున్నా- వారికి తగిన సౌకర్యాలు కల్పించడంలో మాత్రం ప్రభుత్వం చిన్న చూపు చూస్తోందనే విమర్శలు వినిపిస్తున్నాయి. బ్రహ్మోత్సవాల సందర్భంగా తాత్కాలిక ఏర్పాట్లు చేస్తున్నారే తప్ప పూర్తిస్థాయిలో అభివృద్ధి పనులు చేపట్టడం లేదు. కొత్తకొండ శ్రీవీరభద్రస్వామి దేవాలయం హనుమకొండ జిల్లా పరిధిలోకి వచ్చిన తర్వాత దర్శనానికి వచ్చే భక్తులు సంఖ్య కూడా పెద్దఎత్తున పెరిగింది. కానీ వచ్చే భక్తులకు సరిపడా ఏర్పాట్లు కల్పించడంలో ప్రభుత్వాలు పూర్తిగా విఫలమవుతున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి.

చేపట్టాల్సిన అభివృద్ధి పనులు...

కొత్తకొండ వీరభద్రస్వామి దేవాలయంలో కొండపైకి ఘాట్ రోడ్ నిర్మాణం, ఆలయం చుట్టూ పచ్చదనం ఏర్పాటు చేసేందుకు గ్రీనరీ, ఆలయ ప్రాంగణం మొత్తం సీసీ రోడ్ల నిర్మాణం, వీఐపీల కోసం గెస్ట్‌హౌజ్ నిర్మాణం, అన్నదానం కోసం భోజనశాల ఏర్పాటు, మహిళల కోసం స్నానాల ఘట్టం, అద్దాల మండపం, సెంట్రల్ లైటింగ్ సిస్టం, ఆలయం చుట్టూ ఆర్చిగేట్ల ఏర్పాటు తదితర అభివృద్ధి పనులు చేస్తే వచ్చే భక్తులకు సౌకర్యవంతంగా ఉంటుందని పలువురు తెలుపుతున్నారు. కొత్తకొండ దేవాలయానికి చెందిన ఎకరం భూమిలో 2017లో ప్రభుత్వం హరిత హోటల్ ను నిర్మించింది. అప్పటి నుంచి ఇప్పటి వరకు దానికి సంబంధించిన లీజ్ డబ్బులు మాత్రం దేవాలయానికి ఇవ్వడం లేదు. పైగా బ్రహ్మోత్సవాల సందర్భంగా వీఐపీలు, మంత్రులు, ఎమ్మెల్యేలు ఎవరైనా వస్తే వారికి కేటాయించిన రూమ్‌ల బిల్లులు మాత్రం దేవాలయం చెల్లించాలని అధికారులు పేర్కొంటున్నారు.

నేడు మంత్రి సమీక్ష సమావేశం

కొత్తకొండ జాతర బ్రహ్మోత్సవాల సమీక్ష సమావేశాన్ని స్థానిక ఎమ్మెల్యే, మంత్రి పొన్నం ప్రభాకర్ గురువారం నిర్వహించనున్నారు. ఈ సమావేశానికి కలెక్టర్‌తో పాటు వివిధ శాఖాల అధికారులు పాల్గొననున్నారు. జాతర అభివృద్ధిపై కూడా ఈ సమావేశంలో మాట్లాడనున్నారు. అభివృద్ధిపై మంత్రి పొన్నం ప్రభాకర్‌కు నివేదికలు సమర్పించేందుకు భక్తులు, అధికారులు సమాయత్తమవుతున్నారు. సమావేశానికి ఏర్పాట్లను హనుమకొండ ఆర్డీవో ఎల్ రమేష్‌తో పాటు దేవాలయ ఈవో కిషన్‌రావులను పరిశీలించారు.

రాజన్న సేవలో ఎమ్మెల్సీ సత్యవతి రాథోడ్

వేములవాడ, జనవరి 3: వేములవాడ రాజరాజేశ్వరస్వామి వారిని ఎమ్మెల్సీ సత్యవతి రాథోడ్ బుధవారం కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. ప్రత్యేక పూజలో పాల్గొన్నారు. అనంతరం నాగిరెడ్డి మండపంలో అర్చకులు ఆశీర్వచనం గావించారు. ఆలయ ప్రొటోకాల్ సూపరింటెండెంట్ సిరిగిరి శ్రీరాములు స్వామివారి ప్రసాదం అందజేశారు.


ఎమ్మెల్సీ సత్యవతి రాథోడ్‌కు ప్రసాదం అందజేస్తున్న సూపరింటెండెంట్ శ్రీరాములు

మేదరి సంఘం మహిళా నేతకు ఘన సత్కారం


దీకొండ సరితకు షీల్డ్‌ను బహుకరిస్తున్న కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి

వడ్డెపల్లి, జనవరి 3: తెలంగాణ బీసీ జన జాగృతి హైదరాబాద్ వారి ఆధ్వర్యంలో జ్యోతిబాయి పూలే జయంతిని పురస్కరించుకొని హైదరాబాద్ బాగ్ లింగంపల్లిలోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో ప్రత్యేక కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. విద్య, రాజకీయ, సాంస్కృతిక, సమాజ సేవ, మహిళా అభ్యున్నతి, మహిళా జాగృతి విభాగాల్లో ప్రతిభ కనబర్చిన బీసీ కులాల మహిళలను కేంద్ర మంత్రి జి. కిషన్‌రెడ్డి ఘనంగా సత్కరించారు. ఇందులో భాగంగా హనుమకొండ జిల్లా మేదరి కుల ప్రతినిధులుగా కార్యక్రమంలో పాల్గొని ప్రతిభ కనబర్చిన దీకొండ సరిత, చందా స్వరాజ్యంలకు షీల్డులను బహూకరించి అభినందించారు. కార్యక్రమంలో బీసీ కమిషన్ చైర్మన్ వకుళా భరణం కృష్ణమోహన్, కాంగ్రెస్ సీనియర్ నాయకులు వి. హన్మంతరావు తదితరులు పాల్గొన్నారు.

గ్రేటర్‌పై గురి



- బీఆర్ఎస్ కార్పొరేటర్లకు వల వేస్తున్న కాంగ్రెస్
- బీజేపీ కార్పొరేటర్లకు సైతం టచ్‌లోకి...
- మే నాటికి అవిశ్వాస తీర్మానానికి రంగం సిద్ధం
- ముందుగానే బీఆర్ఎస్‌ను ఒంటరిని చేయాలనే వ్యూహాలు

జీడబ్ల్యూఎంసీ(హనుమకొండ సిటీ), జనవరి 3 : వరంగల్ మహానగర పాలక సంస్థపై కాంగ్రెస్ గురి పెట్టింది. అవిశ్వాస తీర్మానం పావుగా హస్తం పార్టీ అస్త్రాలను సంధిస్తోంది. బీఆర్ఎస్ కార్పొరేటర్లకు వల వేసి ఆ పార్టీని బల్దియాలో ఒంటరిని చేయాలనే ప్రణాళికలతో కాంగ్రెస్ ఎమ్మెల్యేలు ఇతర ముఖ్య నేతలు వ్యూహాలు పన్నుతున్నారు. ఇందులో భాగంగా బీఆర్ఎస్‌కు చెందిన ఆరుగురు కార్పొరేటర్లను కాంగ్రెస్ వైపు తిప్పేసుకున్నారు. రానున్న మే నాటి వరకు బల్దియా ప్రస్తుత పాలక వర్గానికి మూడేళ్లు పూర్తి అవుతాయి. అప్పటి వరకు అవిశ్వాస తీర్మానం ప్రవేశపెట్టి కూల్చి వేయని పరిస్థితి. ఈ క్రమంలో ఇప్పటి నుంచే బీఆర్ఎస్‌తో పాటు బీజేపీ కార్పొరేటర్లను తమ వైపునకు లాగి బలాన్ని పెంచుకోవాలనే దిశగా కాంగ్రెస్ నేతలు అడుగులు వేస్తున్నారు. ఈ పరిణామాలతో బీఆర్ఎస్ కూడా తమ వారిని దక్కించుకునే దిశగా యత్నాలు చేపట్టింది.

మే నాటికే అవిశ్వాస తీర్మానం

బల్దియాలో అవిశ్వాస తీర్మానం ప్రవేశపెట్టేందుకు కాంగ్రెస్ చేసే యత్నాలు ఇప్పుడు ఫలించని పరిస్థితి. మే వరకు బీఆర్ఎస్ పాలకవర్గానికి మూడేళ్లు పూర్తి కానున్నాయి. నిబంధనల మేరకు మూడేళ్ల తరువాతే అవిశ్వాస తీర్మానానికి అవకాశం ఉండడంతో కాంగ్రెస్ ఇప్పటికిప్పుడే కూల్చేయలేదనే ధీమాతో బీఆర్ఎస్ నేతలు ఉన్నారు. ఇక మే నెలలో అవిశ్వాస తీర్మానం కాంగ్రెస్ నెగ్గాలన్నా ఆ పార్టీకి తగిన బలం సమకూరాల్సి ఉంది. ప్రస్తుతం బల్దియాలో 66 మంది కార్పొరేటర్లు ఉన్నారు. బీఆర్ఎస్ బలం 52 కార్పొరేటర్లతో ఉండేది. చేరికల క్రమంలో బీఆర్ఎస్ కార్పొరేటర్ల సంఖ్య 45కు తగ్గింది. ఎక్స్ అఫిషియో సభ్యులైన ఎంపీలు పసునూరి దయాకర్, డాక్టర్ బండా ప్రకాశ్, ఎమ్మెల్సీ పోచారం శ్రీనివాస్‌రెడ్డితో పాటు ఎక్స్ అఫిషియో సభ్యుడిగా ఎమ్మెల్యే కడియం శ్రీహరి బాధ్యత తీసుకుంటే కలిపి మొత్తంగా 49 బీఆర్ఎస్ బలంగా ఉంది. కాంగ్రెస్‌కు 11 మంది కార్పొరేటర్లు ఉండగా ఎక్స్ అఫిషియో సభ్యులు మంత్రి కొండా సురేఖ, ఎమ్మెల్యేలు నాయిని రాజేందర్‌రెడ్డి, నాగరాజు, రేవూరి ప్రకాశ్‌రెడ్డితో కలిపి మొత్తంగా ఇప్పటికిప్పుడు 15 మంది ఉంటారు. అయితే ఎక్స్ అఫిషియోగా కాంగ్రెస్ ఎమ్మెల్యేల్లో రేవూరి, నాగరాజు పరకాల, వర్ధన్నపేట మునిసిపాలిటీల్లో బాధ్యత తీసుకుంటారో లేదో తేలాల్సి ఉంది. ఒకవేళ జీడబ్ల్యూఎంసీలోనే సభ్యులుగా ఉంటే మాత్రం కాంగ్రెస్ బలం ఇప్పటికిప్పుడు 15గా ఉన్నట్లే. అవిశ్వాస తీర్మానం కాంగ్రెస్ ప్రవేశపెట్టి నెగ్గాలంటే ఆ పార్టీకి ఎక్స్ అఫిషియోల సంఖ్యతో కాకుండా మరో 19 మంది కార్పొరేటర్ల బలం కావాల్సి ఉంది. ఈ క్రమంలో బీఆర్ఎస్, బీజేపీల నుంచి కార్పొరేటర్లను కాంగ్రెస్‌లోకి చేర్పించే వ్యూహంతో కాంగ్రెస్ నేతలు పావులు కదుపుతున్నారు. ఒకవేళ బీఆర్ఎస్ కార్పొరేటర్ల సంఖ్య తగ్గినా బీజేపీ కార్పొరేటర్లు మాత్రం కాంగ్రెస్ పక్షాన ఓటెయ్యడం కుదరదనే అంచనాలు ఉన్నాయి. ఈ క్రమంలో తమకు ఎలాంటి ఢోకా ఉండదని, కాంగ్రెస్‌కు బలాన్నే చేకూర్చే అంత సంఖ్యలో బీఆర్ఎస్ కార్పొరేటర్లను కాపాడుకోవాలనే ప్రతి వ్యూహంతో బీఆర్ఎస్ అస్త్రాలను సిద్ధం చేసుకుంటోంది. మొత్తంగా ఆరు నెలల కౌంట్ డౌన్‌తో గ్రేటర్ రాజకీయాలు రసవత్తరం కానున్నాయి.

చేరికలతో కాంగ్రెస్‌కు పెరిగిన బలం

బీఆర్ఎస్ కార్పొరేటర్ల చేరికలతో బల్దియాలో కాంగ్రెస్ కార్పొరేటర్ల బలం 11కు చేరింది. కాంగ్రెస్ కార్పొరేటర్లు తోట వెంకన్న, పోతుల శ్రీమాన్, జక్కుల రవీందర్ యాదవ్, విజయశ్రీ రజాలీలు ఉన్నారు. కొద్ది రోజుల క్రితమే బీఆర్ఎస్ కార్పొరేటర్ గుండేటి నరేందర్ కాంగ్రెస్ కండువా కప్పేసుకున్నారు. తాజాగా బుధవారం కాంగ్రెస్‌లో చేరిన ఆరుగురు కార్పొరేటర్లతో మొత్తం కాంగ్రెస్ బలం బల్దియాలో 11కు పెరిగింది. టెక్నికల్‌గా బీఆర్ఎస్ కార్పొరేటర్ల చేరికలు ఆమోదం కావు కానీ వీరంతా బీఆర్ఎస్ పాలకవర్గం ప్రవేశపెట్టే తీర్మాణాలు, నిర్ణయాలను వ్యతిరేకిస్తూ విపక్షంగా వ్యవహరిస్తారు. ముున్ముందు కూడా మరి కొందరు బీఆర్ఎస్ కార్పొరేటర్లు కాంగ్రెస్‌లో చేరనున్నారనే సంకేతాల క్రమంలో బల్దియాలో కాంగ్రెస్ సంఖ్య మరింత పెరిగి బీఆర్ఎస్‌పై ఆధిపత్యం చెలాయించే పరిణామాలు దారి తీస్తాయనే చర్చ జరుగుతోంది.

ముఖ్యమంత్రి ఓఎస్డీగా ముల్కనూరు వాసి


వేముల శ్రీనివాసులు

భీమదేవరపల్లి, జనవరి 3: ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఓఎస్డీగా ముల్కనూరుకు చెందిన వేముల శ్రీనివాసులును నియమిస్తూ చీఫ్ సెక్రటరీ శాంతికుమారి బుధవారం ఆదేశాలు జారీ చేశారు. దీంతో ముల్కనూరులో ఆయన మిత్రులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఏడు సంవత్సరాలుగా స్టాంపులు, రిజిస్ట్రేషన్ల శాఖ జాయింట్ ఐజీగా శ్రీనివాసులు పని చేశారు. ముల్కనూరులో నిరుద్యోగ యువతకు ఉచితంగా కోచింగ్, స్టడీ మెటీరియల్ అందించేందుకు ఏర్పాటు చేసిన ప్రజా గ్రంథాలయ ఏర్పాటులో శ్రీనివాసులుది కీలకపాత్ర. ఆయన ఓఎస్డీగా ఎన్నిక కావడంతో జడ్పీటీసీ వంగ రవి, ముల్కనూరు సర్పంచ్ మాడుగుల కొమురయ్య, పల్లా ప్రమోద్‌రెడ్డి, అరుణ్ కుమార్, లక్ష్మయ్య, వీరేశం తదితరులు హర్షం వ్యక్తం చేశారు.

ఉద్యోగుల వేతనాలు వెంటనే విడుదల చేయాలి

హనుమకొండ రూరల్, జనవరి 3: సమగ్ర శిక్ష, కేజీబీవీ ఉద్యోగుల వేతనాలు వెంటనే విడుదల చేయాలని టీఎస్ యూటీఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎం.సదాశివరెడ్డి, పెండెం రాజు ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. గత రెండు నెలలుగా వేతనాలు అందక ఉద్యోగులు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. నూతన ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు ప్రతి నెల ఒకటవ తేదీన వేతనాలు విడుదల చేయాలని ప్రకటనలో పేర్కొన్నారు.

ఉద్యమకారులకు సంక్షేమ పథకాలు అందించాలి


జూనియర్ అసిస్టెంట్ భగవాన్‌కు వినతిపత్రం అందజేస్తున్న తెలంగాణ ఉద్యమకారులు

ఇనుగుర్తి, జనవరి 3 : తెలంగాణ రాష్ట్రం కోసం పోరాడిన ఉద్యమకారులకు సంక్షేమ పథకాలు అందించాలని, ప్రభుత్వం ప్రకటించిన 250 గజాల ఇంటిస్థలం ఇవ్వాలని తెలంగాణ ఉద్యమకారులు పింగిలి శ్రీనివాస్, ప్రభుత్వాన్ని కోరారు. ఇనుగుర్తి తహసీల్దార్ కార్యాలయంలో బుధవారం జూనియర్ అసిస్టెంట్ భగవాన్‌కు వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... తెలంగాణ ఉద్యమం కోసం పనిచేసిన అమరవీరులకు, ఉద్యమకారులకు ఇండ్ల స్థలం, పింఛన్ సౌకర్యం కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో బూర రఘుపతి, సట్ల బిక్షపతి, లింగ్యానాయక్, హనుమాండ్ల సోమిరెడ్డి, జంపయ్య, గండు నాగన్న పాల్గొన్నారు.

ఆదిత్య ఆస్పత్రి వ్యవస్థాపకుడి మృతి


డాక్టర్ కృష్ణారెడ్డి (ఫైల్)

హనుమకొండ అర్బన్, జనవరి 3 : హనుమకొండలోని ఆదిత్య ఆస్పత్రి వ్యవస్థాపకుడు డాక్టర్ చింతలపాణి కృష్ణారెడ్డి (74) బుధవారం సాయంత్రం అనారోగ్యంతో హనుమకొండలోని ఇంటిలో మృతి చెందారు. కాజీపేట సమీపంలోని సూర్యకుటీర్ వెంచర్‌లో గురువారం ఉదయం 10 గంటలకు అంత్యక్రియలు నిర్వహించనున్నారు. హనుమకొండ జిల్లా ఎల్కతుర్తి మండలం దామెర గ్రామానికి చెందిన కృష్ణారెడ్డి వైద్య పట్టా పొంది రోగులకు వైద్య సేవలందించారు. హుస్నాబాద్ మండల కేంద్రంలో మూడు దశాబ్దాల పాటు వైద్య సేవలు అందించారు. ఆయనకు రాకేశ్‌రెడ్డి, వరుణ్‌రెడ్డి ఇద్దరు కుమారులు ఉన్నారు. కృష్ణారెడ్డి మృతి పట్ల పలువురు ఇండియన్ మెడికల్ అసోసియేషన్ వైద్యులు సంతాపం ప్రకటించారు.

అర్చక ఉద్యోగుల సమస్యలు తీర్చాలి

ఉప ముఖ్యమంత్రి భట్టికి విజ్ఞప్తి


ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్కను కలిసిన ప్రధాన దేవాలయాల అర్చక ఉద్యోగులు

హనుమకొండ, జనవరి 3 (ఆంధ్రజ్యోతి) : సమస్యలు పరిష్కరించాలని అర్చక ఉద్యోగులు ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్కను కోరారు. బుధవారం తెలంగాణ అర్చక ఉద్యోగుల జాక్ ఆధ్వర్యంలో ప్రధాన దేవాలయాల అర్చకులు ఉప ముఖ్యమంత్రిని హైదరాబాద్‌లో జ్యోతిరావుపూలే ప్రజాభవన్‌లో కలిశారు. అర్చక, ఉద్యోగుల సమస్యలపై వినతి పత్రాన్ని సమర్పించారు. రాష్ట్రంలోని 12,625 దేవాలయాల పరిరక్షణకు చర్యలు తీసుకోవాలని కోరారు. రాష్ట్రంలో అన్యాక్రాంతం అయిన 36వేల ఎకరాల ఆలయ భూములను భూకబ్జాదారుల నుంచి విడిపించి వేలం పాట ద్వారా అమ్మి తద్వారా వచ్చే అదాయంతో ఆలయాలను అభివృద్ధి చేయాలని కోరారు. గ్రాంట్ ఇన్ ఎయిడ్ కింద జీవో 577 ప్రకారం మిగిలిన 2వేల మంది అర్చక ఉద్యోగులకు ట్రెజరీ ద్వారా వేతనాలు ఇవ్వాలని అభ్యర్థించారు. కాంగ్రెస్ పార్టీ మేనిఫెస్టోలో చేర్చిన విధంగా దూప దీప నైవేద్యం అర్చకులకు నెలకు రూ.12 వేలు ఇప్పించాలని కోరారు. భట్టి విక్రమార్క ఇందుకు సానుకూలంగా స్పందించారు. ఈ విషయాలను ప్రభుత్వం దృష్టికి తీసుకువచ్చి పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. కొండగట్టు, వేములవాడ, కాళేశ్వరం, బాసర, భద్రాచలం, యాదాద్రి, కొమురవెల్లి తదితర దేవాలయాల అర్చకులు, వేద పండితులతో పాటు దేవాదాయ శాఖ అదనపు కమిషనర్ కురాకుల జ్యోతి ఈవోల సంఘం ప్రధాన కార్యదర్శి అన్నపూర్ణ అర్చక, ఉద్యోగుల జాక్ చైర్మెన్ గంగు ఉపేంద్ర శర్మ, రాష్ట్ర దేవాలయాల ఉద్యోగుల సంఘం రాష్ట్ర కన్వీనర్ కొండూరి క్రిష్ణమాచారి, అధ్యక్షుడు భద్రీనారాయణాచార్యులు డీడీఎన్ రాష్ట్ర అధ్యక్షుడు నిట్టూరి సతీష్ శర్మ వరంగల్ అధ్యక్షుడు పెన్నా మోహన్ శర్మ తదితరులు ఉప ముఖ్యమంత్రిని కలిసినవారిలో ఉన్నారు. అర్చకులు భట్టి విక్రమర్కకు వేద మంత్రాలతో ఆశీర్వచనం చేసి సత్కరించారు.

సమాజ నిర్మాణంలో విద్యార్థుల పాత్ర కీలకం

ప్రముఖ సైకాలజిస్ట్ డాక్టర్ పరికిపండ్ల అశోక్


నేరడ మోడల్‌స్కూల్లో మాట్లాడుతున్న డాక్టర్ పరికిపండ్ల అశోక్

కురవి, జనవరి 3 : విద్యతోనే సమాజంలో గౌరవం, ముందడుగు సాధ్యమని ప్రముఖ సైకాలజిస్ట్ డాక్టర్ పరికిపండ్ల అశోక్ అన్నారు. కురవి మండలం నేరడ మోడల్‌స్కూల్లో బుధవారం ప్రేరణ కార్యక్రమాన్ని ప్రారంభించి మాట్లాడారు. గత పది సంవత్సరాలుగా రాష్ట్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో విద్యార్థుల కోసం ఉచిత ప్రేరణ శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. విద్యార్థులు పరీక్షల్లో విజయం సాధించాలంటే కష్టించి చదవాలన్నారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ అరుణ, సైబర్ క్రైమ్ ఇన్‌స్పెక్టర్ వెంకటేశ్వర్లు, షేక్.జానీ, కొండబత్తుల ఈశ్వర్, ప్రసాద్, కొండబత్తుల యాదగిరి, ఉపాధ్యాయులు వెంకటకృష్ణ, రజిత, రాంనర్సయ్య, ప్రసాద్ పాల్గొన్నారు.

ఆటో డ్రైవర్ల భిక్షాటన


హనుమకొండ చౌరస్తాలో భిక్షాటన చేస్తూ ర్యాలీగా వెళ్తున్న ఆటో కార్మికులు

హనుమకొండ స్పోర్ట్స్, జనవరి 3 : మహాలక్ష్మి పథకంలో భాగంగా ప్రభుత్వం మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం పథకాన్ని ప్రవేశపెట్టడంతో ఉపాధి కోల్పోయామని ఆటో డ్రైవర్‌లు భిక్షాటన చేసి నిరసన తెలిపారు. బుధవారం హనుమకొండ వేయి స్తంభాల ఆలయం నుంచి ఐక్య కార్యచరణ కమిటీ నాయకులు ఇసంపెల్లి సంజీవ ఆధ్వర్యంలో ఆటో డ్రైవర్లు హనుమకొండ చౌరస్తా వరకు ర్యాలీగా వెళ్లి భిక్షాటన చేస్తూ నిరసన తెలిపారు. అనంతరం సంజీవ మాట్లాడుతూ.. ప్రభుత్వం ప్రవేశపెట్టిన మహిళలకు ఉచిత బస్సు ప్రయాణంతో తాము జీవనోపాధి కోల్పోయి కుటుంబాలతో పాటు రోడ్డున పడాల్సిన పరిస్థితి ఏర్పడిందని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం ఆటో డ్రైవర్లను ఆదుకుని నెలకు రూ. 15000 జీవన భృతి అందించాలన్నారు. ఆటో కార్మికుల సంక్షేమం కోసం ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేసి ఆదుకోవాలని కోరారు.

ఆటో కార్మికుల సమస్యలు పరిష్కరించని పక్షంలో ఆటో కార్మికులు ఐక్యంగా ప్రభుత్వంపై ఒత్తిడి పెంచడంతో పాటు ఉద్యమాలు, ధర్నాలను ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఆటో కార్మికులు మడికొండ బాబు, కలకోట్ల జయరాం, పసునూరి బాబు, మంద శ్రీధర్‌రెడ్డి, కుమార్, బొల్లం సంజీవ, గుండా రమేష్, సాయిలు, శ్రీనివాస్, ఖాజాపాషా, మాషూక్, రాజు, హైమద్, పద్మరావు తదితరులు పాల్గొన్నారు.

గీత కార్మికుల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం

వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్. నాగరాజు


ఎమ్మెల్యే నాగరాజుకు వినతి పత్రం ఇస్తున్న గోపాల్‌పూర్ గీత కార్మికులు

వడ్డెపల్లి, జనవరి 3 : గీత కార్మికుల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యమని వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్. నాగరాజు అన్నారు. బుధవారం హనుమకొండ సుబేదారి ప్రాంతంలోని ఎమ్మెల్యే నివాసంలో గోపాల్‌పూర్ గీత పారిశ్రామిక సహకార సంఘం అధ్యక్షుడు చింత రమేష్ గౌడ్, కాంగ్రెస్ యూత్ అధ్యక్షుడు దూలం క్రాంతి కుమార్ గౌడ్ ఆధ్వర్యంలో ఎమ్మెల్యేను మర్యాదపూర్వకంగా కలిసి వినతి పత్రాన్ని సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రేటర్ వరంగల్ 56వ డివిజన్ గోపాల్‌పూర్‌లోని ఊర చెరువు ప్రాంతంలోని సుమారు వెయ్యి గజాల ప్రభుత్వ స్థలాన్ని గత వంద సంవత్సరాలుగా గోపాల్‌పూర్ గీత కార్మికులు శ్మశాన వాటిక కోసం వాడుకుంటూ దహన సంస్కారాలను నిర్వహిస్తున్నారన్నారు. ఏడాది కాలంగా తాము వాడుకుంటున్న శ్మశాన వాటిక స్థలాన్ని సీపీఎం నేతల ప్రోద్భలంతో కొందరు గుడిసెలు వేశారని తెలిపారు. గతంలో ఇదే స్థలంలో గుడిసెలు వేసుకోగా పోలీసుల సహకారంతో రెవెన్యూ అధికారులు తొలగించారని మళ్లీ ఇదే స్థలంలో గుడిసెలు వేసి తమ శ్మశాన వాటిక స్థలాన్ని ఆక్రమించుకుంటున్నారని తెలిపారు. గోపాల్‌పూర్ గీత కార్మికులకు కేటాయించిన శ్మశాన వాటిక స్థలాన్ని పరిరక్షించాలని ఎమ్మెల్యే నాగరాజుకు ఇచ్చిన పత్రంలో కోరారు. వినతి పత్రం సమర్పించిన వారిలో గోపాల్‌పూర్ మాజీ ఎంపీటీసీ దూలం రఘుపతిగౌడ్, మాజీ సర్పంచ్ దూలం సదానందం గౌడ్, గీత కార్మిక సంఘం నేతలు వల్లాల రాజ్‌కుమార్ గౌడ్, మాజీ డీసీపీ సుదర్శన్‌గౌడ్, అనిల్‌గౌడ్, శ్రీనివాస్, కార్తీక్‌గౌడ్ తదితరులు ఉన్నారు.

గురుకుల ప్రవేశాలకు దరఖాస్తుల స్వీకరణ

మరిపెడ, జనవరి 3 : మరిపెడ మునిసిపల్ కేంద్రంలోని నర్సింహులపేట ఎస్సీ బాలికల గురుకుల ప్రవేశాలకు 4వ తరగతి పాసైన విద్యార్థినుల నుంచి 5వ తరగతి ప్రవేశం కోసం ఆన్‌లైన్లో దరఖాస్తులను స్వీకరిస్తున్నట్లు ఆ గురుకుల ప్రిన్సిపాల్ సునీత తెలిపారు. బుధవారం ఆమె స్థానిక విలేకరులతో మాట్లాడారు. ఈ నెల 6వ తేదీలోపు అర్హులైన విద్యార్థినులు రూ.100 రుసం చెల్లించి ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని ఆమె కోరారు. ఫిబ్రవరి 11న ప్రవేశ పరీక్ష ఉంటుందన్నారు. ఈ అవకాశాన్ని నిరుపేద విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

కుమారుడితో వెళ్లిన మహిళ అదృశ్యం

మహబూబాబాద్ రూరల్, జనవరి 3 : మహబూబాబాద్ మండలంలోని కొత్త రెడ్యాల గ్రామానికి చెందిన భార్య మేకల అనిత కుమారుడు హర్షవర్ధన్ గత ఐదు రోజుల నుంచి కన్పించడం లేదని భర్త మేకల మల్లయ్య ఫిర్యాదు చేసినట్లు రూరల్ ఎస్సై దీపికరెడ్డి బుధవారం తెలిపారు. మల్లయ్య డిసెంబర్ 30న పక్క గ్రామమైన నర్సింహులగూడెంలో బంధువుల ఇంటికి శుభ కార్యక్రమానికి వెళ్లాడు. తిరిగి వచ్చేసరికి తన భార్య అనిత, తమ ఏడేళ్ల కుమారుడు కన్పించకపోవడంతో బంధువుల ఇళ్లలో వాకబు చేసినట్లు చెప్పారు. ఎక్కడా ఆచూకీ లభించకపోవడంతో రూరల్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు వివరించారు. మల్లయ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

బీసీ సంక్షేమ సంఘం ఉమ్మడి జిల్లా అధ్యక్షుడిగా రాజేష్


రాజేష్‌కు నియామక పత్రాన్ని అందిస్తున్న నరేందర్

గీసుగొండ, జనవరి 3: తెలంగాణ బీసీ సంక్షేమ సంఘం ఉమ్మడి వరంగల్ జిల్లా అధ్యక్షుడిగా 15వ డివిజన్ మొగిలిచర్ల గ్రామానికి చెందిన బరుపటి రాజేష్ ఎంపికయ్యారు. ఈ మేరకు రాకేష్‌కు నియామక పత్రాన్ని ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మేకపోతుల నరేందర్ హైదరాబాద్‌లో బుధవారం అందజేశారు. కాగా, తన ఎంపికకు సహకరించిన గీసుగొండ ఎంపీపీ, బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర మహిళా విభాగం అధ్యక్షురాలు భీమగాని సౌజన్యకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో పత్తిపాక తిరుపతి, బిల్లా రాజేష్, చింతం ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.

కాపువాడలో చోరీ

రూ. 3 లక్షల విలువైన ఆభరణాల అపహరణ

హనుమకొండ క్రైం, జనవరి 3 : హనుమకొండ పోలీసు స్టేషన్ పరిధిలోని కాపువాడలో దొంగలు హల్‌చల్ చేశారు. ఓ తాళం వేసిన ఇంట్లో చొరబడి అందిన కాడికి దోచుకెళ్లారు. హనుమకొండ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కాపువాడకు చెందిన బొల్లం వీరభద్రస్వామి రెండు రోజుల క్రితం కుటుంబ సభ్యులతో కలిసి వేములవాడ, కొండగట్టుకు విహార యాత్రకు వెళ్లాడు. తిరిగి మంగళవారం రాత్రి వచ్చి చూడగా ఇంటి తాళం పగులగొట్టి ఉంది. ఇంట్లోకి వెళ్లి చూడగా బీరువా పగులగొట్టి ఉంది. బీరువాతో వెతికి చూడగా బంగారం, వెండితో పాటు విలువైన వస్తువులు కనిపించకుండా పోయాయి. వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వడంతో క్లూస్ టీం, సీసీఎస్ పోలీసులు అక్కడకు చేరుకుని ఆధారాలు సేకరించారు. హనుమ కొండ పోలీసులు బాధితుల నుంచి ఫిర్యాదు స్వీకరించారు. సుమారు రూ. 3 లక్షల విలువైన సొత్తు గుర్తు తెలియని వ్యక్తులు ఎత్తుకెళ్లినట్టు పోలీసులు నిర్ధారించారు. నిందితుల కోసం గాలిస్తున్నట్టు పోలీసులు వెల్లడించారు.

ఇంటింటికీ శ్రీరామ అక్షింతల పంపిణీ



ఇందిర నగర్‌లో శోభాయాత్ర నిర్వహిస్తున్న శ్రీరామ భక్తులు

వడ్డేపల్లి, జనవరి 3: హనుమకొండ ఎన్జీవోస్ కాలనీ రోడ్డులోని శ్రీనగర్ కాలనీ, రాఘవేంద్ర నగర్ ఫేస్ -1, ఫేస్- 2తో పాటు ఇందిర నగర్‌లలో శ్రీరాముని భక్తులు బుధవారం నగర సంకీర్తన, శోభాయాత్రను కన్నుల పండువగా నిర్వహించారు. మేళ తాళాలతో, కుంకుమ భరణిలతో మహిళలు ఇంటింటికి వెళ్లి అయోధ్య రామమందిరం నుంచి వచ్చిన అక్షింతలను పంపిణీ చేశారు. శ్రీరాముని నామస్మరణతో కాలనీలు మార్మోగాయి. కార్యక్రమంలో రవీందర్‌రెడ్డి, కొత్త కనకయ్య, సులక్ష సంతోష్, పుల్లూరు అశోక్, సిరబోయిన అంజన్‌రావు పాల్గొన్నారు.

బీఆర్ఎస్‌కు కార్పొరేటర్ల గుడ్‌బై

(5వ పేజీ తరువాయి)

తెలియచేశారు. అనంతరం వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి నేతృత్వంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని కలిశారు. వీరితో ముఖ్యమంత్రితో భేటీ అయ్యారు. పార్టీలోకి చేరడం పట్ల ఆనందం వ్యక్తం చేస్తూ అభినందనలు తెలియచేశారు. తామంతా నిర్బంధాన్ని వీడామని, స్వేచ్ఛాయుత, ప్రజా సేవాభావ రాజకీయ ప్రపంచంలోకి చేరడం ఆనందంగా ఉందని బీఆర్ఎస్ కార్పొరేటర్లు, మాజీ కార్పొరేటర్లు తదితరులు తమ మనోగతాన్ని వెలిబుచ్చారు.

త్వరలో తూర్పు, వర్ధన్నపేట కార్పొరేటర్లు

బీఆర్ఎస్‌తో పాటు బీజేపీకి చెందిన పలువురు కార్పొరేటర్లు కాంగ్రెస్‌లోకి వచ్చేందుకు రెడీగా ఉన్నారు. పశ్చిమ కార్పొరేటర్లతో పాటే తూర్పు, వర్ధన్నపేట కార్పొరేటర్లు కూడా కాంగ్రెస్‌లో చేరేందుకు ప్రణాళికలు జరిగాయి. అయితే మంత్రి కొండా సురేఖ, మాజీ ఎమ్మెల్సీ, సీనియర్ నాయకుడు కొండా మురళి ఈ వ్యవహారాన్ని వాయిదా వేసినట్లు సమాచారం. అదను చూసి అధిక సంఖ్యలో బీఆర్ఎస్ కార్పొరేటర్లను కాంగ్రెస్‌లోకి ఆహ్వానించే వ్యూహంతో కొండా మురళి పావులు కదుపుతున్నట్లు సమాచారం. అదే విధంగా వర్ధన్నపేట కార్పొరేటర్లకు కూడా ఎమ్మెల్యే నాగరాజుతో కలిసి కొండా మురళి చేరికల వ్యూహాన్ని పన్నినట్లు సమాచారం.

స్పందించని కార్పొరేటర్లు

బీఆర్ఎస్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌తో పాటు వరంగల్ పశ్చిమ, తూర్పు మాజీ ఎమ్మెల్యేలు దాస్యం వినయ్‌భాస్కర్, నన్నపునేని నరేందర్, మేయర్ గుండు సుధారాణితో పాటు ఎమ్మెల్సీ బండా ప్రకాశ్ తదితరులు బీఆర్ఎస్ కార్పొరేటర్లను సంప్రదించి నిలువరించే ప్రయత్నాలు చేసినట్లు తెలిసింది. అయితే ఈ యత్నాలకు స్పందించకుండా మంగళవారం రాత్రే హైదరాబాద్‌లో బీఆర్ఎస్ కార్పొరేటర్లు, మాజీ కార్పొరేటర్లు మకాం వేసినట్లు తెలిసింది. బుధవారం ఉదయం కూడా బీఆర్ఎస్ నేతలకు టచ్‌లోకి రాకుండా, ఫోన్లు కూడా ఎత్తకుండా ఉన్నట్లు సమాచారం.

పాలిటెక్నిక్ కళాశాల పూర్వ విద్యార్థుల విరాళం

సుబేదారి, జనవరి 3: ఈద ఇనిస్టిట్యూట్ ఫర్ సివిక్ లీడర్ షిప్ ఫౌండేషన్ తరఫున పాలిటెక్నిక్ కళాశాలలోని తరగతి గదుల్లో విద్యార్థులు కూర్చోవడానికి డ్యూయెల్ డెస్క్ బెంచీల కొరకు కళాశాల పూర్వ విద్యార్థులు ఈద వాసుదేవరెడ్డి రూ.లక్ష, కట్ట మహిపాల్ రెడ్డి రూ.25వేలు విరాళంగా అందజేశారు. బుధవారం వరంగల్‌లోని పాలిటెక్నిక్ కళాశాలలో జరిగిన సమావేశంలో వారు కళాశాల ప్రిన్సిపాల్‌కు ఈ మొత్తాన్ని అందజేశారు. ఈ సందర్భంగా విరాళం అందచేసిన పూర్వ విద్యార్థులను ప్రిన్సిపాల్ డాక్టర్ బైరి ప్రభాకర్, వివిధ శాఖాధిపతులు హైదర్ అలీఖాన్, పి. శ్రీదేవి, జి. నగరాజ్ శేఖర్, ఎం. వెంకన్న, ఎ. రాజేశ్వర్‌లు సన్మానించి మెమొంటో అందజేశారు.

సీపీఐ నుంచి మాజీ కార్పొరేటర్ బహిష్కరణ

సుబేదారి, జనవరి 3 : హనుమకొండ కుమార్‌పల్లికి చెందిన సీపీఐ మాజీ కార్పొరేటర్ మంచాల స్వామిచరణ్‌ను పార్టీ నుంచి బహిష్కరిస్తున్నట్లు సీపీఐ జిల్లా కార్యదర్శి కర్రె భిక్షపతి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. గతంలో స్వామిచరణ్ సీపీఐ పార్టీ నుంచి కార్పొరేటర్‌గా గెలిచాడని, అయితే ఇటీవల పార్టీ క్రమశిక్షణ ఉల్లంఘించినందున పార్టీ జిల్లా నాయకత్వం మందలించినప్పటికీ ఎలాంటి మార్పు రాలేదని, దీనికితోడు గత సంవత్సరం నుంచి పార్టీ సభ్యత్వం తీసుకోకుండా పార్టీ వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడుతున్నందునే పార్టీ నుంచి బహిష్కరిస్తున్నట్టు భిక్షపతి ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

ఆరె సంక్షేమ సంఘం క్యాలెండర్ ఆవిష్కరణ

సుబేదారి, జనవరి 3: ఆరె సంక్షేమ సంఘం హనుమకొండ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో రూపొందించిన క్యాలెండర్‌ను బుధవారం బాలసముద్రంలోని ఆరె సంక్షేమ సంఘం భవనంలో ఆవిష్కరించారు. ముఖ్య అతిథిగా హాజరైన ఆరె సంక్షేమ సంఘం రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు నాగుర్ల వెంకటేశ్వర్లు, రాష్ట్ర అధ్యక్షుడు చెట్టుపల్లి శివాజీలు మాట్లాడుతూ.. సంఘం హనుమకొండ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో క్యాలెండర్‌ను ముద్రించి జిల్లాలోని ప్రతీ ఆరె కుటుంబానికి అందించడం గొప్ప విషయమన్నారు. ఈ క్యాలెండర్ ఆవిష్కరణ కార్యక్రమంలో ఆరె సంక్షేమ సంఘం రాష్ట్ర కన్వీనర్ జెండా రాజేష్, ప్రధాన కార్యదర్శి బలేరావు మనోహర్‌రావు, జిల్లా అధ్యక్షుడు హింగె శివాజీ, జిల్లా కమిటీ సభ్యులు కొల్లూరి కండేరావు, పేర్వాల లింగమూర్తి, వాడికారి బాబురావు, కుడ్లే మనోహర్‌రావు, లోనె దీపక్‌జీ, గురుజాల నిరంజన్ రావు, సిందె చందర్‌రావు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

సావిత్రిబాయి పూలే ఆశయాలను కొనసాగించాలి



కేయూలో జ్యోతిరావు పూలే విగ్రహానికి నివాళులర్పిస్తున్న వీసీ రమేశ్



ప్రభుత్వ విద్యా కళాశాలలో మాట్లాడుతున్న కార్పొరేటర్ గుజ్జుల వసంత మహేందర్‌రెడ్డి



ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలలో పూలే చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పిస్తున్న ప్రిన్సిపాల్

కేయూక్యాంపస్, జనవరి 3 : సావిత్రిబాయి పూలే జయంతి సందర్భంగా కేయూలో వీసీ ప్రొఫెసర్ తాటికొండ రమేశ్, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ టి.శ్రీనివాసరావు, సీడీసీ డీన్ ప్రొఫెసర్ వల్లూరిరామచంద్రం, పరీక్షల నియంత్రణాధికారి ప్రొఫెసర్ పి.మల్లారెడ్డి, కేయూ బీసీ సెల్ డైరెక్టర్ ఆకుతోట శ్రీనివాస్‌లు పూలే దంపతుల విగ్రహాలకు పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. బీసీ సెల్ కార్యాలయంలో సమావేశం ఏర్పాటు చేశారు. కాజీపేట ఏసీపీ డేవిడ్‌రాజ్, ఎన్డీఎల్‌సీఈ పీఆర్‌వో డాక్టర్ సంగాల ఎఫ్రామ్‌రాజ్, ఎన్డీఎల్‌సీ మాజీ డైరెక్టర్ ప్రొఫెసర్ జి.వీరన్ననాయక్, బొట్ల మనోహర్, తెలంగాణ బీసీ బహుజన సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ప్రతాపగిరి విజయ్‌కుమార్, మహిళా అధ్యక్షురాలు బయ్య పద్మావతి, దొడ్డిపాటి శేఖర్, బర్ల రాంమోహన్ హాజరైయారు.

వీజీ మహిళ కళాశాల ప్రిన్సిపాల్ జీబీఎస్ఎల్ సౌజన్య నేతృత్వంలో '21వ శతాబ్దం: పూలే ఆలోచన విధానం' అనే అంశంపై సమావేశం నిర్వహించగా వీసీ రమేశ్ ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు.

సుబేదారిలోని యూనివర్సిటీ న్యాయ కళాశాలలో సావిత్రి బాయి జయంతిని కళాశాల ప్రొఫెసర్ నిమ్మ సుదర్శన్ నేతృత్వంలో ఘనంగా నిర్వహించారు.

● కేయూక్యాంపస్ : కేయూ దూరవిద్య కేంద్రం ఆవరణలో మహాత్మా సావిత్రి బాయి పూలే జయంతిని పురస్కరించుకుని పూలే దంపతుల విగ్రహాలకు యూనివర్సిటీ డీన్ సీడీసీ ప్రొఫెసర్ వల్లూరి రామచంద్రం పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా కేయూ దూరవిద్య కేంద్రం ఎస్సీ, ఎస్టీ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు డాక్టర్ కొట్టెభాస్కర్ నేతృత్వంలో జరిగిన సమావేశంలో ప్రొఫెసర్ వల్లూరి రామచంద్రం ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. పూలే ఆశయాల సాధనకు అందరూ సమిష్టిగా కృషి చేయాలని పిలుపునిచ్చారు.

● హనుమకొండ రూరల్ : సావిత్రిబాయి పూలే జీవితాన్ని నేటి తరం మహిళలందరూ ఆదర్శంగా తీసుకోవాలని ప్రొఫెసర్ మారోజు స్వర్ణలత అన్నారు. బుధవారం లష్కర్‌బజార్‌లోని ప్రభుత్వ విద్యా కళాశాలలో బూర భిక్షపతి అధ్యక్షతన సావిత్రిబాయి పూలే జయంతిని ఘనంగా నిర్వహించారు. సాయిత్రిబాయి పూల చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో అభ్యుదయ రచయితల సంఘం నేతలు డాక్టర్ పల్లేరు వీరస్వామి, కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ ఆర్.విజయలక్ష్మీ, అధ్యాపకులు బూర విద్యాసాగర్, మార్క శంకర్ నారాయణ, డాక్టర్ శ్రీరంగస్వామి పాల్గొన్నారు.

గ్రేటర్ 59వ డివిజన్ సుబేదారిలోని ముస్లిం కమ్యూనిటీ హాలులో సావిత్రిబాయి పూలే జయంతిని నిర్వహించారు. సావిత్రిపూలే చిత్రపటానికి స్థానిక కార్పొరేటర్ గుజ్జుల వసంత మహేందర్‌రెడ్డి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించి మాట్లాడారు. కార్యక్రమంలో జిల్లా సంక్షేమ అధికారి కె.మధురిమ, ప్రొఫెసర్ కుమారస్వామి పాల్గొన్నారు.

● సుబేదారి : సావిత్రిబాయి పూలే భావితరాలకు ఆదర్శమని ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య బన్న ఐలయ్య అన్నారు. సుబేదారిలోని ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలలో బుధవారం సావిత్రిబాయి పూలే జయంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ ఐలయ్య సావిత్రిబాయి పూలే చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించి మాట్లాడారు. కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ ఆచార్య హనుమంతు, అంజన్‌రావు, డాక్టర్ కరుణాకర్, డాక్టర్ చిర్రరాజుతోపాటు కళాశాల విద్యార్థులు పాల్గొన్నారు.

● ఎల్బీ కళాశాలలో...

ములుగురోడ్‌లోని ఎల్బీ కళాశాలలో ఎన్సీసీ ఆర్మీ 10వ తెలంగాణ బెటాలియన్ ఆధ్వర్యంలో సావిత్రిబాయి పూలే జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎన్సీసీ విద్యార్థులు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ అరుణ డీహెచ్‌రావుకు పుష్పగుచ్ఛం అందజేసి శాలువతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో కెప్టెన్ డాక్టర్ ఎం. సదానందం, ఎన్సీసీ క్యాడెట్స్ విద్య, భాగ్యలక్ష్మి, హాసియా, నౌషీను, ఆనందిని పాల్గొన్నారు.

సామాజిక విప్లవ నేత సావిత్రిబాయి పూలే ప్రతి ఒక్కరికీ ఆదర్శమని ఐద్వా రాష్ట్ర సహాయ కార్యదర్శి రత్నమాల అన్నారు. ప్రజాతంత్ర మహిళా సంఘం వరంగల్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో హనుమకొండలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో బుధవారం నిర్వహించారు.

●వడ్డేపల్లి : తెలంగాణ రాష్ట్ర అంబేద్కర్ యువజన సంఘం, మాల పోరాట సమితి, చిరుతల విముక్తి పార్టీ ఆధ్వర్యంలో బుధవారం హనుమకొండలోని అంబేద్కర్ విగ్రహం వద్ద సావిత్రిబాయి పూలే జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. సావిత్రిబాయి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో అంబేద్కర్ యువజన సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు మిద్దెపాక ఎల్లయ్య, చిరుతల విముక్తి పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ జిలుకర శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

● ఐనవోలు : సావిత్రిబాయి పూలే జయంతి సందర్భంగా ఐనవోలు తెలంగాణ తల్లి సెంటర్‌లో ఆమె చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించి ఆమె సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో సామాజిక కార్యకర్త రాజారపు రాజ్‌కుమార్ ప్రజాప్రతి, బీసీ సంఘం రాష్ట్ర నాయకులు అమరవాది సారంగపాణి, కోట నర్సయ్య, అమరవాది రవి, ముదురుకొల రాజు, గూడ ఆగారెడ్డి, పట్టాపురం ఎల్లగౌడ్, శ్రీకాంత్, రమేష్, మల్లేశం, సాంబయ్య, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు. ఉడుతగూడెం ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో పూలే జయంతిని ఘనంగా నిర్వహించి ఆమె సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో విద్యా వారధి జిల్లా అధ్యక్షుడు సారయ్య, ఉపాధ్యాయులు మహేందర్‌రెడ్డి, లక్ష్మయ్య, మహేందర్, సీఆర్పీ రేవతి, సర్పంచ్ ఆరోగ్యం తదితరులు పాల్గొన్నారు

టెన్త్ ఫలితాల్లో జిల్లాను ప్రథమ స్థానంలో నిలపాలి

కలెక్టర్ సిక్తా పట్నాయక్



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ సిక్తా పట్నాయక్

హనుమకొండ రూరల్, జనవరి 3 : రానున్న పదవ తరగతి పబ్లిక్ పరీక్షల ఫలితాల్లో జిల్లాను ప్రథమస్థానంలో నిలిపేలా చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్ అన్నారు. బుధవారం కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాలులో అదనపు కలెక్టర్ రాధికా గుప్తా, జిల్లా విద్యాశాఖ అధికారి డాక్టర్ అబ్దుల్ హైలతో కలిసి సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ మార్చిలో నిర్వహించనున్న పరీక్షలకు విద్యార్థులను సిద్ధం చేయాలన్నారు. విద్యార్థులు ఒత్తిడి లేకుండా ప్రశాంత వాతావరణంలో పరీక్షలు రాసేలా చర్యలు చేపట్టాలని సూచించారు. విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటూ, కెరీర్ గైడెన్స్ ఇవ్వాలని తెలిపారు. విద్యార్థులకు అందించిన స్టడీ మెటీరియల్, ఉదయం, సాయంత్రం వేళల్లో నిర్వహిస్తున్న ప్రత్యేక తరగతుల గురించి సంబంధిత అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈ సమావేశంలో క్వాలిటీ కో ఆర్డినేటర్ ఎ.శ్రీనివాస్, విషయ నిపుణులు సంపతి, మహేశ్, సతీష్, ప్రకాశ్, శ్రీను ఆనంద్, బీసీ, ట్రైబల్, మైనార్టీ, సోషల్ వెల్ఫేర్, రెసిడెన్షియల్ పాఠశాలల ప్రిన్సిపాల్స్ పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి

సైబర్ క్రైం ఏసీపీ విజయ్‌కుమార్



సైబర్ నేరాల పట్ల అవగాహన కల్పిస్తున్న ఏసీపీ విజయ్‌కుమార్

హనుమకొండ క్రైం, జనవరి 3 :విద్యార్థులు సైబర్ నేరస్తులపై అప్రమత్తంగా, అవగాహన కలిగి ఉండాలని వరంగల్ కమిషనరేట్ సైబర్ క్రైం ఏసీపీ విజయ్‌కుమార్ సూచించారు. బుధవారం 'సైబర్ జాగ్రోక్త దివాస్ 'ను పురస్కరించుకుని హనుమకొండ భీమారంలోని శివాణి జూనియక్ కళాశాలలో సైబర్ నేరాల పట్ల అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేశారు. సైబర్ మోసాల పట్ల విద్యార్థులకు వివరించారు. ఈ సందర్భంగా విజయ్‌కుమార్ మాట్లాడారు. విద్యార్థి దశలోనే సైబర్ నేరాలు, చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని అన్నారు. మొబైల్ ఫోన్స్, ఈ మెయిల్స్‌కు వచ్చే మెస్సేజ్‌లకు స్పందించకూడదని అన్నారు. గుర్తు తెలియని వ్యక్తుల నుంచి వచ్చే సందేశాలను చూసి నమ్మవద్దని నమ్మితే మోసపోయినట్టేనని అన్నారు. ప్రస్తుతం క్రెడిట్ కార్డు, డెబిట్ కార్డుల పేరు మీద చాలా మోసాలు జరుగుతున్నాయని, విద్యార్థులు అప్రమత్తంగా ఉండాలన్నారు. ఏదైనా సైబర్ మోసం జరినప్పుడు 1930 లేదా 100 డయల్‌కు ఫోన్ చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో సైబర్ క్రైం ఇన్‌స్పెక్టర్ లక్ష్మీనారాయణ, కేయూ సీఐ అబ్బయ్య, ఎస్ఐ అజ్మీర సురేష్, కళాశాల సిబ్బంది పాల్గొన్నారు.

భూపాలపల్లి ఓఎస్డీగా అశోక్ కుమార్

కృష్ణకాలనీ (భూపాలపల్లి), జనవరి 3: జయశంకర్ భూపాలపల్లి జిల్లా పూర్తి స్థాయి ఓఎస్డీగా అశోక్ కుమార్ నియమితులయ్యారు. ఈమేరకు బుధవారం రాత్రి ఉత్తర్వులు జారీ అయ్యాయి. ములుగు జిల్లా పూర్తి స్థాయి ఓఎస్డీగా ఉన్న అశోక్ కుమార్ భూపాలపల్లి జిల్లా అదనపు బాధ్యతలు కూడా నిర్వర్తించారు. ప్రస్తుతం భూపాలపల్లి జిల్లాకు పూర్తి స్థాయి బాధ్యతలు స్వీకరించనున్నారు. దీంతోపాటు ములుగు జిల్లాకు అదనపు బాధ్యతలు నిర్వర్తించనున్నారు.

ములుగు ఎస్పీగా శబరీష్

ఆదిలాబాద్‌కు గాష్ ఆలం బదిలీ



ఎస్పీ శబరీష్

ములుగు, జనవరి 3 : ములుగు ఎస్పీగా పి.శబరీష్ నియమితులయ్యారు. 2017 బ్యాచ్‌కు చెందిన ఆయన్ను బదిలీ చేస్తూ ప్రభుత్వం బుధవారం ఉత్తర్వులు జారీ చేసింది. ఇక్కడ పని చేస్తున్న గాష్ ఆలం ఆదిలాబాద్ జిల్లాకు బదిలీ అయ్యారు. గత ఏడాది జనవరిలో గాష్ ఆలం ఎస్పీగా బాధ్యతలు చేపట్టారు. అంతకు ముందు ములుగు ఓఎస్డీగా, ఏటూరునాగారం ఏఎస్పీగా సేవలు అందించారు. మేడారం సమ్మక్క- సారలమ్మ మహాజాతరకు ముందు అనూహ్యంగా ఎస్పీ బదిలీ జరగడం చర్చనీయాంశంగా మారింది. 2022 జాతర నిర్వహణలో పనిచేసిన గాష్ ఆలంకు ఈ ప్రాంతంపై పూర్తి అవగాహన ఉంది. రాబోయే జాతర కోసం అధికార యంత్రాంగం సన్నద్ధమవుతున్న క్రమంలో ఆయనకు స్థానచలనం కలిగించడం ప్రాధాన్యతను సంతరించుకుంది. కొత్తగా ములుగు ఎస్పీగా బాధ్యతలు చేపట్టనున్న శబరీష్ తొలి పోస్టింగ్‌గా భద్రాద్రి కొత్తగూడెం జిల్లా మణుగూరు ఏఎస్పీగా బాధ్యతలు చేపట్టారు. అనంతరం ఖమ్మం కమిష నరేట్‌లో ఏసీపీగా విధులు నిర్వర్తించారు. ప్రస్తుతం మేడ్చల్ డీసీపీగా ఉన్న ఆయన ములుగు ఎస్పీగా బదిలీ అయ్యారు. ఎంబీబీఎస్ విద్యార్హత కలిగిన శబరీష్ ఐపీఎస్ పోలీస్ అధికారిగా కొనసాగుతుండటం విశేషం.

ఉద్యోగులు ప్రజల గుండెల్లో స్థానం పొందాలి

భీమదేవరపల్లి, జనవరి 3: బదిలీపై వెళ్తున్న ఉద్యోగులు ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిపోవాలని వంగర ఎస్ఐ వెంకటేశ్వర్లు అన్నా రు. వంగర పోలీస్ స్టేషన్లో ఆరు సంవత్సరాలుగా పనిచేస్తున్న హెడ్ కానిస్టేబుల్ మొగిలి, కానిస్టేబుల్ మోహన్‌లు వేలేరు పోలీస్ స్టేషన్‌కు ఇటీవల బదిలీ కాగా వారికి బుధవారం వీడ్కోలు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారిని ఎస్ఐ వెంకటేశ్వర్లు శాలువాతో సన్మానించి విధులు సక్రమంగా నిర్వహిస్తూ ఉన్నత శిఖరాలకు ఎదగాలని కోరారు. కార్యక్రమంలో ఏఎస్ఐ ప్రకాశ్, హెడ్ కానిస్టేబుల్ రమేష్ బా బు, సత్యనారాయణ, కానిస్టేబుళ్లు విద్యాసాగర్, కరుణాసాగర్, రమేష్, రాజేష్, భాస్క ర్, మహేందర్‌రెడ్డి, సురేష్, సాంబమూర్తి తదితరులు పాల్గొన్నారు.

మంగపేట ఎంపీడీవో మృతి



శ్రీధర్ (ఫైల్)

మంగపేట, జనవరి 3: మంగపేట ఎంపీడీవో కర్నాటి శ్రీధర్ (57) మృతి చెందారు. రెండు రోజుల క్రితం ప్రజాపాలనలో విధుల్లో ఉండగానే అస్వస్థతకు గురైన ఆయన చికిత్స పొంది డిశ్చార్జ్ అయ్యారు. బుధవారం తెల్లవారుజామున కన్నుమూశారు. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం... రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన ప్రజాపాలన కార్యక్రమానికి ఎంపీడీవో శ్రీధర్ హాజరవుతున్నారు. డిసెంబరు 30న మండలంలోని కత్తిగూడెంలో నిర్వహించిన ప్రజాపాలన కార్యక్రమంలో ఒక్కసారిగా ఆయన అస్వస్థతకు గురయ్యారు. దీంతో ఆయన్ను ఉద్యోగులు ఇంటికి చేర్చారు. ఇదే క్రమంలో 31న ఒళ్లు నొప్పులతోపాటు తీవ్ర జ్వరం రావడంతో మాజీ ఎంపీటీసీ మండవ రామకృష్ణ ఆయన్ను ఏటూరునాగారం సామాజిక ఆస్పత్రిలో చేర్పించారు. అనంతరం ములుగులోని ఏరియా ఆస్పత్రికి తీసుకెళ్లారు. ఆ తర్వాత మెరుగైన వైద్యం కోసం హనుమకొండలోని కార్పొరేట్ ఆస్పత్రిలో చేర్చారు. అక్కడ మూడురోజులపాటు వైద్యం పొంది డిశ్చార్జ్ అయిన ఎంపీడీవో బుధవారం తెల్లవారుజామున బాత్‌రూంలో ఒక్కసారిగా కుప్పకూలారు. గుండె నొప్పి వచ్చి తుదిశ్వాస విడిచారు. ఖమ్మం జిల్లా మధిరకు చెందిన శ్రీధర్ మంగపేట ఎంపీడీవోగా కొనసాగుతున్నారు. గతంలో వెంకటాపూర్ (రామప్ప) ఎంపీడీవోగా పనిచేశారు. ఆయనకు భార్య గీత, కూతురు ప్రియాంక ఉన్నారు. మంగపేటలోని అద్దె ఇంట్లో నివసిస్తున్నారు. కూతరు అమెరికాలో భర్త, ఇద్దరు పిల్లలతో ఉంటున్నారు. శ్రీధర్ మృతదేహాన్ని బంధువులు మధిరకు తరలించారు. కూతురు అమెరికా నుంచి రాగానే అక్కడే అంత్యక్రియలు జరగనున్నాయి. ఎంపీడీవో శ్రీధర్ మృతి పట్ల మంత్రి సీతక్క దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు.

పోలీస్‌స్టేషన్లు తనిఖీ చేసిన సీపీ

హనుమకొండ క్రైం, జనవరి 3: వరంగల్ పోలీసు కమిషనరేట్ వెస్ట్‌జోన్ పరిధిలోని నర్మెట, తరిగొప్పుల పోలీసు స్టేషన్‌లను వరంగల్ సీపీ అంబర్ కిశోర్ ఝా బుధవారం అకస్మికంగా తనిఖీ చేశారు. పోలీసు స్టేషన్‌లకు చేరుకుని అక్కడి పరిసరాలను పరిశీలించారు. సిబ్బంది పనితీరు, అధికారుల విధులపై అడిగి తెలుసుకున్నారు. రెండు ఠాణాలను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. తరిగొప్పుల పోలీసు స్టేషన్‌లో నమోదైన కేసుల వివరాలతో పాటు కేసుల స్థితి గతులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం శాంతిభద్రతల పరిరక్షణలో భాగంగా పోలీసు అధికారులు తీసుకోవలసిన జాగ్రత్తలపై సిబ్బందికి సూచించారు. ఈ తనిఖీలలో సీపీ వెంట డీసీపీ సీతారాం, జనగామ ఏసీపీ దేవేందర్‌రెడ్డి, నర్మెట సీఐ సాయిరమణ, జనగామ సీఐ శ్రీనివాస్‌రెడ్డిలతో పాటు సిబ్బంది ఉన్నారు.

మేయర్‌కు అధికారుల శుభాకాంక్షలు

జీడబ్ల్యూఎంసీ(హనుమకొండ సిటీ), జనవరి 3 : మేయర్ గుండు సుధారాణికి జీడబ్ల్యూఎంసీ అధికారులు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియచేశారు. బుధవారం హనుమకొండలోని బల్దియా ప్రధాన కార్యాలయంలోని మేయర్ ఛాంబర్‌లో ఆమెను కలిసి పూల మొక్కలు అందచేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో అదనపు కమిషనర్ అనిసూర్ రషీద్, ఎస్ఈలు క్రిష్ణారావు, ప్రవీణ్‌చంద్రా, పీఆర్‌వో అయూబ్ అలీ, కార్యదర్శి విజయలక్ష్మి తదితరులు ఉన్నారు.

26,838 అభయహస్తం దరఖాస్తుల స్వీకరణ

జీడబ్ల్యూఎంసీ(హనుమకొండ సిటీ), జనవరి 3 : ప్రజాపాలనలోని అభయ హస్తం దరఖాస్తుల స్వీకరణలో భాగంగా నగరంలోని 66 డివిజన్ల నుంచి బుధవారం 26838 దరఖాస్తుల స్వీకరణ జరిగింది. ఈ మేరకు జీడబ్ల్యూఎంసీ కమిషనర్ షేక్ రిజ్వాన్ బాషా అధికారికంగా తెలిపారు. ఈ నెల 6వ తేదీ వరకు దరఖాస్తుల స్వీకరణ ఉంటుందని పేర్కొన్నారు.

దీపాదాస్ మున్షిని కలిసిన అల్గిరెడ్డి ప్రవీణ్‌రెడ్డి

భీమదేవరపల్లి, జనవరి 3: తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ వ్యవహారాల ఇన్‌చార్జి దీపాదాస్ మున్షిని మాజీ ఎమ్మెల్యే, ముల్కనూర్ బ్యాంకు అధ్యక్షుడు అల్గిరెడ్డి ప్రవీణ్ రెడ్డి బుధవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సం దర్భంగా మున్షికి అల్గిరెడ్డి ప్రవీణ్ రెడ్డి పుష్పగుచ్ఛం అందజేసి సన్మానించా రు. అనంతరం నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు.

అంతా తారుమారు

నాడు కాంగ్రెస్ వీడిన కార్పొరేటర్లు నేడు మళ్లీ హస్తం గూటికి

అప్పుడు కాంగ్రెస్‌కు.... ఇప్పుడు బీఆర్ఎస్‌కు షాక్



హనుమకొండ సిటీ, జనవరి 3 : రాజకీయాలల్లో చిత్ర విచిత్రాలు చోటు చేసుకుంటుంటాయి. ఎప్పుడు ఏ నాయకులు ఏ పార్టీ మారుతాడో తెలియదు. జంప్ జిలానీలు....పార్టీకి బైబైలు....అంతా సిత్ర విచిత్రాలే. కాంగ్రెస్‌లో బుధవారం బీఆర్ఎస్‌కు చెందిన ఆరుగురు కార్పొరేటర్లు, మాజీ కార్పొరేటర్లు, ఇతర నాయకుల్లో అత్యధిక మంది ఒకప్పుడు కాంగ్రెస్‌కు చెందిన వారే. 2014లో బీఆర్ఎస్ అధికారంలోకి రావడం ఆ తదుపరి కొంత కాలం తదుపరి కాంగ్రెస్‌ను వీడి గులాబీ కండువాను కప్పేసుకున్నారు. ఇప్పుడు వారే మళ్లీ హస్తం గూటికి చేరడంతో గ్రేటర్‌లోని నగర వాసులు రాజకీయ సిత్రాలు, విచిత్రాలను నెమరేసుకుంటున్నారు.

చేయిని వీడి...తిరిగి చేరిన వారే

కాంగ్రెస్‌లో చేరిన బీఆర్ఎస్ కార్పొరేటర్లు, మాజీ కార్పొరేటర్లు ఇతర నేతల్లో మానస రాంప్రసాద్, చీకటి శారద, చీకటి ఆనంద్ మినహా అందరు గతంలో కాంగ్రెస్‌కు చెందిన వారే. తాడిశెట్టి విద్యాసాగర్ నగర కాంగ్రెస్ అధ్యక్షుడిగా, కార్పొరేటర్‌గా వ్యవహరించారు. వేముల శ్రీనివాస్, నెక్కొండ కిషన్, అబూబాకర్, మోహన్‌రావు ఇలా వీరంతా కాంగ్రెస్ కార్పొరేటర్లుగా ఉన్న వారే. వీరందరి బ్యాక్ గ్రౌండ్ కాంగ్రెస్ పార్టీయే. బీఆర్ఎస్ అధికారంలోకి రావడంతో కాంగ్రెస్‌ను వీడిన వారే. తాజాగా కాంగ్రెస్ అధికారంలోకి రావడంతో బీఆర్ఎస్‌ను వీడిన వారయ్యారు. వీరగంటి రవీందర్, నలుబోల సతీశ్ కూడా కాంగ్రెస్‌లోనే గతంలో నాయకులుగా ఉండి పార్టీని వీడి బీఆర్ఎస్‌లో చేరారు. ఇప్పుడు కాంగ్రెస్‌లో చేరారు.

నాడు అలా.. నేడు ఇలా..

కాంగ్రెస్ అధికారాన్ని కోల్పోయిన తదుపరి 2014 తరువాత బీఆర్ఎస్ నేతలు ఒక్కొక్కరుగా పార్టీని వీడారు. బీఆర్ఎస్‌లో చేరి కొందరు కార్పొరేటర్లుగా గెలిచిన వారే. మరి కొందరు పార్టీ పదవులను అనుభవించిన వారు ఉన్నారు. వీరంతా తాజాగా కాంగ్రెస్‌లో చేరారు. విచిత్రమేమిటంటే నాడు జిల్లా అధ్యక్షుడిగా ఉన్న నాయిని రాజేందర్‌రెడ్డి వీరిని కాపాడుకునేందుకు విశ్వయత్నాలు చేశారు. పార్టీని వీడొద్దంటూ కోరారు. కానీ నేతలు ఒక్కొక్కరుగా పార్టీని వీడడంతో కాంగ్రెస్ ఖాళీ అవుతూ వచ్చింది. గడిచిన రెండు పర్యాయాల గ్రేటర్ ఎన్నికల్లో సైతం కాంగ్రెస్ కోలుకోలేదు. కాలచక్రం గిర్రున తిరిగింది....నాడు అధ్యక్షుడిగా పార్టీని వీడొద్దని కోరిన నాయిని రాజేందర్‌రెడ్డి ఎమ్మెల్యే అయ్యారు...కాంగ్రెస్ అధికారంలోకి వచ్చింది... చేయిచ్చిన నాటి నేతలే నాయిని రాజేందర్‌రెడ్డి ఆధ్వర్యంలో కాంగ్రెస్‌లోకి వచ్చారు. అప్పుడు కాంగ్రెస్ వీడి బీఆర్ఎస్‌లోకి చేర్పించడంలో నాటి రాష్ట్ర చీఫ్ విప్, వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే దాస్యం వినయ్‌భాస్కర్ నాయిని స్థానంలోకి వచ్చారు...నాడు నాయినిని వీడిన వారే....నేడు వినయ్‌భాస్కర్‌ను వీడారు.

కౌన్సెలింగ్



ఈ సమస్యతో గర్భం దాల్చేదెలా?

Q A

నాకు పి.సి.ఓ.డి (పాలీసిస్టిక్ ఓవేరియన్ సిండ్రోమ్) సమస్య ఉంది. గర్భం దాల్చడానికి చేస్తున్న ప్రయత్నాలేవీ ఫలించడం లేదు. నా సమస్య తీరేదెలా?

(ఓ సోదరి, విశాఖపట్నం)

పి.సి.ఓ.డి మహిళలను శారీరకంగా, మానసికంగా కుంగదీసే సమస్య. ఈ సమస్యతో వచ్చే ఇన్‌ఫర్టిలిటీని సమర్థంగా అధిగమించాలంటే అందుకు అన్ని విధాలుగా సంసిద్ధులు కావాలి. శరీరంలో అవకతవకలకు గురయ్యే హార్మోన్ల ప్రభావం మూలంగా నెలసరి క్రమం తప్పి గర్భధారణకు తగిన సమయాన్ని కనిపెట్టనివ్వని పరిస్థితి తలెత్తుతుంది. ఇలాంటప్పుడు ధైర్యం కోల్పోకుండా వైద్యులను కలవడంతోపాటు కొన్ని జాగ్రత్తలు పాటించాలి. అవేంటంటే....

- వ్యాధి నిర్ధారణ సక్రమంగా జరిగే పరీక్షలను వైద్యులు సూచిస్తున్నారో లేదో తెలుసుకోవాలి.
- ఇన్సులిన్ రెసిస్టెన్స్‌తోపాటు శరీర బరువు పెరగకుండా చూసుకోవాలి. ఈస్ట్రోజెన్ మెటాబాలిజంను పెంచే ఆహారం తీసుకోవాలి.
- సమర్థమైన మందులతో హార్మోన్లు సక్రమంగా, సమంగా స్రవించేలా, క్రమం తప్పక అండం విడుదలయ్యేలా చూసుకోవాలి.

డాక్టర్ షర్మిలా మజుందార్
సెక్సాలజిస్ట్ అండ్ సైకో అనలిస్ట్, email: mili77@gmail.com

కొవ్వు తగ్గుతుంది!

సీజనల్ ఫ్రూట్స్‌లో ద్రాక్ష కథే వేరు. ఈ తీపి ద్రాక్ష కేలరీల గని. అధికంగా న్యూట్రిన్లు ఉంటాయి. కప్పు ద్రాక్షలో 151 గ్రాముల న్యూట్రిన్లు ఉంటాయి. శక్తితో పాటు ఆరోగ్యాన్నిచ్చే ద్రాక్ష ఉపయోగాలంటే తెలుసుకుందాం..

- ద్రాక్ష తినటం వల్ల ఇందులోని పొటాషియం రక్తపోటును అదుపు చేస్తుంది. తద్వారా గుండె సమస్యలు వచ్చే అవకాశాలు తక్కువ ఉందని ఎన్నో అధ్యయనాల్లో తేలింది.
- కొవ్వుశాతాన్ని తగ్గించటంలో ద్రాక్ష పాత్ర అధికం. ఒక అధ్యయనం కోసం 69 మందిని ఎనిమిది వారాల పాటు ప్రతిరోజూ ఆహారంతో పాటు అరకేజీ ద్రాక్షను తినిపించారు. దీనివల్ల చెడు కొలెస్ట్రాల్ కరిగిపోయాయి. అందుకే ద్రాక్ష డైట్‌లో ఉంటే బరువు తగ్గవచ్చు.
- ఈ పండ్లు తినటం వల్ల మూడ్ స్వింగ్స్ ఉండవు. చురుగ్గా ఉంటారు. ముఖ్యంగా మెదడు ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తుంది ద్రాక్ష.
- పొటాషియం, మాంగనీసు, విటమిన్-కె ఉండటం వల్ల ఎముకల ధృడత్వానికి కూడా మంచిది.



- ఈ తియ్యని ద్రాక్ష తినటం వల్ల శరీరానికే కాదు జుట్టుకు మంచి చేకూరుతుంది. చర్మం మీద ఉండే మంటలు, వాతలు లాంటివి తగ్గిపోతాయి. గాయాలు త్వరగా మానిపోతాయి. దీంతో పాటు జుట్టు పెరుగుదల ఉంటుంది.
- ద్రాక్ష తినకపోతే పిల్లలకు జ్యూస్ చేసి ఇవ్వొచ్చు. లేదా సలాడ్స్ చేసి తినిపించవచ్చు.

చలికాలంలో హాయిగా..!

చలికాలం పెంపుడు జంతువులనూ బాగా ఇబ్బంది పెడుతుంది. ఈ కాలంలో పెట్ డాగ్స్‌కు వచ్చే అలర్జీలను అరికట్టాలంటే యజమానులు ఈ టిప్స్ పాటిస్తే సరి..

- ఇంట్లోని పెంపుడు జంతువు ఆటోమేటిక్‌గా తనంతకు తానే చలికాలంలో రక్షించుకోగలదు. వాటిపై చర్మం, జుట్టు తగినట్లు మారుతుంది. అయినప్పటికీ చలికాలంలో ఉష్ణోగ్రత అమాంతం పడిపోతే.. వాటి షెడ్స్‌లో కాస్త వెచ్చగా ఉంచాలి. దీనికోసం హీటర్స్ ఉండాలి. షెడ్స్‌లో నీళ్లు, కింద పడిన ఆహారం, చెత్త ఉండకుండా చేయాలి.
- ముఖ్యంగా వీటి జుట్టుపై చుండ్రు పేరుకుపోకుండా ఎప్పుడూ శుభ్రంగా ఉండేట్లు జాగ్రత్తపడాలి.
- పెట్స్‌పై జుట్టు ఎక్కువగా ఉంటే చలికాలంలో వెచ్చగా ఉంటుందిలే అని మాత్రం వదిలేయకూడదు. ఎందుకంటే జుట్టులో బాక్టీరియా వచ్చి అలర్జీలు వచ్చే అవకాశాలెక్కువ. అందుకే రెగ్యులర్ గ్రూమింగ్ అవసరం. దీని వల్ల ఇరిటేషన్ అయ్యే అవకాశాలు తక్కువగా ఉంటాయి.
- పెట్స్ సెన్సిటివ్‌గా ఉంటాయి. ఇంట్లో తిరిగే ప్రాంతమే కాకుండా నిద్రపోయే బెడ్స్, అవి తిరిగే ప్రాంతాలైన కుర్చీలు, సోఫాలను శుభ్రంగా ఉంచుకోవాలి. దగ్గడం, కంటినుంచి నీళ్లు కారటం లాంటి సమస్యలు చలికాలంలో డస్ట్ వల్ల ఎక్కువగా వస్తుంటాయి. అందుకే పెట్ డాగ్ షెడ్ లేదా నిద్రపోయే ప్రాంతంలో దుమ్ముపడకుండా చూసుకోవాలి.
- పిల్లలతో పెట్స్ ఆడుకోవటం, ఎగిరి దుమకడం.. లాంటివి చేస్తుంటాయి. ఆడుకున్న తర్వాత పెట్స్‌ను వెచ్చని నీటితో శుభ్రం చేయాలి. వాటి చెవులు, కాళ్ల దగ్గర పొడి బట్టతో శుభ్రం చేయాలి.



ఆర్టిస్టులు ఎంతో మంది ఉంటారు. కానీ ఆ అభిరుచిని ఒక లక్ష్యంతో ముడిపెట్టేవాళ్లు ఎంతో అరుదు. 21 ఏళ్ల ఆర్టిస్ట్ శ్రీజ కనుమూరి సింగపూర్‌లోని భారత హైకమిషన్‌కు అద్భుతమైన మ్యూరల్‌ను అందించి గుర్తింపు పొందింది. అంతరించిపోతున్న భారతీయ సంప్రదాయాలకూ, మరుగున పడిపోతున్న కళాకారులకూ తగిన గుర్తింపు తీసుకురావడమే తన లక్ష్యం అంటున్న శ్రీజ 'నవ్య'తో పంచుకున్న కబుర్లివి.

విభిన్నం



బొమ్మల్లో భారతీయం

ఏ రంగంలో స్థిరపడతామో ఎవరం ఊహించలేం. నా విషయంలో కూడా అదే జరిగింది. చిన్నప్పుడు రకరకాల అభిరుచులు అలవడతాయి. నేను కూడా బొమ్మలు గీసేదాన్ని, క్రాఫ్ట్ వర్క్స్ తయారు చేసేదాన్ని. పదేళ్ల పాటు కూచిపూడి నేర్చుకున్నాను. 2019లో కూచిపూడి రంగ ప్రవేశం చేశాను. ఇలా అన్ని అభిరుచుల్లో అంతిమంగా నాకు ఆనందాన్నిచ్చేది ఆర్ట్ అనే విషయాన్ని గ్రహించాను. అలా అభిరుచి కాస్తా ఆసక్తిగా మారి,
ఫైన్‌ఆర్ట్స్ చదవాలని నిర్ణయించుకున్నాను. ఆర్ట్ పట్ల ఆసక్తి ఉన్నవాళ్లకు ఫైన్ ఆర్ట్స్ అనేది సరైన పునాది లాంటిది. దీన్లో అన్ని రకాల మీడియమ్స్ ఉంటాయి కాబట్టి, భిన్నమైన ప్రయోగాలకూ, ఎవరికి తగిన మీడియంను వాళ్లు ఎంచుకోడానికి విస్తృత అవకాశాలుంటాయి. ప్రత్యేకించి నేను పెన్సిల్, గ్రాఫైట్, చార్కోల్ వర్క్స్ ఎక్కువగా చేస్తాను. ఇటీవలే వీడియోగ్రఫీ, ఇన్‌స్టలేషన్స్‌ను కూడా ఎక్స్‌ప్లోర్ చేశాను.



సింగపూర్‌లో ఫైన్‌ఆర్ట్స్

2018-19... సమయంలో మన దేశంలో ఉన్న ఫైన్ ఆర్ట్స్ యూనివర్శిటీలకు ప్రపంచవ్యాప్త గుర్తింపు లేదు. పైగా ఆర్ట్ ఇండస్ట్రీ కూడా ఇంకా అభివృద్ధి దశలోనే ఉండిపోయింది. దాంతో నేను యుఎస్, సింగపూర్‌లో ఫైన్ ఆర్ట్స్ అకాడమీలకు అప్లై చేశాను. యుఎస్‌లో కూడా నాకు సీటొచ్చింది. కానీ కొవిడ్ కారణంగా అక్కడకు వెళ్లలేక, సింగపూర్‌ను ఎంచుకోవలసి వచ్చింది. అలా 2020లో సింగపూర్ చేరుకుని, అక్కడి నాన్యన్ అకాడమీ ఆఫ్ ఫైన్ ఆర్ట్స్‌లో మూడేళ్ల ఫైన్ ఆర్ట్స్ చేశాను. చివరి ఏడాదిలో నా థీసిస్ టాపిక్ కోసం ముగ్గును ఎంచుకున్నాను. ఇంటి ముందు వేసే ముగ్గుతో మనం మన కుటుంబానికి ఎంత దగ్గరవుతున్నామో చెప్పడం నా థీసిస్ ఉద్దేశం.



సింగపూర్ హైకమిషన్ కోసం...

ఆర్టిస్టుగా ఎదగడానికి ఫైన్ ఆర్ట్స్ ఒక్కటే సరిపోదు. పని చేసిన అనుభవం కూడా సంపాదించాలి. అందుకోసం సింగపూర్‌లోని ఒక ఆర్ట్ గ్యాలరీ మ్యానేజర్ ఉద్యోగానికి అప్లై చేసి, ఎంపికయ్యాను. అలా 2020లో సింగపూర్‌లో గ్యాలరీ మ్యానేజర్‌గా పని చేస్తున్న సమయంలో భారత హైకమిషన్ నన్ను సంప్రతించింది. హైకమిషన్‌లో శాశ్వత కలెక్షన్‌లో భాగంగా ఒక పెద్ద మ్యూరల్‌ను రూపొందించి ఇవ్వమని వాళ్లు నన్ను అడిగారు. భారత దేశం స్వాతంత్ర్యం సాధించి 75 ఏళ్లు పూర్తి చేసుకుని, ఆజాదీ కా అమృత్ మహోత్సవ్‌ను జరుపుకుంటున్న సందర్భంగా, వాళ్లు ఒక పెద్ద మ్యూరల్‌ను ఏర్పాటు చేయాలనుకున్నారు. కాబట్టి, గ్యాలరీకి వచ్చి నన్ను సంప్రతించడం, నాతో పాటు మరొక 75మంది ఆరిస్టులతో కలిసి ఆ మ్యూరల్‌ను రూపొందించాలని నిర్ణయించుకోవడం జరిగిపోయింది. ఆ ప్రాజెక్టుకు నేను ప్రాజెక్ట్ మ్యానేజర్‌గా కూడా పని చేశాను. అయితే మ్యూరల్‌ను పూర్తి చేయడం కంటే, అందు కోసం 75 మంది భిన్న ఆర్టిస్టులతో కలిసి పని చేయడం ఎంతో ఛాలెంజింగ్‌గా అనిపించింది. వాళ్లందరూ ఇచ్చిన భిన్నమైన పెయింటింగ్స్ అన్నిటినీ ఒక దగ్గరకు చేర్చి, ఆకట్టుకునే ఒక భారీ మ్యూరల్‌ను డిజైన్ చేయడానికే ఎక్కువ శ్రమపడవలసి వచ్చింది. ఈ మ్యూరల్ కోసం భారతీయత ఉట్టిపడే పెయింటింగ్స్‌ను గీయాలని నిర్ణయించుకున్నాం. స్వాతంత్ర్య సమరయోధులు, పండగలు, సంప్రదాయాలు... ఇలా ఎన్నో అంశాలను ఆర్టిస్టులు ఎంచుకున్నారు. నేను నా వంతుగా, భారతీయ జానపద కళలు అనే అంశాన్ని నా పెయింటింగ్ కోసం ఎంచుకున్నాను. ఆ భారీ మ్యూరల్ ఇనాగరేషన్ సమయంలో మన దేశంతో పాటు వివిధ దేశాల్లో స్థిరపడిన 75 మంది కళాకారులందరూ కలుసుకోవడం



జీవితంలో మర్చిపోలేని అనుభవం. ఆ సందర్భంగా హైకమిషన్ కళాకారులందరికీ సర్టిఫికెట్లను అందించారు.

భారతీయతే సర్వస్వం

సంస్కృతిలోని చిన్న చిన్న అంశాలు నిర్లక్ష్యానికి గురవుతూ ఉంటాయి. ఫైన్ ఆర్ట్స్ చివరి ఏడాది థీసిస్‌కు నేను ముగ్గును ఎంచుకోడానికి కారణమిదే! ముగ్గులు వేసే సంప్రదాయం క్రమేపీ కనుమరుగైపోతోంది. అలా మరుగున పడిపోతున్న అంశాలను స్పృశించడాన్ని నేనెంతో ఎంజాయ్ చేస్తాను. అలాగే మన దేశంలో ఎంతోమంది జానపద కళాకారులు, ట్రైబల్ ఆర్టిస్టులు ఉన్నారు. వాళ్లందరి పెయింటింగ్స్‌తో ఒక ఎగ్జిబిషన్ చేయాలనే ఆలోచన ఉంది. అలాగే తగిన సదుపాయాలు లేక, వనరులు లేక ఎంతోమంది గ్రామీణ కళాకారులు తగిన గుర్తింపునకు నోచుకోలేకపోతున్నారు. ఒక క్యురేటర్‌గా వాళ్లను గుర్తించి, ప్రోత్సహించి, వాళ్ల పెయింటింగ్స్‌కు ఒక వేదికను ఏర్పాటు చేయాలని కూడా ఉంది.

మాది హైదరాబాదే! ఇక్కడే పుట్టి పెరిగాను. నాన్న పేరు సోమరాజు, ఎలక్ట్రికల్ పవర్ డిస్ట్రిబ్యూషన్ అండ్ రూరల్ ఎలెక్ట్రిఫికేషన్ వ్యాపారి. అమ్మ పేరు సౌజన్య. నాకు క్యురేషన్, ఆర్ట్ మేనేజ్‌మెంట్ అంటే ఇష్టం. కాబట్టి మాస్టర్స్ పూర్తి చేసి ఆర్ట్ క్యురేటర్‌గా స్థిరపడాలని లక్ష్యంగా పెట్టుకున్నాను. ప్రస్తుతం అందుకు సంబంధించిన ప్రాజెక్టులు చేస్తున్నాను.

మర్చిపోలేని అనుభవం

సింగపూర్‌లో ఆర్ట్ టీచర్‌గా పని చేసిన సమయంలో మానసిక పరిణతి లేని పిల్లలకు బొమ్మలు గీయడం నేర్పించాను. ఆ సమయంలో తీవ్రమైన మానసిక వైకల్యం కలిగి ఉన్న ఒక బాబు నన్నెంతో ఆకట్టుకున్నాడు. పెన్సిల్ పట్టుకోవడం కూడా చేతకాని ఆ బాబు చేత కొంతమేరకు బొమ్మలు గీయించగలిగాను. ఆ బాబుకు టీచర్‌గా వ్యవహరించిన ఆరు నెలల కాలంలోనే ఆ బాబు పాటలకు స్పందిస్తున్న విషయాన్ని గ్రహించాను. ఆర్ట్ అనేది ఒక థెరపీగా ఉపయోగపడి, బాబులో కొంత మార్పును తీసుకొచ్చింది. ఆ మార్పును గ్రహించిన బాబు తల్లితండ్రులు ఎంతో సంతృప్తినీ, సంతోషాన్నీ వ్యక్తం చేశారు. ఆ అనుభవాన్ని నేనెప్పటికీ మర్చిపోలేను.

● గోగుమళ్ల కవిత

సెలబ్ ఫిట్

నయా నేషనల్ క్రష్



'జోయా'... బాగా తెలిసిన పేరులా ఉంది కదూ. ఇటీవల విడుదలైన 'యానిమల్' చిత్రంలోని పాత్ర పేరు అది. అందులో అంతగా ఒదిగిపోయి... ఒక్కసారిగా దేశంలోని సినీ ప్రేమికులందరికీ దగ్గరైంది తృప్తి డిమ్రీ. రణబీర్‌తో నటించిన రసరమ్యమైన సన్నివేశాలు... తృప్తిని నయా 'నేషనల్ క్రష్'గా మార్చేశాయి. ఇప్పుడు ఆమె సొగ'సిరుల' రహస్యాన్ని ఛేదించేందుకు సెర్చ్‌ఇంజన్స్‌లో తెగ శోధిస్తోంది నవతరం.

ఏడెనిమిదేళ్ల కిందట 'పోస్టర్ బాయ్స్'తో ప్రారంభమైంది తృప్తి కెరీర్. ఆమె చిత్రాల్లో థియేటర్‌లో కంటే ఓటీటీలో విడుదలైనవే ఎక్కువ. కానీ 'యానిమల్' తృప్తికి మంచి బ్రేక్ ఇచ్చింది. అప్పటి వరకు ఏ కొద్దిమందికో తెలిసిన ఆమె పేరు... ఆ తరువాత నుంచి దేశవ్యాప్తంగా వినిపించడం మొదలైంది. సామాజిక మాధ్యమాల్లో అభిమానులు అమాంతం పెరిగిపోయారు. ఇన్‌స్టాలో దాదాపు అర కోటి మంది తృప్తిని ఫాలో అవుతున్నారు. ట్విటర్ తదితర వేదికల్లో ఫాలోయింగ్ దీనికి అదనం. రణబీర్‌తో పండించిన సన్నివేశాలకు అదే స్థాయిలో విమర్శలు కూడా ఎదుర్కోవాల్సి వచ్చింది. 'ఆ విమర్శలు తొలుత నన్ను బాగా కలవర పెట్టాయి. ఎందుకంటే గతంలో ఎప్పుడూ నాకు ఇలాంటి అనుభవం ఎదురవలేదు. శృంగార సన్నివేశాలు తీస్తున్నప్పుడు నేను, రణబీర్, దర్శకుడు, కెమెరామన్ మాత్రమే సెట్‌లో ఉన్నాం. నాకు ఏ ఇబ్బందీ కలగకుండా వారు చూసుకున్నారు. నాకు అసౌకర్యంగా లేనప్పుడు, నేను చేస్తున్నది తప్పు కాదని నమ్మినప్పుడు... ఎవరో ఏదో అన్నారని పట్టించుకోవాల్సిన అవసరం లేదనేది నా అభిప్రాయం' అంటున్న తృప్తి పుట్టి పెరిగిన ప్రాంతం ఉత్తరాఖండ్‌లోని గడవాల్.

కొన్నేళ్ల తరువాత ఆమె కుటుంబం ఉత్తరప్రదేశ్ ఘజియాబాద్‌కు మారింది. అక్కడి 'ఢిల్లీ పబ్లిక్ స్కూల్'లో పాఠశాల విద్యాభ్యాసం పూర్తి చేసింది. ఆ తరువాత ఢిల్లీలోని 'శ్రీ అరబిందో కాలేజీ' నుంచి సైకాలజీలో డిగ్రీ పట్టా పొందింది. మరి నటి కావాలన్న కోరిక తనకు ఎప్పుడు కలిగింది? 'చదువులో ఎప్పుడూ నేను వెనకే. కనుక జీవితంలో స్థిరపడాలంటే చదువుతో సంబంధం లేకుండా వేరే ఏదన్నా చేయాలనే స్పష్టత చిన్నప్పుడే వచ్చింది. కానీ అది ఏంటనేది తెలియదు. అయితే నేను ప్రయాణించాల్సిన మార్గం నిదానంగా నిర్మితమైంది... అదీ నా ప్రమేయం లేకుండానే. ఎలాగంటే... మా సోదరుడి స్నేహితుడు ఒకరు ఫొటోగ్రాఫర్. నన్ను చూసి ఒక రోజు తనే అన్నాడు... 'టెస్ట్ ఫొటో షూట్ చేద్దాం' అని. షూట్ అయిపోయింది. అతనే నా ఫొటోలను ఎవరికో పంపించాడు. ఇక అక్కడి నుంచి అవకాశాలు మొదలయ్యాయి. తొలుత ప్రింట్ షూట్స్ చేశాను. ఆ షూట్స్ చూసి ఆడిషన్స్‌కు రమ్మని కాల్స్ వెల్లువెత్తాయి. క్రమంగా నటనతో ప్రేమలో పడ్డాను. అప్పుడు అనుకున్నాను... నటనే నా కెరీర్ అని' అంటున్న తృప్తి పుణేలోని 'ఫిలిమ్ అండ్ టెలివిజన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఇండియా'లో శిక్షణ తీసుకుంది. రెండు మూడు సినిమాల్లో నటించాక కూడా తనపై తనకు నమ్మకం ఉండేది కాదట. ఎప్పుడైతే భిన్న వర్గాల నుంచి ప్రశంసలు అందాయో అప్పటి నుంచి ఆత్మవిశ్వాసంతో అడుగులు వేస్తున్నట్టు ఓ సందర్భంలో చెప్పింది. రెండు చిత్రాలు... తరువాత రెండేళ్ల పాటు ఎలాంటి అవకాశాలూ ఆమెకు రాలేదు. ఆ సమయంలో పరిశ్రమలో కొనసాగాలా... వద్దా? ఒకవేళ వద్దనుకొంటే ఏంచేయాలి? ఎటూ పాలుపోక తనలో తాను ఎంతో సంఘర్షణకు గురైనట్లు ఓ సందర్భంలో తృప్తి చెప్పుకొచ్చింది. ఇలాంటి కఠిన పరిస్థితుల్లో తనను మానసికంగా, శారీరకంగా దృఢంగా ఉంచింది క్రమశిక్షణ గల జీవనశైలి మాత్రమేనంటోంది. దాని కోసం వ్యాయామాన్ని దినచర్యగా మార్చుకుంది.

వర్కవుట్ ఇలా...

తృప్తి వర్కవుట్ ప్రణాళికలో వ్యాయామాలు, ధ్యానం మిళితమై ఉంటాయి. వ్యాయామాలు శారీరక దృఢత్వాన్ని ఇస్తే... ధ్యానం మానసిక ప్రశాంతతను, ఆత్మవిశ్వాసాన్ని ఇస్తుంది. ఎంత పని ఒత్తిడి ఉన్నా వారంలో కనీసం ఐదు రోజులు జిమ్‌కు వెళుతుంది. అదనపు కేలరీలు కరిగించడానికి ఎక్కువ సమయం కేటాయిస్తుంది.

- ఆమె ఫిట్‌నెస్ మంత్రాలో యోగా కూడా భాగం. ఎంతో క్లిష్టమైన ఆసనాలను సునాయాసంగా వేసేయగలదు.
- హృదయసంబంధిత వ్యవస్థ బాగా పని చేయడానికి తృప్తి ప్రధానంగా ఎంచుకున్న మార్గం డ్యాన్స్. తను మంచి డ్యాన్సర్ కూడా. ఆమె 'లైలా మజ్నా' చూసినవారు తృప్తి డ్యాన్స్‌కు ఫిదా అయిపోయారు.
- డ్యాన్స్‌తో పాటు ట్రెడ్‌మిల్ తదితర కార్డియోకు అరగంట కేటాయిస్తుంది.
- వీటన్నిటితోపాటు శారీరక సామర్థ్యం, శక్తిని పెంచుకోవడానికి తృప్తి తరచూ ట్రెక్కింగ్‌కు వెళుతుంది. అది తనకు ఆహ్లాదంతో పాటు ఆస్వాదనం కూడా ఇస్తుందంటుంది.



ఇదీ మెనూ...

- శరీరం డీహైడ్రేషన్‌కు గురి కాకుండా ఉండేందుకు... ఉదయం లేవగానే రెండు పెద్ద గ్లాసుల గోరువెచ్చటి నీళ్లు, గ్రీన్ టీ తీసుకొంటుంది. ఫిట్‌నెస్‌కు, ఆరోగ్యవంతమైన చర్మానికి హైడ్రేషన్ చాలా ముఖ్యం.
- రోజులో మనం తీసుకొనే ఆహారంలో బ్రేక్‌ఫాస్ట్ ముఖ్యమైనదంటారు న్యూట్రిషనిస్టులు. దాన్ని దృష్టిలో ఉంచుకున్న తృప్తి... ఉదయం తన మెనూలో బలవర్ధకమైన అల్పాహారం ఉండేలా చూసుకొంటుంది. వీట్ బ్రెడ్, పండ్లు, ఓట్స్, కిస్మిస్, నట్స్‌తో ఒక గ్లాస్ బాదంపాలు. ఇవి శరీరానికి అవసరమైన శక్తినిస్తాయి.
- మధ్యాహ్నం లంచ్‌లో అన్నం, పప్పు, వెజిటబుల్ కర్రీ, పెరుగు, సలాడ్‌తో పాటు తప్పనిసరిగా తాజా ఆకుకూరలతో చేసిన వంటకం ఉండాలి.
- రాత్రిపూట తేలికపాటి ఆహారం తీసుకొంటుంది. దానివల్ల తిన్నది త్వరగా అరిగి, సుఖమైన నిద్ర పడుతుంది. బాయిల్డ్ ఎగ్స్, గ్రీన్ సలాడ్, పప్పు లేదా సూప్ రాత్రి మెనూలో ఉంటాయి.
- ఏదిఏమైనా... 'సరైన వ్యక్తులను సరైన సమయంలో కలవడంవల్లే నా కెరీర్ ఎలాంటి ఒడుదొడుకులు లేకుండా సాగిపోతోంది. నా చుట్టూ ఉన్నవారంతా నా అభివృద్ధికి నిచ్చెనలు వేసేవారే' అని తృప్తి చెప్పుకొచ్చింది.

లైఫ్ స్టైల్

స్వల్ప ఆనందాలు అందుకోండిలా...

ఉరుకులు పరుగులతో కూడిన దైనందిన జీవితంలో స్వల్ప ఆనందాలను నింపే కొన్ని చిన్న చిన్న ఆనందాలను ఆస్వాదించడం అలవాటు చేసుకోవడం అవసరం. చప్పుడు చేయకుండా చెంతకొచ్చి ఆరోగ్యాన్ని కుదేలు చేసే ఒత్తిడిలు, ఆందోళనల నుంచి స్వాంతన పొందడం కోసం కొన్ని అసాధారణమైన ఆనందాలను అనుభూతిస్తూ ఉండాలి.



తొలి సిప్‌తో మేల్కొలుపు

కమ్మని కాఫీని ఇష్టపడని వారుండరు. కానీ కాఫీ తాగే క్రమంలో మనసు ఆ రోజు చేయవలసిన పనుల మీదకు పరుగులు తీస్తోందా? అయితే దానికి అడ్డుకట్ట వేసి, కాఫీ కమ్మని వాసననూ, రుచినీ ఆస్వాదించడం మీదే మనసు పెట్టాలి. ప్రేరేపించే కాఫీ ఇంద్రియాలను మేల్కొలిపే అనుభవాన్ని అనుభూతించాలి.

స్నానంతో మైమరుపు

శరీరంలోని ఒత్తిడిని తొలగించి రోజంతా చురుగ్గా కదలడం కోసం శరీరాన్ని సిద్ధం చేసే సాధనమిది. కాబట్టి ఆదరాబాదరాగా స్నానం ముగించేయకుండా శ్రద్ధగా శరీరాన్ని సబ్బుతో రుద్దుకుని, మురికిని వదిలించాలి.
గోరువెచ్చని నీళ్లతో స్నానం చేయడం వల్ల చర్మం అడుగున రక్తప్రసరణ మెరుగై చర్మం కాంతివంతంగా తయారవుతుంది. శరీరం బద్ధకం వదలి, కొత్త హుషారు సంతరించుకుంటుంది.

గడ్డి మీద నడక

గార్డెన్‌లో చెప్పులు లేకుండా పచ్చిక మీద నడవడం అలవాటు చేసుకోవాలి. పిల్లలతో, పెంపుడు జంతువులతో పరుగులు పెట్టి ఆడుకోవాలి. ప్రకృతిలో మమేకమవడం కోసం పూల చెట్ల మధ్య, పచ్చిక మీద నడవడం అవసరం. పచ్చని పచ్చిక, పాదాలతో పాటు మనసును కూడా సుతిమెత్తగా స్పృశించి మైమరుపుకు లోను చేస్తుంది.

ఆంధ్రజ్యోతి

నవ్య చిత్రజ్యోతి

గురువారం • 4 జనవరి 2024

cinema@andhrajyothy.com

నా కెరీర్‌లో బెస్ట్ ఫిల్మ్ సైంధవ్

వెంకటేశ్



"నా సినీ కెరీర్‌లో 75వ చిత్రంగా 'సైంధవ్' లాంటి సినిమా చేయడం అదృష్టంగా భావిస్తున్నాను. ఇది నా కెరీర్‌లో బెస్ట్ ఫిల్మ్. న్యూ ఏజ్ యాక్షన్ థ్రిల్లర్ చేయాలని ఎప్పటి నుంచో ఉన్న కోరిక ఈ చిత్రంతో నెరవేరింది' అని వెంకటేశ్ అన్నారు. ఆయన కథానాయకుడిగా శైలేష్ కొలను దర్శకత్వం వహించిన చిత్రమిది. వెంకట్ బోయనపల్లి నిర్మాత. నవాజుద్దీన్ సిద్దిఖీ, ఆర్య, శ్రద్ధా శ్రీనాథ్, రుహానీ శర్మ, ఆండ్రియా జెరెమియా ప్రధాన తారాగణం. సంక్రాంతి సందర్భంగా జనవరి 13న 'సైంధవ్' విడుదలవుతోంది. బుధవారం చిత్ర బృందం ట్రైలర్ విడుదల కార్యక్రమాన్ని నిర్వహించింది. ఈ సందర్భంగా వెంకటేశ్ మాట్లాడుతూ 'ఆకట్టుకునే భావోద్వేగాలతో పాటు అబ్బురపరిచే పోరాట ఘట్టాలు మా సినిమాకు ప్రత్యేక ఆకర్షణ. తప్పకుండా ప్రేక్షకులకు కొత్త తరహా అనుభూతిని ఇస్తుంది. ట్రైలర్ అద్భుతంగా వచ్చింది. సినిమా కూడా తప్పకుండా ప్రేక్షకులను అలరిస్తుంది. సంక్రాంతికి రిలీజ్ చేస్తున్నాం. ప్రేక్షకులు ఆదరించాలి' అని కోరారు. శైలేష్ కొలను మాట్లాడుతూ 'వెంకటేశ్ గారి కెరీర్‌లో మైలురాయి లాంటి సినిమా చేసే అవకాశం నాకు వచ్చింది. ట్రైలర్‌లోనే కథ మొత్తం క్లుప్తంగా చెప్పానంటేనే సినిమాలో ఎంత విషయం ఉందో మీరే ఊహించుకోవచ్చు. ఇది నా బెస్ట్ ఫిల్మ్. వెంకీ 75వ చిత్రాన్ని గ్రాండ్‌గా సెలబ్రేట్ చేసుకోండి' అని చెప్పారు. వెంకట్ బోయనపల్లి మాట్లాడుతూ 'వెంకటేశ్ గారి లాంటి పెద్ద స్టార్‌తో సినిమా చేసే అవకాశం రావడం నా అదృష్టం. సినిమా విందు భోజనంలా ఉంటుంది' అని తెలిపారు.




ప్రముఖ సినీనటి ప్రభ కుమారుని పెళ్లి రిసెప్షన్ మంగళవారం సాయంత్రం హైదరాబాద్ గండిపేటలోని గోల్కొండ రిసార్ట్స్‌లో వైభవంగా జరిగింది. ఈ కార్యక్రమానికి ఏబీఎన్ -ఆంధ్రజ్యోతి మేనేజింగ్ డైరెక్టర్ వేమూరి రాధాకృష్ణ హాజరై వధూవరులను ఆశీర్వదించి శుభాకాంక్షలందించారు. ఆయనతోపాటు సీనియర్ నటులు మురళీమోహన్‌ను కూడా ఈ చిత్రంలో చూడొచ్చు. మరుసటిరోజు బుధవారం ఉదయం గోల్కొండ రిసార్ట్స్‌లో రంగరంగవైభవంగా వివాహం జరిగింది. పలువురు ప్రముఖులు ఈ కార్యక్రమానికి హాజరై కొత్తదంపతులకు శుభాశీస్సులు అందించారు.

ప్రేక్షకుల ప్రేమ కోసమే



ఈ మధ్య టాలీవుడ్‌లో యువ హీరోలు మొదలుకొని స్టార్ హీరోల దాకా హీరోయిన్‌గా అందరి ఛాయిస్ శ్రీలీలే. హిట్టు ఫ్లాపులతో సంబంధం లేకుండా ఆమె నటించిన చిత్రాలు వరుసగా థియేటర్లలో సందడి చేస్తున్నాయి. అందులో కొన్ని సినిమాలు డిజాస్టర్‌లుగా మిగిలాయి. మరికొన్ని యావరేజ్ మార్క్ దగ్గరే నిలిచిపోయాయి. సూపర్‌హిట్ చిత్రాలు పడితేనే హీరోయిన్‌కు టాలీవుడ్‌లో మార్కెట్ అనే లెక్కలను తిరగరాసిన ఘనత కచ్చితంగా శ్రీలీలదే అని చెప్పవచ్చు. అయితే శ్రీలీల మాత్రం ఇలాంటి విశ్లేషణలను పెద్దగా పట్టించుకోనంటుంది. 'మనం ఎంత ప్రతిభావంతులమైనా అభిమానుల ఆదరణ దక్కడమే గొప్ప విషయం. మన టాలెంట్‌ను వారు ఇష్టపడినంత కాలం ఇక్కడ మన పనికి ఢోకా ఉండదు. అందుకే నా వంతుగా అభిమానులను అలరించడానికి కొత్తగా ఏం చేద్దాం అని ఆలోచిస్తాను. దర్శకుల సలహాలు తీసుకుంటాను. హీరోయిన్‌గా నాకున్న పరిమితుల్లోనే నాదైన ముద్ర వేసేందుకు తపిస్తుంటాను. డాన్స్‌లు, నటన కోసం ముందుగా సిద్ధమవుతాను' అని చెప్పారు ఈ ముద్దుగుమ్మ.

కింగ్‌ఖాన్‌కి కోపమొచ్చింది



షారుక్‌ఖాన్ ఇరిటేటయ్యారు. ఓ అభిమాని అడిగిన ప్రశ్న బాలీవుడ్ బాద్‌షాకి కోపం తెప్పించింది. దాంతో సదరు అభిమానిని ఆయన సున్నితంగా మందలించారు. షారుక్ రీసెంట్ హిట్ 'డంకీ' ప్రమోషన్‌లో భాగంగా అభిమానులతో నిర్వహించిన చిట్‌చాట్‌లో వారు అడిగిన ప్రశ్నలకు సరదసరదాగా సమాధానాలిచ్చేశారు షారుక్. అయితే.. ఓ అభిమాని అత్యుత్సాహంతో అడిగిన ప్రశ్న షారుక్‌ని ఇరిటేట్ చేసింది. 'సార్.. అసలు 'డంకీ' బడ్జెట్ ఎంత? కొందరు 85 కోట్లు అంటున్నారు. కొందరు 120కోట్లు అంటున్నారు. ఇంకొందరేమో మీ రెమ్యునరేషన్ కలుపుకొని 350కోట్లు అంటున్నారు. ఇందులో నిజం ఏది? అసలు నిజం మీ నోటివెంట వినాలనుంది' అంటూ ఆ అభిమాని ప్రశ్నించగా షారుక్ ముఖ కవళికలు మారిపోయాయి. 'బ్రో.. ఆ విషయాలు నీకవసరమా? బిజినెస్ చేసేవాళ్లకు వదిలెయ్యాలి. ఆ గొడవలు వాళ్లు చూసుకుంటారు. ఉపయోగం లేని విషయాల గురించి ఆలోచించి ఎందుకు టైమ్ వేస్ట్ చేసుకుంటున్నావ్?' అంటూ సున్నితంగా ఆ అభిమానిని మందలించారు షారుక్. దాంతో ఒక్కసారిగా అక్కడి వాతావరణమంతా నిశ్శబ్దంగా మారిందట.

నేను ఆ రెండో కేటగిరికి చెందిన దాన్ని



కెరీర్‌పై చక్కని క్లారిటీ ఉన్న నటి శ్రద్ధా శ్రీనాథ్. నాని 'జెర్సీ'తో మంచి నటిగా గుర్తింపు తెచ్చుకున్న శ్రద్ధ త్వరలో వెంకటేశ్ 'సైంధవ్'తో ప్రేక్షకులను పలకరించనుంది. ఇటీవల ఓ ఇంటర్వ్యూలో హీరోయిన్స్ కెరీర్ గురించి ఆసక్తికరంగా మాట్లాడింది శ్రద్ధ. 'కెరీర్ విషయంలో సెలక్టివ్‌గా ఉండటం కరెక్ట్ కాదనేది చాలామంది హీరోయిన్ల అభిప్రాయం. అందుకే వచ్చిన ఏ అవకాశాన్నీ వదులకుండా వరుసపెట్టి సినిమాలు చేస్తుంటారు. కానీ కొందరు హీరోయిన్లు మాత్రం సెలక్టివ్‌గా నచ్చిన పాత్రలనే ఎంచుకొని చేస్తుంటారు. నేను ఆ రెండో కేటగిరికి చెందిన దాన్ని. మనసుకు నచ్చకపోతే చేయను. అలా ఎంచుకొని చేసిన సినిమానే 'జెర్సీ'. అందులో సరా పాత్ర నా కెరీర్‌కి పెద్ద బ్రేక్. రాబోతున్న 'సైంధవ్' కూడా మంచి పేరు తెస్తుందని నమ్మకంతో ఉన్నాను' అంటూ చెప్పుకొచ్చారు శ్రద్ధ శ్రీనాథ్

ఊహించని మలుపుల మిస్ పర్‌ఫెక్ట్



ఏ పని అయినా పర్‌ఫెక్ట్‌గా చేసేవాడ్ని మిస్టర్ పర్‌ఫెక్ట్ అనడం విన్నాం. త్వరలో 'మిస్ ఫర్‌ఫెక్ట్' గురించి వినబోతున్నాం. ఏ పనినయినా పర్‌ఫెక్ట్‌గా చేయడమే కాక చేయించడం ఈ మిస్ పర్‌ఫెక్ట్ స్పెషాలిటీ. ఈ కేరక్టరైజేషన్ చుట్టూ తిరిగే కథాంశంతో రూపొందిన వెబ్ సిరీస్ 'మిస్ పర్‌ఫెక్ట్'. లావణ్య త్రిపాఠి టైటిల్‌రోల్ పోషిస్తున్న ఈ సిరీస్‌లో అభిజిత్ దుద్దాల, అబిజ్ఞ ఉతలూరు కీలక పాత్రల్లో నటిస్తున్నారు. అన్నపూర్ణ స్టూడియోస్ బ్యానర్‌పై సుప్రియ యార్లగడ్డ నిర్మిస్తున్నారు. డైరెక్టర్ విశ్వక్ ఖండేరావ్. అతిత్వరలో ప్రసారం కానున్న ఈ సిరీస్‌కు సంబంధించిన ఫస్ట్‌లుక్ పోస్టర్‌ని బుధవారం విడుదల చేశారు. ఈ సందర్భంగా ' కొత్త ఏడాదిని పర్‌ఫెక్ట్‌గా మొదలుపెట్టబోతున్నాం. అంటూ తన వ్యక్తిగత సాంఘిక మాధ్యమం ద్వారా స్పందించారు లావణ్య త్రిపాఠి. ఒక యూనిక్ స్టోరీతో వస్తున్నందుకు ఆనందంగా ఉందని, అనుకోకుండా ఏర్పడిన బంధాలవల్ల జీవితాలు ఎలాంటి మలుపులు తీసుకుంటాయి అనే ఇతివృత్తంతో వినోదభరిత ప్రేమకథగా 'మిస్ పర్‌ఫెక్ట్' సిరీస్ ఉంటుందని సుప్రియ యార్లగడ్డ చెప్పారు. ఝాన్సీ, హర్షవర్ధన్, మహేశ్ విట్టా, హర్ష్ రోషన్ ఇతర పాత్రలు పోషిస్తున్న ఈ సిరీస్‌కి కెమెరా: ఆదిత్య జువ్వాది, సంగీతం: ప్రశాంత్ ఆర్.విహారి.

టైసన్ నాయుడు బరిలో దిగాడు



తొలి చిత్రం 'భీమ్లానాయక్'తోనే దర్శకుడిగా ఘన విజయం అందుకున్నారు సాగర్ కె. చంద్ర. ఇప్పుడు ఆయన బెల్లంకొండ సాయి శ్రీనివాస్ హీరోగా ఓ చిత్రాన్ని తెరకెక్కిస్తున్నారు. యాక్షన్ ఎంటర్టైనర్‌గా రూపుదిద్దుకుంటున్న ఈ చిత్రాన్ని రామ్ ఆచంట, గోపీ ఆచంట నిర్మిస్తున్నారు. సాయి శ్రీనివాస్ పుట్టిన రోజు సందర్భంగా బుధవారం చిత్రబృందం టైటిల్‌ను ప్రకటించి, గ్లింప్స్‌ను విడుదల చేసింది. ఈ చిత్రానికి 'టైసన్ నాయుడు' అనే పవర్‌ఫుల్ టైటిల్‌ను యూనిట్ ఖరారుచేసింది. బాక్సింగ్ దిగ్గజం మైక్ టైసన్ అభిమానిగా శ్రీనివాస్‌ను పరిచయం చేసిన గ్లింప్స్ ఆకట్టుకుంది. ఈ చిత్రంలో ఆయన డీఎస్పీ పాత్రలో అలరించనున్నారు. భీమ్స్ సిసిరోలియో ఈ చిత్రానికి సంగీతం అందిస్తున్నారు.


చైనా గోడైనా దూకొచ్చు



నాగార్జున అక్కినేని కథానాయకుడిగా రూపొందుతున్న చిత్రం 'నా సామిరంగా'. ప్రముఖ కొరియోగ్రాఫర్ విజయ్ బిన్ని దర్శకత్వం వహిస్తున్నారు. రాజ్‌తరుణ్ కీలకపాత్రపోషిస్తున్నారు. బుధవారం చిత్రబృందం రాజ్‌తరుణ్ పాత్రను పరిచయం చేస్తూ గ్లింప్స్ వదిలింది. ఈ చిత్రంలో ఆయన భాస్కర్ అనే కాలేజ్ స్టూడెంట్ పాత్రలో కనిపించనున్నారు. రుక్సార్ ధిల్లాన్‌తో రాజ్‌తరుణ్ ప్రేమకథను గ్లింప్స్‌లో ఆవిష్కరించారు. 'తన చిరునవ్వు కోసం చైనా గోడైనా దూకొచ్చు' అంటూ ఆయన పలికిన సంభాషణలు ఆకట్టుకున్నాయి. జనవరి 14న విడుదలవుతున్న ఈ చిత్రంలో నాగార్జునకు జోడీగా ఆశికా రంగనాథ్ నటిస్తున్నారు. పవన్ కుమార్ సమర్పణలో శ్రీనివాసా చిట్టూరి నిర్మిస్తున్నారు. అల్లరి నరేశ్ కీలకపాత్రలో నటిస్తున్నారు. ఈ చిత్రానికి సంగీతం: ఎంఎం కీరవాణి. ప్రసన్న కుమార్ బెజవాడ కథ, మాటలు అందించారు. సినిమాటోగ్రఫీ: శివేంద్ర దాశరథి.

భక్తిభావం ఉప్పొంగేలా రామనామం





తేజ సజ్జ కథానాయకుడిగా ప్రశాంత్ వర్మ దర్శకత్వం వహించిన చిత్రం 'హను-మాన్'. సంక్రాంతి సందర్భంగా జనవరి 12న ప్రేక్షకుల ముందుకొస్తోంది. ఇప్పటికే విడుదలైన ప్రచార చిత్రాలు, పాటలు సినిమాపై అంచనాలను పెంచాయి. బుధవారం చిత్రబృందం 'శ్రీరామధూత స్తోత్రం' విడుదల చేసింది. భక్తిబావం ఉప్పొంగేలా గౌరహరి స్వరాలందించగా, సాయిచరణ్ భాస్కరుణి, లోకేశ్వర్ ఎడర, హర్షవర్ధన్ చావలి శ్రవణానందంగా ఆలపించారు. ఈ చిత్రంలో అమృత అయ్యర్ కథానాయిక. వరలక్ష్మీ శరత్‌కుమార్, వినయ్ రాయ్, గెటప్ శ్రీను, సత్య కీలకపాత్రలు పోషించారు. ప్రైమ్‌షో ఎంటర్టైన్‌మెంట్‌పై శ్రీమతి చైతన్య సమర్పణలో కె. నిరంజన్‌రెడ్డి ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తున్నారు. సినిమాటోగ్రఫీ: శివేంద్ర.



గ్రామీణ ప్రేమకథ ప్రారంభం

సీనియర్ నటుడు దేవరాజ్ తనయుడు ప్రణం దేవరాజ్ హీరోగా శంకర్ దర్శకత్వం వహిస్తున్న ఫ్యామిలీ ఎంటర్టైనర్ బుధవారం ప్రారంభమైంది. ముహూర్తపు సన్నివేశానికి ఆకాష్ పూరి క్లాప్ ఇచ్చారు. దేవరాజ్ కెమెరా స్విచ్చాన్ చేశారు. తనికెళ్ల భరణి చిత్రబృందానికి స్క్రిప్ట్ అందించి, గౌరవ దర్శకత్వం వహించారు. ఈ సందర్భంగా దర్శకుడు మాట్లాడుతూ 'నాకు ఇది తొలి చిత్రం. తెలుగు, కన్నడ భాషల్లో తెరకెక్కిస్తున్నాం. ఈనెలలోనే రెగ్యులర్ షూటింగ్ ప్రారంభిస్తాం' అన్నారు. దేవరాజ్ పాన్ ఇండియా హీరో, వాళ్లబ్బాయి ప్రణం దేవరాజ్ కూడా ఈ రంగంలోకి వచ్చినందుకు ఆనందంగా ఉంది అని తనికెళ్ల భరణి చెప్పారు. ప్రణం దేవరాజ్ మాట్లాడుతూ 'ఇది తెలుగులో నాకు మూడో చిత్రం. మంచి లవ్ స్టోరీ, యాక్షన్ అంశాలతో రూపొందుతోంది' అని చెప్పారు. గ్రామీణ నేపథ్యంలో రూపొందుతున్న కుటుంబ కథా చిత్రమిదని నిర్మాత పి. హరికృష్ణ గౌడ్ తెలిపారు.

ఆహ్లాదకరంగా శశివదనే..

గోదావరి నేపథ్యంలో సాగే లవ్ అండ్ యాక్షన్ డ్రామా 'శశివదనే'. 'పలాస'ఫేం రక్షిత్ అట్లూరి, కోమలి జంటగా నటిస్తున్న ఈ చిత్రానికి సాయిమోహన్ ఉబ్బర దర్శకుడు. అహితేజ బెల్లంకొండ, అభిలాష్‌రెడ్డి గోడల నిర్మాతలు. నిర్మాణానంతర కార్యక్రమాలు జరుపుకుంటున్న ఈ చిత్రం టీజర్‌ని మేకర్స్ బుధవారం విడుదల చేశారు. పల్లెటూరి నేపథ్యంలో ఆహ్లాదకరమైన ప్రేమకథగా ఈ చిత్రం రూపొందినట్లు టీజర్ చెబుతోంది. ఇప్పటివరకూ విడుదలైన పాటలకు మంచి స్పందన వచ్చిందని, ఈ రోజు విడుదలైన టీజర్ సినిమాపై అంచనాలు పెంచేలా ఉందని పలువురు అభినందించారని, త్వరలోనే సినిమాను విడుదల చేస్తామని చిత్రబృందం తెలిపింది. ఈ చిత్రానికి కెమెరా: శ్రీసాయికుమార్ దారా, సంగీతం: శరవణన్ వాసుదేవన్, నేపథ్య సంగీతం: అనుదీప్.



సేలం స్టీలు ప్రైవేటీకరణ వెనక్కి

న్యూఢిల్లీ: తమిళనాడులోని సేలం స్టీల్ ప్లాంటు ప్రైవేటీకరణ నిర్ణయాన్ని వెనక్కి తీసుకున్నట్టు ప్రభుత్వం ప్రకటించింది. పెట్టుబడులు, ప్రభుత్వ ఆస్తుల నిర్వహణ శాఖ (దీపం) బుధవారం ఈ మేరకు ఒక ప్రకటన విడుదల చేసింది. 2019 జూలైలో సేలం స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణ కోసం దీపం నోటిఫికేషన్ విడుదల చేసింది. ఇందుకు అనేక కంపెనీలు ఆసక్తి చూపించాయి. అయితే షార్ట్‌లిస్ట్ చేసిన సంస్థలు పెద్దగా ఆసక్తి చూపక పోవడంతో, ప్రైవేటీకరణ ప్రక్రియనే నిలిపి వేయాలని ప్రభుత్వం నిర్ణయించింది.

బజాజ్ ఫైనాన్స్ నుంచి డిజిటల్ ఎఫ్‌డీ

న్యూఢిల్లీ: ప్రముఖ ఎన్‌బీఎఫ్‌సీ బజాజ్ ఫైనాన్స్ 42 నెలల కాల వ్యవధి ఉండే డిజిటల్ ఫిక్స్‌డ్ డిపాజిట్ (ఎఫ్‌డీ) పథకాన్ని ప్రారంభించింది. ఈ పథకం కింద సీనియర్ సిటిజన్ల డిపాజిట్లపై 8.85 శాతం, 60 ఏళ్ల కంటే తక్కువ వయసున్న వారి డిపాజిట్లపై 8.60 శాతం వార్షిక వడ్డీ చెల్లిస్తారు. కొత్త డిపాజిట్లతో పాటు, కాల పరిమితి ముగిసిన రూ.5 కోట్ల వరకు ఉండే డిపాజిట్లకు కూడా ఈ వడ్డీ రేట్లు వర్తిస్తాయి.

హైదరాబాద్‌లో జుల్ఫర్ లైఫ్ యూనిట్

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): మెక్సికోకు చెందిన ఫార్మా కంపెనీ జుల్ఫర్ లైఫ్ సైన్సెస్ అండ్ రిసెర్చ్ హైదరాబాద్‌లో యూనిట్‌ను ప్రారంభించింది. ఔషధాలు, ఏపీఐలు మొదలైనవి తయారు చేయనున్నట్లు జుల్ఫర్ లైఫ్ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ ఎన్ రాజారెడ్డి తెలిపారు. ఇక్కడ నుంచి విదేశాలకు ఎగుమతి చేయడంతోపాటు దేశీయ మార్కెట్‌లోకి కూడా అడుగుపెట్టనున్నట్లు చెప్పారు. పంపిణీ, మార్కెటింగ్ నెట్‌వర్క్‌పై దృష్టి పెట్టనున్నట్లు తెలిపారు.

మోల్డ్‌టెక్ కొత్త యూనిట్ ప్రారంభం

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): హరియాణలోని పానిపట్‌లో మోల్డ్‌టెక్ ప్యాకేజింగ్ కొత్త యూనిట్‌ను ప్రారంభించింది. రూ.35 కోట్లతో ఏర్పాటు చేసిన ఈ యూనిట్ గ్రాసిమ్ ఇండస్ట్రీస్ అవసరాలను తీరుస్తుంది. 2,500 టన్నుల సామర్థ్యంతో ఏర్పాటు చేస్తున్న కొత్త యూనిట్‌లో మార్చి నుంచి ఉత్పత్తి ప్రారంభిస్తారు. దీంతో కంపెనీ మొత్తం సామర్థ్యం 47,290 టన్నులకు చేరుతుంది. మొత్తం పెట్టుబడుల్లో 30 శాతాన్ని రుణం ద్వారా సమీకరించినట్లు కంపెనీ వెల్లడించింది.

అదానీపై ఇక ఏ దర్యాప్తు అవసరం లేదు



సిట్ లేదా సీబీఐకి బదిలీకి 'సుప్రీం' నిరాకరణ
విచారణ పూర్తి చేసేందుకు సెబీకి మరో 3 నెలల గడువు

న్యూఢిల్లీ: హిండెన్‌బర్గ్ ఆరోపణల కేసులో అదానీ గ్రూప్‌నకు భారీ ఊరట లభించింది. అదానీ గ్రూప్ అక్రమ పద్ధతుల్లో తన కంపెనీల షేర్ల ధరలను కృత్రిమంగా పెంచుకుంటూ వచ్చిందన్న హిండెన్‌బర్గ్ ఆరోపణలపై దర్యాప్తును సిట్ (ప్రత్యేక దర్యాప్తు బృందం) లేదా సీబీఐకి బదిలీ చేసేందుకు సుప్రీంకోర్టు నిరాకరించింది. అదానీ-హిండెన్‌బర్గ్ వివాదానికి సంబంధించి పలు ప్రజా ప్రయోజన వ్యాజ్యాలపై (పిల్) విచారణ జరిపిన సర్వోన్నత న్యాయస్థానం బుధవారం 46 పేజీల తీర్పును వెల్లడించింది. వార్తా పత్రికల్లో వచ్చిన కథనాలు, ఓసీసీఆర్‌పీ (ఆర్గనైజ్డ్ క్రైమ్ అండ్ కరప్షన్ రిపోర్టింగ్ ప్రాజెక్ట్) వంటి థర్డ్‌పార్టీ సంస్థల నివేదికల ఆధారంగా మార్కెట్ నియంత్రణ సంస్థ సెబీ దర్యాప్తును పిటిషనర్లు ప్రశ్నించడం విశ్వాసం కలిగించేలా లేదని ప్రధాన న్యాయమూర్తి డీవై చంద్రచూడ్ నేతృత్వంలోని త్రిసభ్య ధర్మాసనం పేర్కొంది. ఈ ఆరోపణలపై సెబీ సమగ్ర దర్యాప్తు నిర్వహిస్తోందని, నియంత్రణ సంస్థపై పూర్తి నమ్మకం ఉందన్నది. అంతేకాదు, సెబీ చట్టం పరిధిలోని నిబంధనల్లో జోక్యం చేసుకునేందుకు కోర్టుకున్న అధికారాలు పరిమితమేనని ఈ సందర్భంగా ప్రస్తావించింది. అదానీ గ్రూప్‌పై దర్యాప్తును 3 నెలల్లోగా పూర్తి చేయాలని సెబీని బెంచ్ ఆదేశించింది. అంతేకాదు, ఈ వ్యవహారంలో హిండెన్‌బర్గ్ పెట్టుబడి మార్కెట్ నిబంధనలేమైనా అతిక్రమించిందా అన్న కోణంలో పరిశీలించి తదనుగుణంగా చర్యలు చేపట్టాలని కేంద్ర ప్రభుత్వాన్ని, సెబీని ఆదేశించింది. అదానీ గ్రూప్‌పై వచ్చిన 22 ఆరోపణల్లో ఇప్పటికే 20 ఆరోపణలపై దర్యాప్తును పూర్తి చేసిన సెబీ.. మరో రెండింటిపై మరింత సమచారం కోసం వేచి చూస్తోంది. ఈ రెండు అంశాల్లో విదేశీ నియంత్రణ సంస్థలతోపాటు ఇతరుల నుంచి సమాచారం రావాల్సి ఉందని.. వారితో సంప్రదింపులు కొనసాగుతున్నాయని సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా గతంలోనే కోర్టుకు వెల్లడించారు. అదానీ గ్రూప్ చాలాకాలంగా అకౌంటింగ్ మోసాలకు పాల్పడటంతోపాటు విదేశీ సంస్థల పెట్టుబడుల ద్వారా గ్రూప్ కంపెనీల షేర్ల ధరలను కృత్రిమంగా పెంచుకుంటూ వచ్చిందని అమెరికన్ మార్కెట్ రీసెర్చ్, షార్ట్ సెల్లింగ్ కంపెనీ హిండెన్‌బర్గ్ గత ఏడాది జనవరి 24న ఆరోపించిన విషయం తెలిసిందే. దాంతో అదానీ షేర్లలో అమ్మకాలు పోటెత్తడంతో ఎల్ఐసీతోపాటు చిన్న మదుపరులు భారీగా నష్టపోయారు. ఈ విషయంపై దర్యాప్తు చేయాలని సెబీని ఆదేశించడంతోపాటు గత ఏడాది మార్చి 2న సుప్రీంకోర్టు ఓ నిపుణుల కమిటీని కూడా ఏర్పాటు చేసింది. కాగా, అదానీ గ్రూప్ తన కంపెనీల షేర్ల ధరను కృత్రిమంగా పెంచుకుంటూ వచ్చిందనడానికి, నియంత్రణ వైఫల్యానికి ఆధారాల్లేవన్న నిపుణుల కమిటీ.. అదానీ గ్రూప్‌లో భారీగా పెట్టుబడులు కలిగిన విదేశీ ఫండ్ల అసలు లబ్ధిదారులు ఎవరనేది గుర్తించడానికి 2014-19 మధ్యకాలంలో సెబీ సడలించిన నిబంధనలే అవరోధంగా మారాయని మే నెలలో సుప్రీంకోర్టుకు సమర్పించిన తాత్కాలిక నివేదికలో పేర్కొంది.

అదానీ షేర్లు జూమ్

సుప్రీంకోర్టు తీర్పుతో గ్రూప్ కంపెనీల షేర్లు భారీగా పుంజుకున్నాయి. బీఎస్ఈలో అదానీ ఎనర్జీ సొల్యూషన్స్ షేరు ధర 11.60 శాతం లాభపడింది. అదానీ టోటల్ గ్యాస్ 9.84 శాతం, అదానీ గ్రీన్ ఎనర్జీ 6 శాతం, అదానీ పవర్ 4.99 శాతం, అదానీ విల్మర్ 3.97 శాతం, ఎన్‌డీటీవీ 3.66 శాతం, అదానీ ఎంటర్‌ప్రైజెస్ 2.45 శాతం, అదానీ పోర్ట్స్ అండ్ సెజ్ 1.39 శాతం, అంబుజా సిమెంట్స్ 0.94 శాతం, ఏసీసీ 0.10 శాతం బలపడ్డాయి. దాంతో గ్రూప్‌లోని 10 కంపెనీల మొత్తం మార్కెట్ విలువ ఒక్కరోజే రూ.64 వేల కోట్లకు పైగా పెరిగి రూ.15.11 లక్షల కోట్లకు చేరుకుంది.

సత్యమే గెలిచింది: అదానీ

సుప్రీంకోర్టు తీర్పుపై అదానీ గ్రూప్ అధిపతి గౌతమ్ అదానీ హర్షం వ్యక్తం చేశారు. చివరికి సత్యమే గెలిచిందని, భారత ఆర్థిక వృద్ధికి తమ గ్రూప్ తన వంతు కృషిని కొనసాగిస్తుందన్నారు.

క్రోనీ క్యాపిటలిజంపై పోరాటం కొనసాగిస్తాం: కాంగ్రెస్

సుప్రీంకోర్టు తీర్పు సెబీ పట్ల అమిత ఉదారంగా ఉందని కాంగ్రెస్ వ్యాఖ్యానించింది. క్రోనీ క్యాపిటలిజం (ప్రభుత్వ ప్రతినిధులు, పెట్టుబడిదారుల మధ్య పరస్పర ప్రయోజనకరమైన సాన్నిహిత్యం), ధరలు, ఉపాధి, ఆర్థిక అసమానతలు, ప్రభావంపై తమ పోరాటం కొనసాగుతుందని పార్టీ పేర్కొంది. కాగా, అదానీ కేసులో సర్వోన్నత న్యాయస్థానం తీర్పుపై సీపీఎం కూడా నిరాశ వ్యక్తం చేసింది. ఈ తీర్పు ద్వారా కోర్టు తన విశ్వసనీయతను మరింత పెంచుకోలేకపోయిందని అభిప్రాయపడింది.

అదానీ పోర్ట్స్ ఎండీగా కరణ్ అదానీ



అదానీ పోర్ట్స్ అండ్ స్పెషల్ ఎకానమీ జోన్ (ఏపీసెజ్) సీఈఓ కరణ్ అదానీకి మేనేజింగ్ డైరెక్టర్‌గా (ఎండీ) పదోన్నతి లభించింది. ఇప్పటివరకు ఈ పదవిలో ఉన్న కంపెనీ చైర్మన్ గౌతమ్ అదానీ హోదాను ఎగ్జిక్యూటివ్ చైర్మన్‌గా మార్చడం జరిగిందని ఏపీసెజ్ బుధవారం వెల్లడించింది. అంతేకాదు, ఇంతక్రితం నిస్సాన్ మోటార్స్ గ్లోబల్ చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్‌గా పనిచేసిన అశ్వనీ గుప్తాను ఏపీసెజ్ కొత్త సీఈఓగా నియమించేందుకు కంపెనీ బోర్డు ఆమోదం తెలిపింది.

రెండో రోజూ నష్టాలే

ముంబై : దేశీయ స్టాక్ మార్కెట్ వరుసగా రెండో రోజూ నష్టాలతో ముగిసింది. ప్రపంచ మార్కెట్ల నుంచి అందిన ప్రతికూల సంకేతాల ప్రభావంతో సెన్సెక్స్ 535.88 పాయింట్లు నష్టపోయి 71356.60 వద్ద ముగియగా, నిఫ్టీ 148.45 పాయింట్ల నష్టంతో 21517.35 వద్ద ముగిసింది. సెన్సెక్స్ ఒక దశలో 588.51 పాయింట్లు నష్టపోయి 71303.92 పాయింట్ల ఇంట్రా డే కనిష్ఠ స్థాయిని తాకింది. బ్రెంట్ రకం ముడి చమురు ధర బ్యారెల్ 75 డాలర్లకు తగ్గినా చైనా, ఈయు దేశాల ఆర్థిక పరిస్థితి అంతంత మాత్రంగానే ఉందన్న వార్తలు మార్కెట్‌ను భయపెట్టాయి.

తయారీ రంగం నీరసం

న్యూఢిల్లీ: తయారీ రంగం డిసెంబరు నెలలో 18 నెలల కనిష్ఠ వృద్ధిని నమోదు చేసింది. ద్రవ్యోల్బణం తగ్గుముఖం పట్టినా కొత్త ఆర్డర్లు లేకపోవడం, ఉత్పత్తి తగ్గుదల ఈ క్షీణతకు కారణమని హెచ్ఎస్‌బీసీ ఇండియా తయారీ పీఎంఐ సర్వే నివేదిక తెలిపింది. ఈ సూచీ నవంబరు నెలతో పోల్చితే 56 పాయింట్ల నుంచి 54.9 పాయింట్లకు తగ్గింది.

గృహ రుణాలపై బీఓఎం వడ్డీ తగ్గింపు

న్యూఢిల్లీ: గృహ రుణాల కోసం చూస్తున్న వారికి బ్యాంక్ ఆఫ్ మహారాష్ట్ర (బీఓఎం) తీపి కబురు చెప్పింది. నూతన సంవత్సరం ఆఫర్‌గా గృహ రుణాలపై వడ్డీరేటును 8.5 శాతం నుంచి 8.35 శాతానికి తగ్గిస్తున్నట్టు ప్రకటించింది. కొత్తగా తమ బ్యాంకు నుంచి గృహ రుణాలు తీసుకునే వారికి ప్రాసెసింగ్ ఫీజు నుంచి కూడా మినహాయింపు ఇస్తున్నట్టు తెలిపింది. ఈ తగ్గింపుతో బ్యాంకింగ్ పరిశ్రమలో అతి తక్కువ వడ్డీరేట్లతో గృహ రుణాలు అందిస్తున్న బ్యాంకుల్లో తమ బ్యాంకు ఒకటయిందని తెలిపింది.



బంగారం ధరలు (10 గ్రాములకు రూ.లలో)

	24 క్యారెట్లు	22 క్యారెట్లు	కేజీ వెండి
హైదరాబాద్	63,820 ▼	58,600 ▼	80,000 ▼
ముంబై	63,010 ▼	57,720 ▼	72,690 ▼

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)



3వ తేదీ	
హైదరాబాద్	582
4 జనవరి	
చిత్తూరు	608
గోదావరి	585
విజయవాడ	585
విశాఖపట్నం	625
వరంగల్	584

డజను గుడ్లు రూ.72

ఫామ్‌గేట్ ధర (కిలో) రూ. వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్



హైదరాబాద్	90
వరంగల్	90
కరీంనగర్	90
మహబూబ్‌నగర్	90
కర్నూలు	90
విశాఖపట్నం	89
గోదావరి	94
విజయవాడ	94
గుంటూరు	90
ఒంగోలు	90
చిత్తూరు	105

ఇళ్ల విక్రయాల్లో రికార్డు

హైదరాబాద్‌లో 6 శాతం వృద్ధి



హైదరాబాద్: నివాస గృహాల విక్రయాలు 2023 సంవత్సరంలో జోరుగా సాగాయి. హైదరాబాద్‌లో అమ్మకాలు 6 శాతం పెరిగి రికార్డు స్థాయిలో 32,880 యూనిట్లకి చేరాయి. మొత్తం విక్రయించిన గృహాల్లో సగం కోటి రూపాయల పైబడిన ధరలోని ప్రీమియం గృహాలే ఉన్నాయి. మొత్తం అందుబాటులోకి వచ్చిన 46,985 గృహాల్లో 43 శాతం ప్రీమియం గృహాలేనని నైట్‌ఫ్రాంక్ తాజా నివేదికలో వెల్లడించింది. సగటు చదరపు అడుగు ధర 11 శాతం పెరిగి రూ.5,550కి చేరింది. ప్రీమియం గృహాల విక్రయాలు 2018లో 21 శాతం ఉండగా 2023 నాటికి ఇది 49 శాతానికి చేరినట్టు వెల్లడించింది. అఫర్డబుల్ గృహాల (రూ.50 లక్షల కంటే తక్కువ ధర) విక్రయాలు 2018లో 26 శాతం ఉండగా.. 2023 నాటికి 11 శాతానికి తగ్గింది.

జీసీసీలతో కార్యాలయ స్థలానికి గిరాకీ..: హైదరాబాద్‌లో అద్దెకు తీసుకున్న కార్యాలయ స్థలం 2023 సంవత్సరంలో 32% పెరిగింది. అద్దెకు తీసుకున్న కార్యాలయ స్థలాలు 2022లో 67 లక్షల చదరపు అడుగులుండగా 2023 సంవత్సరంలో 88 లక్షల చదరపు అడుగులకు పెరిగిందని ఆ నివేదికలో తెలిపారు. హైదరాబాద్ నుంచి ఐటీ అవుట్ సోర్సింగ్ సేవలందిస్తున్న గ్లోబల్ కేపబిలిటీ సెంటర్ల (జీసీసీ) నుంచి ఏర్పడిన డిమాండు కార్యాలయ స్థలానికి గిరాకీ పెరగడానికి కారణం. ఏడాది క్రితంతో పోలిస్తే హైదరాబాద్‌లో జీసీసీలు తీసుకున్న కార్యాలయ స్థలం 52 శాతం పెరిగి 41 లక్షల చదరపు అడుగులకు చేరింది. కొత్తగా అందుబాటులోకి వచ్చిన కార్యాలయ స్థలం 42 శాతం తగ్గి 65 లక్షల చదరపు అడుగులకు పరిమితమైంది. సగటున చదరపు అడుగు నెల అద్దె స్వల్పంగా ఒక శాతం పెరిగి రూ.65.5గా ఉంది.

రూ.50 లక్షల లోపు ఇళ్లకు తగ్గిన డిమాండ్: దేశంలో రూ.50 లక్షల లోపు ధరలో ఇళ్లకు డిమాండు తగ్గింది. దేశంలోని ఎనిమిది ప్రధాన నగరాల్లో గత ఏడాది ఈ శ్రేణిలోని ఇళ్ల అమ్మకాలు 16 శాతం తగ్గాయి. 2022 సంవత్సరంలో ఈ శ్రేణిలో 1,17,131 ఇళ్లు అమ్ముడుపోగా 2023లో 98,000 ఇళ్ల అమ్మకాలు మాత్రమే నమోదయ్యాయి. ప్రాపర్టీ ధరలు, మార్టిగేజ్ వ్యయాలు పెరగడం ఇందుకు కారణమని నైట్‌ఫ్రాంక్ తాజా నివేదికలో తెలిపింది. అయితే మొత్తం ఇళ్ల అమ్మకాలు మాత్రం 5 శాతం పెరిగి 3,29,907 యూనిట్లుగా నమోదైనట్టు పేర్కొంది.

డాక్టర్ రెడ్డీస్ చేతికి 'మెనోల్యాబ్స్' బ్రాండ్‌లు

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): మెనోల్యాబ్స్ బ్రాండ్‌తో అమెరికాలో విక్రయిస్తున్న ఉమెన్ హెల్త్ అండ్ డైటరీ సప్లిమెంట్ ఉత్పత్తుల పోర్టుఫోలియోను ఎమిరిస్ ఐఎన్‌సీ నుంచి డాక్టర్ రెడ్డీస్ కొనుగోలు చేసింది. ఎమిరిస్ దివాలా ప్రక్రియలో భాగంగా మెనోల్యాబ్స్ బ్రాండ్లను సొంతం చేసుకున్నట్లు డాక్టర్ రెడ్డీస్ వెల్లడించింది. మెనోఫిట్, మెనోగ్లో, హ్యాపీ ఫైబర్ తదితర 11 బ్రాండ్‌లతో సహా మెనోల్యాబ్స్ చెందిన మొత్తం సప్లిమెంట్స్ పోర్టుఫోలియో డాక్టర్ రెడ్డీస్ చేతికి వస్తాయి. మెనోల్యాబ్స్ బ్రాండ్ల కొనుగోలు విలువను కంపెనీ వెల్లడించలేదు. ఈ ఒప్పందంలో భాగంగా మెనోలైఫ్ హెల్త్ ట్రాకర్ యాప్‌కు కూడా డాక్టర్ రెడ్డీస్‌కు లభిస్తుంది. మెనోల్యాబ్స్ బ్రాండ్ల కొనుగోలు ద్వారా ఈ విభాగంలో కంపెనీ మరింత బలపడుతుందని డాక్టర్ రెడ్డీస్ నార్త్ అమెరికా చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ మార్క్ కికుచి అన్నారు.

స్పోర్ట్స్

తొలి రోజే 23 వికెట్లు

సఫారీలు 55కే ధమాల్



ఆరేసిన సిరాజ్

- భారత్ తొలి ఇన్నింగ్స్ 153
- ఒక్క పరుగు చేయకుండానే 6 వికెట్లు ఫట్
- సౌతాఫ్రికా రెండో ఇన్నింగ్స్ 62/3



2 తొలి రోజు లంచ్‌కు ముందే ఐదు వికెట్లు పడగొట్టిన రెండో భారత బౌలర్ సిరాజ్. 1987లో బెంగళూరులో పాకిస్థాన్‌పై మణిందర్ సింగ్ ఈ ఘనతను సాధించాడు.

3 సౌతాఫ్రికా గడ్డపై అత్యుత్తమ ప్రదర్శన చేసిన మూడో భారత బౌలర్ సిరాజ్ (6/15). శార్దూల్ (7/61), హర్భజన్ (7/120) టాప్‌లో ఉన్నారు.

స్కోరుబోర్డు

సౌతాఫ్రికా తొలి ఇన్నింగ్స్: మార్‌క్రమ్ (సి) జైస్వాల్ (బి) సిరాజ్ 2, ఎల్గర్ (బి) సిరాజ్ 4, జోర్జి (సి) రాహుల్ (బి) సిరాజ్ 2, స్టబ్స్ (సి) రోహిత్ (బి) బుమ్రా 3, బెడింగమ్ (సి) జైస్వాల్ (బి) సిరాజ్ 12, వెరీనె (సి) గిల్ (బి) సిరాజ్ 15, జాన్సెన్ (సి) రాహుల్ (బి) సిరాజ్ 0, కేశవ్ (సి) బుమ్రా (బి) ముకేష్ 3, రబాడ (సి) అయ్యర్ (బి) ముకేష్ 5, బర్గర్ (సి) జైస్వాల్ (బి) బుమ్రా 4, ఎన్‌గిడి (నాటౌట్) 0; **ఎక్స్‌ట్రాలు: 5; మొత్తం: 23.2 ఓవర్లలో 55 ఆలౌట్; వికెట్ల పతనం:** 1-5, 2-8, 3-11, 4-15, 5-34, 6-34, 7-45, 8-46, 9-55; **బౌలింగ్:** బుమ్రా 8-1-25-2, సిరాజ్ 9-3-15-6, ప్రసిద్ధ్ 4-1-10-0, ముకేష్ 2.2-2-0-2.

భారత్ తొలి ఇన్నింగ్స్: జైస్వాల్ (బి) రబాడ 0, రోహిత్ (సి) జాన్సెన్ (బి) బర్గర్ 39, గిల్ (సి) జాన్సెన్ (బి) బర్గర్ 36, కోహ్లీ (సి) మార్‌క్రమ్ (బి) రబాడ 46, అయ్యర్ (సి) వెరీనె (బి) బర్గర్ 0, రాహుల్ (సి) వెరీనె (బి) ఎన్‌గిడి 8, జడేజా (సి) జాన్సెన్ (బి) ఎన్‌గిడి 0, బుమ్రా (సి) జాన్సెన్ (బి) ఎన్‌గిడి 0, సిరాజ్ (రనౌట్/బర్గర్) 0, ప్రసిద్ధ్ (సి) మార్‌క్రమ్ (బి) రబాడ 0, ముకేష్ (నాటౌట్) 0; **ఎక్స్‌ట్రాలు: 24; మొత్తం: 34.5 ఓవర్లలో 153 ఆలౌట్; వికెట్ల పతనం:** 1-17, 2-72, 3-105, 4-110, 5-153, 6-153, 7-153, 8-153, 9-153; **బౌలింగ్:** రబాడ 11.5-2-38-3, ఎన్‌గిడి 6-1-30-3, బర్గర్ 8-2-42-3, జాన్సెన్ 9-2-29-0.

సౌతాఫ్రికా రెండో ఇన్నింగ్స్: మార్‌క్రమ్ (బ్యాటింగ్) 36, ఎల్గర్ (సి) కోహ్లీ (బి) ముకేష్ 12, జోర్జి (సి) రాహుల్ (బి) ముకేష్ 1, స్టబ్స్ (సి) రాహుల్ (బి) బుమ్రా 1, బెడింగమ్ (బ్యాటింగ్) 7; **ఎక్స్‌ట్రాలు: 5; మొత్తం: 17 ఓవర్లలో 62/3; వికెట్ల పతనం:** 1-37, 2-41, 3-45; **బౌలింగ్:** బుమ్రా 6-0-25-1, సిరాజ్ 5-2-11-0, ముకేష్ 6-2-25-2.

1 టెస్ట్ చరిత్రలో ఒక్క పరుగు కూడా జత చేయకుండా 6 వికెట్లు కోల్పోయిన తొలి జట్టుగా టీమిండియా చెత్త రికార్డును మూటగట్టుకొంది.

భారత్‌తో ఆడిన టెస్టులో ఓ ఇన్నింగ్స్‌లో అత్యల్ప స్కోరు (55 పరుగులు) చేసిన జట్టుగా సౌతాఫ్రికా. 2021లో ముంబైలో న్యూజిలాండ్ 62 రన్స్ చేసింది.

2 మొదటిరోజే 23 వికెట్లు కూలడం టెస్ట్ చరిత్రలో రెండోసారి. 1902లో మెల్‌బోర్న్‌లో ఆస్ట్రేలియా, ఇంగ్లండ్ మధ్య మ్యాచ్‌లో తొలిరోజు 25 వికెట్లు పడ్డాయి.

సిరాజ్ చిరస్మరణీయ ప్రదర్శన కనబరచినా.. భారత బ్యాటింగ్ వైఫల్యం నిరాశపరిచింది. అనూహ్యమైన బౌన్స్‌తో బ్యాటర్లు ఇబ్బందులు పడుతున్న వేళ.. స్వల్ప ఆధిక్యం రోహిత్ సేనకు కలసి రానుంది. తొలి ఇన్నింగ్స్‌లో సఫారీలు 55 పరుగులకే ఆలౌట్ కాగా.. భారత్ ఒక్క పరుగు కూడా చేర్చకుండా 6 వికెట్లు చేజార్చుకొన్న చెత్త రికార్డును మూట గట్టుకుంది. వికెట్ల జాతర చూస్తుంటే.. మరో రెండు సెషన్లలో మ్యాచ్ ఫలితం వచ్చినా ఆశ్చర్యపోనవసరంలేదు.

కేప్‌టౌన్: పేసర్ల జోరు.. బ్యాటర్ల బేజారు..! ఇదీ భారత్, దక్షిణాఫ్రికా మధ్య బుధవారం మొదలైన రెండో టెస్ట్ తొలి రోజు పరిస్థితి. పిచ్ బౌలర్లకు సహకరిస్తుండడంతో ఒక్క రోజే 23 వికెట్లు కూలాయంటే మ్యాచ్ ఎలా సాగుతోందో అర్థం చేసుకోవచ్చు. అసమానమైన బౌన్స్‌తోపాటు స్వింగ్ అవుతున్న బంతులు బ్యాటర్లకు సవాల్ విసురుతున్న నేపథ్యంలో రెండో రోజే మ్యాచ్ ముగిసే అవకాశం ఉంది. సిరాజ్ (9-3-15-6) కెరీర్ బెస్ట్ గణాంకాలు నమోదు చేయడంతో.. తొలి ఇన్నింగ్స్‌లో సౌతాఫ్రికా 23.2 ఓవర్లలో 55 పరుగులకే కుప్పకూలింది. వెరీనె (15), బెడింగమ్ (12) మినహా మిగతా బ్యాటర్లంతా సింగిల్ డిజిట్‌కే వెనుదిరిగారు. బుమ్రా, ముకేష్ చెరో రెండు వికెట్లు పడగొట్టారు. అనంతరం మొదటి ఇన్నింగ్స్‌లో భారత్ 34.5 ఓవర్లలో 153 పరుగులకు ఆలౌటైంది. కోహ్లీ (46), రోహిత్ (39), గిల్ (36) పర్వాలేదనిపించారు. అయితే, 153 పరుగుల వద్ద ఒక్క రన్ కూడా జోడించకుండానే 6 వికెట్లను చేజార్చుకొన్న టీమిండియా.. 98 పరుగుల ఆధిక్యం సాధించింది. రబాడ, ఎన్‌గిడి, బర్గర్ తలో మూడు వికెట్లు పడగొట్టారు. తొలి రోజు ఆటముగిసే సమయానికి దక్షిణాఫ్రికా రెండో ఇన్నింగ్స్‌లో 17 ఓవర్లలో 62/3తో ఆడుతోంది. మార్‌క్రమ్ (36), బెడింగమ్ (7) క్రీజులో ఉన్నారు. చివరి టెస్ట్ ఆడుతున్న ఎల్గర్ (4, 12) విఫలమయ్యాడు. ముకేష్ 2 వికెట్లు పడగొట్టాడు. ప్రస్తుతానికి 36 పరుగుల ఆధిక్యంతో టీమిండియాదే పైచేయిగా కనిపిస్తోంది.

పెవిలియన్‌కు క్యూ: పేసర్ సిరాజ్ నిప్పులు చెరగడంతో.. టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకొన్న సౌతాఫ్రికా బెంబేలెత్తింది. మరోవైపు బుమ్రా కూడా కట్టుదిట్టంగా బౌలింగ్ చేయడంతో.. వికెట్లు టపటపా నేలరాలాయి. స్వయంగా షార్ట్‌లెగ్‌లో ఫీల్డింగ్ చేసిన రోహిత్.. అటాకింగ్ ఫీల్డింగ్‌తో ప్రత్యర్థి బ్యాటర్లపై ఒత్తిడి పెంచాడు. ఓపెనర్ మార్‌క్రమ్ (2) బలహీనతను గమనించిన సిరాజ్.. ఆఫ్‌స్టంప్‌నకు ఆవలగా బంతులేసి ఫలితం సాధించాడు. బయటకు వెళ్తున్న బాల్‌ను ఆడే ప్రయత్నంలో స్లిప్స్‌లో ఉన్న జైస్వాల్ అద్భుత క్యాచ్ అందుకోవడంతో సఫారీల పతనం ఆరంభమైంది. ఓపెనర్ ఎల్గర్.. సిరాజ్ బౌలింగ్‌లో వికెట్ల మీదకు ఆడుకొన్నాడు. స్టబ్స్ (3)ను బుమ్రా క్యాచవుట్ చేయగా.. ఫామ్‌లో ఉన్న జోర్జి (2)ని సిరాజ్ లెగ్‌సైడ్ బాల్‌తో బోల్తా కొట్టించాడు. దీంతో సౌతాఫ్రికా 15 పరుగులకు 4 టాపార్డర్ వికెట్లు కోల్పోయి పీకల్లోతు కష్టాల్లో కూరుకుపోయింది. అయితే, కొంతసేపు క్రీజులో నిలిచిన బెడింగమ్, వెరీనె ఐదో వికెట్‌కు 19 పరుగులు జోడించారు. కానీ, బెడింగమ్, జాన్సెన్ (0)ను ఒకే ఓవర్‌లో అవుట్ చేసిన సిరాజ్.. తన ఆరో వికెట్‌గా వెరీనెను పెవిలియన్ చేర్చాడు. బర్గర్ (4)ను బుమ్రా క్యాచవుట్ చేయగా.. కేశవ్ (3), రబాడ (5)ను ముకేష్ వెనక్కిపంపాడు.



భారత్ 153/4 నుంచి 153/10 దాకా..

34వ ఓవర్‌లో	ఎన్‌గిడి	W 0 W 0 W 0
35వ ఓవర్‌లో	రబాడ	0 W 0 W W

11 బంతుల్లో 6 వికెట్లు: అనంతరం తొలి ఇన్నింగ్స్ బరిలోకి దిగిన భారత్.. ఒక దశలో మెరుగ్గా కనిపించింది. కానీ, 153 పరుగుల స్కోరు వద్ద నాటకీయ రీతిలో 11 బంతుల్లో 6 వికెట్లను కోల్పోయింది. ఏకంగా ఆరుగురు డకౌటయ్యారు. ఓపెనర్ జైస్వాల్ (0)ను రబాడ డకౌట్ చేసినా.. రోహిత్, గిల్ రెండో వికెట్‌కు 55 పరుగుల భాగస్వామ్యంతో ఆదుకొన్నారు. అయితే, రోహిత్‌తోపాటు గిల్, శ్రేయాస్ (0)ను బర్గర్ అవుట్ చేయడంతో టీ సమయానికి భారత్ 111/4తో నిలిచింది. కానీ, మూడో సెషన్‌లో కోహ్లీ అడపాదడపా షాట్లతో స్కోరుబోర్డును నడిపించగా.. రాహుల్ (8) ఎక్కువగా డిఫెన్స్‌కే పరిమితమయ్యాడు. వీరిద్దరూ ఐదో వికెట్‌కు 43 పరుగులు జోడించారు. అయితే, 153/4 స్కోరు వద్ద రాహుల్‌ను ఎన్‌గిడి అవుట్ చేయడంతో.. పతనం మొదలైంది. 34వ ఓవర్‌లో రాహుల్‌తోపాటు జడేజా (0), బుమ్రా (0)ను ఎన్‌గిడి వెనక్కి పంపాడు. తర్వాతి ఓవర్‌లో సిరాజ్ (0) రనౌట్ కాగా.. కోహ్లీ, ప్రసిద్ధ్ (0)ను అవుట్ చేసి రబాడ భారత ఇన్నింగ్స్‌కు తెరదించాడు.

మార్‌క్రమ్ నిలకడగా..: చివరి సెషన్‌లో రెండో ఇన్నింగ్స్‌లో బ్యాటింగ్‌కు దిగిన సౌతాఫ్రికా 17 ఓవర్లు ఆడింది. తొలి ఇన్నింగ్స్‌లో స్వల్ప స్కోరుకే వెనుదిరిగిన ఓపెనర్ మార్‌క్రమ్ నిలకడగా ఆడుతుండడం సఫారీలకు ఊరటనిచ్చే విషయం. మార్‌క్రమ్, ఎల్గర్ తొలి వికెట్‌కు 37 పరుగుల భాగస్వామ్యం నమోదు చేశారు. అయితే, ఎల్గర్, జోర్జి (1)ను ముకేష్ అవుట్ చేయగా.. స్టబ్స్‌ను బుమ్రా వెనక్కిపంపాడు. కానీ, బెడింగమ్ మరో వికెట్ ఇవ్వకుండా రోజును ముగించాడు.



కోహ్లీ @ 9

దుబాయ్: విరాట్ కోహ్లీ టెస్ట్ ర్యాంకింగ్స్‌లో మళ్లీ టాప్-10లోకి దూసుకొచ్చాడు. బుధవారం విడుదల చేసిన ఐసీసీ టెస్ట్ బ్యాటర్ల జాబితాలో కోహ్లీ 4 స్థానాలు ఎగబాకి 9వ ర్యాంక్‌లో నిలిచాడు. కేన్ విలియమ్సన్, జో రూట్ టాప్-2లో ఉన్నారు. రోహిత్ 4 స్థానాలు కోల్పోయి 14వ ర్యాంక్ దక్కించుకొన్నాడు. బౌలర్ల విభాగంలో అశ్విన్ అగ్రస్థానంలో కొనసాగుతుండగా.. జడేజా, బుమ్రా నాలుగు, ఐదు ర్యాంకుల్లో నిలిచారు. ఆల్‌రౌండర్ల జాబితాలో జడేజా నెం:1 ర్యాంక్‌లో కొనసాగుతున్నాడు.



మలుపు తిరిగిన రెజ్లింగ్ రగడ

- సీనియర్లపై జూనియర్ల తిరుగుబాటు
- కార్యవర్గాన్ని పునరుద్ధరించాలని అల్టిమేటం
- లేదంటే అవార్డులు వెనక్కి ఇస్తామని హెచ్చరిక

న్యూఢిల్లీ: భారత రెజ్లింగ్ సమాఖ్య (డబ్ల్యూఎఫ్ఐ) వివాదం బుధవారం అనూహ్య మలుపు తిరిగింది. ఇప్పటివరకు దేశ అగ్రశ్రేణి రెజ్లర్లంతా సమాఖ్య మాజీ చీఫ్ బ్రిజ్‌భూషణ్, సస్పెండైన కొత్త కార్యవర్గం అధ్యక్షుడు సంజయ్ సింగ్‌కు వ్యతిరేకంగా ఆందోళనకు దిగగా..తాజాగా వినేశ్, సాక్షి, బజ్‌రంగ్ పూనియాపై జూనియర్ రెజ్లర్లు వ్యతిరేక గళమెత్తారు. రెజ్లింగ్ సమాఖ్య గొడవలతో ఏడాదంతా నష్టపోయామని, అందుకు బజ్‌రంగ్, సాక్షి, వినేశ్ కారణమని ఆరోపిస్తూ జంతర్ మంతర్ వద్ద మూడు గంటలపాటు నిరసనకు దిగారు. ఉత్తరప్రదేశ్, హరియాణా, ఢిల్లీ నుంచి దాదాపు 300మంది జూనియర్ రెజ్లర్లు బస్సుల్లో ధర్నాకు తరలివచ్చారు. స్టార్ రెజ్లర్లకు వ్యతిరేకంగా నినదిస్తూ వచ్చిన వారిని అడ్డుకోవడం పోలీసులకు కష్టతరమైంది. ఢిల్లీలో చలి తీవ్రంగా ఉన్నా లెక్క చేయని రెజ్లర్లు ఉదయం 11 నుంచి 3 గంటలపాటు ధర్నాలో పాల్గొన్నారు. డబ్ల్యూఎఫ్ఐపై కేంద్ర ప్రభుత్వం విధించిన సస్పెన్షన్‌ను 10 రోజుల్లోగా ఎత్తివేయకపోతే తమ అవార్డులను వెనక్కిస్తామని వారు హెచ్చరించారు. అలాగే సాక్షి, వినేశ్, బజ్‌రంగ్ చిత్రాలతో కూడిన ప్లకార్డులను కాళ్లతో తొక్కి ఆగ్రహం ప్రకటించారు. గతనెల 21న ఎన్నికైన డబ్ల్యూఎఫ్ఐ కొత్త కార్యవర్గం అండర్-15, అండర్-20 జాతీయ చాంపియన్‌షిప్‌ను మాజీ అధ్యక్షుడు బ్రిజ్‌భూషణ్ స్వస్థలం గోండాలో నిర్వహించనున్నట్టు ప్రకటించింది. దాంతో సమాఖ్య రాజ్యాంగాన్ని ఉల్లంఘించిందంటూ గతనెల 24న నూతన కార్యవర్గాన్ని కేంద్ర క్రీడాశాఖ సస్పెండ్ చేసిన విషయం విదితమే. ఫలితంగా కొత్త కార్యవర్గం నిర్వహించ తలపెట్టిన రెండు టోర్నీలూ రద్దయ్యాయి. ఈనేపథ్యంలో జూనియర్ రెజ్లర్లు నిరాశకు లోనయ్యారు. మహిళా రెజ్లర్లను బ్రిజ్‌భూషణ్ లైంగికంగా వేధిస్తున్నాడంటూ సరిగ్గా ఏడాది కిందట ఇదే జంతర్ మంతర్‌లో టాప్ రెజ్లర్లు ఆందోళనకు దిగారు. అప్పట్లో వారికి దేశ వ్యాప్తంగా వివిధ వర్గాలనుంచి భారీ మద్దతు లభించడం విశేషం.

గ్వాలియర్‌లో జూనియర్ చాంపియన్‌షిప్: అండర్-15, అండర్-20 జాతీయ చాంపియన్‌షిప్‌ను ఆరు వారాలలోపు గ్వాలియర్‌లో నిర్వహిస్తామని, నిరసన వ్యక్తంజేస్తున్న రెజ్లర్లు..ఆ పోటీలకోసం సాధన చేయాలని అడ్‌హాక్ కమిటీ సూచించింది.

మా అమ్మకు బెదిరింపులు: సాక్షీ మాలిక్



డబ్ల్యూఎఫ్ఐ మాజీ చీఫ్ బ్రిజ్‌భూషణ్ అనుచరుల నుంచి తన తల్లికి బెదిరింపులు వస్తున్నాయని సాక్షీ మాలిక్ వెల్లడించింది. తమకు భద్రత కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వానిదేనని చెప్పింది. కాగా..సంజయ్ సింగ్ మినహా సమాఖ్య కొత్త కార్యవర్గం అంతా తమకు ఆమోదయోగ్యమేనని చెప్పింది. రెజ్లింగ్‌కు నేను 18 నుంచి 20 సంవత్సరాలు సేవ చేశా. ఈ క్రమంలో ఎన్ని ఇబ్బందులకు గురయ్యానో నాకే తెలుసు. సోషల్ మీడియాలో బాగా తప్పుడు ప్రచారం జరుగుతోంది. జూనియర్ రెజ్లర్ల నిరసన గురించి మీడియా ద్వారానే నాకు తెలిసింది. జంతర్ మంతర్‌లో ఆందోళన చేసిన వారు అతడి మద్దతుదారులే అని సాక్షి చెప్పింది.

పాకిస్థాన్ 313 ఆలౌట్

ఆసీస్‌తో మూడో టెస్టు

సిడ్నీ: కెప్టెన్ కమిన్స్ (5/61) వరుసగా మూడో ఇన్నింగ్స్‌లోనూ ఐదు వికెట్లు తీయడంతో.. ఆస్ట్రేలియాతో బుధవారం ప్రారంభమైన మూడో టెస్ట్ తొలి ఇన్నింగ్స్‌లో పాకిస్థాన్ 313 పరుగులకు ఆలౌటైంది. 96/5తో కష్టాల్లో పడ్డ పర్యాటక జట్టును రిజ్వాన్ (88), ఆమెర్ జమాల్ (82), ఆఘా సల్మాన్ (53) అర్ధ శతకాలతో ఆదుకున్నారు. అనంతరం మొదటి ఇన్నింగ్స్ చేపట్టిన ఆసీస్ తొలిరోజు ఆఖరికి వికెట్ నష్టపోకుండా 6 పరుగులు చేసింది.

రూ.22,880 కోట్ల విలువైన 286 ఎకరాల భూమి మాయం!

» నకిలీ పత్రాలతో ఆక్రమణ.. సీఐడీ విచారణ జరిపించాలి

» సీఎం రేవంత్‌రెడ్డికి లేఖ రాసిన కూనంనేని

హైదరాబాద్, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్ కూకట్‌పల్లిలో రూ.22,880 కోట్ల విలువైన వివాదాస్పద భూమిని కొంతమంది నకిలీ పత్రాలు సృష్టించి ఆక్రమించారని, ఈ అక్రమ దందాపై సీఐడీ విచారణ జరిపించాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు సీఎం రేవంత్‌ను కోరారు. ఈ భూములను రాష్ట్ర ప్రభుత్వం స్వాధీనం చేసుకుని ప్రజల సంక్షేమం కోసం ఉపయోగించాలని సీఎంకు ఆయన లేఖ రాశారు. అందులోని వివరాలను ఒక ప్రకటన ద్వారా విడుదల చేశారు. మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కూకట్‌పల్లి గ్రామ పరిధిలోని సర్వే నంబరు 1007లో ఉన్న 286 ఎకరాల భూమికి నవాబ్ రయీస్ యార్ జంగ్ బహదూర్ యజమాని. ఆయన ఆ భూమికి వారసులుగా కుమారుడు ఫజిలత్ హుస్సేన్‌తో పాటు ఆయన తల్లి, సోదరి, సోదరులకు హక్కు ఉంటుందని పేర్కొన్నారు. బహదూర్ 1960లో మృతి చెందారు. ఫజిలత్ హుస్సేన్‌కు పిల్లలు లేరు. కాలక్రమేణ భూముల విలువ పెరగడంతో.. షాదిఖ్ మొహియుద్దీన్ అనే వ్యక్తి 286 ఎకరాల భూమికి సంబంధించి తనకు గిఫ్ట్ డీడ్ ఉందంటూ నకిలీ పత్రాలను సృష్టించారు. ఆయన చూపే రికార్డులు, పత్రాలు అన్నీ నకిలీవే. ప్రస్తుతం ఒక ఎకరాకు సుమారు రూ.80 కోట్ల ధర పలుకుతోంది. ఈ లెక్కన 286 ఎకరాల భూమికి రూ.22,880 కోట్లు వచ్చే అవకాశం ఉంది. ప్రస్తుతం ప్రైమ్ ప్రాపర్టీస్ పేరు మీద ఉన్న ఈ భూముల్లో అభివృద్ధి పనులు చేపడుతున్నారు. ఈ భూముల ఆక్రమణపై సీఐడీ విచారణ జరిపించాలి." అని కూనంనేని ఆ లేఖలో విజ్ఞప్తి చేశారు.

కేసీఆర్ కుటుంబ అవినీతిపై విచారణ కమిటీ

» మావోయిస్టు పార్టీ ప్రతినిధి జగన్ డిమాండ్

హైదరాబాద్, జనవరి 3 (ఆంధ్రజ్యోతి) : మాజీ సీఎం కేసీఆర్ కుటుంబ అవినీతిపై కాంగ్రెస్ ప్రభుత్వం విచారణ కమిటీని ఏర్పాటు చేయాలని మావోయిస్టు పార్టీ డిమాండ్ చేసింది. ఈ మేరకు మావోయిస్టు పార్టీ తెలంగాణ కమిటీ అధికార ప్రతినిధి జగన్ పేరుతో మీడియాకు ఒక ప్రకటన విడుదలయింది. కేసీఆర్ కుటుంబం అన్ని ఆస్తులను ఎలా సంపాదించింది? హరీశ్‌రావు ఏ శ్రమ చేసి వేల కోట్ల ఆసామి అయ్యారు?" అని ఆ ప్రకటనలో జగన్ నిలదీశారు. గత పాలకులు కాళేశ్వరం, మిషన్ భగీరథ వంటి పథకాల పేరుతో ప్రజాధనాన్ని దుర్వినియోగం చేశారన్నారు.ప్రజాఆస్తులను కొల్లగొట్టిన కేసీఆర్ కుటుంబాన్ని ప్రజల ముందు దోషులుగా నిలబెట్టి శిక్షించాలని జగన్ ప్రకటనలో డిమాండ్ చేశారు.

బీఆర్ఎస్ తప్పులు కాంగ్రెస్ చేయొద్దు

» ప్రజాధనాన్ని లూటీ చేస్తే ఆ పార్టీ గతే:ప్రవీణ్‌కుమార్

హైదరాబాద్, భానుపురి, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రాన్ని పదేళ్ల పాటు పాలించిన బీఆర్ఎస్ అప్పులు చేసి ప్రజాధనాన్ని లూటీ చేసినట్లు కాంగ్రెస్ ప్రభుత్వం పాలన చేయొద్దని బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్.ఎస్. ప్రవీణ్ కుమార్ సూచించారు. ప్రభుత్వం ఏర్పడి కొద్ది రోజులే అయినందున ఇప్పుడే విమర్శలు చేయడం మంచిది కాదన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలు నెరవేర్చకపోతే ప్రజల పక్షాన నిరంతరం పోరాడతామన్నారు. ప్రాజెక్టుల పేరుతో ప్రజాధనాన్ని లూటీ చేస్తే బీఆర్ఎస్‌కు పట్టిన గతే కాంగ్రెస్‌కు పడుతుందని చెప్పారు.

కాళేశ్వరం ప్రాజెక్టుపై సీబీఐ విచారణ జరిపించాలి

» పార్లమెంటరీ బోర్డు సభ్యుడు లక్ష్మణ్

హైదరాబాద్, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): కాళేశ్వరం ప్రాజెక్టు మీద సీబీఐ విచారణ జరిపించాలని ఓబీసీ మోర్చా జాతీయ అధ్యక్షుడు లక్ష్మణ్ అన్నారు. సావిత్రిబాయిపూలే జయంతి వేడుకల్లో పాల్గొని, నివాళులు అర్పించిన సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళల స్వశక్తీకరణ కోసం సావిత్రిబాయిపూలే పాటు పడ్డారని, ఆమె సేవలకు వెల కట్టలేమని చెప్పారు. పూలే ఆశయాలను ప్రధాని మోదీ కొనసాగిస్తున్నారని చెప్పారు. సీబీఐతో విచారణ జరిపించి, కాళేశ్వరం అవినీతిని బయట పెడతామని ఎన్నికలకు ముందు కాంగ్రెస్ పార్టీ చెప్పగా.. ఇప్పుడు రిటైర్డ్ సిట్టింగ్ జడ్జితో న్యాయ విచారణకు సీఎం ఆదేశించడం ఏమిటని ఆయన ప్రశ్నించారు.

మేడారం జాతరకు ప్రత్యేక ఆహ్వాన పత్రిక

» 'కోయ ఇలవేల్పుల పండుగకు రండి' పేరుతో ప్రచురణ

హైదరాబాద్, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ కుంభమేళా అయిన మేడారం జాతరకు రాష్ట్రపతి, ప్రధాని, కేంద్రమంత్రులతో పాటు 8 రాష్ట్రాల గవర్నర్లు, ముఖ్యమంత్రులను ఆహ్వానించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాట్లు చేస్తోంది. వారిని ఆహ్వానించేందుకు 'కోయ ఇలవేల్పుల పండుగకు రండి' అంటూ ప్రత్యేకంగా ఆహ్వాన పత్రికను రూపొందించింది. ఆహ్వాన పత్రికతో పాటు జాతర విశేషాలతో కూడిన పుస్తకాన్ని, సమ్మక్క- సారక్క గద్దెల ఫొటోను, పసుపు- కుంకుమ భరిణెను, ఒక కోయబొమ్మను, గత జాతర సమయంలో 'ది లెజెండ్ ఆఫ్ మేడారం' పేరుతో గిరిజన శాఖ ప్రత్యేకంగా రూపొందించిన పుస్తకాన్ని అందించనుంది. తెలంగాణ చుట్టుపక్కల ఉన్న 8 రాష్ట్రాలకు ఆహ్వానాలు పంపేందుకు రాష్ట్ర సర్కారు నిర్ణయించింది. మేడారం జాతర, ఏర్పాట్లు తదితర అంశాలపై ఈ నెల 8వ తేదీన మంత్రి సీతక్క, గిరిజనశాఖ అధికారులతో సమీక్ష నిర్వహించనున్నట్టు సమాచారం.



తెలంగాణ భవన్‌లో ఆదిలాబాద్ నేతలతో మాట్లాడుతున్న కేటీఆర్

ఓటమికి 170 కారణాలు!

» ఆత్మపరిశీలన చేసుకుంటాం.. ముందుకెళతాం..

» లోక్‌సభ ఎన్నికల్లో 3 పార్టీల మధ్యే పోటీ

» 22 తర్వాత అభ్యర్థులను నిర్ణయిస్తాం

» 420 అబద్ధాలతో అధికారంలోకి కాంగ్రెస్

» వంద రోజుల్లో హామీలను అమలు చేయకుంటే బొందపెడతాం

» కేసీఆర్ సీఎం కాకపోవడాన్ని ప్రజలు జీర్ణించుకోవడంలేదు: కేటీఆర్

హైదరాబాద్, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్ ఓటమికి 170 కారణాలు తమ దృష్టికి వచ్చాయని ఆ పార్టీ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తెలిపారు. ప్రజల్లో ఉన్న అభిప్రాయాలు, క్షేత్రస్థాయి పరిస్థితుల ఆధారంగా పార్టీ నేతలు ఈ విషయాలను తమ దృష్టికి తెచ్చారని పేర్కొన్నారు. స్వల్ప ఓట్ల తేడాతో అధికారం కోల్పోయినప్పటికీ.. దానికి కారణాలు తెలుసుకొని ఆత్మపరిశీలన చేసుకుంటామని, ఇకపై రెట్టించిన ఉత్సాహంతో పనిచేస్తామని అన్నారు. బుధవారం ఆదిలాబాద్ పార్లమెంటరీ నియోజకవర్గ సమీక్ష సమావేశం అనంతరం తెలంగాణ భవన్‌లో మాజీ మంత్రులు నిరంజన్‌రెడ్డి, ప్రశాంత్‌రెడ్డి, జోగు రామన్నతో కలిసి కేటీఆర్ మీడియాతో మాట్లాడారు. "అసెంబ్లీ ఎన్నికల ఫలితాలు మాకు ప్రతికూలంగా రావడం వెనుక బలమైన కారణాలను పార్టీ శ్రేణుల ద్వారా తెలుసుకుంటున్నాం. ఆదిలాబాద్ పార్లమెంటు నియోజకవర్గ నాయకుల్లో 26 మంది మాట్లాడితే.. పార్టీ అంతర్గత సమస్యలు, కాంగ్రెస్ పార్టీ చెప్పిన అబద్ధాలు, ప్రజల్లో చేసిన దుష్ప్రచారం వంటి 170కిపైగా కారణాలు మా దృష్టికి వచ్చాయి. పార్టీ నిర్మాణంపై దృష్టి పెట్టి ఉంటే బాగుండేదని, పదేళ్ల పార్టీ నిర్మాణాన్ని ఇంకా సుదృఢం చేసి ఉంటే కార్యకర్తల్లో నిస్తేజం ఉండేది కాదని పలువురు అభిప్రాయపడ్డారు. ప్రభుత్వంలో పలు కార్యక్రమాలను సవరిస్తే బాగుండేదన్నారు. పార్టీ అంతర్గత సమస్యలు, పలువురు ఎమ్మెల్యేల పట్ల ప్రజల్లో వ్యతిరేకత, ఇతర అంశాలను కుండబద్దలు కొట్టినట్లు వెల్లడించారు" అని కేటీఆర్ చెప్పారు. ఓటమి నుంచి ఎవరైనా పాఠాలు నేర్చుకోవాల్సిందేనని, నాయకులు, కార్యకర్తలు, ప్రజల నుంచి వచ్చిన అభిప్రాయాలను ఆచరణలో పెట్టేందుకు ప్రయత్నిస్తామని తెలిపారు. ఎన్నికల సందర్భంగా జరిగిన చిన్న చిన్న పొరపాట్లను సవరించుకుంటామన్నారు. పార్టీ శ్రేణుల ఏకాభిప్రాయంతోనే ఈ నెల 22 తర్వాత లోక్‌సభ ఎన్నికలకు అభ్యర్థులను ఖరారు చేస్తామని చెప్పారు.

పోటీ మూడు పార్టీల మధ్యనే..!

లోక్‌సభ ఎన్నికల్లో పోటీ బీఆర్ఎస్, కాంగ్రెస్, బీజేపీ మధ్యనే ఉంటుందని కేటీఆర్ అన్నారు. బీజేపీకి బీఆర్ఎస్ బీటీమ్ అంటూ కాంగ్రెస్ దుష్ప్రచారం చేస్తోందన్నారు. అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీలోని బలమైన నాయకులను బీఆర్ఎస్ ఓడించిందని, కామారెడ్డిలో బీజేపీ అభ్యర్థి బీఆర్ఎస్‌ను ఓడించిన విషయాన్ని తెలుసుకోవాలని హితవు పలికారు. గత లోక్‌సభ ఎన్నికల్లో మాదిరిగానే.. కాంగ్రెస్ మరోసారి బీజేపీతో అంతర్గతంగా అవగాహనకు వచ్చినట్లు కనిపిస్తోందని ఆరోపించారు. అందుకే బండి సంజయ్.. రేవంత్‌రెడ్డిని పొగుడుతున్నారని, దీనిపై ప్రజలు అప్రమత్తం కావాలని అన్నారు. తెలంగాణ అస్తిత్వం కోసం ప్రజలు బీఆర్ఎస్‌ను బలపరచాలని కోరారు. తెలంగాణ ప్రయోజనాల కోసం పోరాడేది ఈ రాష్ట్రాన్ని సాధించిన బీఆర్ఎస్ పార్టీ మాత్రమేనన్నారు. ప్రతి రాష్ట్రంలో గుర్తింపు తేగలిగే పార్టీ, నాయకుడు ఒకరు ఉంటారని, బెంగాల్‌లో మమతాబెనర్జీ, ఏపీలో జగన్, చంద్రబాబు, తెలంగాణలో కేసీఆర్ మాత్రమే ఇలాంటివారని తెలిపారు. తెలుగువారంటే ఎన్టీఆర్ గుర్తుకొచ్చినట్లు.. తెలంగాణ అంటే కేసీఆర్ గుర్తుకొస్తారని పేర్కొన్నారు. రాష్ట్ర ప్రయోజనాలు ఢిల్లీలో బలంగా వినిపించాలంటే కేసీఆర్ దండు పార్లమెంటులో ఉండాల్సిందేనన్నారు. తమిళనాడు మాదిరిగా రాజకీయ వైరుధ్యాలకు అతీతంగా ఇక్కడి కాంగ్రెస్, బీజేపీ ఎంపీలు రాష్ట్రం కోసం ఏనాడూ కలిసి రాలేదని, తెలంగాణకు మంచి జరిగితే.. కేసీఆర్‌కు క్రెడిట్ వస్తుందన్న ఉద్దేశంతో రాష్ట్ర అభివృద్ధిని విస్మరించాయని ఆరోపించారు. మత విద్వేషం తప్ప.. బీజేపీ మంచి చేసిందేమీ లేదన్నారు. తెలంగాణ రాష్ట్రం కోసం పార్లమెంటులో రాహుల్ గాంధీ ఎన్నడూ మాట్లాడలేదని, నరేంద్ర మోదీ, రాహుల్ గాంధీకి తెలంగాణతో అవసరం లేదని, అన్యాయం జరిగితే కేంద్రంతో నిలబడేది, కలబడేది టీఆర్ఎస్ పార్టీ మాత్రమేనని చెప్పారు.

జనం జీర్ణించుకోలేకపోతున్నారు..

"మా నియోజకవర్గ ఎమ్మెల్యేపై వ్యతిరేకతతో ఓడించాం. కానీ, సీఎంగా కేసీఆర్ దిగిపోతారని అనుకోలేదని ప్రజలు చెబుతున్నారు. ఆయన సీఎం కాకపోవడాన్ని జనం జీర్ణించుకోలేకపోతున్నారు" అని కేటీఆర్ అన్నారు. ప్రతి గ్రామంలో జరుగుతున్న చర్చను ఆదిలాబాద్ నాయకులు తమ దృష్టికి తెచ్చారని, పదేళ్ల పాలనలో జరిగిన అభివృద్ధి విషయంలో ఎలాంటి ఫిర్యాదుల్లేవని, కొన్ని లోటుపాట్లను సవరిస్తే బాగుండేదన్న అభిప్రాయాన్ని వారు చెప్పారని తెలిపారు. కాంగ్రెస్ తమపై చేసిన దుష్ప్రచారాన్ని సరిగా ఖండించలేకపోయామని, ఇది కూడా ఓటమికి కారణమని అన్నారు. అడ్డగోలు హామీలిచ్చిన కాంగ్రెస్.. అధికారం చేపట్టాక వాటిని అమలు చేయలేకనే తమపై విమర్శలు, ఆరోపణలు చేస్తోందని కేటీఆర్ మండిపడ్డారు. కాంగ్రెస్ ఇచ్చిన 420 హామీలను ప్రజల్లోకి తీసుకెళ్లి ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తామని, ఇందుకుగాను పార్టీ కార్యకర్తలందరికీ తమ పార్టీ ముద్రించిన కాంగ్రెస్ 420 హామీల బుక్‌లెట్‌ను అందిస్తున్నామని తెలిపారు. వంద రోజుల్లో హామీలను అమలు చేయకపోతే ఆ పార్టీని బొందపెట్టేలా కార్యాచరణ రూపొందిస్తామన్నారు. కాంగ్రెస్ పార్టీ తెలంగాణలో రాజకీయాలకు ఆగడాలకు పాల్పడుతోందని, తుంగతుర్తి లాంటి చోట్ల తమ పార్టీ కార్యకర్తలను ఇబ్బందులు పెడుతున్నారని తెలిపారు. వీటిని ప్రజాస్వామికంగా ఎదుర్కొంటామన్నారు. ఎన్నికల హామీలు ఎగ్గొట్టేందుకు ప్రభుత్వం శ్వేత పత్రాలు, క్రూజర్ వాహనాలు దాచారన్న ఆరోపణలతో ప్రజల దృష్టి మళ్లించే ప్రయత్నం చేస్తోందన్నారు. రైతుబంధు రాకపోవడంపై ప్రజలు అసంతృప్తితో ఉన్నారని, సీఎం చేస్తున్న ప్రకటనలు చూసి నవ్వుకుంటున్నారని అన్నారు. తెలంగాణ బ్రాండ్ ఇమేజ్‌ను దెబ్బతీసేలా కాంగ్రెస్ వ్యవహరిస్తోందని ఆరోపించారు. తెలంగాణ సాధించిన విజయాలను, కాళేశ్వరం వంటి ప్రాజెక్టులను సైతం వైఫల్యాలుగా చిత్రీకరించే ప్రయత్నం చేస్తోందని మండిపడ్డారు.

ఆదిలాబాద్ నుంచి బీఆర్ఎస్ తరఫున రేసులో ముగ్గురు!

ఆదిలాబాద్ లోక్‌సభ స్థానానికి బీఆర్ఎస్ తరఫున పోటీ చేసేందుకు ముగ్గురు అభ్యర్థులు టికెట్ ఆశిస్తున్నట్లు తెలుస్తోంది. పార్టీ గెలుపే లక్ష్యంగా లోక్‌సభ నియోజకవర్గాల వారీగా బీఆర్ఎస్ వరుస సమావేశాలు నిర్వహిస్తోంది. తొలిరోజు ఆదిలాబాద్ నియోజకవర్గం పరిధిలోని ఎమ్మెల్యేలు, మాజీ ఎమ్మెల్యేలు, ముఖ్యనేతలతో తెలంగాణ భవన్‌లో బుధవారం సమావేశం జరిగింది. ఇందులో పాల్గొనేందుకు ఆదిలాబాద్ లోక్‌సభ పరిధిలోని ఆయా నియోజకవర్గాలకు చెందిన ముఖ్య నాయకులు, పార్టీ శ్రేణులు పాల్గొన్నారు. ఉదయం 11.30 నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు సుదీర్ఘంగా జరిగిన ఈ సమావేశంలో ఆ నియోజకవర్గంలో పార్టీ స్థితిగతులు, సమస్యలు, వాటిని అధిగమించేందుకు ఏం చేయాలన్న దానిపై చర్చ కొనసాగింది. సమావేశంలో.. పార్టీ ఎంపీ అభ్యర్థులుగా ఎవరిని బరిలో నిలబెట్టాలన్న దానిపై కూడా అభిప్రాయాలు సేకరించినట్లు సమాచారం. పార్టీ తరఫున పోటీ చేసేందుకు సిద్ధంగా ఉన్నవారిలో ఆత్రంసక్కు, జి.నగేశ్, జాన్సన్ నాయక్ పేర్లు ప్రధానంగా వినిపించినట్లు తెలుస్తోంది. టికెట్ ఆశిస్తున్న ఆ ముగ్గురికి మద్దతుగా ముఖ్య నాయకులతోపాటు, పార్టీ శ్రేణులు సైతం తమ నేతకే టికెట్ ఇవ్వాలని కోరినట్లు తెలిసింది. పార్టీ శ్రేణుల అభిప్రాయం మేరకు టికెట్ కేటాయించనున్నట్లు బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ప్రకటించిన నేపథ్యంలో ఆదిలాబాద్ పార్లమెంటు టికెట్ ఎవరికి దక్కుతుందన్న దానిపై ఉత్కంఠ నెలకొంది. ఇదిలా ఉండగా.. నేడు (గురువారం) కరీంనగర్ లోక్‌సభ నియోజకవర్గం పరిధిలోని నేతలతో సమావేశంనిర్వహించనున్నారు.

కాంగ్రెస్ 420 హామీలు

(మొదటి పేజీ తరువాయి)

ప్రారంభించిందని విమర్శించింది. ఇప్పటికైనా ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేసేలా కార్యాచరణ ప్రారంభించాలని డిమాండ్ చేసింది. సాగదీత ప్రక్రియకు పాల్పడకుండా లోక్‌సభ ఎన్నికల కోడ్ రాకముందే ఎన్నికల ప్రచారంలో ఇచ్చిన హామీలను నెరవేర్చాలని సూచించింది. రైతు భరోసా కింద ఎకరాకు రూ.15 వేల సాయం, వ్యవసాయ కూలీలకు రూ.12వేలు, క్వింటాల్ ధాన్యానికి రూ.500 బోనస్ హామీలను గుర్తు చేసింది. గృహ జ్యోతి కింద 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్, ఇందిరమ్మ ఇళ్లు, మహిళలకు ప్రతి నెలా రూ.2,400 భృతి, రూ.500కే గ్యాస్ సిలిండర్, యువ వికాసం కింద విద్యార్థులకు రూ.5లక్షల భరోసా కార్డు, ప్రతి మండలంలో ఇంటర్నేషనల్ స్కూల్, చేయూత కింద రూ.4 వేల పెన్షన్ వంటి హామీలను ఎప్పటి నుంచి అమలు చేస్తారో చెప్పాలని కోరింది. కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణంలో జరిగిన అవినీతిపై సిట్టింగ్ జడ్జితో న్యాయ విచారణ, ఉద్యోగులకు ప్రతి నెలా ఒకటో తేదీన జీతాలు చెల్లింపు వంటి హామీలను గుర్తు చేసింది. కేవలం హామీలు ఇచ్చి.. తెలంగాణ ప్రజలను మోసం చేస్తామంటే ఊరుకోబోమని బీఆర్ఎస్ స్పష్టం చేసింది. అధికార పార్టీపై ఒత్తిడి తీసుకొస్తామని, ఆ పార్టీ మోసాలను ఎప్పటికప్పుడు ప్రజలకు గుర్తు చేస్తామని వెల్లడించింది.

గవర్నర్ నిర్ణయంపై హైకోర్టుకు బీఆర్ఎస్ నేతలు

నామినేటెడ్ ఎమ్మెల్సీలను తిరస్కరించడంపై సవాలు

హైదరాబాద్, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం నామినేట్ చేసిన ఎమ్మెల్సీలను గవర్నర్ తిరస్కరించడాన్ని సవాల్ చేస్తూ బీఆర్ఎస్ నేతలు దాఖలు చేసిన పిటిషన్ హైకోర్టులో శుక్రవారం విచారణకు రానుంది. గవర్నర్ నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ బీఆర్ఎస్ నేతలు దాసోజు శ్రవణ్, కుర్ర సత్యనారాయణ హైకోర్టును ఆశ్రయించారు. శ్రవణ్, సత్యనారాయణను ఎమ్మెల్సీలుగా నామినేట్ చేస్తూ గత జూలైలో మంత్రి మండలి తీర్మానం చేసింది. మంత్రి మండలి నిర్ణయాన్ని గవర్నర్ తమిళిసై సౌందరరాజన్ నిరుడు సెప్టెంబర్ 19న తిరస్కరించారు. మంత్రిమండలికి ఎమ్మెల్సీలను నామినేట్ చేసే హక్కు ఉంటుందని, గవర్నర్ తన పరిధి దాటి వ్యవహరించారని పిటిషనర్లు పేర్కొన్నారు. దీనిపై శుక్రవారం సీజే ధర్మాసనం విచారణ చేపట్టనుంది.

పటిష్ఠం దిశగా రేవంత్ టీమ్

సీఎంవోలోకి మరో ముగ్గురు అధికారులు

ఇదివరకే ముగ్గురి నియామకం

మహిళా అధికారిగా సంగీతసత్యనారాయణ

కార్యదర్శిగా ఐఎఫ్ఎస్ చంద్రశేఖర్‌రెడ్డి

ఓఎస్‌డీగా రిజిస్ట్రేషన్ల జేఐజీ వేముల శ్రీనివాస్

హైదరాబాద్, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ముఖ్యమంత్రి ఎ. రేవంత్‌రెడ్డి తన టీమ్‌ను బలోపేతం చేసుకుంటున్నారు. ముఖ్యమంత్రి కార్యాలయం(సీఎంవో)లోని కీలక పోస్టులను భర్తీ చేయించుకుంటున్నారు. సీనియర్ నేతలను తన క్యాబినెట్‌లోకి తీసుకున్న రేవంత్‌రెడ్డి.. సీఎంవోను కూడా సమర్థులైన అధికారులతో పటిష్ఠం చేస్తున్నారు. నిజానికి ప్రభుత్వపరమైన ఎలాంటి కీలక నిర్ణయం తీసుకోవాలన్నా.. సీఎంవోలో పనిచేసే అధికారులే ప్రధానం. అందుకే సీఎంవోలో వివిధ విభాగాల్లో నిష్ణాతులైన అధికారులను ఆయన నియమించుకుంటున్నారు. రెవెన్యూ చట్టాలు, భూవ్యవహారాల్లో నైపుణ్యం ఉన్న వి.శేషాద్రిని సీఎంవో కార్యదర్శిగా నియమించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత మొట్టమొదటి నియామకం ఇదే. ఆ తర్వాత ఐపీఎస్ అధికారి షానవాజ్ ఖాసీంను సీఎంవో కార్యదర్శిగా నియమించారు. శాంతి భద్రతలు, పోలీసు శాఖ వ్యవహారాలను చూడడానికి ఈయన నియామకం జరిగింది. ఇండియన్ డిఫెన్స్ ఎస్టేట్స్ సర్వీసెస్(ఐడీఈఎస్)కు చెందిన 2012 బ్యాచ్ అధికారి బి.అజిత్‌రెడ్డిని సీఎంవోలో ఓఎస్‌డీగా నియమించారు. ఇదివరకు ఈయన సికింద్రాబాద్, ఆగ్రా కంటోన్మెంట్ బోర్డులలో పనిచేశారు. రక్షణ శాఖ భూములపై ఆయనకు మంచి అవగాహన ఉంది. నగరంలోని కొన్ని రక్షణ శాఖ భూములపై కేంద్ర ప్రభుత్వానికి, రాష్ట్ర ప్రభుత్వానికి మధ్య చర్చలు సాగుతున్నాయి. ఇలాంటి వ్యవహారాల్లో పాత్ర పోషించడానికి అజిత్‌రెడ్డిని నియమించినట్లు తెలుస్తోంది. ఇలా ముగ్గురు అధికారులను నియమించుకున్న సీఎం రేవంత్.. బుధవారం మరో ముగ్గురు అధికారులను సీఎంవోలోకి తీసుకున్నారు. అటవీ శాఖలో అనుభవం ఉన్న 1991 బ్యాచ్‌కు చెందిన ఐఎఫ్ఎస్ అధికారి, ప్రస్తుతం తెలంగాణ రాష్ట్ర అటవీ అభివృద్ధి సంస్థ(టీఎస్ఎఫ్‌డీసీ) వైస్ చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్‌గా ఉన్న జి.చంద్రశేఖర్‌రెడ్డిని అక్కడి నుంచి బదిలీ చేసి, సీఎంవో కార్యదర్శిగా నియమించారు. ఈయనకు అటవీ విస్తరణ, పర్యావరణ బాధ్యతలు అప్పగించే అవకాశాలున్నాయి. సీఎంవో సంయుక్త కార్యదర్శిగా సంగీతసత్యనారాయణను నియమించారు. టీఎస్ ఫుడ్స్ ఎండీగా ఉన్న ఆమెను బదిలీ చేసి, సీఎంవోలోకి తీసుకున్నారు. దీంతో సీఎంవోలో కూడా ఓ మహిళా అధికారికి పోస్టింగ్ ఇచ్చినట్లయింది. స్టాంపులు-రిజిస్ట్రేషన్ల శాఖ జాయింట్ ఇన్‌స్పెక్టర్ జనరల్, నాన్-కేడర్ అధికారి వేముల శ్రీనివాస్‌ను బదిలీ చేసి, సీఎంవోలో ఆఫీసర్ ఆన్ స్పెషల్ డ్యూటీగా నియమించారు.

టీఎస్‌టీఎస్ ఎండీగా శంకరయ్య

తెలంగాణ రాష్ట్ర టెక్నాలజీ సర్వీసెస్(టీఎస్‌టీఎస్) మేనేజింగ్ డైరెక్టర్‌గా జె.శంకరయ్యను ప్రభుత్వం నియమించింది. జీహెచ్ఎంసీ అడిషనల్ కమిషనర్‌గా ఉన్న ఈయనను బదిలీ చేసి, టీఎస్‌టీఎస్ ఎండీగా నియమించారు. ఈయన నాన్ ఐఏఎస్ అధికారి. ఈ నియామకంపైనా సీఎస్ ఉత్తర్వులిచ్చారు.

స్మితా సభర్వాల్‌పై వేటు

(మొదటి పేజీ తరువాయి)

బదిలీ చేసి, ఇరిగేషన్ శాఖ కార్యదర్శిగా నియమించింది. గతంలో బీఆర్ఎస్ ప్రభుత్వం కూడా సీనియర్ ఐఏఎస్ అధికారి, సమర్థుడనే పేరున్న సురేశ్ చందాను ఇదే పోస్టులో నియమించింది. ఇక మరో ఐదు జిల్లాలు.. సంగారెడ్డి, రంగారెడ్డి, మహబూబాబాద్, నల్లగొండ, జోగుళాంబ-గద్వాల జిల్లాల కలెక్టర్లను కూడా ప్రభుత్వం బదిలీ చేసింది. వెయిటింగ్‌లో ఉన్న ముగ్గురు ఐఏఎస్ అధికారులు డి.దివ్య, భారతి హోలికెరి, చిట్టెం లక్ష్మిలకు పోస్టింగులు ఇచ్చింది. ఎనిమిది మంది ఐఏఎస్‌లు.. బుర్రా వెంకటేశం, సందీప్‌కుమార్ సుల్తానియా, జ్యోతి బుద్ధప్రకాశ్, ఎం.రఘునందన్‌రావు, ఎం.ప్రశాంతి, డి.కృష్ణభాస్కర్, ఆర్‌వీ కర్ణన్, ఎం.హరితలకు ప్రభుత్వం వివిధ శాఖలు, విభాగాల అదనపు బాధ్యతలను అప్పగించింది. ఇటీవలే 'ప్రజావాణి' రాష్ట్ర నోడల్ అధికారిణిగా నియమితులైన హరిచందన దాసరిని బదిలీ చేసింది. ప్రజావాణి కార్యక్రమాన్ని ప్రారంభించిన వెంటనే హరిచందనను పురపాలక శాఖ డైరెక్టర్‌గా, ప్రజావాణి రాష్ట్ర నోడల్ అధికారిణిగా నియమించింది. కానీ, ఇంతలోనే ఆమెను బదిలీ చేసి, నల్లగొండ కలెక్టర్‌గా బాధ్యతలు అప్పగించింది.

లూప్‌లైన్‌లో స్మితా సభర్వాల్

బీఆర్ఎస్ ప్రభుత్వంలో స్మితా సభర్వాల్ చాలాకాలం పాటు సీఎంవో కార్యదర్శిగా పని చేసిన విషయం తెలిసిందే. ఆ ప్రభుత్వ ప్రతిష్ఠాత్మక పథకమైన మిషన్ భగీరథకు, ఆర్‌డబ్ల్యూఎస్ విభాగానికి అదనపు బాధ్యతలనూ నిర్వహించారు. సాగునీటి పారుదల శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శిగా రజత్‌కుమార్ పదవీ విరమణ చేయగానే.. ఆ శాఖ కార్యదర్శిగా అదనపు బాధ్యతలు చేపట్టారు. ఇలా కీలకమైన బాధ్యతలు నిర్వహించి, ముఖ్యమైన అధికారిణిగా వెలిగారు. కానీ, కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత స్మితా సభర్వాల్ విషయంలో కొన్ని వివాదాస్పద వార్తలు వెలువడ్డాయి. ఆమె కేంద్ర సర్వీసులకు వెళతారన్న ప్రచారం జరిగింది. సాగునీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి నిర్వహించిన సమీక్ష సమావేశానికి ఆమె హాజరు కాకపోవడం వివాదాస్పదమైంది. ఆ నేపథ్యంలో స్మితా సభర్వాల్ ఎక్స్ (ట్విట్టర్) ద్వారా ఓ ప్రకటన చేశారు. తాను కేంద్ర సర్వీసులకు వెళ్లడం లేదని, కొత్త ప్రభుత్వం ఏ బాధ్యతలు అప్పగించినా నిర్వహిస్తానని, తెలంగాణ రాష్ట్ర కేడర్ అధికారిణిగా గర్విస్తున్నానంటూ ట్వీట్ చేశారు. కానీ, కాంగ్రెస్ ప్రభుత్వం ఆమె పట్ల మొదటి నుంచీ కొంత ఆగ్రహంతోనే ఉంది. అందుకే ఈసారి వేటు వేసి, ఎలాంటి ప్రాధాన్యం లేని రాష్ట్ర ఫైనాన్స్ కమిషన్ సభ్య కార్యదర్శిగా నియమించింది. నిజానికి ఇది డిప్యూటీ కలెక్టర్ స్థాయి పోస్టు. గ్రామ పంచాయతీలకు నిధులను సిఫారసు చేయడం తప్ప.. ఎలాంటి కార్యకలాపాలు ఉండవు. ఎవరినైనా లూప్‌లైన్‌లో పెట్టాలంటే ఇలాంటి పోస్టుల్లో నియమిస్తారు. ఇప్పుడు స్మితా సభర్వాల్‌ను కూడా ఈ స్థానంలోకి పంపించడం ద్వారా లూప్‌లైన్‌లో పెట్టినట్లయింది.

ఐఏఎస్ అధికారుల బదిలీల వివరాలు

అధికారి పేరు	ప్రస్తుత పోస్టు	బదిలీ అయిన స్థానం
బెనహర్ మహేశ్‌దత్ ఎక్కా	ఏడీజీ, ఎంసీఆర్‌హెచ్‌ఆర్‌డీ	మైన్స్, జియాలజీ ముఖ్యకార్యదర్శి
అహ్మద్ నదీం	కార్మికశాఖ కమిషనర్	ప్రణాళిక శాఖ ముఖ్యకార్యదర్శి
రాహుల్ బొజ్జా	జీఏడీ కార్యదర్శి	సాగునీటి పారుదల శాఖ కార్యదర్శి
స్మితా సభర్వాల్	సీఎంవో కార్యదర్శి	ఫైనాన్స్ కమిషన్ సభ్య కార్యదర్శి
ఎ.శరత్	సంగారెడ్డి కలెక్టర్	గిరిజన సంక్షేమశాఖ కార్యదర్శి
డి.దివ్య	వెయిటింగ్	పురపాలక శాఖ డైరెక్టర్, ప్రజావాణి రాష్ట్ర నోడల్ అధికారి
హరిచందన దాసరి	పురపాలక శాఖ డైరెక్టర్, ప్రజావాణి రాష్ట్ర నోడల్ అధికారి	నల్లగొండ కలెక్టర్
భారతి హోలికెరి	వెయిటింగ్	పురావస్తు శాఖ డైరెక్టర్
కె.శశాంక	మహబూబాబాద్ కలెక్టర్	రంగారెడ్డి కలెక్టర్
అద్వైత్‌కుమార్ సింగ్	కేంద్ర సర్వీసులు	మహబూబాబాద్ కలెక్టర్
చిట్టెం లక్ష్మి	వెయిటింగ్	టీఎస్ డెయిరీ కార్పొరేషన్ ఎండీ
ఎస్.కృష్ణ ఆదిత్య	పీసీబీ సభ్య కార్యదర్శి	కార్మిక శాఖ డైరెక్టర్
ఆయేషా మస్రత్ ఖానమ్	పంచాయతీరాజ్ జాయింట్ సెక్రటరీ	మైనారిటీ గురుకులాల కార్యదర్శి
ఎస్.సంగీత సత్యనారాయణ	టీఎస్ ఫుడ్స్ డైరెక్టర్	సీఎంవో జాయింట్ సెక్రటరీ
వల్లూరు క్రాంతి	జోగుళాంబ-గద్వాల కలెక్టర్	సంగారెడ్డి కలెక్టర్
బీఎం సంతోష్	టీఎస్‌పీఎస్సీ అదనపు కార్యదర్శి	జోగుళాంబ-గద్వాల కలెక్టర్
అభిలాష అభినవ్	వెయిటింగ్	జీహెచ్ఎంసీ జోనల్ కమిషనర్
పి.కధిరవరన్	భూపాలపల్లి అదనపు కలెక్టర్	హైదరాబాద్ జిల్లా అదనపు కలెక్టర్
బి.వెంకటేశం	విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి	బీసీ వెల్ఫేర్ అదనపు బాధ్యతలు
సందీప్‌కుమార్ సుల్తానియా	పంచాయతీరాజ్ ముఖ్యకార్యదర్శి	ఆర్‌డబ్ల్యూఎస్ అదనపు బాధ్యతలు
జ్యోతి బుద్ధప్రకాశ్	రవాణా శాఖ కమిషనర్	పీసీబీ సభ్య కార్యదర్శిగా అదనపు బాధ్యతలు
ఎం.రఘునందన్‌రావు	వ్యవసాయ శాఖ కార్యదర్శి	జీఏడీ కార్యదర్శిగా అదనపు బాధ్యతలు
ఎం.ప్రశాంతి	అటవీ శాఖ అదనపు కార్యదర్శి	ఆయుష్ డైరెక్టర్‌గా అదనపు బాధ్యతలు
కృష్ణ భాస్కర్	డిప్యూటీ సీఎం ఓఎస్‌డీ	ఆర్థిక, ప్రణాళిక శాఖ ప్రత్యేక కార్యదర్శిగా అదనపు బాధ్యతలు
ఆర్‌వీ కర్ణన్	ఆరోగ్యం, కుటుంబ సంక్షేమ శాఖ డైరెక్టర్	టీఎస్ఎంఎస్ఐడీసీ ఎండీగా అదనపు బాధ్యతలు

23 మంది ఐపీఎస్‌ల బదిలీలు

21 మంది నాన్-క్యాడర్ ఎస్పీలకూ స్థానచలనం.. టెక్నికల్ సర్వీసెస్‌కు వీవీ శ్రీనివాస్

» డీఐజీ కో-ఆర్డినేషన్‌గా గజరావు భూపాల్

» మహిళాభద్రత విభాగానికి రెమారాజేశ్వరి

» జోగులాంబ జోనల్ డీఐజీగా జోయెల్ డేవిస్



హైదరాబాద్, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో 23 మంది ఐపీఎస్‌లు, 21 మంది నాన్-క్యాడర్ ఎస్పీలను బదిలీ చేస్తూ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. కొత్త సర్కారు కొలువుదీరాక ఒకట్రెండు విడతల బదిలీలు ఇప్పటికే పూర్తవ్వగా.. బుధవారం నాటి బదిలీల్లో సింహభాగం 2008-19 బ్యాచ్‌ల ఐపీఎస్‌లు, వెయిటింగ్‌లో ఉన్న అధికారులు ఉన్నారు. తాజా బదిలీల్లో సీనియర్ ఐపీఎస్, పోలీసు నియామక బోర్డు ఛైర్మన్‌గా ఉన్న వీవీ శ్రీనివాసరావు టెక్నికల్ సర్వీసెస్‌కు బదిలీ అయ్యారు. తదుపరి ఉత్తర్వులు వెలువడే వరకు ఆయన అదనంగా బోర్డు ఛైర్మన్‌గా బాధ్యతలు నిర్వహిస్తారు. వెయిటింగ్‌లో ఉన్న డీఐజీ డాక్టర్ గజరావు భూపాల్‌కు డీఐజీ కో-ఆర్డినేషన్‌గా బాధ్యతలు అప్పగించారు. రెమా రాజేశ్వరిని మహిళా భద్రత విభాగానికి బదిలీ చేసిన ప్రభుత్వం.. రామగుండం సీపీగా ఎల్ఎస్ చౌహాన్‌ను నియమించింది. ఐపీఎస్‌లతోపాటు.. 21 మంది నాన్-క్యాడర్ ఎస్పీలు, అదనపు ఎస్పీలను కూడా ప్రభుత్వం బదిలీ చేసింది. ఈ మేరకు హోంశాఖ ముఖ్య కార్యదర్శి డాక్టర్ జితేందర్ ఉత్తర్వులు ఇచ్చారు. వెయిటింగ్‌లో ఉన్న పలువురు నాన్-క్యాడర్ ఎస్పీలకు తాజా బదిలీలతో పోస్టింగులు లభించాయి.

ఐపీఎస్‌ల బదిలీలు

అధికారి పేరు	పోస్టింగ్
వీవీ శ్రీనివాస రావు	ఏడీజీ టెక్నికల్ సర్వీసెస్, పోలీసు నియామక బోర్డు ఛైర్మన్‌గా అదనపు బాధ్యతలు
డాక్టర్ గజరావు భూపాల్	డీఐజీ కో-ఆర్డినేషన్, డీజీపీ కార్యాలయం
రెమా రాజేశ్వరి	మహిళాభద్రత విభాగం
ఎల్.ఎస్ చౌహాన్	రామగుండం పోలీసు కమిషనర్
డి.జోయెల్ డెవిస్	జోగులాంబ జోనల్ డీఐజీ
విష్ణు ఎస్.వారియర్	డీజీపీ కార్యాలయంలో రిపోర్ట్ చేయాలి
పి.వి.పద్మజ	మల్కాజిగిరి డీసీపీ
జి.జానకి షర్మిల	నిర్మల్ ఎస్పీ
జానకి ధారావత్	హైదరాబాద్ సౌత్-ఈస్ట్ జోన్ డీసీపీ
సునీల్ దత్	ఖమ్మం పోలీసు కమిషనర్
ఎస్.రాజేంద్రప్రసాద్	సీఐడీ ఎస్పీ
డి.ఉదయ్ కుమార్ రెడ్డి	ట్రాన్స్‌కో ఎస్పీ
గౌస్ ఆలం	ఆదిలాబాద్ ఎస్పీ
జి.వినీత్	మాదాపూర్ డీసీపీ
పి.శబరీశ్	ములుగు ఎస్పీ
నితిక పంత్	మేడ్చల్ డీసీపీ
బి.అనురాధ	సిద్దిపేట పోలీసు కమిషనర్
సీహెచ్ ప్రవీణ్ కుమార్	ఎల్బీనగర్ డీసీపీ
బిరుదురాజు రోహిత్‌రాజు	భద్రాద్రి కొత్తగూడెం ఎస్పీ
బి.బాలస్వామి	మెదక్ ఎస్పీ
అశోక్ కుమార్	జయశంకర్ భూపాల్ పల్లి ఓఎస్డీ
ఆర్.వెంకటేశ్వర్లు	హైదరాబాద్ ట్రాఫిక్ డీసీపీ-3
సీహెచ్ శ్రీనివాస్	రాజేంద్రనగర్ డీసీపీ

‘ధరణి’లో మార్పులకు శ్రీకారం

‘భూ మాత’గా మార్చేందుకు సన్నాహాలు

- 2 రోజులుగా భూముల రిజిస్ట్రేషన్లు బంద్
- బుధవారం మధ్యాహ్నమే మళ్లీ ప్రారంభం
- ప్రస్తుతం పోర్టల్‌లో రిజిస్ట్రేషన్లకే అనుమతి

(ఆంధ్రజ్యోతి, రంగారెడ్డి జిల్లా ప్రతినిధి)

రాష్ట్రంలో కొత్తగా ఏర్పాటైన కాంగ్రెస్ ప్రభుత్వం.. కీలకమైన రెవెన్యూ వ్యవహారాలపై దృష్టి సారించింది. ఎన్నికల సమయంలో ప్రకటించిన విధంగానే ధరణి పోర్టల్‌లో సమూల మార్పులకు శ్రీకారం చుట్టింది. ధరణి పోర్టల్‌ను ‘భూమాత’గా మార్చేందుకు సన్నాహాలు చేస్తోంది. ఇందులో భాగంగానే రెండు రోజుల పాటు భూముల రిజిస్ట్రేషన్లను సైతం నిలిపివేసింది. ముందస్తు సమాచారం లేకుండా భూముల రిజిస్ట్రేషన్లు నిలిపివేయడంతో స్లాట్లు బుక్ చేసుకున్న వారు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. అయితే, బుధవారం మధ్యాహ్నం నుంచి భూముల రిజిస్ట్రేషన్లు మళ్లీ ప్రారంభమయ్యాయి. రిజిస్ట్రేషన్ల కోసం మీసేవలో స్లాట్ల బుకింగ్ కూడా మళ్లీ ప్రారంభమైంది. అయితే, ధరణిలో భూసమస్యల పరిష్కార ప్రక్రియను మాత్రం పూర్తిగా నిలిపివేశారు. కేవలం.. ఆయా సమస్యలపై మీ సేవల ద్వారా బాధితులు దరఖాస్తు చేసుకునేందుకు బుధవారం మధ్యాహ్నం నుంచీ అవకాశం కల్పించారు. రికార్డుల కంప్యూటరీకరణ సమయంలో జరిగిన పొరపాట్ల కారణంగా భూ విస్తీర్ణంలో తేడాలు, పేరు తప్పుగా ఉండడం, ఒకరి భూమి మరొకరి పేరుపై ఉండడం, డిజిటల్ సంతకం లేకపోవడం... వంటి సమస్యలతో బాధితులు సతమతమవుతున్నారు. వీటిపై క్షేత్రస్థాయి నుంచి సమాచారం తెప్పించి పరిష్కరించే వీలున్నా.. గతంలో అలాంటి ప్రయత్నమే జరగలేదు.

ప్రత్యామ్నాయ ఆదాయంపై దృష్టి

- ఆర్టీసీపై సమీక్షించిన డిప్యూటీ సీఎం భట్టి

హైదరాబాద్, హైదరాబాద్ సిటీ, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ ప్రత్యామ్నాయ ఆదాయ వనరులను పెంచుకునే అంశంపై దృష్టి కేంద్రీకరించి నిర్వహణ సామర్థ్యాన్ని పెంచుకోవాలని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క సూచించారు. మహాలక్ష్మి పథకం కింద ఉచిత బస్సు సౌకర్యాన్ని ఇప్పటి వరకు 6.50 కోట్ల మంది మహిళలు వినియోగించుకోవడం విశేషమన్నారు. ముున్ముందు ఈ పథకాన్ని ప్రశాంత వాతావరణంలో కొనసాగించేందుకు చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. బుధవారం సచివాలయంలో ఆర్టీసీపై రవాణ మంత్రి పొన్నం ప్రభాకర్‌తో కలిసి భట్టి విక్రమార్క సమీక్షించారు. ఈ సందర్భంగా భట్టి మాట్లాడుతూ ఆర్టీసీకి ఆర్థిక శాఖ తరఫున పూర్తి సహాయ, సహకారాలు అందిస్తామన్నారు. సిబ్బందికి రావాల్సిన బకాయిలు, సంస్థ అప్పులు, పీఎఫ్, సీసీఎస్, ఇతర సెటిల్ మెంట్లకు సంబంధించిన అంశాలపై త్వరలోనే నిర్ణయం తీసుకుంటామని చెప్పారు. మంత్రి పొన్నం మాట్లాడుతూ టికెట్ ఆదాయంపైనే కాకుండా.. లాజిస్టిక్స్, కమర్షియల్, తదితర టికటేతర ఆదాయంపై అధికారులు దృష్టిని కేంద్రీకరించాలని సూచించారు. కాగా, పరాధీనంలో ఉన్న విలువైన దేవాదాయ భూముల్ని తిరిగి రాబట్టేందుకు ప్రభుత్వ పరంగా చర్యలు చేపట్టాలని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్కకు అర్చక, ఉద్యోగులు విజ్ఞప్తి చేశారు. అర్చక, ఉద్యోగుల జేఏసీ చైర్మన్ గంగు ఉపేంద్ర శర్మ నేతృత్వంలో పలు ఆలయాల అర్చకులు, ఉద్యోగులు సచివాలయంలో ఆయనను బుధవారం కలిసి వినతి పత్రం అందజేశారు. మరోవైపు, ఆదిలాబాద్ జిల్లాలోని కేస్లాపూర్ నాగోబా ఆలయ అభివృద్ధికి కృషి చేస్తానని భట్టి విక్రమార్క తెలిపారు. నాగోబా దేవాలయం అభివృద్ధికి నిధులు ఇవ్వాలని కోరుతూ మంత్రి సీతక్కతో కలిసి కేస్లాపూర్ మెస్రం వంశస్థులు బుధవారం సచివాలయంలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కతో భేటీ అయ్యారు.

‘మీసేవ’ల సమస్యలు పరిష్కరిస్తాం: దుద్దిళ్ల


మంత్రి శ్రీధర్‌బాబును కలిసిన మీసేవ జేఏసీ

హైదరాబాద్, జనవరి 3(ఆంధ్ర జ్యోతి): ప్రభుత్వ సంక్షేమ పథకాల అమల్లో మీసేవ కేంద్రాల పాత్ర అత్యంత కీలకమని, కేంద్రం నిర్వాహకుల సమస్యలను పరిష్కరిస్తామని ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్‌బాబు అన్నారు. తెలంగాణ మీసేవ జేఏసీ సంఘం ప్రతినిధులు బుధవారం మంత్రి శ్రీధర్‌బాబును సచివాలయంలో కలిశారు. మీసేవ ఆపరేటర్ల కమిషన్ పెంపు, ఉద్యోగ భద్రత, జీవిత బీమా తదితరల సమస్యలను మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. హైదరాబాద్ వినహా రాష్ట్రంలోని ఇతర జిల్లాల్లోని మీసేవ కేంద్రాలకు నెలవారీ కమిషన్ రూ.3వేలు కూడా మించడం లేదని అసంతృప్తి వ్యక్తం చేశారు. కమిషన్ పెంచి నిర్వాహకులను ఆదుకోవాలని జేఏసీ ప్రతినిధులు బైర శంకర్, మహ్మద్ అబ్దుల్ మోయిద్ తదితరులు విజ్ఞప్తి చేశారు. మీసేవల సమస్యలన్నీ పరిష్కరిస్తామని మంత్రి హామీ ఇచ్చారు.

ఈ నెల 8 వరకు టెన్త్ పరీక్ష ఫీజు గడువు పెంపు

హైదరాబాద్, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): పదో తరగతి వార్షిక పరీక్షల ఫీజు గడువును జనవరి 8వ తేదీ వరకు పొడగిస్తూ బుధవారం అధికారులు నిర్ణయం తీసుకున్నారు. రూ. 500ల ఆలస్య రుసుముతో గడువులోపు విద్యార్థులు తమ ఫీజును చెల్లించాల్సిందిగా వారు సూచించారు. మార్చి 18వ తేదీ నుంచి పదో తరగతి వార్షిక పరీక్షలు ప్రారంభం కానున్నాయి.

సింగరేణిలో ఖాళీ పోస్టులు వెంటనే భర్తీ:సీఎండీ

హైదరాబాద్, జనవరి 3 (ఆంధ్రజ్యోతి):సింగరేణి సంస్థలో ప్రస్తుతం ఉన్న ఖాళీ పోస్టులను వెంటనే గుర్తించి భర్తీ ప్రక్రియ చేపడతామని సీఎండీ ఎన్.బలరాం వెల్లడించారు. సింగరేణిని దేశంలోనే అగ్రగామి సంస్థగా నిలపడానికి కృషి చేస్తామని చెప్పారు. బుధవారం సింగరేణిభవన్‌లో అధికారులతో ఆయన సమీక్ష జరిపారు. కార్మిక సంక్షేమానికి పెద్దపీట వేయనున్నామని, అలాగే రక్షణ పట్ల మరింత శ్రద్ధ వహిస్తూ ఖర్చుకు వెనకాడకుండా చర్యలు తీసుకోనున్నామన్నారు.

దరఖాస్తుల ఎంట్రీ 17లోగా పూర్తవ్వాలి: సీఎస్

హైదరాబాద్, జనవరి 3 (ఆంధ్రజ్యోతి):ప్రజాపాలన దరఖాస్తుల డేటా ఎంట్రీ పనులను ఈనెల 17లోగా పూర్తిచేయాలని జిల్లాల కలెక్టర్లకు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి ఆదేశించారు. బుధవారం ఆమె కలెక్టర్లతో టెలీకాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. మంగళవారం వరకు రాష్ట్రవ్యాప్తంగా 57 లక్షల దరఖాస్తులు వచ్చాయని చెప్పారు. “ఈనెల 6న ప్రజాపాలన ముగియగానే.. దరఖాస్తుల డేటా ఎంట్రీ ప్రారంభించాలి” అని సూచించారు.

కాంగ్రెస్‌లోకి ఆదిలాబాద్ జడ్పీ, డీసీసీబీ చైర్మన్లు

ఆదిలాబాద్, జనవరి 3(ఆంధ్రజ్యోతి): ఆదిలాబాద్ జడ్పీ చైర్మన్ రాథోడ్ జనార్దన్, డీసీసీబీ చైర్మన్ అడ్డి భోజారెడ్డిలు బీఆర్ఎస్ పార్టీకి గుడ్‌బై చెప్పారు. బుధవారం సీఎం రేవంత్‌రెడ్డి సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. కొంతకాలంగా ఈ ఇద్దరు నేతలు పార్టీ మారుతారన్న ప్రచారం జోరుగా సాగింది. వీరిద్దరితో పాటు జైనథ్ జడ్పీటీసీ తుమ్మల అరుంధతి, కూడా కాంగ్రెస్‌లో చేరారు.

ఇంటర్ బోర్డు ఖాతా ఖాళీ !

- వందల కోట్ల నిధులు దారిమళ్లాయి: మధుసూదన్‌రెడ్డి

హైదరాబాద్, జనవరి 3 (ఆంధ్రజ్యోతి) : గత ప్రభుత్వ హయాంలో పనిచేసిన అధికారుల నిర్వాకం వల్ల ఇంటర్మీడియర్ బోర్డు ఖాతాలోని వందల కోట్ల నిధులు ఖాళీ అయ్యాయని ఇంటర్ బోర్డు జేఏసీ చైర్మన్ మధుసూదన్ రెడ్డి ఆరోపించారు. ఈ మేరకు బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ప్రస్తుతం స్పాట్ వాల్యుయేషన్‌లో పాల్గొన్న సిబ్బందికి జీతాల చెల్లించే పరిస్థితి కూడా ఇంటర్ బోర్డుకు లేదన్నారు. బోర్డులో ఉన్న రూ.150 కోట్ల నిధులను ప్రభుత్వ ఖాతాలోకి బదిలీ చేశారని చెప్పారు. విద్యార్థులకు ఉచితంగా సరఫరా చేస్తున్న పుస్తకాల ముద్రణ బిల్లులు చెల్లించకుండా వాటిని ప్రభుత్వ ఖాతాలోకి మళ్లించారని ఆరోపించారు. మన ఊరు-మన బడి పథకం కోసం ఇంటర్ బోర్డులోని రూ.42 కోట్లకు పైగా నిధులను మళ్లించారని చెప్పారు. ఇలాంటి చర్యల వల్లే ఇంటర్ బోర్డు ఖాతా ఖాళీ అయిందని మధుసూదన్ ఆరోపించారు.

రాష్ట్రంలో అదానీ డేటా సెంటర్, ఏరోస్పేస్ పార్క్!

- సీఎం రేవంత్‌తో అదానీ గ్రూప్ చర్చలు
- శంషాబాద్‌లో ఎనర్జీ పార్క్
  పరిశోధన కేంద్రం పెడతాం
- సీఎంతో అమరరాజా చైర్మన్ జయదేవ్

హైదరాబాద్, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో కొత్త పెట్టుబడులు పెట్టేందుకు సిద్ధంగా ఉన్నామని అదానీ గ్రూప్ ప్రకటించింది. రాష్ట్రంలో ఇప్పటికే పలు ప్రాజెక్టులు అమలుచేస్తున్న సంస్థ.. మరిన్ని పెట్టుబడులకు సంబంధించి బుధవారం సచివాలయంలో సీఎం రేవంత్‌రెడ్డితో సమావేశమైంది. అదానీ గ్రూప్ పోర్ట్స్, సెజ్ సీఈవో, చైర్మన్ గౌతం అదానీ పెద్ద కుమారుడు కరణ్ అదానీ, ఏరోస్పేస్ సీఈవో ఆశిష్ రాజ్‌వన్షీ ఈ సమావేశంలో పాల్గొన్నారు. రాష్ట్రంలో డేటా సెంటర్, ఏరోస్పేస్ పార్క్ ఏర్పాటుకు ఆసక్తిగా ఉన్నామని వారు సీఎంకు వివరించారు. ఇప్పటికే కొనసాగుతున్న ప్రాజెక్టులతో పాటు కొత్త పెట్టుబడులకు రాష్ట్ర ప్రభుత్వం నుంచి పూర్తి సహకారం ఉంటుందని సీఎం రేవంత్ వారికి హామీ ఇచ్చారు. మరోవైపు.. న్యూ ఎనర్జీ, లిథియం అయాన్ బ్యాటరీ, ఫుడ్ ప్రాసెసింగ్ రంగాలతో పాటు వివిధ రంగాలలో తెలంగాణలో మరిన్ని పెట్టుబడులకు తమ కంపెనీ సిద్ధంగా ఉందని అమరరాజా కంపెనీ ప్రకటించింది. ఈ మేరకు.. ఆ సంస్థ చైర్మన్ గల్లా జయదేవ్ సీఎం రేవంత్, ఐటీ, పరిశ్రమల మంత్రి శ్రీధర్‌బాబుతో సమావేశమయ్యారు. న్యూ ఎనర్జీ పార్క్, బ్యాటరీ ప్యాక్ అసెంబ్లింగ్ యూనిట్, శంషాబాద్‌లో ఈ-పాజిటివ్ ఎనర్జీ ల్యాబ్స్ పేరుతో పరిశోధన, అభివృద్ధి కేంద్రాన్ని ఏర్పాటుచేస్తామని వెల్లడించారు. అమరరాజా సంస్థ ఇప్పటికే మహబూబ్‌నగర్‌లోని దివిటిపల్లిలో రూ.9500 కోట్ల పెట్టుబడులతో లిథియం అయాన్ బ్యాటరీల తయారీకి సంబంధించి గిగా ప్రాజెక్టు నిర్మాణ పనులకు 2023 మేలో శంకుస్థాపన చేసిన సంగతి తెలిసిందే. ఆ ఫ్యాక్టరీ పనుల పురోగతి గురించి సీఎం ఈ భేటీలో అడిగి తెలుసుకున్నారు. తమ ప్రాజెక్టును వేగంగా పూర్తిచేయడానికి అవసరమైన మద్దతు ఇస్తున్న ప్రభుత్వానికి జయదేవ్ కృతజ్ఞతలు తెలిపారు. రోజురోజుకూ విస్తరిస్తున్న ఎలక్ట్రానిక్ వాహనాలు, న్యూ ఎనర్జీ రంగంలో తెలంగాణ ప్రభుత్వం ప్రధాన భూమిక పోషిస్తోందని, కొత్త పరిశ్రమల స్థాపనకు తగినంత మద్దతును ఆశిస్తున్నామని పేర్కొన్నారు. కాగా.. తెలంగాణ పారిశ్రామిక అభివృద్ధి పథంలో అమరరాజా కీలక భాగస్వామి అని సీఎం రేవంత్ పేర్కొన్నారు. తెలంగాణలో ఆ కంపెనీ తలపెట్టిన పరిశ్రమల ఏర్పాటుకు ప్రభుత్వం పూర్తి సహాయసహకారాలను అందిస్తుందని భరోసా ఇచ్చారు. కొత్త పరిశ్రమల స్థాపనకు అత్యంత ప్రాధాన్యం ఇస్తామని పేర్కొన్నారు.


ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని సన్మానిస్తున్న గల్లా జయదేవ్

టార్గెట్ 17.. కనీసం 12

(మొదటిపేజీ తరువాయి)

ఆమోదించింది. ఆరు గ్యారెంటీల అమల్లో పార్టీ నేతలు, కార్యకర్తలు భాగస్వాములు కావాలని, వాటిని ప్రజలకు చేరువగా తీసుకెళ్లాలని నిర్ణయించింది. ఏఐసీసీ తెలంగాణ ఇన్‌చార్జ్‌గా నియమితులైన దీపాదాస్ మున్షీకి.. రాష్ట్రంలో పార్టీని అధికారంలోకి తీసుకురావడంలో సమన్వయం చేసిన మాణిక్‌రావ్ ఠాక్రేకు అభినందనలు తెలుపుతూ మరో తీర్మానాన్ని ఆమోదించింది. నెల రోజుల ప్రభుత్వ పనితీరు పట్ల సంతృప్తిని వ్యక్తం చేసింది. సీఎం రేవంత్ రెడ్డిని, మంత్రి వర్గాన్ని అభినందించింది.

కచ్చితంగా అమలు చేస్తాం..

ఎన్నికల సందర్భంగా కాంగ్రెస్ ప్రజలకు ఇచ్చిన ఆరు గ్యారెంటీలనూ ప్రభుత్వం కచ్చితంగా అమలు చేసి తీరుతుందని సీఎం రేవంత్ రెడ్డి ఈ సమావేశంలో స్పష్టం చేశారు. పార్టీ కోసం కష్టపడిన వారికి వీలైనంత త్వరగా సముచిత స్థానం కల్పించే బాధ్యత తనదని భరోసా ఇచ్చారు. ఎన్నికల్లో బొర్లాపడి బొక్కలు విరిగినా బీఆర్ఎస్ పార్టీకి బుద్ధి రాలేదని విమర్శించారు. చెరుకు తోటలో పడిన అడవి పందుల్లా తెలంగాణను బీఆర్ఎస్ నేతలు దోచుకున్నారని ధ్వజమెత్తారు. రాష్ట్రంలో కొత్త ప్రభుత్వం ఏర్పడి నెల రోజులు కూడా గడవకముందే కాంగ్రెస్ హామీలపై పుస్తకాలు విడుదల చేస్తున్నారని మండిపడ్డారు. బీఆర్ఎస్ విమర్శలను దీటుగా తిప్పికొట్టాలని పార్టీ నేతలకు సూచించారు. బీజేపీ అధ్యక్షుడు కిషన్‌రెడ్డికి ఆదాయం తగ్గినట్టుందని.. అందుకే కాళేశ్వరం ప్రాజెక్టుకు సంబంధించి సీబీఐ విచారణ కోరుతున్నారని వ్యంగ్యంగా అన్నారు. తాము ప్రతిపక్షంలో ఉన్నప్పుడు ఇదే అంశంపై సీబీఐ విచారణ జరిపించాలని తాను కోరానని.. అప్పుడు ఏం చేశారని ప్రశ్నించారు. దొంగను గజదొంగకు పట్టించాలని కిషన్‌రెడ్డి అడుగుతున్నారంటూ ఎద్దేవా చేశారు. బీజేపీ, బీఆర్ఎస్ తోడు దొంగలని.. ఇద్దరూ కలిసి కాళేశ్వరం పేరుతో దోచుకున్నారని ఆరోపించారు. డిప్యూటీ సీఎం భట్టివిక్రమార్క మాట్లాడుతూ ప్రభుత్వ పథకాలను ప్రజలకు చేరవేయాలని పార్టీ నేతలకు సూచన చేశారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం ఆర్థిక అరాచకత్వంతో రాష్ట్రాన్ని పీల్చి పిప్పిచేసిందని ఆయన విమర్శించారు.

కార్యకర్తల త్యాగాలకు ఫలితం..

రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీని అధికారంలోకి తేవడానికి కార్యకర్తలు పదేళ్లపాటు కష్టపడ్డారని, లోక్‌సభ ఎన్నికల్లో పార్టీ నేతలు మరింత శ్రమించాలని పార్టీ రాష్ట్రవ్యవహారాల ఇన్‌చార్జ్ దీపాదాస్ మున్షీ అన్నారు. రాష్ట్రంలో, ప్రత్యేకించి హైదరాబాద్‌లో బోగస్ ఓట్లు చాలా ఉన్నాయని, ఈ విషయంలో శ్రద్ధ తీసుకుని పనిచేయాలని సూచన చేశారు. ప్రభుత్వం, పార్టీ సమన్వయంతో పని చేస్తే మరింత మంచి ఫలితాలు వస్తాయన్నారు. పార్టీ నేతలు, కార్యకర్తల త్యాగాల ఫలితంగానే కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిందని.. వారి కష్టానికి తగిన ఫలితం ఉంటుందని మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి అన్నారు. లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్ సభ్యులమంతా ఒక్క కుటుంబంగా పనిచేద్దామని పిలుపునిచ్చారు. కాగా.. ఉచిత బస్సు సౌకర్యంతో రాష్ట్ర వ్యాప్తంగా ఇప్పటికి ఆరున్నర కోట్ల మంది మహిళలు ఉచితంగా ప్రయాణం చేశారని రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. విజయవంతమైన ఈ కార్యక్రమానికి వ్యతిరేకంగా బీఆర్ఎస్ రాజకీయం చేస్తోందని, దీన్ని పార్టీ నేతలు అన్ని స్థాయిల్లో తిప్పికొట్టాలని పొన్నం సూచించారు.

స్థలాలివ్వండి..

బీఆర్ఎస్ జిల్లా కార్యాలయాలకు గత ప్రభుత్వం స్థలాలు ఇచ్చినట్టుగానే డీసీసీ కార్యాలయాల నిర్మాణానికి అన్ని జిల్లాల్లో ప్రభుత్వం ఎకరం చొప్పున స్థలాలు ఇవ్వాలంటూ పార్టీ నేతలు పలువురు ఈ భేటీలో సీఎం రేవంత్‌ను కోరారు. దీనికి సంబంధించి గత ప్రభుత్వం జీవో కూడా విడుదల చేసిందని, దాని ప్రకారం ఇవ్వొచ్చునని తెలిపారు. అలాగే జోనల్ వ్యవస్థపై సమీక్ష చేయాలని, వర్సిటీల్లో అధ్యాపక పోస్టులు భర్తీ చేయాలని, ఎస్సీ కమిషన్‌ను రద్దు చేసి కొత్త కమిషన్‌ను నియమించాలని విజ్ఞప్తి చేశారు. కార్పొరేషన్ చైర్మన్లు, ఇతర నామినేటెడ్ పదవులను త్వరిత గతిన భర్తీ చేయాలని పలువురు నేతలు సూచన చేశారు. దీనికి సీఎం రేవంత్ రెడ్డి బదులిస్తూ.. ఎన్నికల్లోనూ, పార్టీ కోసం కష్టపడి పని చేసిన నేతలను ఏఐసీసీ ఇన్‌చార్జ్ కార్యదర్శులు గుర్తించి జాబితాను తయారు చేస్తున్నారని, వారికి త్వరలోనే పదవులు ఉంటాయని స్పష్టం చేశారు.


దీపాదాస్ మున్షికి పుష్పగుచ్ఛం ఇచ్చి అభినందనలు తెలుపుతున్న సీఎం రేవంత్, చిత్రంలో డిప్యూటీ సీఎం భట్టి

నేడు ఢిల్లీకి సీఎం రేవంత్‌రెడ్డి

సీఎం రేవంత్‌రెడ్డి గురువారం ఉదయం ఢిల్లీకి వెళ్లనున్నారు. కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ మలి విడత పాదయాత్రకు సంబంధించి అన్ని రాష్ట్రాల పీసీసీ అధ్యక్షులతో ఏఐసీసీ కార్యాలయంలో జరగనున్న సమావేశంలో పాల్గొనేందుకు ఆయన ఢిల్లీకి వెళుతున్నారు. అలాగే అధిష్ఠానం పెద్దలనూ కలిసి రానున్న లోక్‌సభ ఎన్నికలు, నామినేటెడ్ పదవులు, ఇతర అంశాలపైన చర్చించే అవకాశం ఉందని పార్టీ వర్గాలు పేర్కొన్నాయి. ఢిల్లీ నుంచి ఆయన వీలును బట్టి గురువారం రాత్రే తిరుగు ప్రయాణం అయ్యే అవకాశం ఉందని తెలిపాయి. కాగా, రాష్ట్రానికి పెట్టుబడులను ఆహ్వానించేందుకు ఈ నెల 14న సీఎం రేవంత్‌రెడ్డి దావోస్‌కు వెళ్లనున్నారు. మంత్రి శ్రీధర్‌బాబుతో పాటుగా వెళ్లనున్న ఆయన.. అక్కడ సమ్మిట్‌లో పాల్గొంటారు. నాలుగు రోజుల పాటు దావోస్‌లో పర్యటిస్తారు.

త్వరలో ఇందిరమ్మ కమిటీలు

ఆరు గ్యారెంటీలు సహా ప్రభుత్వ పథకాల అమలు కోసం త్వరలోనే గ్రామ స్థాయుల్లో, పట్టణాల్లోనైతే వార్డు స్థాయిలో ఇందిరమ్మ కమిటీల ఏర్పాటు త్వరిత గతిన పూర్తిచేయాలని సీఎం రేవంత్ రెడ్డిని పార్టీ నేతలు కోరారు. ఆ కమిటీల్లో పార్టీ కార్యకర్తలనూ భాగస్వాములను చేయాలని సూచించారు. గత కాంగ్రెస్ ప్రభుత్వంలో ఉన్న విధంగానే ఇందిర మ్మ కమిటీలను తిరిగి వేస్తామంటూ సీఎం రేవంత్‌రెడ్డి స్పష్టం చేశారు. కాగా.. టీపీసీసీ విస్తృత సమావేశంలో సీఎం రేవంత్‌రెడ్డితో పాటు మంత్రు లు, ఎమ్మెల్యేలు పాల్గొనడంతో గాంధీభవన్ చుట్టూ పోలీసులు కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేశారు. భేటీకి ఆహ్వానం ఉన్న నేతలనే గాంధీభవన్‌లోకి అనుమతించారు. ఈ క్రమంలో టీపీసీసీ సీనియర్ ఉపాధ్యక్షుడు మల్లు రవి, ఇతర నేతలను గాంధీభవన్‌లోకి అనుమతించే విషయంలో పోలీసులకు, మల్లు రవికి మధ్య వాగ్వాదం జరిగింది. ఈ సందర్భంగా పోలీసులపై మల్లు రవి తీవ్ర ఆగ్రహం వ్యక్తంచేశారు. అలాగే.. సీఎం కాన్వాయ్ తప్ప మంత్రులు, పార్టీ నేతలు, పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి దీపాదాస్ మున్షీ కారును సైతం గాంధీ భవన్‌లోకి అనుమతించలేదు. వాటిని బయటే నిలపడంతో ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తాయి.

నేను మోతెవరిగనే ఉంట

- సంగారెడ్డిలో ఓట్ల కోసం బలహీనుడిని కాలేను
- ఇకపై పార్టీకి ఫుల్ టైం కేటాయిస్త: జగ్గారెడ్డి

హైదరాబాద్, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): తాను సంగారెడ్డిలో ఓట్ల కోసం బలహీనుడిని కాలేనని, మోతెవరిగనే ఉంటానని టీపీసీసీ కార్యనిర్వాహక అధ్యక్షుడు తూర్పు జగ్గారెడ్డి అన్నారు. ఇక మీదట తాను పార్టీకి ఫుల్ టైం కేటాయిస్తానని చెప్పారు. గాంధీభవన్‌లో బుధవారం ఆయన మీడియాతో చిట్‌చాట్‌గా మాట్లాడారు. తాను ఎమ్మెల్యే అయిన తర్వాతనే సంగారెడ్డిలో అభివృద్ధి జరిగిందని, సంగారెడ్డి అంటే.. జగ్గారెడ్డి అనే బ్రాండ్ తనకు ఏర్పడిందన్నారు. సంగారెడ్డిలో ఓటమిని తాను ఆరు నెలలు ముందుగానే గుర్తించానని పేర్కొన్నారు. తాను అందుబాటులో లేనంటూ కొందరు ప్రశ్నించారని, అది తనను బాధించిందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం వస్తుందనీ, రేవంత్‌రెడ్డి సీఎం అవుతారనీ, తాను గెలిస్తే మంత్రినీ అవుతాననీ తనకు ముందే తెలుసునన్నారు. అయితే.. తాను అందుబాటులో లేనంటూ కొందరు ప్రశ్నించారని, అందుకే 24 గంటలు అందుబాటులో ఉండేవారిని గెలిపించుకుంటారని వదిలేశానని వ్యంగ్యంగా వ్యాఖ్యానించారు. తనను ఓడించడానికి హరీశ్ రావు రూ.60 కోట్లు ఖర్చుచేశారని ఆరోపించారు.


తెలంగాణ కాంగ్రెస్ ఇన్‌చార్జ్‌గా ఎంపికైన దీపాదాస్ మున్షికి అభినందనలు తెలుపుతున్న జగ్గారెడ్డి, చిత్రంలో ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి, మాజీ మంత్రి రాంరెడ్డి దామోదర్‌రెడ్డి, తాహేర్ బిన్ హమ్దన్ తదితరులు

ఇందిరమ్మ ఇంటికి పీఎంఏవై నిధులు!?

ప్రధానమంత్రి ఆవాస యోజన పథకం నిధులను వినియోగించుకోవాలని రాష్ట్ర సర్కారు యోచన

- త్వరలో కేంద్రానికి వెల్లడించేందుకు ప్రణాళిక రూపకల్పన
- దరఖాస్తుల స్వీకరణ తర్వాత పథకం అమలుకు చర్యలు
- పీఎంఏవై పథకాన్ని అందుకోని గత ప్రభుత్వం



హైదరాబాద్, జనవరి 3 (ఆంధ్ర జ్యోతి): తెలంగాణలో ఇల్లు లేని అర్హులైన పేదలకు రాష్ట్ర సర్కారు అందించబోయే ‘ఇందిరమ్మ ఇల్లు’ పథకానికి ప్రధానమంత్రి ఆవాస యోజన పథకం (పీఎంఏవై) నిధులు అందనున్నాయి. పథకం అమలుకు అవసరమయ్యే నిధుల్లో కొంతమేర కేంద్రం నుంచి అందుకోవాలని రాష్ట్ర సర్కారు సూత్రప్రాయంగా నిర్ణయించినట్లు విశ్వసనీయంగా తెలిసింది. కేంద్రం నుంచి నిధులను తీసుకోవడం వలన రాష్ట్ర ఖజానాపైనా భారం పడదని సర్కారు భావిస్తున్నట్లు సమాచారం. నిధుల స్వీకరణ అంశానికి సంబంధించి త్వరలోనే కేంద్రం ముఖ్యులతో భేటీ అవ్వాలని సర్కారు పెద్దలు నిర్ణయించారు. ఆ మేరకు కేంద్రానికి సవివరంగా తెలిపేందుకు అవసరమైన ఒక ప్రణాళికను కూడా సిద్ధం చేస్తున్నట్లు సమాచారం. ఎన్నికల ప్రచారంలో రాష్ట్రంలో ఇల్లు లేని పేదలకు (ఇంటి స్థలం ఉన్న వారికి ఆర్థిక సాయం, స్థలం లేని వారికి స్థలం ఇచ్చి, ఆర్థిక సాయం) ఇల్లు నిర్మించుకునేందుకు రూ.5లక్షల ఆర్థిక సాయం చేస్తామని కాంగ్రెస్ ప్రకటించింది. అందులో భాగంగా ‘ప్రజాపాలన’లోనే ఇల్లు లేని వారు కూడా దరఖాస్తు చేసుకోవాలని ప్రభుత్వం సూచించింది. దీంతో రాష్ట్ర వ్యాప్తంగా ప్రజాపాలన దరఖాస్తుల్లో భాగంగా ఇంటి నిర్మాణ ఆర్థిక సాయం కోసం దరఖాస్తులు వస్తున్నాయి. జనవరి 6తో దరఖాస్తుల స్వీకరణ ప్రక్రియ ముగియనుండగా, దరఖాస్తులను వడపోసి.. అందులో ఇంటి నిర్మాణం కోసం ఎన్ని దరఖాస్తులు వచ్చాయనే వివరాలను సేకరించనున్నారు. వివరాలన్నీ తేలాక పథకం అమలుకు అవసరమైన మార్గదర్శకాలను విడుదల చేసి, అమలుచేయనున్నారు.

పీఎంఏవై పథకానికి అనుసంధానం

రాష్ట్ర ప్రభుత్వం అమలుచేయబోయే ఇందిరమ్మ ఇల్లు పథకాన్ని ప్రధానమంత్రి ఆవాస యోజన పథకానికి అనుసంధానం చేయాలని రాష్ట్ర ప్రభుత్వం భావిస్తోంది. వాస్తవానికి కేంద్రం కూడా రాష్ట్రాలకు పీఎంఏవై కింద ఇళ్ల నిర్మాణాలకు కొంతమేర నిధులను అందిస్తుంది. అయితే కేంద్రం నుంచి నిధులను అందుకోవాలంటే అంతకుముందుగానే రాష్ట్రంలో ఎన్ని ఇళ్లను నిర్మించాల్సి ఉందనే అంశంతో పాటు, లబ్ధిదారుల వివరాలను తెలుపుతూ కేంద్ర ప్రభుత్వానికి సవివర నివేదికను అందించాలి. ఆ తర్వాత అందుకవసరమైన నిధులను కేంద్రం విడతల వారీగా రాష్ట్రానికి చెల్లిస్తుంది. కానీ గత ప్రభుత్వ హయాంలో కేంద్రం నుంచి వచ్చే ఈ పథకం నిధులను వినియోగించుకోకపోగా, అసలు రాష్ట్రంలో నిర్మించాల్సిన ఇళ్ల నిర్మాణ జాబితాలను కూడా కేంద్రానికి అందించలేదు. ఫలితంగా గత ప్రభుత్వ హయాంలో 2017-18 తర్వాత పీఎంఏవై నిధులు రాష్ట్రానికి రాలేదు. గతంలో 2016-17లో రూ.190.79కోట్లు, 2017-18లో రూ.1,120.7కోట్లు కలిపి మొత్తం రూ.1,311కోట్లను కేంద్రం నుంచి నిధులు అందాయి. ఇక ఆ తరువాత నుంచి అప్పటి సర్కారు కేంద్రానికి జాబితా ఇవ్వలేదు, కేంద్రమూ నిధులివ్వలేదు. దాంతో ‘డబుల్ బెడ్ రూం’ఇండ్ల పథకానికి ఆర్థికంగానూ కొంత సమస్య ఏర్పడింది. ఇపుడు తెలంగాణలో ఏర్పాటైన కాంగ్రెస్ సర్కారు.. కేంద్రం నుంచి రావాల్సిన నిధులు, వచ్చే నిధులన్నింటినీ సంపూర్ణంగా వినియోగించుకోవాలని భావిస్తోంది. అందులో భాగంగానే ‘ఇందిరమ్మ ఇల్లు’ పథకాన్ని పీఎంఏవై పథకానికి అనుసంధానం చేయాలని నిర్ణయించినట్టు సమాచారం. రాష్ట్ర సర్కారు కేంద్ర పథకంతో అనుసంధానమైతే.. పట్టణ ప్రాంతాల్లో నిర్మించబోయే ఒక్కో ఇంటికి రూ.1.60లక్షలకు పైగా, గ్రామీణ ప్రాంతాల్లో రూ.75వేలకు పైగా ఆర్థిక సాయం అందనుంది. ప్రస్తుతం పీఎంఏవై కింద పట్టణ, గ్రామీణ ప్రాంతాల వారీగా ఒక్కో ఇంటికి కేంద్రం 2015 నిర్మాణ అంచనా ప్రకారం ఆర్థిక సాయం అందిస్తున్నట్లు తెలుస్తోంది. అయితే ఈ పథకంతో అనుసంధానం కావాలని భావిస్తున్న తెలంగాణ సర్కారు.. ఆ నిర్మాణ అంచనాలను పెంచాలని కోరాలని నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. 2015 తర్వాత నుంచి ఇంటి నిర్మాణాలకు అవసరమైన సామాగ్రి (సిమెంటు, ఐరన్, సహా ఇతరత్రా) ధరలు పెరగడంతో.. ఆ అంశాలను పరిగణనలోకి తీసుకుని ఆర్థిక సాయాన్ని పెంచి ఇస్తే పేదలకు న్యాయం జరుగుతుందని కేంద్రానికి వివరించనున్నట్లు సమాచారం. దీంతో రాష్ట్ర ఖజానాకు కొంత ఉపశమనం లభిస్తుందని సర్కారు యోచిస్తోంది.


కరీంనగర్‌లో రాముడి అక్షింతల పంపిణీకి వెళ్తున్న బండి సంజయ్‌కుమార్

భయంతోనే ఒవైసీ వ్యాఖ్యలు

- రామమందిర ప్రతిష్ఠను వివాదాస్పదం చేసే కుట్ర:సంజయ్

కరీంనగర్, బోయినపల్లి, జనవరి 3 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి/ఆంధ్రజ్యోతి): ముస్లిం సమాజంపై పట్టుకోల్పోతున్నామన్న భయంతోనే ఎంఐఎం అధినేత అసదుద్దీన్ ఒవైసీ రామమందిర ప్రతిష్ఠను వివాదాస్పదం చేసే వ్యాఖ్యలు చేస్తున్నారని బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, కరీంనగర్ ఎంపీ బండి సంజయ్ అన్నారు. శ్రీరామ ట్రస్టు ఆధ్వర్యంలో అయోధ్య నుంచి వచ్చిన రాముడి అక్షింతలను కరీంనగర్‌లో బుధవారం ఇంటింటికి పంపిణీ చేశారు. అలాగే హైదరాబాద్ బోయినపల్లిలో అనురాధ టింబర్ ఇంటర్నేషనల్ సంస్థను సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రామమందిర ప్రాణప్రతిష్ఠ కార్యక్రమాన్ని వివాదాస్పదం చేసే కుట్రలో భాగంగా వ్యాఖ్యలు చేస్తున్నారని, దీంతో రాజకీయ లబ్ధి పొందాలనుకుంటున్నారన్నారు. ‘500 ఏళ్లపాటు ఖురాన్ చదివిన ప్రదేశం మనకుకాకుండా పోతుంటే మీ గుండెల్లో బాధ లేదా?’ అంటూ ముస్లిం యవతను రెచ్చగొట్టేందుకు ప్రయత్నిస్తున్నారని చెప్పారు. ఇదంతా రామమందిర ప్రతిష్ఠను వివాదాస్పదం చేసే కుట్ర అని విమర్శించారు. ఎంఐఎం నేతలకు కోర్టులు, చట్టాలు, దేశం, దేశ భక్తులు, హిందూ సమాజం, హిందూ దేవుళ్లంటే గౌరవంలేదని, చులకన భావంతో చూస్తారని చెప్పారు. కాగా శ్రీరాముని మందిరానికి ద్వారాలను తయారు చేసే అవకాశం బోయినపల్లికి చెందిన అనురాధ టింబర్ ఇంటర్నేషనల్‌కురావడం చదలవాడ కుటుంబసభ్యులు, తెలంగాణ ప్రజల అదృష్టమని బండి సంజయ్ అన్నారు. ఈ నేపథ్యంలో సంస్థను బుధవారం బండి సంజయ్ సందర్శించి చదలవాడ తిరుపతిరావు, కిరణ్‌లను శాలువతో సత్కరించి అభినందించారు.

జాతీయ కిసాన్ మోర్చా ఇన్‌చార్జ్‌గా సంజయ్

కరీంనగర్ ఎంపీ బండి సంజయ్‌కు బీజేపీ జాతీయ నాయకత్వం మరో కీలక పదవి కట్టబెట్టింది. ఇప్పటికే జాతీయ ప్రధాన కార్యదర్శిగా కొనసాగుతున్న ఆయన్ను తాజాగా కిసాన్ మోర్చా జాతీయ ఇంచార్జిగా నియమించింది. ఈ మేరకు పార్టీ జాతీయ అధ్యక్షులు జేపీ నడ్డా, బుధవారం ఉత్తర్వులు జారీచేశారు. దేశవ్యాప్తంగా రైతాంగానికి సంబంధించిన అంశాలపై పార్టీ తీసుకునే నిర్ణయాలకు అనుగుణంగా కార్యక్రమాలను సంజయ్ సమన్వయం చేయనున్నారు.

సంక్రాంతికి టీఎస్ ఆర్టీసీ 4,484 ప్రత్యేక బస్సులు

» 6 నుంచి 15వ తేదీ వరకు

హైదరాబాద్, జనవరి 3(ఆంధ్రజ్యోతి): సంక్రాంతి పండుగ సందర్భంగా హైదరాబాద్ నుంచి 4,484 ప్రత్యేక బస్సులను నడిపేందుకు టీఎస్ఆర్టీసీ ప్రణాళిక సిద్ధం చేసింది. జనవరి 6 నుంచి 15వ తేదీ వరకు హైదరాబాద్ నుంచి రాష్ట్ర వ్యాప్తంగా అన్ని జిల్లాలతో పాటు పొరుగు రాష్ట్రాలు ఆంధ్రప్రదేశ్, కర్నాటక, మహారాష్ట్రకు ప్రత్యేక బస్సులు నడపనున్నట్లు ఆర్టీసీ అధికారులు తెలిపారు. దూరప్రాంతాలకు వెళ్లే ప్రయాణికుల కోసం 626బస్సుల్లో ముందస్తు సీటు రిజర్వేషన్ సౌకర్యాన్ని కల్పించినట్లు తెలియజేశారు. మరోవైపు హైదరాబాద్ నుంచి ఆంధ్రప్రదేశ్‌లోని వివిధ ప్రాంతాలకు సంక్రాంతి సందర్భంగా 1,450 ప్రత్యేక బస్సులను నడపనున్నట్లు ఏపీఎస్ఆర్టీసీ డిప్యూటీ చీఫ్ ట్రాఫిక్ మేనేజర్ కిషోర్‌నాథ్ బుధవారం తెలిపారు.

రూ.22.95 లక్షల విలువైన నకిలీ యాంటీబయాటిక్ ట్యాబ్లెట్ల సీజ్

హైదరాబాద్, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో నకిలీ ఔషధాలను సరఫరా చేస్తున్న ఓ ముఠాను ఔషధ నియంత్రణ మండలి పట్టుకుంది. రూ.22.95 లక్షల విలువైన 51 వేల నకిలీ యాంటీబయాటిక్ ట్యాబ్లెట్లను సీజ్ చేసింది. ఇందుకు సంబంధించి రాష్ట్ర ఔషధ నియంత్రణ మండలి డైరెక్టర్ జనరల్ కమలాసన్ రెడ్డి తెలిపిన వివరాలిలా ఉన్నాయి. హిమాచల్‌ప్రదేశ్‌కు చెందిన మెగ్‌లైఫ్ సైన్సెస్ పేరుతో తయారైన సెఫోగ్జిమ్-సీవీ యాంటీ బయాటిక్ ట్యాబ్లెట్లు ఉప్పల్‌లోని ట్రాకాన్ కొరియర్‌కు చేరినట్లు గుర్తించారు. పువ్వాడ లక్ష్మణ్ అనే వ్యక్తి వాటిని అక్కడి నుంచి దిల్‌షుక్‌నగర్ ద్వారకపురంలోని వెంకటేశ్వర ఎంటర్‌ప్రైజెస్‌కు చేరుస్తుండగా దాడి చేసిన అధికారులు పట్టుకున్నారు. పెట్టెల్లో ఉన్న మాత్రలు నకిలీవిగా గుర్తించారు. పోకాల రమేశ్, గారేపల్లి పూర్ణచందర్‌తో కలిసి ఈ నకిలీ మందులను నగరంలోని పలు దుకాణాలకు సరఫరా చేస్తున్నామని లక్ష్మణ్ అధికారులకు వెల్లడించాడు.

ఖరీఫ్ నుంచి పంటల బీమా!

(మొదటి పేజీ తరువాయి)

రానుంది. దేశంలో పంటల బీమా పథకం అమలు చేయని ఏకైక రాష్ట్రం తెలంగాణ మాత్రమే! మిగతా రాష్ట్రాల్లో కేంద్ర ప్రభుత్వ ఫసల్ బీమా యోజన పథకమో లేదా రాష్ట్ర ప్రభుత్వ సొంత పంటల బీమా పథకమో అమలవుతోంది. పీఎం-ఎఫ్‌బీవై నుంచి వైదొలిగిన పశ్చిమ బెంగాల్ ప్రభుత్వం 'బంగ్లా సస్య బీమా యోజన'ను అమలు చేస్తోంది. ఆహార ధాన్యాలు, నూనె గింజల పంటలకు మొత్తం ప్రీమియం బెంగాల్ ప్రభుత్వమే చెల్లిస్తోంది. చెరకు, ఆలుగడ్డ పంటలకు 4.85 శాతం ప్రీమియం రైతులు చెల్లిస్తున్నారు. ప్రధాన మంత్రి మోదీ సొంత రాష్ట్రం గుజరాత్‌లో 'ముఖ్య మంత్రి కిసాన్ సహాయ్ యోజన'ను అమలు చేస్తున్నారు. జార్ఖండ్ ప్రభుత్వం 'జార్ఖండ్ రాజ్య ఫసల్ రహత్ యోజన'ను అమలు చేస్తోంది. బిహార్ ప్రభుత్వం... పీఎం-ఎఫ్‌బీవైతోపాటు 'బిహార్ రాజ్య ఫసల్ సహాయత యోజన'ను కూడా అమలుచేస్తోంది. ఈ రెండు పథకాల ద్వారా అక్కడి రైతులు నష్టపరిహారం పొందుతున్నారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం మూడేళ్ల పాటు 'వైఎస్ఆర్ ఉచిత పంటల బీమా పథకం' అమలుచేసింది. కేవలం రూపాయి చెల్లించి రిజిస్ట్రేషన్ చేసుకున్న రైతులకు క్రాప్ ఇన్సురెన్స్ స్కీమ్ వర్తించేలా చేసింది. ఆర్థిక భారం కావటంతో 2022-23 వానాకాలం సీజన్ నుంచి తిరిగి పీఎం-ఎఫ్‌బీవైలో చేరింది. అయితే రైతుల తరఫున రాష్ట్ర ప్రభుత్వమే ప్రీమియం చెల్లిస్తోంది. కానీ తెలంగాణ రాష్ట్రంలో అటు కేంద్రానిది కానీ ఇటు రాష్ట్ర ప్రభుత్వానిది కానీ ఇన్సురెన్స్ పథకమేదీ అమలులో లేదు.



ఇన్సురెన్స్ లాభ నష్టాలపై లెక్కలేవి?

పంటల బీమా పథకాన్ని అమలుచేస్తే రాష్ట్ర ప్రభుత్వం చెల్లించే ప్రీమియం రూ.300 కోట్ల నుంచి రూ.350 కోట్ల వరకు ఉంటుంది. ఈ భారాన్ని మోయడానికి గత కేసీఆర్ ప్రభుత్వం ఇష్టపడలేదు. ఎందుకంటే క్రాప్ ఇన్సురెన్స్‌తో రైతులకు కలిగే ప్రయోజనం కంటే బీమా కంపెనీలకే ఎక్కువ లాభం ఉంటోందనే వాదనను తెరపైకి తెచ్చింది. అయితే ఇన్సురెన్స్ అనేది ప్రమాదం జరిగినప్పుడే ఉపయోగపడుతుంది. ప్రకృతి విపత్తులు రావాలని గానీ, పంటలు నష్టపోవాలని గానీ, ఇన్సురెన్స్‌ను వినియోగించుకోవాలని ఎవరూ కోరుకోరు. అలాగని క్రాప్ ఇన్సురెన్స్ పథకంతో రాష్ట్రానికి జరిగిన భారీ నష్టమేమీ లేదు. 2016-17లో క్రాప్ ఇన్సురెన్స్ చేసి పంట నష్టపోయిన ఒక్కో రైతుకు సగటున రూ.7,983 నష్టపరిహారం వచ్చింది. అలాగే 2017-18లో రూ.14,732, 2018-19లో రూ.25,323 వచ్చింది. 2016-17 నుంచి 2019-20 వరకు 4 సంవత్సరాల్లో తెలంగాణ రైతులు రూ.681 కోట్ల ప్రీమియం చెల్లిస్తే రూ.1,817 కోట్ల బీమా క్లెయిమ్ రాష్ట్రానికి వచ్చింది. పంటల బీమా పథకంపై లాభ నష్టాలు బేరీజు వేసుకోకుండా అమలు చేయాల్సిన అవసరం ఉంది. పీఎం-ఎఫ్‌బీవైతో పాటు వాతావరణ ఆధారిత పంటల బీమా పథకాన్ని కేంద్రం అమలు చేస్తోంది. తెలంగాణకు సంబంధించి ఈ స్కీమ్‌లో 5 పంటలు (పత్తి, ఆయిల్ పామ్, టమాట, బత్తాయి, మిర్చి) చేర్చారు. వరుసగా 3 రోజులు అత్యధిక వర్షపాతం నమోదై లేదా వరుసగా 15 రోజులు వర్షాలు పడక డ్రై స్పెల్ వచ్చి పంటల దిగుబడి తగ్గితే రైతులకు పరిహారం వస్తుంది. ఇలాంటి ఇన్సురెన్స్ పథకాలపై సమగ్ర అధ్యయనం చేస్తే ఎలాంటి పథకం అమలు చేయాలనే స్పష్టత వచ్చే ఛాన్స్ ఉంది.

ఐదెకరాల వరకు ఉచిత ప్రీమియం!

ప్రధానమంత్రి ఫసల్ బీమా పథకం అమలు చేసినా, రాష్ట్ర ప్రభుత్వం సొంత పథకం తీసుకొచ్చినా... ఐదెకరాల వరకు ఉన్న రైతులకు ఉచిత ప్రీమియం వసతి కల్పించాలనే డిమాండ్ సర్వత్రా వ్యక్తమవుతోంది. రాష్ట్రంలో 86 శాతం మంది చిన్న, సన్నకారు రైతులే ఉన్నారు. వీరికి పంటల బీమా ప్రీమియం భారం కాకుండా పథకాలు అమలుచేయాల్సిన అవసరం ఉంది. ప్రీమియం పెరగటం, క్లెయిమ్‌లు రాకపోవటం వంటి లోపాలను సవరించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉంది. కేంద్ర పథకాన్ని అమలు చేయడమో, రాష్ట్రం సొంత పంటల బీమా పథకం అమలు చేయడమో జరగాలనే డిమాండ్లు వ్యక్తమవుతున్నాయి. ఖరీఫ్ కోసం మే నెలలోనే నోటిఫికేషన్ విడుదల చేయాలి. లోనింగ్, నాన్ లోనింగ్ రైతులందరికీ రాష్ట్రంలో క్రాప్ ఇన్సురెన్స్ వర్తింపజేయాలనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.

లిఫ్ట్ అడిగి.. రేప్ చేశారంటూ బ్లాక్‌మెయిల్

» డబ్బులివ్వకపోతే కేసు పెడతానని బెదిరింపులు

» హైదరాబాద్‌లో ఓ యువతి దారి దోపిడీ దందా

» పదుల సంఖ్యలో బాధితులు..యువతిపై ఇప్పటికే 17 కేసులు

బంజారాహిల్స్, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్ నగరానికి చెందిన పరమానంద గత నెల పంజాగుట్ట నుంచి జూబ్లీహిల్స్ వైపు తన కారులో వెళుతున్నాడు. కేబీఆర్ పార్కు చౌరస్తా దాటగానే ఓ యువతి లిఫ్ట్ అడిగితే కారులో ఎక్కించుకున్నాడు. కారు కొద్ది దూరం వెళ్లిన తర్వాత ఆ యువతి "నన్ను ఎందుకు రేప్ చేశావు" అని పరమానందను ప్రశ్నించింది. డబ్బులు ఇవ్వు.. లేదంటే కేసు పెడతానని బెదిరించింది. దిగ్భ్రాంతి చెందిన పరమానంద భయపడి జేబులో ఉన్న రూ.5 వేలు తీసి ఇచ్చి వెళ్లిపోయాడు. అయితే, ఆ తర్వాత జూబ్లీహిల్స్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. జూబ్లీహిల్స్ పోలీస్ స్టేషన్‌లో అప్పటికే అలాంటి ఫిర్యాదులు అనేకం ఉన్నాయి. దర్యాప్తు ప్రారంభించిన పోలీసులు ఈ నెల 2న కేబీఆర్ పరిసర ప్రాంతాల్లోనే లిఫ్టు కోసం ఎదురుచూస్తున్న యువతిని అదుపులోకి తీసుకున్నారు. విచారణలో ఆమె పేరు నయిదా సుల్తానా అని చెప్పింది. గతంలో కూడా ఆమెపై హైదరాబాద్‌లోని వివిధ పోలీసు స్టేషన్లలో 17 కేసులు నమోదైనట్లు పోలీసులు గుర్తించారు. లిఫ్ట్ ఇచ్చిన వారి కారులోకి ఎక్కిన తర్వాత దుస్తులు చించుకొని, రభస చేసి డబ్బులు లాగిన ఘటనలు కూడా ఉన్నాయని వారు తెలిపారు. తనకు లిఫ్ట్ ఇచ్చిన వారిని సుల్తానా.. "నేను లా చదివాను. ఏ సెక్షన్‌కు ఎంత శిక్ష పడుతుందో తెలుసు. అన్ని సెక్షన్లు వర్తించేలా రేప్ కేసు పెడతా" అని బెదిరించినట్లు ఆరోపణలు ఉన్నాయి. లా పుస్తకంలో ఉన్న సెక్షన్‌లు, వాటికి పడే శిక్షల గురించి చెప్పి మరీ డబ్బు లాగేదని దర్యాప్తులో తేలింది. మహిళల విషయంలో గతంలో శిక్షలు పడిన కేస్ స్టడీలను కూడా తనతో ఉంచుకొని, వాటిని చూపించి అమాయకులను మోసగించేదని పోలీసులు తెలిపారు.

అనధికార లే అవుట్లలోని ప్లాట్లకు రిజిస్ట్రేషన్ చేయాలి

» తెలంగాణ రియల్టర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు ప్రవీణ్‌కుమార్

హైదరాబాద్ సిటీ, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): పంచాయతీలు, మున్సిపాలిటీల్లో ఉన్న ప్రభుత్వ అనుమతులు లేని లే అవుట్లలోని ప్లాట్లకు రిజిస్ట్రేషన్లు చేయాలని ప్రభుత్వాన్ని తెలంగాణ రియల్టర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు నారగోని ప్రవీణ్‌కుమార్ డిమాండ్ చేశారు. ఆ లే అవుట్లకు రిజిస్ట్రేషన్లు చేయడం ప్రారంభిస్తే ప్రభుత్వానికి ఆదాయం వస్తుందని ఆయన తెలిపారు. అనధికార లే అవుట్లకు ఎల్ఆర్ఎస్ కింద క్రమబద్ధీకరణకు రూ.10వేల చొప్పున చెల్లింపులు జరిగాయని, కానీ ఇప్పటి వరకు క్రమబద్ధీకరణకు సంబంధించి ఎటువంటి కదలిక లేకపోవడంతో రియల్టర్లు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. గతంలో ఈ రిజిస్ట్రేషన్ల కోసం సుమారు ఆరు వేల మంది రాష్ట్ర హైకోర్టును ఆశ్రయించారని, దాంతో రిజిస్ట్రేషన్లు చేయాలని సబ్ రిజిస్ట్రార్‌లను హైకోర్టు ఆదేశించిందని, దాంతో కొంత మంది రిజిస్ట్రేషన్లు చేసుకున్నారని ప్రవీణ్ తెలిపారు. అయితే ఆ తర్వాత సుప్రీం కోర్టు స్టేతో రిజిస్ట్రేషన్లు ఆగిపోయాయని తెలిపారు. సుప్రీంకోర్టులో వేసిన అప్పీల్‌ను రాష్ట్ర ప్రభుత్వం వెంటనే ఉపసంహరించుకుని అనుమతులు లేని లే అవుట్లలోని ప్లాట్లకు రిజిస్ట్రేషన్లు చేయాలని ప్రవీణ్ కోరారు.

ఉపాధి కూలీలకు శాపంగా ఆధార్ అనుసంధానం

» బీకేఎంయూ జాతీయ కార్యదర్శి

హైదరాబాద్, జనవరి 3(ఆంధ్రజ్యోతి): జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో వేతన చెల్లింపుల కోసం జాబ్ కార్డుతో ఆధార్ నంబర్‌ను అనుసంధానం చేయాల్సిందేనన్న కేంద్రప్రభుత్వ నిర్ణయం కూలీల పట్ల శాపంగా మారిందని భారత్ ఖేత్ మజ్దూర్ యూనియన్ జాతీయ కార్యదర్శి బాల మల్లేశ్ అన్నారు. తక్షణమే నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని, కూలీలకు ఉపశమనం కల్పించాలని డిమాండ్ చేశారు. ఆన్‌లైన్ హాజరు కారణంగా ఇప్పటికే అనేక చోట్ల ఇంటర్నెట్ లేక కూలీల హాజరు నమోదు కావడం లేదని చెప్పారు. తాజాగా ఆధార్ అనుసంధానం తప్పనిసరి చేయడంతో తెలంగాణలో 18.04 లక్షల మంది ఉపాధి పథకానికి దూరమయ్యే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు.

ఇథనాల్ పరిశ్రమ నిర్మాణంపై ప్రజాగ్రహం

» కూలీల తరిమివేత..పోలీసుల లాఠీఛార్జి

» కారుకు నిప్పు.. పలు వాహనాలు ధ్వంసం

దిలావర్‌పూర్, జనవరి 3 : ఇథనాల్ పరిశ్రమ నిర్మాణం నిలిపివేయాలని డిమాండ్ చేస్తూ ఆందోళన చేస్తున్న దిలావర్‌పూర్, గుండంపల్లి గ్రామాల ప్రజలు బుధవారం ఆకస్మికంగా పరిశ్రమ నిర్మాణ ప్రదేశాన్ని ముట్టడించారు. నిర్మాణ పనులను అడ్డుకున్నారు. అక్కడ పని చేస్తున్న కూలీలను వెళ్లిపోవాలని హెచ్చరించారు. దీంతో కూలీలు పెట్టె బేడా సర్దుకుని వెళ్లిపోయారు. కూలీల తాత్కాలిక షెడ్లను ప్రజలు ధ్వంసం చేశారు. నిర్మాణంలో ఉన్న ప్రహరీని కూలదోశారు. టిప్పర్ల అద్దాలు ధ్వంసం చేశారు. వాటికి నిప్పు పెట్టేందుకు ప్రయత్నించగా పోలీసులు అడ్డుకున్నారు. రాళ్లు విసరడంతో రెండు కార్లు పాక్షికంగా దెబ్బతిన్నాయి. భైంసా ఏఎస్పీ క్రాంతిలాల్ పటేల్, అదనపు కలెక్టర్ కిషోర్ కుమార్, తహసీల్దార్ సరిత, డీఎస్పీ గంగారెడ్డి, సీఐ శ్రీనివాస్ రైతులతో చర్చలు జరిపినా ఫలించలేదు. ఇదే సమయంలో కొంతమంది పరిశ్రమ ప్రతినిధి కారుకు నిప్పు పెట్టారు. పోలీసులు మఫ్టీలో ఉండి వీడియోలు తీస్తుండటాన్ని గమనించిన కొందరు వారి వద్ద నుంచి సెల్‌ఫోన్లను లాక్కుని ధ్వంసం చేశారు. పోలీసులు ముగ్గురిని చితకబాదారు. ఇద్దరిని అదుపులోకి తీసుకున్నారు. వాళ్లని వదిలేయాలని డిమాండ్ చేస్తూ రైతులు రోడ్డుపై బైఠాయించారు. దీంతో పోలీసులు ఆ ఇద్దరిని వదిలేశారు. తమపై పోలీసులు లాఠీఛార్జి చేయడాన్ని నిరసిస్తూ గురువారం దిలావర్‌పూర్ బంద్‌కు పిలుపునిస్తున్నట్లు ఇథనాల్ పరిశ్రమ వ్యతిరేక కమిటీ, దిలావర్‌పూర్ వీడీసీ పిలుపునిచ్చాయి. పరిశ్రమ రద్దయ్యే వరకు పోరాటం సాగుతుందని స్పష్టం చేశారు.



మంటల్లో కాలిపోతున్న కారు

Printed and Published by Koganti Venkata Seshagiri Rao on behalf of Aamoda Publications Pvt. Ltd., printed at Aamoda Press, H.No.5-9-287/10 & 11, Plot No. 53 & 54, Prasanth Towers, Rajeev Gandhi Nagar, Moosapet, Kukatpally (Mandal), Kukatpally Municipality, Ranga Reddy District and Published at Plot No.76, Ashwini Layout, Huda Heights, Road No.70, Jubilee Hills, Hyderabad-500033. Editor: K. Srinivas. Fax No. 23558288, Phone No: 23558233 / 44 / 55, Regd. No.H/HD 674, RNI No.44903 / 86. Managing Director: Vemuri Radha Krishna, Founder: K.L.N.Prasad.

ఆంధ్రజ్యోతి
దిక్సూచి
హైదరాబాద్ ● గురువారం 4 జనవరి 2024
diksuchi@andhrajyothy.com

ఎంఎస్ఈలో పీజీ డిప్లొమా



మద్రాస్ స్కూల్ ఆఫ్ ఎకనామిక్స్ (ఎంఎస్ఈ) ఆధ్వర్యంలోని బిజినెస్ స్కూల్ - పోస్ట్ గ్రాడ్యుయేట్ డిప్లొమా ఇన్ మేనేజ్మెంట్ (పీజీడీఎం) ప్రోగ్రామ్‌లో ప్రవేశానికి దరఖాస్తులు కోరుతోంది. ఇది ఫుల్ టైం ప్రోగ్రామ్. దీని వ్యవధి రెండేళ్లు. ఫైనాన్స్, రీసెర్చ్ అండ్ బిజినెస్ అనలిటిక్స్ స్పెషలైజేషన్‌లు ఉన్నాయి. జాతీయ పరీక్ష స్కోర్, అనుభవం, పర్సనల్ ఇంటర్వ్యూ ద్వారా అభ్యర్థులను ఎంపిక చేస్తారు.

అర్హత: గుర్తింపు పొందిన యూనివర్సిటీ నుంచి ఏదేని డిగ్రీ ఉత్తీర్ణులై ఉండాలి. పదోతరగతి నుంచి డిగ్రీ స్థాయి వరకు కనీసం 70 శాతం మార్కులు ఉండాలి. ఇంటర్ స్థాయిలో మేథమెటిక్స్ చదివిన అభ్యర్థులకు ప్రథమ ప్రాధాన్యం ఉంటుంది. క్యాట్/జీమ్యాట్/ఎక్స్‌ఏటీ/మ్యాట్/సీమ్యాట్/ఏటీఎంఏ వ్యాలిడ్ స్కోర్ ఉండాలి.

ముఖ్య సమాచారం

- **దరఖాస్తు ఫీజు:** రూ.1500
- **దరఖాస్తు సబ్మిషన్‌కు చివరి తేదీ:** రౌండ్ 1కు ఫిబ్రవరి 19; రౌండ్ 2కు మే 6; రౌండ్ 3కి జూలై 1
- **ఇండక్షన్ ప్రోగ్రామ్:** జూలై 12
- **ప్రోగ్రామ్ ప్రారంభం:** ఆగస్టు 1 నుంచి
- **వెబ్‌సైట్:** www.mse.ac.in

ఇఫ్లూలో ఇంగ్లీష్ ప్రొఫిషియెన్సీ కోర్సు



హైదరాబాద్‌లోని ఇంగ్లీష్ అండ్ ఫారిన్ లాంగ్వేజెస్ యూనివర్సిటీ (ఇఫ్లూ-సెంట్రల్ యూనివర్సిటీ)కి చెందిన నాన్ ఫార్మల్ కోర్సెస్ అండ్ రిసోర్సెస్(ఎన్ఎఫ్‌సీఏఆర్) విభాగం- ప్రొఫిషియెన్సీ కోర్స్ ఇన్ ఇంగ్లీష్‌లో ప్రవేశానికి దరఖాస్తులు కోరుతోంది.

కోర్సు వ్యవధి 40 గంటలు. ఇందులో ప్రధానంగా ఇంగ్లీష్‌కు సంబంధించి రిటెన్, స్పోకెన్ స్కిల్స్ నేర్పిస్తారు. ఫిబ్రవరి 5 నుంచి మార్చి 1 వరకు నాలుగు వారాలు శిక్షణ తరగతులు నిర్వహిస్తారు. రోజుకు రెండు గంటలు చొప్పున వారానికి అయిదు రోజులు తరగతులు ఉంటాయి. ఉదయం ఏడు నుంచి తొమ్మిది గంటల వరకు; సాయంత్రం ఆరు నుంచి ఎనిమిది గంటల వరకు తరగతులు నిర్వహిస్తారు. కనీసం 80 శాతం అటెండెన్స్ తప్పనిసరి. నిబంధనల ప్రకారం కోర్సు పూర్తిచేసినవారికి ఎన్ఎఫ్‌సీఏఆర్ విభాగం సర్టిఫికెట్లు ఇస్తుంది. మొత్తం 200 సీట్లు ఉన్నాయి. ఫస్ట్ కం ఫస్ట్ సర్వ్‌డ్ పద్ధతిలో అడ్మిషన్స్ ఇస్తారు.

కోర్సులోని అంశాలు

ఇంగ్లీష్ లాంగ్వేజ్‌కు సంబంధించి లిజెనింగ్, స్పీకింగ్, రీడింగ్, రైటింగ్ వంటి కమ్యూనికేషన్ స్కిల్స్ నేర్పిస్తారు. మొదటి వారంలో ఇంట్రడక్షన్స్, డిస్క్రిప్షన్, నరేషన్, ప్లానింగ్; రెండో వారంలో ఎక్స్‌ప్లయినింగ్, ఇన్‌ఫార్మింగ్, ఇన్‌స్ట్రక్టింగ్/డైరెక్టింగ్, రెస్పాండింగ్; మూడో వారంలో ఎక్స్‌ప్రెసింగ్ ఒపీనియన్, గ్రూప్ డిస్కషన్, నోట్ టేకింగ్, సమ్మరైజింగ్, ఫార్మల్ లెటర్ రైటింగ్; నాలుగో వారంలో సీవీ అండ్ అప్లికేషన్, లెటర్స్, ఇంటర్వ్యూ స్కిల్స్, అఫీషియల్ రైటింగ్ తరగతులు ఉంటాయి. కోర్సుకు సంబంధించిన మెటీరియల్ ఇస్తారు.

అర్హత

గుర్తింపు పొందిన కాలేజీ నుంచి ఇంటర్/పన్నెండోతరగతి/తత్సమాన కోర్సు ఉత్తీర్ణులై ఉండాలి. విదేశీ విద్యార్థులు కూడా అప్లయ్ చేసుకోవచ్చు. వీరికి ఇంగ్లీష్‌లో కనీసం 50 శాతం మార్కులు ఉండాలి. వీరు దరఖాస్తుతోపాటు వీసా కాపీ, కోర్సు వ్యవధికి రెసిడెంట్ పర్మిట్ కాపీ సబ్మిట్ చేయాలి.

ముఖ్య సమాచారం

- **కోర్సు ఫీజు:** భారతీయ విద్యార్థులకు రూ.2,500; విదేశీ విద్యార్థులకు రూ.5,000; ఇఫ్లూలో చదువుతున్న విదేశీ విద్యార్థులకు రూ.4,000
- **దరఖాస్తు ఫీజు:** రూ.100
- దరఖాస్తు ఫారాలను జనవరి 19 వరకు ఇస్తారు.
- **దరఖాస్తు సబ్మిషన్‌కు చివరి తేదీ:** జనవరి 31
- **దరఖాస్తుకు జతచేయాల్సినవి:** రెండు ఫొటోలు, ఆధార్ కార్డ్/ఓటర్ ఐడీ/పాస్‌పోర్ట్
- **చిరునామా:** ఎన్ఎఫ్‌సీఏఆర్ కార్యాలయం, రూమ్ నెం.29, గ్రౌండ్ ఫ్లోర్, అడ్మినిస్ట్రేటివ్ బిల్డింగ్, ఇఫ్లూ, హైదరాబాద్-500007.
- **ఫోన్ నెం.** 040 27689646
- **వెబ్‌సైట్:** efluniversity.ac.in

ఐఐఎం కాశీపూర్‌లో ఎగ్జిక్యూటివ్ ఎంబీఏ(అనలిటిక్స్)

కాశీపూర్‌లోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్(ఐఐఎం)- వర్కింగ్ ప్రొఫెషనల్స్ కోసం ఉద్దేశించిన ఎగ్జిక్యూటివ్ ఎంబీఏ(అనలిటిక్స్) ప్రోగ్రామ్‌లో ప్రవేశానికి దరఖాస్తులు కోరుతోంది. ప్రోగ్రామ్ వ్యవధి రెండేళ్లు. ఆరు టర్మ్‌లు ఉంటాయి. వ్యాపారవేత్తలు, ఆంత్రప్రెన్యూర్స్, ఇంజనీర్లు, నాన్ ఇంజనీర్లు, మిడ్ లెవెల్ ఎగ్జిక్యూటివ్‌లు అప్లయ్ చేసుకోవచ్చు. అడ్మిషన్ టెస్ట్, పర్సనల్ ఇంటర్వ్యూల ద్వారా అడ్మిషన్స్ ఇస్తారు.

ప్రోగ్రామ్ వివరాలు

ఇది ఆన్‌లైన్ బ్లెండెడ్ లెర్నింగ్ ప్రోగ్రామ్ అయినప్పటికీ కొన్ని ఆన్ క్యాంపస్ తరగతులు కూడా నిర్వహిస్తారు. ప్రోగ్రామ్‌లో భాగంగా ఫ్యాకల్టీ వర్చువల్ మీటింగ్స్, అసైన్‌మెంట్లు, క్విజ్‌లు, పెడగాగి క్లాసెస్, సిమ్యులేషన్స్, ఇండస్ట్రీ వర్క్‌షాప్స్, క్యాప్‌స్టోన్ ప్రాజెక్టులు, ఇతర ప్రాజెక్ట్ వర్క్‌లు, టర్మ్ ఎండ్ ఎగ్జామ్స్ ఉంటాయి. ప్రోగ్రామ్ మొత్తానికి 34.5 క్రెడిట్లు నిర్దేశించారు.

ముఖ్య సమాచారం

దరఖాస్తు ఫీజు: రూ.2,950
ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ: జనవరి 6
అడ్మిషన్ టెస్ట్, పర్సనల్ ఇంటర్వ్యూలు: జనవరి 21
ఎంపికైన అభ్యర్థుల లిస్ట్ విడుదల: జనవరి 26
అడ్మిషన్ తేదీ: ఫిబ్రవరి 16
ఓరియంటేషన్, ఇండక్షన్ ప్రోగ్రామ్‌లు: మే 13
క్యాంపస్ క్లాసెస్: మే 13 నుంచి 17 వరకు
ఆన్‌లైన్ క్లాసెస్: మే 25 నుంచి
వెబ్‌సైట్: iimkashipur.ac.in

అర్హత

గుర్తింపు పొందిన కళాశాల నుంచి కనీసం 45 శాతం మార్కులతో ఏదేని డిగ్రీ ఉత్తీర్ణులై ఉండాలి. ఓబీసీ, ఈడబ్ల్యూఎస్ అభ్యర్థులకు 42 శాతం; దివ్యాంగులు, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు 40 శాతం మార్కులు చాలు. దరఖాస్తు నాటికి కనీసం మూడేళ్ల ప్రొఫెషనల్ అనుభవం తప్పనిసరి. పార్ట్ టైమ్, ప్రాజెక్ట్ వర్క్, ఇంటర్న్‌షిప్, ఆర్టికల్‌షిప్, అప్రెంటిస్‌షిప్, ప్రీ గ్రాడ్యుయేషన్ అనుభవాలను పరిగణనలోకి తీసుకోరు.

IIM KASHIPUR

జేఈఈ మెయిన్ ప్రిపరేషన్ టిప్స్

ప్రతిష్ఠాత్మక ఇంజనీరింగ్ కాలేజీల్లో ప్రవేశానికి ఉద్దేశించిన తొలి వడపోత అయిన జేఈఈ మెయిన్ మొదటి సెషన్ మరో ఇరవై రోజుల్లో ఆరంభం కానుంది. ఇంటర్ లేదంటే పన్నెండో తరగతి ఎగ్జామ్స్‌కు ముందే జరిగే ప్రవేశ పరీక్ష ఇది. ఒకరకంగా ఎంట్రెన్స్ అంటే భయం, బెరుకు ఏదైనా ఉంటే దీంతో అవి పోగొట్టుకోవచ్చు. ఇది చక్కగా రాస్తే, మంచి స్కోర్ సాధించగలిగితే ఇంటర్ పరీక్షలు తరవాత సెలవులు ఎంజాయ్ చేయవచ్చు. అలాగే ఐఐటీలో చేరేందుకు ఉద్దేశించిన జేఈఈ అడ్వాన్స్‌డ్‌పై గురిపెట్టవచ్చు. ఈ నేపథ్యంలో ఉన్న ఈ కొద్ది రోజులను సద్వినియోగం చేసుకునేందుకు నిపుణులు సూచించిన కొన్ని టిప్స్



- నేర్చుకున్నది చాలు, ఈ కొద్ది రోజులు రివిజన్‌కు సమయాన్ని ఉపయోగించాలి. ముఖ్యమైన ఫార్ములాలు, థీరమ్స్, రియాక్షన్స్ వంటివి ప్రాక్టీస్ చేయాలి. ప్రాబ్లెమ్స్ సాల్వ్ చేసేందుకు ఇవన్నీ తోడ్పడతాయి. బలంగా ఉన్న వాటిపైనే మరింత శ్రద్ధవహించాల్సిన సమయం ఇది. వచ్చిన వాటినే మరిన్ని సార్లు చదవడం లేదంటే ప్రాక్టీస్ చేయడంతో మైండ్‌లో ఆ టాపిక్ స్థిరపడుతుంది. పరీక్షలో మరింత బాగా ఆన్సర్ చేసేందుకు ఉపయోగపడుతుంది.
- రివిజన్ కోసం షార్ట్ నోట్స్‌ని ఉపయోగించుకోవాలి. అందులో ఫార్ములాలు, కాన్సెప్ట్ ఉండేలా చూసుకోవాలి. టాపిక్స్‌లోకి వెళ్ళి ఇవన్నీ ఎక్కడ ఉన్నాయన్నది సరిచూసుకోవడం కష్టం. అలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఉండేందుకు ఇది మంచి మార్గం. అలాగే ఫ్లాష్ కార్డులతోనూ ప్రయోజనం ఉంటుంది.
- సబ్జెక్టు లేదంటే ప్రత్యేకించి టాపిక్‌పరంగా ఏవైనా సందేహాలు ఉంటే వాటిని వెంటనే నివృత్తి చేసుకోవాలి. టీచర్ నుంచి సీనియర్ వరకు ఈ విషయంలో ఎవరితో అయినా మాట్లాడవచ్చు. సందేహం తీరడం ముఖ్యం. కాన్సెప్టులను క్షుణ్ణంగా అర్థం చేసుకోవడం కూడా కీలకం.
- సాధ్యమైనన్ని మాక్ టెస్టులు రాయాలి. ఆలిండియా స్థాయిలోవి రాస్తే మంచిది. ఇవి రాస్తే అసలు పరీక్షను ఎదుర్కోవడం సులువు అవుతుంది. ఒకటి రెండు మాక్ టెస్టులు రాసి, పాత పేపర్లను సాల్వ్ చేయడం మరో పద్ధతి. అయితే అది అంత ప్రాక్టికల్‌గా అనిపించదు. దానికి బదులు రోజుకో టెస్ట్ రాసి విశ్లేషించుకోవడం చాలా మంచిది. ఎక్కడ తప్పు చేశామో గుర్తించి, దాన్ని తిరిగి నేర్చుకుంటే కలకాలం గుర్తుంటుంది. అసలు పరీక్షలో సరిగ్గా అదే సమస్యవస్తే సులువుగా గుర్తుకొస్తుంది. అందుకే ఆలిండియా స్థాయిలో జరిగే మాక్ టెస్టులను ఎంచుకోవాలని విజ్ఞులు చెబుతూ ఉంటారు.
- అర్థరాత్రి వరకు చదవడానికి ఎక్కువ మంది విద్యార్థులు ఆసక్తి చూపుతారు. అయితే అంత సీన్ అవసరం లేదు. రాంగ్ ప్రాక్టీస్ కూడా. పరీక్షలు ముంచుకొస్తున్న ఈ సమయంలో సరిపోను విశ్రాంతి, నిద్ర ఆరోగ్యకరమైన ఆహారం చాలా అవసరం.
- పాజిటివ్ మైండ్‌సెట్‌ను డెవలప్ చేసుకోవాలి. అర్జునుడికి పక్షి కన్నుపై గురి మాదిరిగా రాసే పరీక్షలో సక్సెస్ లక్ష్యం కావాలి. ఒత్తిడి(స్ట్రెస్) అనిపిస్తే వెంటనే మరో ఫన్నీ యాక్టివిటీతో మైండ్‌ను ఫ్రెష్ చేసుకోవాలి. కొద్దిసేపు ఇష్టమైన వాటిపై దృష్టిపెడితే చాలు, ఒత్తిడి చాలావరకు తగ్గుతుంది.
- కాన్సంట్రేషన్ లెవెల్స్ పెంచుకోవడం అన్నది కీలకమే. అందుకే గంటల కొద్దీ చదవకూడదని అంటారు. రెగ్యులర్ బ్రేక్స్ అలాగే ఆ సమయంలో యోగా తదితర కార్యకలాపాలతో మైండ్‌ని ఫ్రెష్‌గా ఉంచుకోవాలి. అదేవిధంగా ప్రిపరేషన్‌పై ఎవరితోనూ చర్చించాల్సిన అవసరం లేదు. పరీక్షకు ప్రిపేర్ కావడం అన్నది వ్యక్తిగతం. అది ఎలా ఉండాలన్నది మనమే నిర్ణయించుకోవాలి.

పరీక్ష హాలులో

- జేఈఈ మెయిన్ ప్రశ్నలను చూసుకునేందుకు మొదట కొద్ది సమయాన్ని ఉపయోగించుకోవాలి. ఆ సమయంలో అస్సలు ఆందోళన చెందవద్దు. ఏవీ తెలియనట్టు అనిపించినా బెదరవద్దు. గట్టిగా శ్వాస తీసుకుని వదలండి.
- ఎప్పుడైన కొన్ని ప్రశ్నలు కష్టంగా ఉంటాయి. సులువైన ప్రశ్న కనిపించే వరకు ముందుకు కదలండి. ఎక్కడో ఒక చోట ఈజీ ప్రశ్న తగులుతుంది. మొదట దాన్ని సాల్వ్ చేయండి. కాన్ఫిడెన్స్ లెవెల్ పెరుగుతుంది. తరవాత మరొకటి సులువైనది తీసుకోండి. అప్పటికి మీరు కుదురుకుంటారు. ఆ తరవాత ఎదురు ఉండదు. వచ్చినవన్నీ సాల్వ్ చేసుకుంటూ వెళ్ళడమే పనిగా ఉండాలి.
- ఒక మాట వినే ఉంటారు. కష్టం మీ ఒక్కరికే సొంతం కాదు. అలాంటి వాళ్ళే చాలామంది ఉంటారు. వారిలో మీరు ఒకరు అంతే.
- ప్రశ్న ఏదైనా సాల్వ్ చేసేందుకు కొంత సమయం పెట్టుకోవాలి. రాకుంటే తరవాతి ప్రశ్న చూడాలి. అంతే తప్ప ఒక్క ప్రశ్న దగ్గరే ఆగిపోవద్దు. వచ్చినవి చేసుకుంటూ వెళ్ళాలి. అన్నీ అయ్యాక మళ్ళీ మొదటి నుంచి వదిలేసినవి చూసుకుంటూ వెళ్ళాలి.
- ఎక్కువ ప్రశ్నలు సాల్వ్ చేసేయాలని అనుకోవద్దు. ఎన్ని కరెక్ట్‌గా చేస్తే ఎంత స్కోర్ వస్తుందో మీకు తెలుసు. అది మదిలో పెట్టుకుని పరీక్షలు ఏవైనా రాయాలని గుర్తుంచుకోవాలి. అదే సక్సెస్ రూట్.

'సెంట్రల్ గ్లాస్ అండ్ సిరామిక్'లో సైంటిస్టులు

సెంట్రల్ గ్లాస్ అండ్ సిరామిక్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్... కింద పేర్కొన్న పోస్టుల భర్తీకి అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు కోరుతోంది.

మొత్తం ఖాళీలు: 12

అర్హత: సైన్స్/ఇంజనీరింగ్, సిరామిక్ ఇంజనీరింగ్/సిరామిక్ టెక్నాలజీ/మెటీరియల్స్ ఇంజనీరింగ్/మెటీరియల్స్ సైన్స్/మెటలార్జికల్ అండ్ మెటీరియల్ ఇంజనీరింగ్/ఫిజిక్స్ విభాగాల్లో పీహెచ్‌డీ, ఎంఈ, ఎంటెక్ ఉత్తీర్ణులై ఉండాలి.
వయోపరిమితి: 32 ఏళ్లకు మించకూడదు
దరఖాస్తు ఫీజు: రూ.500
దరఖాస్తు విధానం: ఆన్‌లైన్‌లో
దరఖాస్తుకు చివరి తేదీ: జనవరి 24
వెబ్‌సైట్: https://www.cgcri.res.in/



ఎల్ఐసీ గోల్డెన్ జూబ్లీ స్కాలర్‌షిప్ స్కీమ్

ముంబైలోని లైఫ్ ఇన్స్యూరెన్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా(ఎల్ఐసీ)- 'గోల్డెన్ జూబ్లీ స్కాలర్‌షిప్ స్కీమ్ 2023'కి దరఖాస్తులు కోరుతోంది. ప్రభుత్వ/ప్రైవేట్/ఐటీఐ కళాశాలలు సహా ఎన్‌సీవీటీ గుర్తింపు పొందిన ఇండస్ట్రియల్ ట్రయినింగ్ సెంటర్లలో చదువుతున్న ప్రతిభావంతులకు ఆర్థిక సహకారాన్ని అందించేందుకు ఈ స్కీమ్‌ను ఉద్దేశించారు. ఇందులో జనరల్ స్కాలర్‌షిప్, స్పెషల్ స్కాలర్‌షిప్ ఫర్ గర్ల్ ఛైల్డ్ కేటగిరీలు ఉన్నాయి. అకడమిక్ మెరిట్, కుటుంబ వార్షికాదాయం ఆధారంగా అభ్యర్థులను ఎంపిక చేస్తారు.

జనరల్ స్కాలర్‌షిప్

అర్హత: గుర్తింపు పొందిన రెగ్యులర్/ఒకేషనల్ కళాశాల నుంచి ఇంటర్/డిప్లొమా ఉత్తీర్ణులై ఉండాలి. పదోతరగతి స్థాయి నుంచి ప్రథమ శ్రేణి మార్కులు తప్పనిసరి. ప్రస్తుత విద్యా సంవత్సరంలో మెడిసిన్/ఇంజనీరింగ్/ఏదేని గ్రాడ్యుయేషన్/ఒకేషనల్/ఇంటిగ్రేటెడ్ కోర్సులో ప్రవేశం పొంది ఉండాలి. లేటరల్ ఎంట్రీ అభ్యర్థులు; డిప్లొమా తరవాత ఇంజనీరింగ్ మొదటి సంవత్సర ప్రవేశం పొందినవారు కూడా అర్హులే.

స్కాలర్‌షిప్: మెడిసిన్ చదివేవారికి కోర్సు పూర్తయ్యే వరకూ ఏడాదికి రూ.40,000లను మూడు విడతలుగా(రూ.12,000 + రూ.12,000 + రూ.16,000) చెల్లిస్తారు. ఇంజనీరింగ్ చదివేవారికి ఏడాదికి రూ.30,000(రూ.9,000 + రూ.9,000 + రూ.12,000)లు ఇస్తారు. జనరల్ డిగ్రీ, ఇంటిగ్రేటెడ్ కోర్సులు, ఒకేషనల్ కోర్సులు చేసేవారికి ఏడాదికి రూ.20,000 (రూ.6,000 + రూ.6,000 + రూ.8,000) ఇస్తారు.

- కోర్సుకు సంబంధించి వార్షిక పరీక్షల్లో కనీసం 55 శాతం మార్కులు వస్తేనే స్కాలర్‌షిప్ రెన్యువల్‌కు అవకాశం లభిస్తుంది

స్పెషల్ స్కాలర్‌షిప్ ఫర్ గర్ల్ ఛైల్డ్

- ❑ బాలికలకు చదువుపై ఆసక్తి కలిగించేందుకు, వారిని ఉన్నత విద్యలో ప్రోత్సహించేందుకు ఈ స్కాలర్‌షిప్ స్కీమ్‌ను రూపొందించారు.
- ❑ **అర్హత:** గుర్తింపు పొందిన పాఠశాల నుంచి ప్రథమ శ్రేణి మార్కులతో పదోతరగతి ఉత్తీర్ణులై ఉండాలి. ఈ విద్యా సంవత్సరంలో ఇంటర్/పన్నెండోతరగతి/డిప్లొమా/ఒకేషనల్/ఐటీఐ కోర్సులో అడ్మిషన్ పొంది ఉండాలి.
- ❑ **స్కాలర్‌షిప్:** రెండేళ్ల పాటు ఏడాదికి రూ.15,000లను మూడు విడతలుగా (రూ. 4,500 + రూ.4,500 + రూ.6,000) ఇస్తారు.
- ❑ కోర్సుకు సంబంధించి మొదటి ఏడాది కనీసం 50 శాతం మార్కులు వస్తేనే స్కాలర్‌షిప్ రెన్యువల్‌కు అనుమతిస్తారు.



ముఖ్య సమాచారం

- ❑ కుటుంబ వార్షికాదాయం రూ.2,50,000 మించకూడదు.
- ❑ కరస్పాండెన్స్, పార్ట్ టైమ్, ఈవెనింగ్, డిస్టెన్స్, ఓపెన్ యూనివర్సిటీ, సెల్ఫ్ స్టడీ కోర్సులు చేసేవారు; సీఏ/సీఎస్/ఐసీడబ్ల్యూఏఐ అభ్యర్థులు ఈ స్కీమ్‌నకు అనర్హులు.
- ❑ కుటుంబంలో ఒక విద్యార్థికి మాత్రమే అవకాశం కల్పిస్తారు. ఇద్దరు ఉన్న పక్షంలో ఒకరు బాలిక అయితే ఇద్దరికీ అవకాశం ఇస్తారు.
- ❑ **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** జనవరి 14
- ❑ **వెబ్‌సైట్:** https://licindia.in

లిటిల్స్




మీకు తెలుసా?

- సూదిమొనలా పొడవైన కొమ్ములు ఉండే ఈ జింకలను ఆరిక్స్ అని పిలుస్తారు. ముఖ్యంగా ఈ తెల్ల ఆరిక్స్‌లు మిడిల్‌ఈస్ట్‌లో ఎక్కువగా ఉంటాయి. వీటిని అరేబియన్ ఆరిక్స్ అని పిలుస్తారు. ఆరిక్స్ అనే పదం గ్రీక్ నుంచి వచ్చింది.
- దుబాయ్, కువైట్, ఇరాన్, ఒమన్, జోర్డాన్, ఇజ్రాయిల్, సౌదీ అరేబియా, పాలస్తీనా.. ఇలా మిడిల్ ఈస్ట్ దేశాల్లోని ఎడారుల్లో జీవిస్తాయివి. ఎడారిలోని గడ్డిని తింటాయి. అక్కడ దొరికే దుంపలు, పూలు, మొగ్గలు, పండ్లు తవ్వుకుని తింటాయి.
- ఇవి వైల్డ్ అనిమల్స్. 1970 దశకం నుంచి వీటిని జంతుప్రదర్శనశాలల్లో కూడా పెంచటం ఆరంభించారు.
- 1767లో తొలిసారి ఈ జంతువు గురించి ప్రస్తావించారు.
- 2.1 ఫీట్ల నుంచి 4.6 ఫీట్ల వరకూ పొడవు ఉంటాయి. ఎత్తు కూడా సుమారు 4 ఫీట్ల వరకు ఉంటాయి.
- వీటి బరువు వంద కేజీలనుంచి 209 కేజీల వరకూ ఉంటుంది.




- ఎడారుల్లోని మందమైన ఇసుకలో ఇవి వేగంగా పరిగెత్తగలవు. ముఖ్యంగా వీటి గిట్టల బలం, కొమ్ముల పదునే వీటిని శత్రువుల నుంచి రక్షిస్తాయి.
- వేల కిలోమీటర్లు ఎడారుల్లో అలుపూ సొలుపూ లేకుండా నడుస్తాయి. ఒక్కో గుంపులో మూడు నుంచి పదిహేను వరకూ ఉంటాయి. పెద్ద గుంపుల్లో మాత్రం వందలోపు ఉంటాయి.
- ఆరిక్స్ సంవత్సరానికి ఒకే పిల్లను కంటుంది. పుట్టిన నాలుగు గంటల్లో నడుస్తుందది. నాలుగు వారాలు మాత్రమే అమ్మ రక్షిస్తుంది. ఆ తర్వాత గుంపులో చేరుతుంది.
- ఇవి ఇరవై ఏళ్ల వరకూ జీవిస్తాయి.

చుక్కలు కలిపి బొమ్మ గీయండి



దారి కనుక్కోండి



5 తేడాలు గుర్తించండి



సరైన నీడ ఏది?



డైలీ సుడోకు - 195

			7		9		4	
		7		4		6		
3			1	2		5	9	
	5	8			3			
	6	2	5		4	8	7	
			6			4	2	
	4	5		1	7			2
		1		6		7		
	2		3		8			

సుడోకు - 194 సమాధానం

1	9	2	4	5	8	3	7	6
8	5	6	7	9	3	4	1	2
4	3	7	1	6	2	8	9	5
5	2	4	9	1	7	6	3	8
7	6	8	3	4	5	1	2	9
3	1	9	8	2	6	7	5	4
9	8	1	2	3	4	5	6	7
6	4	3	5	7	9	2	8	1
2	7	5	6	8	1	9	4	3

ప్రతి బాక్స్‌లో 9 గళ్లు ఉంటాయి. ఒక్కో బాక్స్‌ను 1 నుంచి 9 వరకు అంకెలతో పూరించాలి. అన్ని బాక్స్‌లనూ కలిపి చూస్తే నిలువుగా, అడ్డంగానూ ఏ లైనులోనూ ఒకసారి వాడిన అంకెను తిరిగి వాడకూడదు.